# జయకాంతన్ నవల



# కళ ఎల్లలు దాటాలి!

అనువాదం: ఏండీ సుందరేశన్

# కళ ఎల్లలు దాటాలి!

(జయకాంతన్ నవల)

మూలం: తమిళం

అనువాదం: ఏండీ సుందరేశన్

**Publisher:**
**Kurinji Publications**
**10944 San Pablo Avenue, # 610**
**El Cerrito, CA 94530-2377**
**Email: rangan.sundaresan@gmail.com**

**KALA ELLALU DAATALI!**

(Translation of Jayakanthan's Tamil Novel,
*Parisukkuppo*! in Telugu)

*Publisher:*

Kurinji Publications
10944 San Pablo Avenue # 610
El Cerrito, CA 94530-2377
Website: www.kurinjipubs.com

*Copyright:* Andy Sundaresan/Jayakanthan

ISBN No: 979-8-218-99801-1
First Edition, 2025

Front/Back Covers:

The front cover depicts the principal characters of the novel; the illustration is by Artist Gopulu.

*Source: Meenakshi Puttaga Nilayam,* Madurai 625001, India
Used with permission.
*Design & Layout:*
Amir Bhat

Jayakanthan's photo on back cover:
Source: *1975 Jayakanthan Pavalaviza Malar, 2008*
Used with permission.

Printed at:

The Copy World,
1935 University Avenue,
Berkeley, CA 94702
Phone: 1-800-690-2679 (Toll Free)

# కళ ఎల్లలు దాటాలి!

## (జయకాంతన్ నవల)



(జన్మదినం: అక్టోబర్ 14, 1931)

మా కుటుంబ, చిరకాల మిత్రులు, సహృదయులు

శ్రీ కే.వి. శేషారావుగారికి

ఇది అంకితం

# ACKNOWLEDGEMENTS

The translator gratefully acknowledges and extends his thanks to the following:

- J.Deepalakshmi, Author Jayakanthan's daughter, for permission to translate her father's work in Tamil, **PARISUKKUPO**!, into Telugu;
- The owners of **Meenakshi Puttaga Nilayam**, Madurai, for permission to use the cover illustration by Artist Gopulu from their original Tamil book;
- Mr. Nakkeeran Gopal, the publisher of the **JK 75 Pavalaviza Malar**, for permission to use the photos and other material from that book;
- Mrs. Selvi Viswanathan of Los Alamos, New Mexico, my sister, for going over my initial drafts in Telugu and offering valuable suggestions;
- And, finally, Mr. Himakar Tata, our family friend who, at our request, met with Mr. K.M. Sesha Rao, in Vizayanagaram, to convey the news of dedicating this book to him.

*****

# కళ ఎల్లలు దాటాలి!

## విషయ సూచిక

అనువాదకుని ముందుమాట

జయకాంతస్ ముందుమాట

జయకాంతస్ నవల

అనుబంధం

# అనువాదకుని ముందుమాట

ఈ నవల తమిళ మూలం 1966 లో ***ఆనంద వికటన్*** వారపత్రికలో ధారావాహికంగా వెలుబడింది. దీన్ని రాసినందువలన జయకాంతన్ అన్ని విధాల కఠోర విమర్శనలు, ఆక్షేపణలకి గురి అయ్యారు.

"నా సమకాలిక రచయితలలో, ఉచిత సాహిత్య విమర్శకి విరుద్ధంగా, నావంతు విరోధం సంపాదించుకున్నవారు ఎవరూ లేరని నేను తెలుసుకున్నాను. ఈ అనుభవంతో ఒక పెద్ద నవలని నేను రాయగలను" అని అతను ఒక వ్యాసంలో రాసారు.[1]

నేను 30 సంవత్సరాలుగా జయకాంతన్ రచనలు అనువాదం చేస్తున్నాను. క్రమంగా అతని రచనావిశేషం, పాత్ర చిత్రీకరణ గురించి నా అవగాహనస్థాయిలో కొత్త కొత్తగా ఎరుకలు వస్తూనే ఉన్నాయి. ఇటీవల ఈ నవలని రెండు మూడు సార్లు చదివిన తరువాత నాకు తోచిన కొన్ని ఆలోచనలు ఇక్కడ పాఠకులతో పంచుకోవాలని నిశ్చయించాను.

1970-72 లో తను రాసిన నవల[2] లోని పాత్రల గురించి జయకాంతన్ ఇలా వర్ణించారు:

***"ఇందులో ప్రధాన పాత్రలు ముగ్గురు: కళ్యణి, రంగా, అణ్ణాసామి.***

***కళ్యాణి నా భార్య కాదు, నా ప్రియురాలుకూడా కాదు - ఆమె నేనే. రంగా, అణ్ణాసామి కూడా నేనే. ఈ కథలో వచ్చే అన్ని పాత్రలూ నేనే. అంత ఎందుకు, నా కథల్లో వచ్చే పాత్రలందరూ - పాఠకులు ఇది గమనించాలి; పాత్రలు ఎవరూ పూర్తిగా మంచివారు, చెడ్డవారు కాదు - నేనే. నేను ధరించే -జీవితంలో నేను కలుసుకొనే భిన్న రకమైన - మారువేషాలే అవి."***

---

[1] 'జయకాతన్ ముందుమాట' చదవండి.

[2] వివరాలకి అనుభంధం చూడండి

తన కల్పనలో అవతరించిన అన్ని పాత్రలూ తన మారురూపాలే అని జయకాంతన్ మనకి ఇక్కడ చెప్తున్నారు.

ఈ వివరణ నిజమని ఈ నవలలో నాకు స్పష్టంగా తెలిసింది. ప్రతీ ఘటన, దృశ్యం, ఘర్షణలో - మనం చూస్తున్న పాత్ర ఎవరైనా సరే - శేషయ్య, సారంగన్, నరసయ్య, లేక లలిత - వారి చర్య, వైఖరి, ప్రవర్తనలో, జయకాంతన్ ప్రతిఫలించడం నేను చూసాను. అంటే, ఈ నవలని దాసినప్పుడు రచయిత ప్రత్యామ్నాయంగా (vicariously) అందులో పాల్గొన్నారనిపించింది.

వయసు చెల్లిన కాలంలో ఈ నవలని అనువదించడానికి నాకు దొరికిన అవకాశంని ఒక బహుమానంగా నేను తలపోస్తున్నాను. ఈ నవలని తెలుగులో అనువదించడానికి నాకు అనుమతి ఇచ్చిన రచయిత జయకాంతన్, అతని కొమార్తె దీపలక్ష్మికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అలవాటుగా, నా అనువాదం ఓపికతో, ఉత్సాహంతో చదివి, మంచి సలహాలు ఇచ్చిన అక్కయ్య శెల్వి విశ్వనాధన్ కి నా కృతజ్ఞతలు.

నా ఈ అనువాదంని అంకితం పుచ్చుకోవలసిన గురువుగా శేషారావుగారు సమ్మతించాలనే నా అభిలాష ఆఖరికి నెరవేరింది. దీనిగురించి అతనితో సంప్రదించడానికి నా తరపున మా Vizag మిత్రుడు హిమకర్ టాటా గత April 7, 2025 అతన్ని కలుసుకున్నారు. ఆ సమయం శేషారావుగారు ఫోను సంభాషణలో తన సాహిత్యాభిమానం గురించి మాటాడారు. ముఖ్యంగా రాజాజీ ఆంగ్లంలో రాసిన రామాయణంని 31 రోజుల్లో తెలుగులో అనువదించి, భద్రాచలక్షేత్రంని దర్శించిన అనుభవం వివరించారు. KNS కుటుంబంతో అతని నాన్నగారు కీర్తి శేషులు తాండవకృష్ణయ్యగారి పరిచయం, ఆ తరువాత 2013లో మా అక్కయ్య శెల్వితో ఆరంభించి ఈరోజులవరకూ కొనసాగుతున్న తన సహవాసం గురించి మనసు కరిగనట్టు మాటాడారు. అతనికి ఆరు మాసాలలో 94 నిండుతాయి. అతని మాటలు విని మేం పులకరించాం.

*******

# జయకాంతన్ ముందుమాట[3]

ఈ నవలని ధారావాహికంగా ఆనంద వికటన్ పత్రికలో రాయాలని నేను సాహసించినప్పుడు, ఇది ఎటువంటి అవస్థలకి గురి అవుతుందని నాకు తెలియడంవలన లేక నేను ముందుగా ఊహించడం వలన దీనికి హెచ్చరికగా ఒక అవతారిక ప్రచురించి నా ఉనికి స్పష్టపరచాను.

ఎంత దురదృష్టం! ఆ అవతారికమీదనే విమర్శకులు పైబడడం జరిగింది. మన ప్రజలు మనం ఎన్ని విధాలుగా వివరించినా తమకి తెలిసినది ఏదో ఒకటి తమకి తెలిసిన ఒకే విధంగా బోధపరచుకోవాలని మూర్ఖంగా ఉన్నారు. అందువలన కాలంని నమ్ముకొని మనం మన పని చెయ్యవలసివుంది.

కాని మన ప్రజలు వివాదం చెయ్యడానికి చాలా ఆతురతతో ఉన్నారు, అందువలనే చాలా తొందరపడుతున్నారు. ఒక తర్కశాస్త్రికి అగత్యమైన విశాల హృదయం, తీక్షణ్యమైన జ్ఞానం లేకుండా, వట్టి తొందరపాటుతో వివాదంలో దిగితే దానికి ఫలితం 'సంతలో సందడి' అని వీళ్ళకి తెలీదు.

ఒక వివాదంకి మౌలికం ఓర్పు, అది వీళ్ళకి లేదు; అందువలన తమకి యెరిగినది పునర్విచారణ చెయ్యక, ఆవేశంతో, బుద్ధికుశలతతో ఆరసించవలసిన ఒక విషయంని ఉద్వేగంతో అంగీకరించి, యుద్ధంకి సిద్ధంగా ఉన్నారు. త్వరలో ఇతరులని కోపిష్ఠులుగా చేసేసి, అలాగే తమకుతామే కోపించుకుంటున్నారు.

ఊరకే ఆవేశంతో బలమైనవారు పోట్లాట చేసి అలసిపోతే అందులో ఒక నెమ్మది ఉంటుంది. కాని ఆ జగడం తరువాత పరస్పర ద్వేషం, అర్థం లేని విరోధం అనావశ్యకంగా ఎదగడం జరగుతుంది.

మన భాష తలవ్రాత చూసారా? అదేంటి, అంత దుర్బలంగా ఉందా? నిజంని నొక్కి చెప్పే సాధనంగా పని చెయ్యడం దానికి చేతకాదా? ఈ భాషలో రూపొందే - ఈ భాషలో సృష్టించే - సాహిత్య ఆశ్రయంని అసత్యంతో చీకటి చేసేసి - తెలివిలేని ద్వేషమనే సైతాను ఇక రాజ్య పరిపాలన చెయ్యాలా?

[3] నవంబరు 11, 1966 లో రాసిన వ్యాసం సారాంశం

సాహిత్యం, ఒక దేశం నాగరికతకి, అభ్యుదయంకి, జీవితంకి, గీటురాయి.

ఒక రచయిత చిత్తశుద్ధితో రాస్తున్నాడే, అది కేవలం అతని ఉదర నిమిత్తం లేక వృత్తి కాదు. అది ఒక ధ్యానం! మీరు కథ అని చదువుతున్నారే, అది ఒక కాలం గురించి, ఒక జీవితం గురించి చెప్పే ఒక శాసనరాయి (milestone).

దాన్ని మీ తృప్తికోసం లేక నా తృప్తికోసం నేను రాయలేను. మిమ్మల్ని మోసగించాలని, నన్ను మోసగించాలనికూడా రాయలేను. సాహిత్యంలో విజయం అనేది మీ మెచ్చుకోలు కాదు, నా అహంకారమూ కాదు. మిమ్మల్ని జయించుతే అది గెలుపు కాదు. కొన్ని సమయాల్లో అదే పతనం. సాహిత్యంలో విజయం అనేది కాలంని గెలవడం. మిమ్మల్ని మించి నేను సాగితే అది నా విజయం. మిమ్మల్ని మించి మీరు సాగితే అది సాహిత్యంకి విజయం. దానికి ఇంకొక పేరు అభివృద్ధి.

ఈ నవల రాసినందువలన నేను నా పాఠకులని పోగొట్టుకున్నాను అని కొందరు నాకు సానుభూతి తెలిపారు.

"మీరిక కథలే రాస్తూవుండండి, ఇవన్నీ ఎందుకు?" అని కొందరు సలహా ఇచ్చారు.

ఏ లోకంలోనోవున్న మహత్తైన పేర్లు నేను వల్లించుకుంటూ పోతున్నట్టు కొందరికి ఆయాసం కలిగింది.

లోతు తెలియకుండా కాలు దిగితే ఇలాగవుతుందని కొందరికి నామీద జాలి కలిగింది.

కొందరు ఏ కారణమూ లేకుండా నన్ను ఈసడించి, నిందించి రాసారు.

నా సమకాలిక రచయితలలో, ఉచిత సాహిత్య విమర్శకి విరుద్ధంగా, నావంతు విరోధం సంపాదించుకున్నవారు ఎవరూ లేరని నేను తెలుసుకున్నాను; ఈ అనుభవంతో ఒక పెద్ద నవలని నేను రాయగలను.

నేనొకసారి రాసిన ఒక విషయం పదేపదే రాయడం వలన అది బోధపడనివారకి అర్థమవుతుందనే నమ్మకం నాకు లేదు. అలాగే 'నా అభిప్రాయాలతో ఏకీభవించనివారితో ప్రతివాదన చెయ్యడం వ్యర్థం' అని నేను నిశ్చయించాను.

ఈ రెండు వర్గాలకి చెందినవారే మూర్ఖంగా నామీద దాడిచేసారు. 'ఇదొక పనికిరాని పని' అని వాళ్ళకి తెలియకపోవడం గురించి నాకు వారిమీద సానుభూతి కలుగుతోంది.

నా పాఠకులనేవారు ఆఖరివరకు ఓపికతో ఉన్నారు. నాలాగే వారుకూడా ఆ ఆక్షేపణలకి గురియై తమ అనుభవాలు నాతో పంచుకునే విధంగా ఈ నవలని పొగడుతూ ఉత్తరాలు రాసారు; ఈ నవల గురించి జరిగిన చర్చలలో తమకి కలిగిన ప్రశ్నలు, చిక్కులు గురించి స్పష్టపరచమని నన్ను అడిగారు.

ఒక రచయితగా ఒకటి రాసి ముగించిన తరువాత అది పాఠకుల మనోధర్మంకి వదిలేయాలని, దానిగురించి పదేపదే పరిశీలన చెయ్యడం నాకు విముఖం అనే కారణం వలన ఆ ఉత్తరాలకి నేను జవాబు ఇవ్వలేదు.

మన సమాజంలో నానావిధమైన బుద్ధిజీవుల చర్చలు, వాదనలు జరగాలనే నా ఆకాంక్ష. జ్ఞానులు, పండితులు, చాలామంది కలుసుకొని శ్రమతో పరిష్కరించవలసిన - లేక శాశ్వతంగా పరిష్కరించలేని - చాలా నిగూఢ ప్రశ్నల గురించి - మూర్ఖులే కలిసి సులభంగా తీర్పు చెప్పడం నేను దినచర్యగా చూస్తున్నాను. ఆ పని మినాయించి, బుద్ధిబలంతో ఎవరు ఎది వాదించినా - అది నా అభిప్రాయాలకి ఎంత వ్యతిరేకమైనా - దాన్ని వినడానికి నేను మర్యాదతో సిద్ధంగా ఉన్నాను.

అందువలన నా అమూల్య పాఠకులు, తమకు తామే ఆ ప్రశ్నలగుంచి ఆలోచించాలని నేను ఊరుకున్నాను.

ఈ నవలని రాసిన తరువాత పాఠకుల ఉత్తరాలు ప్రచురించాలని **ఆనంద వికటన్** సంస్థవారు నన్ను అడిగినప్పుడు నేను నిరాకరించాను. నాకు వచ్చిన శ్లాఘ్యమైన ఉత్తరాలు మాత్రం ప్రచురించి ఈ కాలంలో వెలుబడిన ఈ నవలని ఈ కాలమే అంగీకరించినట్టు ఒక అబద్ధంకి అధికారం ఇచ్చి ఆ అబద్ధంలో దాచుకోడానికి నేను జంకాను. అది న్యాయమే అని వాళ్లుకూడా ఒప్పుకున్నారు.

ఇప్పుడు, ఇంకొకసారి, ఈ నవలని నోరువిప్పి చదివినప్పుడు, దీన్ని రాసినందుకు నాకు గర్వమే కలుగుతోంది. ఆ నిజంని దాచుకొనే నమ్రత ఘనమైనా ఈ సందర్భంలో అందుకు అగత్యం లేదని నాకనిపిస్తోంది.

మీకు ఈ సూత్రం[4] తెలుసా? దాని తాత్పర్యం ఇదిగో:

---

[4] వివరాలకి అనుబంధం చూడండి.

*"యోగ్యకవుల పద్యంకి మహారాజు సభలో బిరుదులు లభించిన తరువాతకూడా, అసూయ వలన కొందరు ఆ ప్రతిష్టని గుర్తుపట్టకపోవచ్చు. అటువంటి సమయంలో ఆ కవులు బహిరంగంగా చేసే ఆత్మస్తుతి ఉచితమే."*

యోగ్యత కలవారు ఆత్మస్తుతిలో పాల్గొనే నిర్బంధం ఎంత శోచనీయమని నాకు బోధపడింది. నా కొఱతలు నాకు తెలుసు.

ఈ కథని నడిపించే పాత్రలందరూ ఎంత వరకు భావావేశపూరిత వ్యక్తులో, అలాగే వివేచనాశక్తి కలవారు కూడా. వారి మధ్య కలిగే సంఘర్షణలలో ఎవరు గెలుస్తున్నారు? ఎవరు ఓడిపోయారు? అని నాకు తెలీదు. ఎవరు గెలవాలి, ఎవరు ఓడిపోవాలి అని నేను ఆశించలేదు. వారు ప్రాతినిధ్యం వహించే అన్ని అభిప్రాయాలకి తమ్మల్ని అంకితం చేసుకొనివున్నారు.

బుద్ధిబలం వర్ధిల్లే ఒక ప్రపంచంలోని భిన్నమైన ప్రజలనే నేను ఇక్కడ పాత్రలుగా ఊహించాను. ధర్మం, అధర్మం ఢీకొట్టుకోవాలని లేదు. ధర్మంలోనే చాలా ఘర్షణలు జరుగవచ్చు. ఆ ఘర్షణలు చాలా ముచ్చటగా లేక చాలా క్రూరంగా ఉంటాయి!

వివాదాస్పదమైన ఈ నవలని ధారావాహికగా ఆనంద వికటన్ పత్రికలో ప్రచురించిన సాధనకి నేను ఆ సంస్థని ఏనాడూ మరిచిపోలేను.

*****



# ఒక విప్లవ కళాకారుని ఆకాంక్ష

*"సంగీతం ఒక ప్రాంతీయ భాష కాదు. అదొక ప్రపంచ భాష! ఈ ప్రాధమిక ప్రజ్ఞ లేకపోతే మరేం సంగీత జ్ఞానం? ఈ విశాల దృక్పధం లేదంటే ఏం భక్తి కలుగుతుంది? అది అర్ధజ్ఞానం లేకుండా వల్లించే మంత్రం అన్నమాట! అది మూఢభక్తి, మరేం కాదు!"*

*"నేను 'సంగీతం ఒక ప్రపంచ భాష' అని అనగానే నేను వేరేవేరే దేశాల సంగీత సంప్రదాయాలు, సాధనలు, నిరాకరిస్తున్నాను అని అర్ధం చేసుకోవద్దు . . . ఇవన్నీ దాటి కళలకి విశ్వజనీన ఏకచిత్తత ఉంది. చెవులద్వారా ప్రవేశించి పురిగొల్పే సంగీతంకి అది చాలా ఉంది. దేశాలలో విభాగాలు, రంగుల్లో భేదాలు ఉన్నా మానవుడి కన్నీరు, నవ్వులలో ఏ వియోగమూ లేదు. అలాగే మానవజాతి దేశ ఎల్లలలో భిన్నమైనా, ఆ భేదాలు ఏ దేశంలో ఎలాగున్నా, World Citizen - విశ్వ పౌరుడు - అనే ఒక ఉదాత్త వ్యక్తిని మనం ఎలాగ ఎదురు చూస్తున్నామో, ఆమోదించుతామో, అలాగే ఒక మనిషికి అది సాధ్యమైతే, ఏం, ఒక కళకి అది సాధ్యం కాదా?"*

*****

# కళ ఎల్లలు దాటాలి!

## 1

దేశదేశాలని వేరువేరుగా వ్యాపించిన పూల తోటల్లో రకరకాల ఛాయలలో వికసించే మానజాతి అనే పుష్పాలలోని మకరందంని వెతుకుతూ వచ్చే భ్రమరంలాగ ఆ విమానం ఆకాశంలో ఎగిరివచ్చింది.

"ఇంకా కొన్ని నిమిషాలలలో మనం మీనంబాక్కం విమానాశ్రయం చేరుకుంటాం," అనే సందేశం ఆంగ్లభాషలో ప్రకటన వినిపించింది. ఎగురుతున్న విమానం ఎత్తునుంచి మెల్లమెల్లగా కిందకి దిగడం వలన ఏర్పడిన కుదుపుతో విమానం సందడి కొంచెం మరింత తీవ్రంగా పెరిగినట్టనిపించింది; సారంగన్ తన కుడి చెవిని చెయితో కప్పుకున్నాడు.

ఏదో వచ్చి చెవిని పూర్తిగా నింపేసినట్టు ఒక స్పర్శ.

అతని చూపు తనకి ఎడమవున్న కిటికీ ద్వారా భూమిపైన వాలింది. ఉదయం సూర్యకిరణాల కాంతిలో నిగనిగమని మెరిసే పట్టుచీర అంచులాగ ఒక సెలయేరుని, చాలా దూరంలో వంకలు వంకలుగా తిరుగుతున్న సముద్రంని అతను రెప్పవాల్చకుండా చూసాడు. కిటికీకి సమీపంలో ఒక దూది బంతిలాగ తేలుతూ వచ్చిన మేఘం ఆవిరిని విమానం విభాగం దట్టంగా ఖండించింది. ఆ దృశ్యం మంచు తెరలాగ సారంగన్ మొహాన్ని ఆవరించుకుంది.

సారంగన్ మళ్ళీ తన చూపుని విమానంలోకి మళ్ళించాడు.

పొరుగు వరుసలో, అతనికి ఎదుట ఉన్న ఆసనంలో ఒక యూరోపుదేశ స్త్రీ, తాగిన సిగరెట్టుని చితకగొట్టి, ఆర్పేసి, కళ్ళద్దాలని తుడుచుకొని నీరసమైన కళ్ళతో కిటికీద్వారా బయటికి చూస్తోంది. పక్కనే ఉన్న ఆమె నాలుగేళ్ళ పిల్లవాడు చెవులని రెండు వేళ్ళతో

బిగువుగా మూసుకొని విమానం ధ్వనికి స్వరం కూర్చుతున్నట్టు మూలుగుతూ ఆసనంమీద కూర్చొనివున్నాడు.

సారంగన్ ఆ పిల్లవాడిని చూసి నవ్వాడు. పిల్లవాడి ధ్వనిని విమానం ధ్వనితో కలిపి విన్నాడు. అదెక్కడ, ఇదెక్కడ?

తనూ ఆ విమానంతో కలిసి ఉదాత్త స్వరంతో పాడాలనిపించింది; తనలో తనే నవ్వుకున్నాడు.

సారంగన్ తన మనసులో దానికి సరైన స్థాయిని కల్పించుకున్నాడు.

'ఈ ధ్వనిని షడ్జమంగా కల్పించుకొని ఇంకా ఉన్నతస్థానలో సంచారం చేస్తే ఎలాగుంటుంది?' అనే ఆలోచన రాగానే మూడు స్వరాలు కూడా దాటలేని తన ఆశక్తి, భ్రమని అతను  గుర్తుచేసుకున్నాడు. మరేం తోచక అదుపులేని, నెత్తిమీద, పొరలుతున్న తన కేశంలో వేళ్ళు పోనిచ్చి తల గోకుకున్నాడు.

అతని చూపు మళ్ళీ కిటికీద్వారా భూమిమీద వాలినప్పుడు విమానం కిందకి దిగుతూ ఎగరడం వలన  చరచరమని చెట్లూ, బాటలూ, వెనకాడుతూ, త్వరగా అదృశ్యమవడం గమనించాడు.

దూరంలో భూమి మహత్యం తెలుసుకొని ఆకాశం వొంగి దాన్ని కౌగిలించుకున్నట్టు దిగంతంలో భూమికి పొలిమేర లాగ సముద్రం నల్లగా కనిపించింది. దానిమీద తేలుతున్న చిన్న పడవలమధ్య ఒక మానవరూపం బొట్టులాగ కనిపించింది.

అది అదృశ్యమవగానే కొంచెం దూరంలో నక్షత్రగుంపులు భూమికి దిగి రావడానికి సిద్ధమైనట్టు ఆకాశంని ఆవరించుకున్న పెద్ద క్రేనులతో ఓడరేవు కనిపించింది.

ఒక పటంని తెఱచిచూపుతున్నట్టు ఒక విశాలమైన నగరం; అక్కడక్కడ భారీ భారీగా కనిపించే కొన్ని కట్టడాల గుంపులు; వృత్తాకారలో చిన్న చిన్న తిప్పలు; పచ్చగా వ్యాపించి కనిపించే చెట్ల పంక్తి; మేంగళూరు పెంకులతో పైకప్పు మాసిపోయిన ఇళ్ళు; వంకరవంకరగా వెళ్తున్న రైలుబండి; సమీపంలో కనిపించే ట్రంకురోడు; లెవల్ క్రాసింగులో నిల్చున్న లారీలు, వాటి చివర యెద్దుబండిలో  కూర్చున్న ఒకే ఒక మనిషి . . . ఇవన్నీ త్వరగా మాయమయే సమయంలో . . .

ఒక పెద్ద కుదుపుతో విమానం భూమిని తాకింది.

విమానాశ్రయంకి అవతల ఇనుప దడి వెనక వరుసగా నిలబడిన జన సమూహం విమానంనుంచి దిగినవారికి చేతులెత్తి స్వాగతం చెప్పింది.

విమానంనుంచి వరుసగా దిగివచ్చిన ప్రయాణికులలో ఆఖరి మనిషిగా, భుజంపై ఒక సంచె, మోజెయిపై ముడుచుకున్న కోటుతో, సారంగన్ దూరంలో కనిపించే జనసమూహంలో తన్ను ఆహ్వానించడానికి ఎవరైనా వచ్చివుంటారనే నమ్మకంతో చెయ్యెత్తి ఊపుతూ దిగివచ్చాడు.

పదిహేను సంవత్సరాల తరువాత జన్మభూమిలో అడుగుపెట్టినప్పుడు, ఉష్ణమైన స్వదేశ గాలి శ్వాసించినప్పుడు, మాతృభాషలో మాటలు అక్కడా ఇక్కడా వచ్చి చెవుల్లో వినిపించినప్పుడు - అన్యోన్యమైన విదేశీయ జీవితంలో సారంగన్ ఎంత గూఢంగా పాతుకొనివున్నా- జన్మభూమి అనే అనురాగం అతన్నికూడా ఆనందభరితుడుగా చేసింది.

ఊహా ప్రపంచంలో తేలుతూ, ఆదర్శవాదిగా మెలిగే అతని కళ్ళు ఆ జన సమూహంలో తనకి స్వాగతం చెప్పడానికి వచ్చిన తన తండ్రిని, లేక తమ్ముడుని, లేక పరిచయం లేకపోవడం వలన పెనుగులాడే తన మేనల్లుడుని వెతికాయి. వరుస వరుసగాగా నిల్చున్న ఆ గుంపులో ప్రతీమొహం చూస్తూ చివరికి సారంగన్ ఒంటరిగానే బయటకి వచ్చాడు.

వచ్చి నిలబడి, కొంచెంసేపుముందు వరుసగా చూస్తూవచ్చినప్పుడు సారంగన్ చూపుని స్నేహ భావంతో ఆకర్షించిన ఆ కళ్ళని ఇంకొకసారి ఆ జనసమూహంలో అతను తిరిగి చూసాడు.

దట్టమైన ఎర్రరంగుతో జ్వలించుతున్న పట్టుచీర కొనతో మోహం కప్పుకొని ఆమె నిల్చొనివుంది. సారంగన్ తన చూపుని మళ్ళించిన తరువాతకూడా ఆమె అతన్నే చూస్తూవుంది. ఆమెతో మాటాడాలని ఒక అడుగు పెట్టి, 'ఇది పారిస్ కాదు, లండన్ కాదు' అనే ప్రజ్ఞతో 'పరిచయం లేని ఒక హిందూ స్త్రీతో ఎలాగ మాటాడడం?' అనే భయంతో, రెండు మూడు సార్లు ఆమెను తిరిగిచూస్తూనే సారంగన్ లగ్గేజ్ కౌంటర్ కి నడిచాడు.

అతను తన చూపునుంచి అదృశ్యమవగానే ఆమె తన సమీపంలో నిల్చున్న భర్తని తిరిగిచూసింది. సూట్ ధరించిన ఆ పొడుగాటి మనిషి - కొంచెం దూరంలో సిగరెట్టు కాల్చుతూ, ఆకాశంని తేరిపారి చూస్తున్నారు. ఆమె దగ్గరకి రాగానే అతను ఆమెని చూసారు. “మనం ఎదురుచూసిన మనిషి రాలేదు!” అని నిరాశతో పెదిమని విదిల్చారు. ఆమె నెమ్మదిగా తనలో నవ్వుకుంది. ఇద్దరూ మౌనంగా తిరిగి నడిచారు.

లగ్గేజ్ కౌంటరులో ‘నాలుగు పెద్ద సూట్ కేసులను బస్సులో ఎక్కించుకుందామా? లేకపోతే ఒక టాక్సీ అమర్చుకుందామా?’ అని నిర్ణయం చెయ్యలేక సారంగన్ ఒక పోర్టరు, టాక్సీ డ్రైవరు మధ్య తారుమారులో పడ్డాడు. వాళ్ళని వదిలి కొంచెం దూరంలో నిలబడి సిగరెట్టు వెలిగించాడు. అప్పుడు అతని వెనకనుంచి ఆంగ్లభాషలో ఒక పిలుపు వినిపించింది:

“Excuse me . . . Aren’t you Mr. Sarangan?”

సారంగన్ తిరిగిచూసినప్పుడు అతను - సూట్ ధరించిన ఆ పొడుగాటి మనిషి - వాడియెదుట చెయి చాటి నిల్చున్నారు. తనకి పరిచయం లేని ఒకతను తన్ను సరిపోల్చుకున్నారని తెలుసుకొని సారంగన్ చిరునవ్వుతో తన కృతజ్ఞత తెలిపి కరచాలన చేసాడు.

“నా పేరు మహాలింగం,” అని సారంగన్ని తన పిడికిలితో లాగ్గున్న అతను పోర్టరుదగ్గర ఒక తాళంచెవి ఇచ్చి “ఆ అంబాసిడర్ లో ఈ సామాను ఎక్కించు” అని చెప్పారు.

ఇద్దరూ మౌనంగా రెస్టారెంటుకి నడిచారు. అప్పుడు మహాలింగం తను సారంగన్ తండ్రికి ఆప్త మిత్రుడని - ఇంకా తేటగా చప్పాలంటే - అతని అన్నయ్య నరసింహన్ సహపాఠి అని, సారంగన్ పారిస్ నుంచి రాసిన ఉత్తరాలన్నీ తను చదివినట్టు ఆతురతతో ఆంగ్లభాషలోనే చెప్తూ వచ్చారు. అతని ప్రతీ సందేశంకి, “I see”, “Oh, I see . . . ” అని చిరునవ్వుతో కృతజ్ఞత చూపుతూ, తలూపుతూ సారంగన్ అతనితో నడిచాడు.

అప్పుడు వాడి చూపులో వరాండా చివర ఒక స్తంభంని ఆనుకొనివున్న - దట్టమైన ఎర్రరంగుతో జ్వలించుతున్న చీర కొనతో మొహం కప్పుకొని - ఆమె కనిపించింది. సారంగన్ నుదుటమీద పొరలుతున్న జుత్తుని వెనక్కి నెట్టుకున్నాడు.

వాళ్ళిద్దరూ ఆమె చెరువకి దగ్గర రాగానే మహలింగం ఆగారు. "ఇది నా భార్య లలిత" అని సారంగన్ కి పరిచయం చేసి, "మీరే సారంగన్ అని ఈమె చెప్పే నేను తెలుసుకున్నాను . . . అందువలన దానికి మిమ్మల్ని పరిచయం చేసే అగత్యం లేదు!" అని ఏదో పెద్దగా హాస్యమాడినట్టు బిగ్గరగా నవ్వారు.

లలిత సారంగన్ని నమస్కరించింది. సారంగన్ చెయిలోని సిగరెట్టుని నేల పారేసి జవాబుకి నమస్కరించాడు. తరువాత ముగ్గురూ రెస్టారెంటుకి వెళ్ళారు.

వేసవికాలం వలన ఉదయంలోనే ఉష్ణం చాలా తీవ్రంగా ఉంది. మహాలింగం, లలిత, సారంగన్ ముగ్గరూ ఆ రెస్టారెంటులో కాఫీ తాగాలని, ఉష్ణం లేని వాతావరణంలో కొంచెంసేపు కూర్చొని మాటాడాలని అక్కడ వచ్చి కూర్చున్నారు.

సారంగన్ తన కోటు పాకెట్టునుంచి ఒక సిగరెట్టు తీసి మహాలింగంకి అందించాడు. అది అలవాటుగా అతను తాగే సిగరెట్టు కాదు, కాని మర్యాదకోసం ఆ విదేశ సిగరెట్టుని తీసుకొని, వెలిగించి, పొగని అతను సంతోషంగా అనుభవించారు.

వాళ్ళు ముగ్గురూ మౌనంగా కాఫీ తాగుతున్నప్పుడు సారంగన్ చూపు మహాలింగంని అంచనా వేసింది. అప్పుడు మహాలింగం సౌమ్యంగా నవ్వుతూ, "We are your admirers" అని అన్నారు.

"It is impossible," అని అతను చెప్పినది ఒకే వాక్యంలో తిరస్కరించిన సారంగన్, మళ్ళీ ఆంగ్లభాషలోనే అతనికి చెప్పాడు: "ఇంతవరకూ నేను ఇండియాలో వయలిన్ తాకనేలేదే?"

" మేం మీ సంగీత అభిమానులు అని అనలేదే?" అని అతను అడగ్గానే -

"నా దగ్గర మరేం ఉందని?" అని పెదిమలు విదిలించుతూ సారంగన్ లలితని చూసాడు.

"ఎందుకు లేదు? మీరు మీ నాన్నగారికి రాసిన ఆ పొడుగాటి ఉత్తరాల్లో చదివిన విప్లవాత్మక ఆలోచనలగురించి మేం చాలాసార్లు వివాదించియున్నాం. అవును కాదా, లలితా?" అనే భర్త మాటలు విని, ఆమోదించే విధంగా లలిత తలూపింది.

"ఆ ఆలోచనల గురించి మేం మాలో వివాదించుకోడం కంటే మీ నాన్నగారితో మేం వివాదించినదే ఎక్కువ" అని లలిత నిదానంగా, మధురమైన కంఠధ్వనిలో చెప్పినప్పుడు సారంగన్ ఎడం చెయితో జుత్తుని దువ్వుతూ ఏదో ఆలోచనలో పడి, నవ్వుతూ -

"అవేం అంత వివాదాస్పదమైన అభిప్రాయాలంటున్నారా?" అని మూలుగుతున్నట్టు అడిగాడు.

"అవును, తప్పకుండా! మీలాంటివారు చాలామంది ఈ సమాజంకి కావాలి! ఆ ఆతురతవలనే పరిచయంలేని మీకు స్వాగతం చెప్పడానికి మేం పరుగెత్తుకొని వచ్చాం!" అని ఆవేశంతో మహాలింగం కొంచెం బిగ్గరగానే మాటాడారు.

"Thank you, thank you very much . . . " కృతజ్ఞతతో సారంగన్ పెదిమలు వొణికాయి. అగాధమైన గుండెనుంచి మాటలు హీనస్వరంతో బయటకి వచ్చాయి. వాడు ఇద్దరినీ మారి మారి చూసాడు. తల వొంచి, సిగరెట్టుని బాగా పీల్చి, దాని బూడిదని ash tray లో మెల్లగా తట్టికొట్టిన తరువాత మహాలింగం పక్క తిరిగాడు.

"నాన్నగారు ఎలా ఉన్నారు? నేను లండన్ నుంచి పారిస్ కి వెళ్ళిన తరువాత ఈ పది సంవత్సరాలలో అతను నేను రాసిన ఏ ఉత్తరంకీ జవాబు రాయలేదు. మిస్టర్ నరసింహన్ కి రాసినాకూడా అంతే. నన్ను వాళ్ళందరూ మరిచిపోయారు!" అని ఒక నిట్టూర్పు వదిలి వాడు చిరునవ్వు నవ్వినప్పుడు అతని కన్నులలోని కలవరం లలిత మాత్రం గమనించింది.

"Oh, take it easy" అని మహాలింగన్ సారంగన్ భుజం తట్టారు. "మీరు ఇంతకు ముందు ఇందియాకి ఎప్పుడు వచ్చారు?"

"1949 లో . . . " అని మూలుగుతూ జవాబు చెప్పిన సారంగన్ మొహంని శోకం కప్పేసింది. కొన్ని క్షణాల తరువాత వాడు చెప్పాడు: "నాన్నగారికి నామీద కోపం! నాగురించి అతనికి పెద్ద ఆశాభంగం! అతని సలహా ప్రకారం నేనిక్కడ చదవలేదని

అతనికి కోపం . . . ఇక్కడే ఉండమని అప్పుడు బలవంతం చేసారు. అప్పుడు నేను లండన్ లో ఉన్న ఒక హిందు వ్యాపారిదగ్గర పనిచేస్తున్నాను - అంతేకాదు, అప్పుడే నేను తీవ్రంగా పాశ్చాత్య సంగీతం నేర్చుకుంటున్నాను. అందువలన అతని సలహాకి విరుద్ధంగా నేను వెళ్ళవలసివచ్చింది. నాకు తెలుసు, నేను పాశ్చాత్య సంగీతం చదివి ఒక గాయకుడుగా పారిస్ వెళ్ళడం వలన అతను నన్ను పూర్తిగా మరిచిపోయారు! నేనంటే అతనికి ద్వేషం!" అని, అక్కడక్కడ ఆలోచిస్తూ, ఆగి, ఆగి, ఒక విదేశికి తగిన సంజ్ఞలతో సారంగన్ చెప్పినది మహాలింగం, లలిత, శ్రద్ధతో విన్నారు.

లలిత చెప్పింది:

"అతనూ ఒక సంగీత విద్వాంసుడు కదా? అతనికున్న సంగీత జ్ఞానం, సంగీతంమీద భక్తి . . . అని చెప్పబోతుంటే -

"అదేం సంగీతం? భాషలలో ఎన్ని భేదాలున్నాయో ఆ భేదాలన్నీ సంగీతంలోనూ ఉన్నాయి. అతను 'సంగీతం' అని అంటే 'కర్ణాటక సంగీతం' మాత్రమే!" అని జోక్యం చేసుకొని మాటాడిన సారంగన్ తనేదో పొరబాటు చేసినట్టు "I am sorry!" అని ఆగాడు.

"మీరన్నది నిజం. అతను అలాగే వాదించుతున్నారు" అని మహాలింగం సారంగన్ చెప్పినది ఆమోదించారు.

"'నా అభిప్రాయాలకి అతను స్వాగతం చెప్పరు, అలాగే నాకూ స్వాగతం చెప్పరు' అని తెలిసే నేను వచ్చివున్నాను. కాని ఈ రెండూ నా హక్కుకి సంబంధించినవి" అని నవ్వుకుంటూ వాడు చెప్పినా వాడికి తన అభిప్రాయాలపై ఎంత తీవ్రమైన అధీనత ఉందని, తన వ్యక్తిగత జీవితంలోనూ సారంగన్ దృఢంగా పోరాడుతాడని తమకు బోధపడినట్టు ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు.

సారంగన్ చెప్పాడు:

"సంగీతం ఒక ప్రాంతీయ భాష కాదు. అదొక ప్రపంచ భాష! ఈ ప్రాధమిక ప్రజ్ఞ లేకపోతే మరేం సంగీత జ్ఞానం? ఈ విశాల దృక్పథం లేదంటే ఏం భక్తి కలుగుతుంది? అది అర్ధజ్ఞానంలేకుండా వల్లించే మంత్రం అన్నమాట! అది మూఢభక్తి, మరేంకాదు! నేను నా నాన్నగారిగురించి మాత్రం మాటాడలేదు. అలాంటివారు చాలామంది మన

దేశంలో ఉన్నారని నాకు తెలుసు" అని వాడు చెప్తూంటే వెయిటర్ మహాలింగంకి బిల్ అందించాడు. మహాలింగం బిల్లుకి వాడికి డబ్బిచ్చారు.

ముగ్గురూ లేచి ఆ A.C. గది తలుపులు తెరచుకొని బయటకి వచ్చినప్పుడు వేసవి ఎండ ఇంకా తీవ్రంగా ఉంది. కారున్న చెరువకి నడిచి రావడానికి ముందే సారంగన్ చెవులు, నుదురు, ఉష్ణంలో ఎర్రబారిపోయాయి. అతని తెల్ల షర్టు కాలరు, చంకలు చమటలో తడిసిపోయాయి. వాడు 'ఉస్' అని టైని విప్పుకొని ఊపిరి వదిలాడు. కారుని చేరుకొని కారు ముందు తలుపు తెరిచి మహాలింగం వాడిని చూసి అడిగారు: "ఈ ఉష్ణం మీకు చాలా తీవ్రంగా ఉందికదూ?"

"నా జన్మభూమి వాతావరణం ఇలాగే ఉందంటే దానినుంచి నేను తప్పించుకోడం ఎలా సాధ్యం?" అని బిగ్గరగా నవ్వుతూ సారంగన్ కారులో ఎక్కికూర్చున్నాడు.

వాడి వాలకం చూసి మనసులో ఆనందిస్తూ కారు వెనక సీటులో కూర్చున్న లలిత వాడి వీపుని తేరిపార చూసింది.

'ఇతనికి స్వాగతం చెప్పడానికి చెయిలో ఒక పూలదండతో రాలేదే!' అని ఆలోచిస్తూ మహాలింగం కారు నడిపారు.

కారు వెళ్ళే మార్గంలో తమిళ దేశంలో పరిశుద్ధ తమిళులుగా జీవించే తమిళులని సారంగన్ ఆతురతతో చూసాడు. వాళ్ల తమిళ సంభాషణలు వడిగా విన్నాడు. దారిలో ఒక గోడమీద బొగ్గుతో రాసిన - తమిళ భాష వర్ధిల్లాలి! - అనే సందేశం బిగ్గరగా చదివాడు. తరువాత గభీమని మహాలింగంని తిరిగి చూసి పామరభాషలో "మనం ఎందుకు ఇంగ్లీషులో మాటాడాలి? . . . ఇక నేను తమిళంలోనే మాటాడతాను" అని వాడి ప్రకటన విని మహాలింగం చిరునవ్వుతో "Why not?"అని ఇంగ్లీషులో అడగ్గానే అది విని లలిత కలకలమని నవ్వింది. ఆమె ఎందుకు నవ్వుతోందని తెలియక సారంగన్ తిరిగిచూసాడు.

** ** ** **

ఇవాళ ఉదయం పూజలో శేషయ్య మనసుని కలవరం ఆవరించుకుంది. మామూలుగా కుంభవర్షంలోనూ, చలితీవ్రతలోనూ ఈ ఎనభైఐదుయేళ్ల వయస్సులో

పొద్దున్నే లేచి స్నానం చేసే అతను నిన్నరాత్రి చాలాసేపు నిద్రపోకుండా పడకమీద దొర్లడంవలన ఉదయం చాలాసేపు నిద్రపోయారు.

ఇంటిచుట్టూ ఉన్న తోటలో ప్రతీ పువ్వులోనూ అతను ఆరాధించే పాండురంగడు దివ్యదర్శనం ఇస్తున్నట్టు, ఆ అనుభవంని తను గారాబంతో పెంచుకున్నట్టు, రోజూవారీ అతను పువ్వులు కోసేవారు.  కాని ఇవాళ తొందర తొందరగా, కొన్ని నందియా పువ్వులు సేకరంచి పూజచేసారు. శాస్త్రంకని  వీణని తీసుకొని ఒడిలో పెట్టుకొని కొన్ని నిమిషాలు మౌనంగా ధ్యానం చేసారు. తరువాత వీణలో ధన్యాసి రాగంలో కొంచెం ఆలాపన చేసారు:

**'సంగీత జ్ఞానము భక్తి వినా . . .**

**సన్మార్గము కలదే . . .**

**మనసా . . . '**

అనే కీర్తన పాడుతున్నప్పుడు,

'మనసా' అనే పదంని మాత్రం వయసు చెల్లడం వలన అసక్తమైన తన తీయని కంఠధ్వనితో వీణతో కలిసి అతను పాడారు.

వీణనుంచి వెలుబడిన నాద ధ్వనులు, అలలు అలలుగా, ఆ పవిత్ర పూజాగదిని పూర్తిగా ప్రశాంతితో నింపాయి.

బయట -

హాలులో ఉయ్యాలలో కూర్చున్న అతని కొమార్తె బాలాంబ, పూజాగదినుంచి మెల్లగా వినిపించే ఆ కీర్తనని తనూ మనసులో  గొణుక్కుంది.

పెరడులో తుళసీ మఠం ముందు నిలబడి తుళసీని, సూర్యుడుని ఆరాధించే బాలాంబ కోడలు లీల లోపలికి వచ్చినప్పుడు అత్తగారి ఎదుట భక్తి శ్రద్ధతో పూజించిన పువ్వులతో నిలబడింది.

సుమంగళిగా ఉన్నాకూడా  బాలాంబ అసంతృప్తితో కోడలు ఇస్తోంది అనే కారణం వలన ఆ పువ్వులలో ఒకటి తీసుకొని తన కేశంలో దూర్చుకుంటుంది. తరువాత పళ్ళెంలో ఉన్న కుంకుమంని ఒక వేలులో తీసుకుంటుంది.

బాలాంబ పవిత్రమైన భావన లేకుండా పువ్వూ, కుంకమం ఒక నియమంకోసం ధరించడం చూసి లీల తన భావనలు బయటకి తెలియజేయక మేడమెట్లు ఎక్కి మీదకి వచ్చింది.

లీల కావాలనే తరచుగా ఇలాగ తన అత్తగారికి ఒక సుమంగళి ఇంకొక సుమంగళికి వస్తువులు ఇచ్చినప్పుడు ఆవిడ తన భర్తగురించి ఏమైనా చెప్తారా అని శ్రద్ధతో చూస్తుంది.

లీలకి, బాలాంబ కుమారుడు మురళీకి మూడునెలలముందు పెళ్ళయింది.

ఆ పెళ్ళిలో ఒక తండ్రి స్థాయిలో మరళీకి లాంఛనప్రాయంగా అన్నీ చేసినది అతని తాతగారు శేషయ్య.

మురళీకి పదేళ్ళు నిండినప్పుడు అతని తండ్రి నరసయ్య సన్యాసం స్వీకరించి ఎక్కడికో వెళ్ళిపోయారని అని చెప్పుకున్నారు; లీలకి అంతే తెలుసు.

సన్యాసిగా ఐపోయారు అనే ఒకే కారణం వలన ఒక కుటుంబం అతన్ని పూర్తిగా మరిచిపోవడం ఎలా సాధ్యమైంది?

'కుటుంబంని త్యజించడం ఒక సన్యాసికి ధర్మంగా కనిపించవచ్చు. కాని అతని భార్య కూడా సన్యాసిలాగ భర్తని త్యజించడం ఎలా సాధ్యమైంది?' అనే ప్రశ్న బాలాంబని చూసినప్పుడెల్లా లీల మనసుకి కలిగేది.

పెళ్ళయి భర్త ఇంచికి వచ్చిన ఒక పడుచుకి భర్త ఇల్లే సొంత ఇల్లుగా కొత్త అనుభవంగా, కొత్త ఉపాదిగా కనిపించడం మామూలే.

పడుచుకి పుట్టినిల్లు సొంత ఇల్లు కాదు. భర్త ఇల్లే ఆమె సొంత ఇల్లు. ఇక అక్కడే ఆమె అధికారం చెలాయించడం జరుగబోతోంది. ఒక హిందు యువతి ఆ మార్పుకి తగినట్టుగా తన్ను తయారుచేసుకుంటుంది.

కాని లీలకి పుట్టినిల్లుతో బంధం పొగొట్టుకున్న తరువాత వచ్చిన ఇంటిలోనూ ఒద్దిక లేకుండా పోయింది. 'ఇది నా భర్త ఇల్లు. ఇక నా అధికారం, హక్కులు ఇక్కడే నేను నిరూపించాలి!' అనే భావనకి, నమ్మకంకి ఎటువంటి అవకాశమూ లేకుండా, ఇక తన భవిష్యత్తు గురించి ఏ ప్రజ్ఞ లేకుండా అసంతృప్తితో ఆమె రోజులు గడుపుతోంది.

ఎన్ని వసతులతో జీవించినా, అందరి అభిమానంకి పాలయినా, ఇది ఆమె సొంత ఇల్లు కాదే! ఇది ఆమె భర్త మాతామహి ఇల్లు! శేషయ్య జ్యేష్టపుత్రుడు నరసింహన్, అతని భార్య బాలాంబతో ఎన్ని అభిప్రాయ భేదాలున్నా, మురళీని తమ సొంత బిడ్డలాగ భావించారు. వాళ్ళకి సంతతిలేని కొరతని వాడు నివర్తించాడు. కాని అందువలన లీలకి తృప్తి కలుగుతుందా?

తన అసంతృప్తికి కారణం లీలకే బోధపడలేదు. కాని తన భర్తకి సొంతమైన ఇల్లు, కుటుంబం, తలపోసినప్పుడెల్లా ఎక్కడో జీవించే మొహం తెలియని మామగారు తరచుగా ఆమె మనసులో కనిపించారు.

ఎవరైనా సన్యాసం స్వీకరించారంటే కుటుంబంని విడిచిపెట్టి పారిపోవాలా? అదేం పరిత్యాగం? "తిండి లేక అడవిలో వాపోయే మనిషి 'నేనిక ఉపవాసం ఉంటాను!' అని చెప్పినట్టుంది! . . . " అని చదువుకున్న ఆ అమ్మాయి ఆలోచించింది.

చాలామంది సన్యసించడానికి కారణాలు లీల తరచుగా పరిశీలన చేసింది. ఒకటి: సంసారం అనే బంధంకి వాళ్లు లోబడలేదు, అలాగున్నా ఆ మనోహరమైన సంబంధంని వాళ్ళు దృఢంగా నిరాకరించారు. అటువంటి బంధుత్వం ఉన్నా, పవిత్రమైన దాంపత్యంలో పాల్గొని, అందువలన కలిగిన సంతతిని వదిలేసి ఎవరైనా సన్యాసం అంగీకరించారంటే దానికి కారణం విరక్తియే అనాలి.

ఒక మనిషికి అటువంటి విరక్తి కలగాలంటే అందుకు తీరా బాధ్యత అతని భార్యకే అని లీల ఊహించింది.

ఇలాగ ఆలోచించడానికి కారణం ఆమెకున్న జ్ఞనమో, సహజగుణంకి మించిన అనుభవమో కాదు.

ఆమె కొత్తగా పెళ్ళయిన వధువు. అందువలన ఆమె తన భర్తగురించి ఆలోచించింది. 'నా భర్త నన్ను త్యజించి సన్యాసం స్వీకరించడం సాధ్యమైతే దానికి తగిన కారణం ఏమిటి?' అని లీల కల్పన చేసుకుంది.

'నా భర్త నిజంగానే జ్ఞానమార్గంలో ఇష్టపడి సాధారణ ఇచ్ఛలు నిరాకరిస్తే అందుకు దోహదం చేసే విధంగా నేను కూడా అతన్ని అనుసరించి జీవించాలి!' అని అమె

నిశ్చయించినప్పుడు ఆమె చూపు ఆమె గదిలో గోడమీద వేలాడుతున్న పరంహంస, శారదామణి పటాలమీద వాలింది.

ఇలాగ చాలారోజులు లీల బాలాంట గురించి, తన మామగారు గురించి బాగా లోతుగా ఆలోచించింది. కాని తన భావనలు ఆమె తన భర్తకికూడా తెలియజేయలేదు.

అమె తనే ఆలోచించి నిశ్చయం చేసేవరకూ ఏదీ బహిరంగపరచదు.

ఆమె భర్త ఆమెని ఒక పసిపాపలాగ భావించాడు.

ఇప్పుడుకూడా తులసీమఠం ఎదుట నిల్చొని పూజించిన ఆ ప్రసాదంని లీల బాలాంటకి ఇవ్వడం - మేడ వసారాలో నిలబడి ఆ దృశ్యం చూసినప్పుడు - ఆమె బోళాతనం మనసులో గుర్తుచేసుకొని నవ్వుతూ మురళీ లోపలికి వెళ్ళాడు.

మేడగదిలో ఎలక్ట్రిక్ షేవరుని ప్లగ్గులో దోప్పించి, అద్దం ముందు నిలబడి క్షవరం చేసుకుంటున్న మురళీ వెనుక వచ్చి నిలబడిన లీల, స్నానం చేసిన తరువాత క్షవరం చేసుకొనే వాడి వీపుని తేరిపార చూసింది.

ఆమె తన్ను చూడడం మురళీ అద్దంమూలంగా గ్రహించాడు. మొహం మళ్ళించకుండా అద్దంలో ఆమె ప్రతిబింబం చూస్తూనే వాడు అడిగాడు:

"లీలా, నీ పూజలూ, పునస్కారాలన్నీ పూర్తిచేసావా?"

"ఏం, మీకు ఇవన్నీ ఇష్టం లేదంటున్నారా?"

"ఇష్టం లేదని ఎవరన్నారు? నాకు అన్నిటికంటే నువ్వే ఇష్టం! నువ్వెప్పుడు వస్తావని కాచుకొనివున్నాను . . .."

"ఎందుకు?"

"ఎందుకా? నేను నీ కోసం, నువ్వు నాకోసం కాచుకొని ఉండడానికి కారణం చెప్పమంటే ఎలాగ? నేను నాలాగ, నువ్వు నీలాగ ఉన్నాం, అదే కారణం!" అని ఆమెను చూసి మళ్ళీ మురళీ నవ్వాడు.

లీలకూడా వాడిని చూసి నవ్వేసింది; యౌవనంలో ఆకర్షణ ఏలుతున్నప్పుడు చిరునవ్వు మత్తుమందులాగ పనిచేస్తుంది.

ప్లగ్గులో దూర్చిన షేవర్ ని అలాగే మేజామీద వదిలేసి మురళి ఆమెని కౌగిలించుకున్నాడు.

కుట్టుపని యంత్రంలాగ మేజామీదున్న షేవరు సందడి చెయ్యడం ఆపలేదు!

లీల అతని పట్టుని వదలించుకోవాలని ప్రయత్నించలేదు. ప్లగ్గులోని షేవరుని తీసేసి ఆ కరణకఠూర శబ్దం ఆపింది.

తరువాత మెల్లగా భర్తని బతిమాలుతున్నట్టు అడిగింది:

"అవును లేండి . . . మీ నాన్నగారు ఎక్కడ ఉన్నారు? అత్తకి అతనిగురించి ఏ విచారమూ లేదు. మీకకూడానా?"

మురళి ఆమె మొహం ఎత్తి కళ్ళలో చూసాడు.

అతని కళ్ళు నిగనిగలాడాయి.

అతను పట్టు వదిలాడు.

ఇద్దరూ మౌనంగా ఏదో ఆలోచిస్తూ ఒకరినొకరు వదిలి నిల్చున్నారు.

కొన్ని నిశ్శబ్ద క్షణాల తరువాత ఆమె మొహం చూడకుండా కరకైన ధ్వనిలో మరళి చెప్పాడు:

"ఈ కుటుంబం చాలా గౌరవమైనది. అమ్మ నాకు దైవం లాగ. నాన్నగారి గురించి నాకు తెలుసు. సమయం వచ్చినప్పుడు నీకన్నీ నేను చెప్తాను . . . నీకు తెలుసా? నిజం చెప్పాలంటే సన్యాసం పుచ్చుకున్నది నాన్నకాదు, అమ్మే!" అని చెప్పి మురళి ఆమె మొహం చూడగానే లీల ఏమీ బోధపడక కలవరపడింది.

"క్రమంగా నీకన్నీ బోధపడతాయి. నీ దగ్గర నేనేదీ దాచను!" అని ఆమెకి హామీ ఇచ్చినట్టు మురళి కనుసైగ చేసాడు.

అంతకు మించి మరేం అడక్క లీల తులసీ మఠంని పూజించి తెచ్చిన కుంకంని మురళి నెత్తిలో పెట్టి తన గదికి వెళ్ళింది.

ఆమె వెళ్ళగానే మురళి నేత్తిలోని కుంకంని చెఱుపుకున్నాడు.

మురళికి విదేశంనుంచి సారంగన్ రావడం తెలుసు. ఇవాళ ఉదయం విమానాశ్రయంకి తను మాత్రం స్కూటర్ లో వెళ్ళి అతనికి స్వాగతం చెప్పాలనుకున్నాడు.

కాని ఆ ఆలోచనతోబాటు కొన్ని ప్రశ్నలు లేచాయి: 'నరసింహన్ కారు ఇవ్వరు; స్కూటర్ లో వెళ్తే అతన్ని చూసినతరువాత బస్సుకి నేను వెనకతట్టుగా తిరిగిరావాలి,

అందువలన నేను వెళ్తే అతనికేం లాభం ఉండదు; అదొకటి. ఇంకొకటి - పదిహేను సంవత్సరాలముందు స్కూలులో చదువుతున్న బాలకుడుగా సారంగన్ నన్ను చూసారు, ఇప్పుడతను నన్ను సరిపోల్చగలరా? ఇవన్నీ సామాన్య ప్రశ్నలే, కాని నేను మాత్రం వచ్చి అతనికి స్వాగతం చెప్పడానికి కారణం తలచుకుంటే నాకు ఇబ్బందిగా ఉందే?' అనే భయంతో 'సరే, అతనే ఏలాగో రానీ!' అని మురళి ఊరుకున్నాడు.

కాని గత అర్ధగంటగా మురళి వాచీ, బంగళా గేటుని చూస్తూ మేడలో కాచుకొనివున్నాడు.

లలిత, మహాలింగం దంపతులు విమానాశ్రయంకి వెళ్ళివుంటారని వాడు ఎదురుచూడలేదు.

సారంగన్ రావడానికి ముందే మురళి క్షవరం చేసుకున్నాడు. తనతోనే మేడమీద సారంగన్ బస చెయ్యాలనే ఆకాంక్షతో మేడలో తన గదిలాగే ఇంకొకటి శుభ్రం చేసివుంచాడు.

అప్పుడు అక్కడ వచ్చిన లీలని చూసాడు. ఆమె మొహం తేరిపార చూసి ఆలోచించాడు.

"మనకి పెళ్ళయిందనికూడా సారంగన్ అంకుల్ కి తెలీదు . . . " అని మూలుగుతూ తల వొంచిన మురళి, తడిసిన కళ్ళతో, తలెత్తి లీలకి చెప్పాడు.

"అయ్యో, రంగయ్య మామ గతించారనికూడా ఈ తాతయ్య అతనికి చెప్పలేదు, ఆతనికి తెలుస్తే? . . . " ఆని ఆ తలంపు తాళలేక మురళి నిర్ఘాంతపోవడం చూసి లీల కలవరపడింది.

పూజ గదినుంచి వీణాగానం ఎడతెగకుండా వినిపించింది.

ధన్యాసి రాగంలో ప్రారంభించిన ఆ కీర్తనలోని పల్లవిని ఒక సారి స్పష్టంగా పాడిన తరువాత వీణ నాదం ఆగింది.

ఉయ్యాలలో కూర్చున్న బాలాంబ ఇంకొక కీర్తన ఎదురుచూసింది.

కాని ఆకస్మికంగా ఇవాళ ఒక కీర్తన తరువాత -

***"నీ నామ రూపములకు***
***నిత్య జయ మంగళం"***

అని మంగళం పాడిన తరువాత మధ్యమావతి స్వరాలతో వీణానాదం మ్రోగి ఆగింది.

పూజని ముగించుకొని, పూజగదిని మూసి, తాళం వేసి, శేషయ్య హాలుకి వచ్చారు.

బాలాంబ ఉయ్యాలనుంచి లేచివచ్చి తండ్రిని చూసింది. మామూలుగా ఇంకా ఒక గంట తరువాతనే అతను పూజగదినించి బయటకి వస్తారు.

శేషయ్య తల వొంచి ఏదో ఆలోచిస్తూ ఉయ్యాలలో కూర్చున్నారు.

బాలాంబ మరేం అనక మౌనంగా వంటగదికి వెళ్ళింది.

తలెత్తి చూసిన శేషయ్య ఒక నిట్టూర్పు వదిలారు; పళ్ళు లేకుండా నోరులో అంటుకున్న పెదిమలు వణికాయి.

బక్కచిక్కిన దేహంని కప్పుకున్న అంగవస్త్రంని తీసి నెత్తిలోని చెమటని తుడుచుకున్నారు. నెత్తిలోని తిలకం అంగవస్త్రంని మలినపరచింది.

వంటగదినుంచి బాలాంబ అతనికి ఒక వెండి గిన్నెలో పాలు ఇచ్చింది. తన్ను గమనించకుండా అతను ఏదో ఆలోచనలో ఉన్నారని ఆమె మౌనంగా ఉయ్యాలసంకెలు పట్టుకొని నిల్చుంది. కొన్ని నిమిషాల తరువాత ఆమె అక్కడ నిలబడడం అతను గ్రహించారు. బోసినోరు తెరిచి ఆమెని చూసి నవ్వారు.

ఆమె అందించిన పాల గిన్నెలో ఒక గుక్కెడు మింగి ఆమెని అడిగారు.

“ఇప్పుడు వాడెందుకు వస్తున్నాడు?”

ఈ ప్రశ్నకి ఆమె ఏం జవాబు చెప్తుంది?

“వాడింటికి వాడు వస్తున్నాడు” అని మూలుగుతున్నట్టు చెప్పింది.

అప్పుడు కాలేజీకి వెళ్ళడానికి సిద్ధమై తన గదినుంచి బయటకి వచ్చిన శేషయ్య జేష్టకుమారుడు నరసింహన్ -తమిళ ప్రొఫసరు - తండ్రిని చూసి చెప్పారు:

“నాన్నగారూ, నాకేమో వాడు రావడం గురించి అనుమానంగా ఉంది. వాడు రాడు.”

సారంగన్ రావడం గురించి నరసింహన్ కి ఇష్టం లేదని గ్రహించిన బాలాంబ మొహం ముడుచుకుంది. ఆమె తిరిగిచూసింది. చెయిలో ఫ్లాస్కుతో వచ్చిన నరసింహన్ భార్య రాజమ్మ “అతను రానీ, వచ్చినా కొన్నిరోజులు మాత్రమే ఉంటారు . . . అతనికి మన దేశం నచ్చుతుందా? ఆలాగైతే మామయ్య ఎంత చెప్పినా అతను వినలేదే? సరేలేండి,

ఏ తెల్ల గుంటతోనో అతను వచ్చి మనముందు నిలబడకపోతే అదే చాలు!" అని నిష్ఠూరంగా మాటాడింది.

కోడలు మాటలు విన్న శేషయ్య "దేవుడా, నాకు అటువంటి పరీక్షలు వద్దు!" అని మనసులో ప్రార్థించుకుంటూ తల వొంచారు.

నరసింహన్ మౌనంగా తన తండ్రిని, చెల్లెలు, భార్య, ముగ్గురుని వరుసగా చూసారు. తరువాత తన వాచీని చూసారు.

"నాకు టైమయింది, నాన్నగారూ . . . ఇక వస్తాను" అని చెప్పి భార్య చెయిలోని ఫ్లాస్క్ అందుకొని, బయట నిలబడివున్న తన పాత మోరిస్ మైనర్ కారుకి నడిచారు.

రాజమ్మ కూడా లోపలికి వెళ్ళింది.

నరసింహన్ కారు బంగళా కాంపవుండు దాటి మాయమయ్యేవరకూ కాచుకున్న బాలాంబ స్వరం తగ్గించి రహస్యంగా మాట్లాడుతున్నట్టు తండ్రికి చెప్పింది:

"సారంగన్ రానీ . . . ఏం, వాడు రాకూడదా? వాడికి ఈ ఇంటిలో హక్కులు లేవా? పాపం, అనాధగా అన్యదేశంలో ఇంతకాలం జీవించాడు. 'ఇప్పుడైనా సొంత ఇల్లు, సొంత మనుషులు గుర్తుకి వచ్చి వస్తున్నాడే' అని మనం సంతోషించాలి! నాన్నగారూ, మీకూ ఎందుకు విచారం?" అని తన్ను ఓదార్చిన కూతురిని తలెత్తిచూసారు శేషయ్య.

"బాలామ్మా . . . " అని అతను ఏమో చెప్పబోయారు; పెదిమలు వణికాయి.

అప్పుడే ఆ బంగళా గేటు దగ్గర, దూరంలో మహాలింగం అంబాసిడర్ కారు, ఒక తిరుగు తిరిగి, లోపలికి ప్రవేశించింది.

మేడమీదనుంచి కారుని చూసిన మురళి, లీల కిందకి దిగివచ్చారు. బాలాంబ హాలు వదలి పెరడుకి వచ్చింది. రాజమ్మకూడా వంటగదినుంచి పరుగెత్తుకొని వచ్చింది.

తోటమాలి కన్నియప్పన్ "అయ్యా వచ్చేసారు!" అని ఉత్సాహంగా అరిచాడు.

ఈ కుటుంబంతో నలభై సంవత్సరాలముందు తమ జీవితంని సంబంధించుకొని, అన్ని విధాల బాధ్యతలతో తమ దాంపత్యంకి సమాప్తి కలిగిందని గర్వపడుతున్న వయోజనులు నాగణ్ణ, కమలమ్మ కూడా అందరినీ తోసుకుంటూ ముందుకు వచ్చారు.

కమలమ్మ చెయిలో హారతికని పళ్ళెం ఉంది.

కమలమ్మ చాలా భక్తి శ్రద్ధతో వాడికి హారతి ఇచ్చినప్పుడు ఆమెను చూస్తూ నిలబడిన సారంగన్ ఎందుకో నవ్వాడు; వయసు చెల్లిన మొహం, మాసిపోయిన కళ్ళు చూసి అనురాగంతో నవ్వాడు.

కమలమ్మ గతించిన సారంగన్ తల్లి లక్ష్మమ్మని ఇప్పుడు గుర్తు చేసుకుంది; ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

హారతి తీసుకొని ఆవిడ జరిగిన వెంటనే సారంగన్ అక్కడున్న అందరినీ ఒక పసిపాపలాగ ఆతురతతో ఉత్సాహంతో చూసాడు.

ఇప్పుడు హాలు పూర్తిగా అతనికి స్వాగతం చెప్పడానికి కాచుకున్నట్టు గుమిగూడివుంది.

సారంగన్ వెనుకనున్న మహాలింగం, లలిత, ఒకరినొకరు ఏమీ బోధపడక నిల్చున్నారు. కాని ఆఖరి నిమిషంలో మనసు మారి అతనికి ఈ కుటుంబ సభ్యులు ఆదరణ చూపుతున్నారని తృప్తి పొందారు.

కారునుంచి దిగిన సారంగన్ సంచెలు, సూట్ కేసులు, తోటమాలి కన్నియప్పన్ లోపలికి తీసుకొనివెళ్ళాడు. “ఇవన్నీ మేడమీద ముందుగదిలో ఉంచు . . . ” అని మురళి వాడికి ఆజ్ఞ ఇచ్చాడు.

కమలమ్మ హారతి పళ్ళెంతో హాలుని దాటి వెళ్ళింది.

ఉయ్యాలదగ్గర నిల్చున్న శేషయ్య ఆవేశంతో చేతులు చాటి . . .

“తంబుడూ . . . ” అని తడిసిన కళ్ళతో, బోసినోరు తెరిచి, వాత్సల్యంతో, వణికే కంఠధ్వనితో పిలిచారు.

సారంగన్ అతన్ని చేరుకొని, అతని పాదాలు ముట్టుకొని తలెత్తి చూసాడు; అతను వాడి రొమ్ముని తనతో కౌగిలించుకున్నారు.

“ఇంతసేపూ మీకోసం కాచుకొని ఇప్పుడే అతను కాలేజీకి వెళ్ళారు . . . ” అని రాజమ్మ మాటలు విని సారంగన్ తిరిగిచూసాడు.

‘అబ్బా, ఒక కుటుంబంలోనే ఇంత పెద్ద మోసమా? ఇదేనా అతిథి మర్యాద అంటే?’ అని ఆశ్చర్యపడుతూ లీల మేడమెట్లదగ్గర నిల్చొనివుంది.

అలాగేంకాదు. ఆ భావనలు అబద్ధాలు కావు. నిజ భావనలని అణగదొక్కుకొని, అబద్ధాల నిర్బంధాలకివశమైపోయి, తమకుతామే నిరాశ కలిగించే అలవాటులే జీవితం అనే భ్రాంతితో మనుషులు రోజులు గడుపుతున్నారని లీలకి తెలియలేదు.

కుటుంబంని త్యజించి, కుటుంబంలో అందరి పగకి గురి అయిపోయి, ఇంటికి తిరిగివచ్చిన సారంగన్ని చూడగానే శేషయ్య పుత్రవాంఛతో ఆహ్లాదపడ్డారు. వాడు రావడం తనకిష్టం లేకపోయినా, అందుకు తగిన కారణాలు ఉన్నాయని అతను నమ్మారు. తన్ను మినహాయించి ఆ కుటుంబంలో అందరికీ వాడి రాక గురించి సంతోషమే అని అతను గ్రహించారు. ఎందుకంటే వాడు రాసిన ఉత్తరాలు అతను మాత్రం చదివివున్నారు; ఆ కుటుంబంకి అవతల మహాలింగం, లలిత కూడా చదివివున్నారు.

ఎలాగో, ఆఖరికి, వాడు వచ్చేసాడు.

ఇక వాడిని తిరస్కరించడం పొరబాటు; అది సాధ్యమూ కాదు.

మూర్ఖపుపట్టు, స్వేఛ్ఛ వాడిలో మితిమీరివున్నాయని, కుటుంబం అనే బంధంలో వాడు లోబడివుండడని శేషయ్య మనసులో ఒక భయం క్రమేణ పెరుగుతూ వచ్చింది. అందుకు కారణం వాడు రాసిన ఉత్తరాలే. అవన్నీ మరిచిపోవాలని అతను ప్రయత్నించారు. ఒక విదేశీయ సంప్రదాయంలో జీవించే ఒక మనిషికి వెయ్యి మైళ్ళ దూరంనుంచి అలాగ రాయడం చాలా సులభం. ఒక విధంగా వాడు తిరిగిరావటం మంచిదే. తన ఊహలు ఎంత నిరంకుశమైనవి అని వాడు ఇప్పుడు గ్రహించవచ్చు. ఏ దేశం సంప్రదాయం కంటే మన భారత సంప్రదాయం ఘనమైనది అని ఇక్కడకి వచ్చి జీవించిన తరువాత వాడికి బోధపడుతుంది. ‘సారంగన్ విపరీత ఊహలకి బాధ్యత ఎవరు?’ అనే ప్రశ్న లేవగానే అందులో తనకీ వాటా ఉందని ఈ తండ్రి గ్రహించారు. విదేశీయ చదువుతో వీడొక విజ్ఞానిగా, డాక్టరుగా వస్తాడన్న కలకి విరుద్ధంగా వీడు మన దేశంకి పనికిరాని ‘తోడేలు కూత’ లాంటి ఒక సంగీతం నేర్చుకొని వస్తాడని అతను కల్పనకూడా చెయ్యలేదు. తన కుమారుడు చెడిపోవడానికి తనే కారణం అనే అపరాధ భావంతో వాడు వస్తాడని తెలిసిన తరువాత కూడా అతను చాలా రాత్రులు కలవరపడుతూ గడిపారు.

వాడి ఊహలన్నీ ఒక నీచమైన సిద్ధాంతంపై ఆధారపడివున్నాయనే అవగాహనలో అతనికి ఎటువంటి సందేహమూ లేదు. కర్ణాటక సంగీతంని కులధర్మంగా పోషించే ఈ కుటుంబంలో వాడు పుట్టినది ఒక దివ్య శాపమని అతను గ్రహించారు. ఆ పాపాలకు ప్రాయశ్చిత్తంగానే - ప్రేమానురాగంతో తల్లి మొహం ఎరుగని, తనే తల్లి-తండ్రిగా భావించి, పోషించి, పెంచిన, తన కనిష్ట కుమారుడు -ఒక విదేశీయ నాగరికతకి బలి అవడానికి అతను సిద్ధమయ్యారు. ఆ తరువాత అతను ఇంకొక కుమారుడిని కోల్పోయారు; అప్పుడుకూడా అతను తన మనసుని సారంగన్ దిక్కుకి మళ్ళించలేదు.

వాడిని తను ప్రత్యేకంగా ముద్దాడి - వాడి పెంపకంలో పేరాశ చూపడం వలనే - ఇంత పెద్ద నష్టం కలిగిందని అతను పది సంవత్సరాలకు ముందే గ్రహించారు.

లేకపోతే, ముప్పై సంవత్సరాలముందు, అన్యదేశ మోహంలో ముదురుతున్న భారతదేశ వాతావరణంలో తన కనిష్టకుమారుడుని విదేశీయ చదువుకి పంపాలని శేషయ్య  నిశ్చయించివుంటారా? ఆ సమయం అతని స్నేహితుడు లండన్ లో వలసివోయినప్పుడు అతని సంతానంతో సారంగన్నికూడా పంపినందుకు అతను ఆహ్లాదపడివుంటారా?

కాని, ఆఖరికి ఏమైంది? నలభై దాటినా పెళ్ళి, కుటుంబం, బాధ్యత అనే జీవితంలోని శ్రేయస్సులు, భారములు లేకుండా పూర్తిగా ఒక పరదేశిలాగ వాడు తనముందు వచ్చి నిల్చున్నప్పుడు - అలాగే ముప్పైఐదు సంవత్సరాలముందు తన్ను వదిలి మాయమైన ఆ లక్ష్మమ్మ మగవేషంలో వచ్చినట్టు; వీడిని కోల్పోవడానికి బదులు తన అభిమానంకి అర్హుడైన - మూడు సంవత్సరాలముందు గతించిన రంగయ్య - మళ్ళీ వచ్చి నిలబడినట్టు; జీవితంలోని అన్ని అశుభ జ్ఞాపకాలు రేకెత్తినట్టు; అతని వివేకం, భావనలు పోరాటంలో పడిపోవడంతో వయసు చెల్లిన శేషయ్య తాళలేక ఏడ్చారు.

శేషయ్య మానసిక స్థితిని తెలుసుకున్నవారు - ఆ కుటుంబంకి అవతల - లలిత, మహాలింగం దంపతులు మాత్రమే.

సారంగన్ని అతని ఇంటిలో వదిలేసిన తరువాత లలిత, దంపతులు ఆ కుటుంబంనుంచి మెల్లగా జారుకొని తమ ఇల్లు చేరుకున్నారు.

మురళి మితిమీరిన సంతోషంతో సారంగన్ కి మేడమీద తన గదికి ఎదుట ఇంకొక గదిలో బస ఏర్పాటు చేసాడు. బాలాంటకూడా వచ్చి మురళిని కలుసుకుంది. అందువలన రాజమ్మ కడుపుమంటతో ఉయ్యాలలో ఏదో ఆలోచిస్తూ కూర్చున్న శేషయ్యతో ఫిర్యాదు చేసింది:

“మురళి పిల్లవాడు, వాడి అమ్మకి ఇది తెలియదా? అతన్ని కిందనే ఉండమని చెప్పండి . . . కొత్తగా పెళ్ళైన పిల్లలు ఈ ఇంటిలో ఉన్నారు . . . ”

శేషయ్య తలెత్తి కోడలిని చూసారు. మళ్ళీ తల వొంచి ఆమెను చూడకుండానే, చెయిని మాత్రం ఊపుతూ అతను “ఎవరెక్కడ ఉంటే మనకేం?” అని అడిగినప్పుడు రాజమ్మకి దాని అర్థం బోధపడింది: “వాళ్ళు ఎక్కడవుంటే నీకేం?”

రాజమ్మ మొహం ముడుచుకొని వంటగదికి వెళ్ళిపోయింది.

మేడమీద తన ప్రత్యేక గదిలో సారంగన్ దుస్తులు మార్చుకున్నాడు. ఆ తరువాత dressing gown ధరించిన వాడిని చూసి బాలాంట తనలో నవ్వుకుంది.

సారంగన్ సిగరెట్ పాకెట్టు తీసి మురళికి అందించాడు. మురళి ఒకసారి తల్లిని చూసి “No thanks . . . ” అని వెనకాడడం మర్యాద కలసిన భయం వలన అని సారంగన్ కి బోధపడలేదు.

తన కొడుకు యోగ్యుడనే తృప్తితో తన తమ్ముడు తనెదుట సిగరెట్టు కాల్చడం సహించలేని బాలాంట ‘మర్యాద కావాలంటే మనమే ఇవన్నీ తొలగించుకోవాలి’ అని మూలుగుతూ మేడ దిగింది.

ఆమెకి అభిముఖంగా లీల మేడెక్కివస్తోంది. ఆమె చెయిలో కాఫీ గ్లాసు ఉంది.

కింద బాలాంట తల మాయమవగానే మురళి తనూ ఒక సిగరెట్టు వెలిగించుకొని, పెద్దలముందు సిగరెట్టు కాల్చడం ఇక్కడ అమర్యాదైన అలవాటుగా భావించుతారని వివరించాడు. పిల్లలు పొగ కాల్చుతే పెద్దలు ఖండించుతారన్నది నిజం, కాని అది దేహ ఆరోగ్యంకని ఇంతకాలమూ సారంగన్ నమ్మాడు. ఇప్పుడు తనేమో ఏదో విదేశీయ సంప్రదాయాలు కొత్తగా వింటున్నట్టు సారంగన్ కి అనిపించింది.

అప్పుడు లీల వచ్చింది.

ఎవరని తెలియక సారంగన్ ఆమెను తేరిపార చూసాడు. అప్పుడే తన పెళ్ళి సంగతి గురించి సారంగన్ ఏమీ ఎరుగడని మురళి మళ్ళీ గుర్తుచేసుకున్నాడు. తటబడుతూ వాడికి అది చెప్పి లీలని పరిచయం చేసినప్పుడు సారంగన్ చాలా సంతోషించాడు; కాని అదే సమయం తను ఈ కుటుంబంకి ఎంతమట్టుకు అన్యుడైపోయాడనే జ్ఞానంతో అతనికి విచారమూ కలిగింది.

లీల ఇచ్చిన కాఫీ తాగుతూ గభీమని మురళిని ఏదో ఇంగ్లీషులో అడగబోయిన సారంగన్ తమిళంలో మాటాడాలనే తన నిశ్చయం గుర్తుచేసుకొని సగం ఇంగ్లీషు, సగం తమిళంలో అడిగాడు:

“సరేలే . . . మీ నాన్నగారు ఎలాగున్నారు? అతను ఎక్కడున్నారు? అదేంటో, సన్యాసిగా . . . ?”

మురళి తన మొహంని తీవ్రంగా చూస్తున్న లీల మొహంని ఒకసారి చూసి తల గోకుకున్నాడు.

మంచివేళ, అప్పుడే కిందనుంచి బాలాంబ పిలుపు వినిపించింది:

“మురళి . . . మామయ్యని స్నానంకి రమ్మని చెప్పు.”

సారంగన్ బాత్ రూమునుంచి బయటకి రాగానే - వెనకటితట్టు వసారాలో వాడి ఎదుట తన రెండు చేతులూ విప్పి ఊపుతూ నవ్వుకుంటూ, నోటినుంచి ఎంగిలి, మెతుకులు రొమ్ముమీద వాలుతుంటే, ముచ్చటలాడుతూ, ఒక రెండేళ్ళ బాలకుడు దూకి, పరుగెత్తుకొనివచ్చి వాడి రెండు మోకాళ్ళు పట్టుకున్నాడు.

ఎదురుచూడని సంతృప్తితో సారంగన్ ఆ పాపని ఎత్తి రొమ్ము మీద అణచుకుంటూ పరిసరాలు గమనించాడు.

ఒక చెయిలో గిన్నెలో వండిన అన్నం; ఇంకొక చెయిలో పిల్లవాడిని తినిపించడానికి ఒక పిడికిలి అన్నంతో, హఠం చేస్తూ పరుగెడుతున్న ఆ పిల్లవాడు వెనుక వచ్చిన ఒక యువతి సారంగన్ని చూడగానే లటుక్కున నిల్చుంది. ‘కళ్ళకి కనిపించినది మాయమో?’ అని ఆశ్చర్యం కలిగినట్టు త్వరగా పక్కనేవున్న గదిలో మాయమైంది.

'ఈమె ఎవరు . . . ఎవరీ పిల్లవాడు?' అని సారంగన్ తిరిగిచూసినప్పుడు వంటగది దగ్గర నిల్చున్న కమలమ్మ తడిసిన కళ్ళతో, రొమ్ము మీద చేతులు ఆనుకొని ఏడ్చింది:

"ఎవరు సేర్పారు పసివాడికి? రక్తబంధం అంటే అదేకదా? తండ్రి మొహంకూడా పిల్లవాడు చూడలేదు . . . చూస్తేనా బంధుత్వం?" అని వాపోయింది.

ఆమె భాషతో తనకి పరిచయం లేకపోయినా ఆమె ఎమంటుందో సారంగన్ తెలుసుకున్నాడు. కాని ఆమె దేని గురించి మాటాడుతోందని తెలియక కన్నీరు కారుస్తున్న ఆమె మొహంని మౌనంగా తేరిపార చూసి -

"వీళ్ళు ఎవరు? మీరు ఏమేమో చెప్తున్నారే?" అని తనకి తెలిసిన తెలుగులో కమలమ్మని అడిగాడు.

సారంగన్ అన్నయ్య రంగణ్ణ మూడు సంవత్సరాలముందు కన్ను మూసాడన్న సంగతి వీడికి తెలుసు అనే నమ్మకంతో కమలమ్మ మామూలుగా ఏడ్చింది. సావధానంగా కళ్ళు తుడుచుకొని వాడి దగ్గరకి వచ్చింది. సారంగన్ కౌగిలిలో అతని రొమ్ముని అంటుకొని భుజంమీద వాలిన పిల్లవాడి మొహంని మళ్ళించి, వాడికి చూపించి,

"చూడు నాయనా, మీ అన్నయ్య రంగణ్ణ మోహం . . . " అని శోకం, ఏడ్పు కలిసిన స్వరంతో అడుగుతూ పసిపాప బుగ్గని తాకి ముద్దాడింది.

"కమలమ్మా . . . " అని భారంతో సారంగన్ ఆమెను పిలిచాడు.

ఆ క్షణం ఒక భయంకరమైన శాంతం అక్కడ చోటుచేసుకుంది.

ఆ కంఠధ్వనిలోని శోకం, కోపం, గ్రహించి, వంటగదిలో కూరగాయలు నరుకుతున్న కమలమ్మ భర్త నాగణ్ణ లేచి నిల్చున్నారు.

"నాగణ్ణా . . . " సారంగన్ కనుబొమలు ఇఱుక్కొని సూదిలాగ అతనిమీద వాలాయి. వాడి చెయి పసివాడిని బాగా కౌగిలించుకొనివుంది. కళ్ళు ఎవరిని ప్రత్యేకంగా చూడక చెమ్మగిల్లాయి. పెదవులు వొణికాయి.

వాడికి అది తెలియదని నాగణ్ణ ఆ క్షణంలో తెలుసుకున్నారు. అతని దేహమంతా పులకరించింది. పెండ్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

"రంగణ్ణా . . . What happened to him?"

ఏదో రహస్యంలాగ వాడు అడిగిన ప్రశ్నకి బిగ్గరగా జవాబు చెప్తున్నట్టు వంటగదిలో తటాలున అన్నం గిన్నె నేల వాలింది. "అయ్యో, దేవుడా!" అనే కూతతో ఏడ్పు, వెక్కు వచ్చి సారంగన్ గుండెని బాదాయి.

పసిపాపని రొమ్ముల్లో ఒత్తుకొని ఆవేశంతో సారంగన్ హాలుకి నడిచివచ్చాడు. వాడికి తెలియదని తెలుసుకున్న కమలమ్మ ఇప్పుడు బిగ్గరగా ఏడ్చింది.

వాడి కాళ్ళలో ఉన్న రబ్బరు జోడుల్లో ఒకటి జారి నేల వాలడంకూడా తెలియక ఆవేశంతో సారంగన్ నడిచాడు. హాలుకి ప్రవేశించే తలుపు మూడివుంది; దాన్ని తటాలున తెరిచి హాలుకి వచ్చాడు.

రంగణ్ణ కొడుకు కణ్ణన్ని రొమ్ముల్లో అణచుకొని వచ్చి నిలబడిన సారంగన్ని చూడగానే ముసలాయన గుండెలో కాల్చినట్టు ఉలికిపడి, లేచారు; వయసు చెల్లిన అతని దేహం వొణికింది.

"నాన్నగారూ . . . ? అని గొంతు కమ్ముకొని సారంగన్ రెండుసార్లు పిలిచాడు. రెండవసారి పిలిచినప్పుడు ఆ పదం వాడి కంఠంలో చిక్కుకుంది. మొహంలో కన్నీళ్ళు, కలత ఏమీ లేవు. ఏడవడం, వాపోవడం - ఇవన్నీ దాటి శోకం వాడి గుండెలోని భావనలు బరువునెక్కించాయి.

ముసలాయన లేచి నిల్చున్నారు. వొణుకుతున్న దేహంతో వాడి దగ్గర వచ్చి పిల్లవాడితో కలిసి అతన్ని కౌగిలించుకున్నారు. "తమ్ముడూ . . . " అని ఏమో మాటలు చెప్పి భుజంమీద తల అణచుకొని వెక్కి వెక్కి ఏడ్చారు.

"Oh, I am sorry . . . " అని అతనికి ధైర్యం చెప్తున్నట్టు తన్ను సర్దుకున్న సారంగన్ నిబ్బరంగా రొమ్మునుంచి జారిన పిల్లవాడిని నేల దింపేసి, తండ్రి చెయిని పట్టుకొని అతన్ని ఉయ్యాలలో కూర్చోబెట్టాడు.

కింద దిగిన పిల్లవాడు ముచ్చటలాడుతూ హాలు తలుపు తెరిచి వంటగదికి పరుగెత్తడం శేషయ్య తేరిపార చూసారు; అంగవస్త్రం తీసి ముక్కు తుడుచుకున్నారు. అతని కనుబొమలు, ముక్కు మొన ఎర్రబారిపోయాయి; గభీమని పెదిమలు వణికాయి. కళ్ళలోని కలవరం పోలేదు.

సారంగన్ అతన్ని చూస్తూ మౌనంగా నిల్చున్నాడు. తరువాత తన చూపుని మళ్ళించి గోడమీదున్న ఫోటోలో - తన తల్లి పక్క నిల్చున్న తండ్రి యౌవన రూపం చూసి - నిట్టూర్పు వదిలాడు.

'ఎంత ఘోరం! నామీద ఎంత ద్వేషం ఉన్నా, నేను నువ్వు చెప్పినట్టు వినకపోయినా, నా తోబుట్టువు గతించిన వార్త ఎవడో పరాయివాడు మూలంగా నాకు తెలియజేయకూడదా? నీకు అంత రాతి గుండె అన్నమాట, అవునా?' అని వాడు తన్ను అడక్కపోయినా, 'వాడు తన్ను అలాగ అడిగి, బలవంతంగా పురిగొల్పితే ఎంత బాగున్ను!' అని శేషయ్యకి అనిపించింది. ఉయ్యాల బల్లమీద రెండు చేతులూ ఆనుకొని విరక్తితో తన్ను తన్నే నోచుకుంటూ జాలిజూపుతో తలని కిందా మీదా ఊపుతూ అతను నిట్టూర్పు వదిలారు; అపరాధం వలన తలెత్తలేకపోయారు.

తన ఉనికిలో అతను ఇంకా బాధపడతారని గ్రహించి సారంగన్ మౌనంగా, తల వొంచి, నిష్క్రమించాలని మేడమెట్లు చేరుకునేముందు అతన్ని ఒకసారి తిరిగిచూసాడు.

శేషయ్య ఇప్పుడు వాడినే తేరిపారి చూసారు.

"నీకు తెలియజేయలేదు . . . పారిసులో నీ అడ్రసు నాకు తెలీదు . . . " అని గభీమని అతని మాటలు విని సారంగన్ హాలుకి తిరిగివచ్చాడు.

శేషయ్య తల వొంచుకొని చెప్పారు. "నువ్వు రాసిన ఉత్తరాలన్నీ నేను అప్పుడే చింపి పారేసాను. నువ్వు ఇప్పుడు రాసినవన్నీ మిస్టర్ మహాలింగం దగ్గర ఉన్నాయి. కాని మూడు సంవత్సరాల తరువాత ఆ ఘోరం ఎలాగ రాయాలని తెలియక నేను ఊరుకున్నాను . . . " అని తటబడుతూ మాటాడారు.

అతను చెప్పినదాంట్లో సగం మాత్రం సత్యం అని, తన్ను మనస్పూర్తిగా నిరాకరించడంవలనే అతను తనకి రాయలేదని సారంగన్ అతని మొహంని తేరిపారి చూసి గ్రహించాడు.

'నా సహోదరుని మరణంతోబాటు ఎంతమట్టుకు నేను నా కుటుంబ సభ్యులనుంచి పరాధీనమైపోయాను!' అని వాడు లోలోపల దుఃఖించాడు.

ఆఖరిసారిగా ఇక్కడకి తను వచ్చినప్పుడు తన్ను ఇక్కడే స్థిరంగా ఉండమని దృఢంగా చెప్పిన తండ్రి సలహాను మీరి తను లండన్ కి వెళ్ళిన పాత ఘటనలు సారంగన్ ఇప్పుడు గుర్తుచేసుకున్నాడు.

వాడు లండన్ ప్రయాణం నిశ్చయం చేసిన తరువాత ఆ కడపటి రోజుల్లో శేషయ్య మనసులో వాడి మొహంకూడా చూడకూడదనే కటువు, ద్వేషం చోటుచేసుకున్నాయి.

బయలుదేరే సమయం, అతని దగ్గర సెలవు పుచ్చుకోవాలని వచ్చినప్పుడు అతను తన గది తలుపుని తెరవకుండా లోపలనుంచి అరిచారు:

"పో . . . నువ్వు తిరిగి రావొద్దు! . . . "

అతని కోపం చూసి సారంగన్ లోలోపల నవ్వుకున్నాడు.

"సరే . . . నేను తిరిగి రాను . . . అందుకే మిమ్మల్ని ఒక సారి చూసేసి వెళ్దామని వచ్చాను . . . " అని వాడు అనగానే శేషయ్య గది తలుపు తెరచుకొని బయటికి వచ్చేసారు.

"ఎక్కడ ఉన్నా సరే, వర్ధిల్లు!" అని తన కోపంని మించిన పుత్ర వాత్సల్యంతో అతను వాడిని దీవించారు; కాని అతను తన్ను క్షమించనేలేదనే అవగాహనతోనే సారంగన్ విదేశంకి వెళ్ళాడు.

తండ్రి నియమం మీరి, కుటుంబంని వదిలేసి, తన మనసు ఆశించిన లక్ష్యం కోసం విదేశం వెళ్ళిన తనకి వీటిగురించి అడగడానికి, ఆక్షేపించడానికి, తప్పులెన్నడానికి, ఎటువంటి హక్కు లేదని గ్రహించిన సారంగన్ తండ్రి ఎదుట రొమ్ముమీద ఒక చెయి, చుముకంని తాకుతూ, ఇంకొక చెయితో తల వొంచి నిల్చున్నాడు.

"వాడే నా మాటలకి కట్టుబడిన కొడుకు . . . వాడినే నేను పరామరిక లేకుండా పెంచాను . . . ఏం గొప్ప చదువూ చదివించలేదు . . . పెళ్ళయినంతవరకూ పెద్దవాడు నా కొడుకుగా ఉన్నాడు. ఆ తరువాత భార్య ఇంటిలో అల్లుడుగా ఐపోయాడు . . . ఆ తరువాత తన వసతికి ఇప్పుడు తిరిగివచ్చి ఇక్కడే ఉన్నాడు! నువ్వొక విప్లవకారుడువి, నీకు నీ లక్ష్యం ముఖ్యం, నువ్వా వెళ్ళిపోయావ్! ఇంటిలో నాకు లొంగిన కొడుకుగా వాడు ఉండేవాడు. నన్ను వదిలేసి మీరందరూ వెళ్ళిపోయారు, కాని 'వాడున్నాడు' అని అప్పుడు నాకు ఊరటగా ఉండేది . . . "

“నేను చూసి మంచి అణకువగల అమ్మాయి లక్ష్మితో వాడికి పెళ్ళి చేసాను. ఆమె ఎవరూ లేని అనాధ, బీద అని తెలిసే నా మాట విని వాడు పెళ్లాడాడు. అటువంటి కొడుకు ఈ రోజుల్లో ఉండడం దేవుడు సహించలేకపోయాడు . . . ” శేషయ్య సారంగన్ కి చెప్తున్నట్టు, తనలో తనే బొబ్బరించుతున్నట్టు, తల వొంచి, వాడి మొహం చూస్తూ, కన్నీరు తుడుచుకుంటూ, ఆవేశంతో మాటాడుతూనే ఉన్నారు.

గభీమని తలెత్తి వాడిని చూసి మారిన ధోరణిలో చెప్పారు:

“అప్పుడే . . . వాడు కన్నుమూసిన కొన్నిరోజుల తరువాత నేను నీగురించి ఆలోచించాను. నాకు పట్టరాని కోపం వచ్చింది. ఒక కొడుకు చనిపోయాడు, ఇంకొకడు పనికిరానివాడైపోయాడు . . . విను, నా పరిస్థితిలో నువ్వు ఉండి నీ గురించి మాట్లాడు . . . మీ అందరిగురించి ఆలోచించి మాట్లాడు . . . ” అని అంటూ కొంచెం సేపు మౌనం వహించి, ఒక నిట్టూర్పు వదిలి, తనకి చెప్తున్నట్టు మాటాడారు.

“హూం, ఎంత కోపమైనా నీ ఉత్తరాలని చింపేయకుండా ఉంటే బాగున్నేమో? నీ అడ్రసు తెలుసుకొని ఒక కేబిల్ ఇచ్చి ఉంటే, నువ్వు వచ్చేవాడేమో? అది నీ బాధ్యత, అప్పుడు నామీద ఏ నేరమూ ఉండదు . . . నువ్వు వచ్చినా మాత్రం? నాకు రంగయ్య . . . వాడికి ఈడుగా ఈ జన్మలో నాకెవరున్నారు? . . . ” మరేం పలకలేక అతని కంఠం గడ్డకట్టిపోయింది. పెదిమలని గట్టిగా ముడుచుకొని, దేహం వొణుకుతూ, గొంతుమీదకి వచ్చిన దుఃఖంని అతను మింగారు.

ముడుచుకునే కనుబొమలు, ఎర్రబారిన మొహం, పెదిమలు కొరుకుతూ సారంగన్ మెల్లగా మేడ ఎక్కాడు.

ముసలాయన మానసిక వ్యధ చూసి వాడి మనసు నొచ్చుకుంది.

వాడు మేడమీద తన గదికి వెళ్ళి తలుపు మూసుకున్నాడు.

గది ఏకాంతంలో ఒక పసిపాపలాగ వాడు వెక్కివెక్కి ఏడ్చాడు. మరుక్షణం సర్దుకొని మౌనంగా కిటికీద్వారా కనిపించిన చెట్లని చూస్తూ నిల్చున్నాడు. కొంచెంసేపు తరువాత దుస్తులు మార్చుకున్నాడు. సూట్ కేసునుంచి తన వస్తువులన్నీ తీసి ఆ గదిలోని బీరువాల్లో అమర్చాడు. వాటిలో ఒక సారాయి బుడ్డి, వరుస వరుసగా గ్లాసు పానపాత్రలు ఉన్నాయి.

అద్దంముందు నిలబడి తలని బ్రష్ తో ఒత్తుకున్నాడు. ఏమీ అర్ధంకాని ఏకాంతంలోని శూన్యతని విసుగ్గుంటూ, చేతులని వీపు వెనక పట్టుకొని గదిలో కొంచెంసేపు సంచరించాడు. అలాగ తిరుగుతున్నపుడు కిటికీని సమీపించినప్పుడెల్లా కొంచెం నిల్చొని, ఎఱ్ఱని పువ్వులతో దండిగా పెరిగిన చెట్ల గుంపుని, వాటి వెనుక ఆకాశంలోని మేఘాలని చూసాడు. అలాగ చూస్తున్నప్పుడెల్లా, వాడు వచ్చి నిలబడి తిరిగిన సమయంకి సముచితంగా ఒక ఒంటరి కోకిల వాంఛగా, భ్రాంతిగా, వాడి హృదయంని చింపి దీర్ఘమైన కంఠంతో తీక్షణంగా పిలిచింది.

ఆ ధ్వని అశుభంగా, దుఃఖకరంగా ఒక మహత్తైన గానంగా వాడి హృదయంని ఆవరించుకుంది.

వాడు బీరువానుంచి తన ఫిడేలు పెట్టెని తెరిచి దాన్ని చెయిలో అందుకొని స్వరం చేర్చాడు. భజంమీద ఫిడేలుతో కిటికీ దగ్గర నిలబడినప్పుడు తాళం గణించి పాడుతున్నట్టు 'కుహూ', 'కుహూ' అని ఇంతకు ముందు వినిపించిన ఆ కోకిల గానం గభీమని ఆగిపోయింది.

ఆ చిన్న పిట్ట మేఘం నేపధ్యంతో ఎగరడం నిరాశతో వాడు తేరిపార చూసాడు; ఏదో శూన్యమైన శోక అవగాహనలో వాడి కళ్ళు తడిసిపోయాయి.

వాడు ఒక  దగ్గు దగ్గి  ఫిడేలు తంతులమీద విల్లుని పోనిచ్చి సావధానంగా ఆ కోకిల ధ్వనిలాగ ఒక స్వరంని దీర్ఘంగా వాయించాడు.

వాడి చూపు ఇప్పుడు ఎక్కడో నిర్ణయంగా నిలిచిపోయింది.

తన సహోదరుని ఆత్మ శాంతికోసం మైమరచి వాడు ఒక ఊహాత్మక గీతం వాయించాడు.

** ** ** **

లలిత రాకని ఎదురుచూస్తూ ముందు హాలులో కూర్చొని పత్రికలని తిరగేస్తున్న మహాలింగం సోఫాలో వాలి అలాగే నిద్రపోయారు.

ఉదయం విమానాశ్రమంలో సారంగన్ కి స్వాగతం చెప్పి అతన్ని వాళ్ళ ఇంటిలో దింపిన తరువాత తమ ఇంటికి వచ్చే మార్గంలో మౌంట్ రోడ్డులో లలిత దిగింది.

ఆమె కార్యదర్శిగా పని చేసే మహిళా సమాజంలో ఆమెకి కొంచెం పని ఉంది. ఆ తరువాత ఆమె ఏదైనా లైబ్రరీ, పుస్తకాల దుకాణంకి వెళ్ళివుంటుంది. తప్పకుండా మధ్యాహ్న భోజనంకి వచ్చేస్తుందని మహాలింగం కాచుకొనివున్నారు.

వంటగదిలో అన్ని పనులూ ముగించి, విశ్రాంతికని కొంచెం నిద్రపోయి, తటాలున లేచిన వంటమనిషి మణి అయ్యర్ హాలుకి వచ్చారు.

అక్కడ సోఫాలో నిద్రపోతున్న మహాలింగంని చూసి 'లేపుదామా, వద్దా?' అని వెనకాడుతూ అతను నిల్చున్నారు. అప్పుడే ఇంటిముందు ఒక టాక్సీ వచ్చి ఆగింది.

టాక్సీనుంచి దిగిన లలిత కూలింగ్ గ్లాసుని తీసి, ఎండలో మొహం చిట్లించుకొని, సెత్తిని, మొహంని చీర కొనతో తుడుచుకుటూ లోపలికి వచ్చింది.

టాక్సీనుంచి డ్రైవరు రెండు పుస్తకాల మూటలు బయటకి తీసిపెట్టాడు.

లలిత మణి అయ్యర్ కి రెండు రూపాయలు అందించిన తరువాత లోపలికి వచ్చి సోఫాలో వాలింది.

మహాలింగం మేలుకొని వాచీ చూసారు.

"మీరింగా భోంచెయ్యలేదా? నేను చెప్పానుగా నేను రావడం ఆలస్యమవుతే మీరు టైముకి భోంచెయ్యాలని?" అని ఆమె అతన్ని మందలించినప్పుడు ఆ రెండు మూటల పుస్తకాలు మోసుకొనివచ్చిన మణి అయ్యర్ 'ఇదెక్కడ పెట్టమంటారు?" అని అడుగుతూ పుస్తకాల బీరువాలున్న మహాలింగం ఆఫీసులోకి ప్రవేశించారు.

"హూం, ఇక్కడే ఉండనీ . . . ఇవన్నీ అతనికి సంబంధం లేని పుస్తకాలు . . . " అని లలిత సోఫాలమధ్య ఒక సోఫా చూపించింది.

అతను పుస్తకాలు ఆమె ముందు పెట్టి తలెత్తి చూడగానే లలిత మణి అయ్యర్ ని అడిగింది.

"ఏమండీ, అతనింకా భోంచెయ్యలేదట! మీరైనా అతన్ని అడగలేపోయారా?"

భార్యకోసం భర్త కాచుకొనే కొత్త నాగరికతకి కాలం మారిందని మణి అయ్యర్ గుర్తుచేసుకొని తనలో నవ్వుకున్నారు.

"నేనూ ఆలోచించాను . . . అతను బాగా నిద్రపోతున్నారు . . . " అని అంటూ dining table మీద భోజనంకి ఆహారపదార్థాలు  మణి అయ్యర్ అమర్చారు.

“మీరు వెళ్ళి మొహం కడుక్కోండి . . . పగటిపూట ఇదేం నిద్ర? . . . ఇదుగో, నేనూ వస్తున్నాను . . . ” అని లలిత మేడమీదకి వెళ్ళింది.

తొందర తొందరగా దుస్తులు మార్చుకొని కిందకి వచ్చి తనకి, మహాలింగంకి ఆహారపదార్థాలు వడ్డించి అతనికోసం కాచుకొని నిలబడింది.

అతను తువాలుతో మొహం తుడుచుకుంటూ ఆమె ముందు వచ్చి కూర్చున్నారు.

అన్నం కలుపుతూ “ఇవాళ సాయంకాలం మనం శేషయ్యా ఇంటికి వెళ్దామా?” అని అతను సంభాషణ ప్రారంభించారు. అతనికి భోంచేస్తూ మాటాడాలి; అది చూసి లలితకి చీదర. ఎంత చెప్పినా అతను వినరు.

“హూం, ఇవాళ నాకు కొంచెం పని ఉంది . . . ” అని అతన్ని చూడకుండానే లలిత క్లుప్తంగా అతనికి జవాబు ఇచ్చింది.

“ఏం పని?” అని అతను అడిగారు.

“ముందు మీరు భోంచెయ్యండి. తరువాత చెప్తాను . . . ” అని లలిత తలెత్తి అతన్ని చూసింది.

అప్పుడే మహాలింగంకి బోధపడింది.

“I am sorry . . . ” అని ఒక చిరునవ్వు నవ్వి అతను భోజనం ఆరంభించారు; కొంచెం సేపయింది.

గాజు గ్లాసులో నీళ్ళు తాగినప్పుడు అతనికి జ్ఞాపకం వచ్చింది. తొందర తొందరగా నీళ్ళు మింగుతూ అడిగారు.

“అతనే సారంగన్ అని నువ్వెలా పోల్చుకున్నావ్?” అని ఆతురతతో అతను అడిగినప్పుడు లలిత అతని మొహంని కొంచెంసేపు చూసి నవ్వింది.

“ఓ, చూడగానే నాకు తెలిసిపోయింది! He’s very eccentric! అసాధారణమైన చూపు! అతని కళ్ళు చూడండి, అందులో తీక్షణత ఉంది. కొందరికి అది చికాకుగా కూడా కనిపిస్తుంది . . . ” అని ఆమె సారంగన్ని వర్ణించినప్పుడు నుదుటమీద వాలిన జుత్తు ఆమె కనుబొమలను మూసేసింది. వెంటనే మహాలింగం కాంతివంతమైన సారంగన్ కళ్ళు గుర్తుచేసుకున్నారు.

“వాడి కళ్ళు యిరుకైనట్టు కనిపించలేదూ?”

“హూం, కళ్ళు చిన్నవే, నేను చూపు గురించి చెప్పాను . . . చాలా తీక్షణమైన చూపు . . . Searching look . . . ‘దేన్నో వెతుకుతున్న కళ్ళు’ అని మనం రాస్తాంకదా?”

“‘రాసాను’ అని చెప్పు. నేనెప్పుడు రాసాను? నువ్వు చెప్పేది నిజమే కావచ్చు, నీవంటి రచయత్రికే ఇవన్నీ బోధపడతాయి.”

కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా భోంచేసారు. లలిత చెప్పింది.

“అతన్ని భేటీ చేసి ‘మనోన్మణి’ పత్రికలో రాయాలని నా ఉద్దేశం. వచ్చే దారిలో అక్కడికి వెళ్ళాను. వాళ్ళూ సరే అన్నారు. మీకు గుర్తుందా? ‘సంగీతం ఒక ప్రాంతీయ భాష కాదు, అది ప్రపంచ భాష!’ అని అతను అనలేదూ? అదే చాలా controversial subject కాదా?”

మహాలింగం కనుబొమలు పైకెత్తి ఆమెను చూసారు:

“Why, nothing wrong with that?”

“‘Wrong’ అని ఎవరన్నారు? ‘Very correct’ అని చెప్తే మాత్రం వెంటనే ఇక్కడ అందరూ ఒప్పుకుంటారా ఏమిటి?”

“ఏకీభవించకపోతే సరే” అని ఆ విషయంని గుడ్డిపేటుగా తోసిపుచ్చి - ఆమె భోజనం కూడా సమాప్తి అయిందని తెలిసిన తరువాత - అతను లేచారు.

మానవుల జీవితంలో చట్టం, విచారణలకి సంబంధించిన విషయాలకి మాత్రం అతను ఇచ్చే ప్రాముఖ్యత లలితకి తెలుసు. కాని ఇతర వృత్తుల్లోనూ అతనికి అభిరుచి ఉందని ఆమె గ్రహించింది.

భోజనం ముగించి లేచినప్పుడు ఆమె సారంగన్ ఊహలుగురించి ఆలోచించింది.

‘ఏకీభవించకపోతే సరే’ అని అతనులాగ నిర్లక్ష్యం చెయ్యడం ఆమెకి సాధ్యం కాదు. wash basin లో చెయి కడుక్కుంటూ, సోఫాలో కూర్చొని సిగరెట్టు వెలిగించే మహాలింగంని చూసింది.

“అదెలాగ? ఇతరులు ఏకీభవించరు అనే కారణం వలన ఒక అభిప్రాయం చెప్పేవారు ఏ బాధ్యత లేనట్టు ఊరుకోవలసిందేనా?” అని అడుగుతూ లలిత అతని దగ్గర కూర్చొని

మహిళా సమాజం లైబ్రరీ కోసం తను తెచ్చిన పుస్తకాలని చెయిలో అందుకొని బిల్లుతో సరిచూసింది.

దానికీ అతను జవాబు చెప్పలేదు.

కొంచెంసేపు చరువాత అతను హాలు వసారాలో రెండు సోఫాలమధ్య ఉన్న టీపాయ్ లో చదురంగం ఆటకి పాచికలు పెట్టి ఆ రోజు వచ్చిన వార్తాపత్రికలో వచ్చిన చదురంగ ఆటాడం ఆరంభించారు.

లలిత పుస్తకాలని సరిచూసి మళ్ళీ వాటిని క్రమంగా సర్దింది. హాలులోని అలమారానుంచి రెండు మాత్ర సీసాలను తీసి ఒక గ్లాసులో నీళ్ళతో అతనికి అందించింది.

అది తాగి "నువ్వూ ఈ ఆట ఆడి చూడు" అని అతను ఆమెకి నచ్చచెప్పారు. కాని లలిత అది వినక లేచి మేడమీదకి వెళ్ళడానికి సిద్ధమైంది. అంతకుముందు తన hand bag నుంచి తన కథల అచ్చుప్రతులని బయటకి తీసింది. ఆమె కథల సంకలన ఒకటి త్వరలో రాబోతుంది. వాటిని సరిదిద్దడానికి పూనుకుంది. వెళ్లేముందు ఒక నిమిషం ఆగింది.

"ఇవాళ సాయంకాలం మహిళా సమాజంలో మిస్టర్ సారంగన్ కి ఒక reception ఇవ్వాలని నేను చెప్పాలనుకుంటున్నాను. మీరేమంటారు?"

అతను తలెత్తి చూసారు.

"అది మంచి idea వే . . . అతనికి ఆ ఇంట్లో ఎలాగ స్వాగతం చెప్తారో అని నేను భయపడ్డాను. నీకు ఆశ్చర్యంగా లేదూ? ఎంతో హడావిడిగా హారతికూడా తీసారు . . . సారంగన్ పేరు చెప్తే శేషయ్య చిరచిరలాడేవారు, అతను వాడిని ఎలా కౌగిలించుకొని ఎడ్చారో చూసావా? మనుషులు ఎలా మారుతారో ఎవరికి తెలుసు?"

"అవన్నీ క్రమంగా మనకి అర్థమవుతాయి . . . నాకేమో అతని temperament కి సారంగన్ ఆ కుటుంబంలో చాలా బాధపడతారనిపిస్తోంది . . . "

"ఎవరూ, సారంగనా? హూం, అందుకోసమేకదా అతను రెడిగా వచ్చాడు? ఈ దేశంని మార్చాలని వచ్చినవాడు ఈ కుటుంబంని మార్చలేడా?"

“దేశమే మారినా కొన్ని కుటుంబాలు మారడం చాలా కష్టం” అని ఆమె అతనికి ఇంగ్లీషులో చెప్పింది.

“అవును. దేశం మారాలంటే వ్యక్తిగతంగా మనుషులు, కుటుంబాలు మారకుండా పైకి మినుకుగా కనిపించడంవలనే మన సమాజం ఇలా తారుమారుగా ఐపోయింది” అని ఆమె చెప్పినది ఆమోదిస్తూ అతను న్యాయశాస్త్రంగురించి ఆలోచించారు. ‘సగటు మానవ అభివృద్ధికి, ప్రశ్నలకి మనకి చట్టవసతులున్నాయి. కాని వాటిని బాగా గ్రహించడమో, అనుభవంలో వాడడమో చాలామందికి తెలియదే?’ అనే భావన తోచగానే అతని చదురంగం ఆటని అది చెరుపుతున్నట్టు గ్రహించారు. వెంటనే దాన్ని మనసునుంచి తిరస్కరించి సరసమైన ఆ ఆట ముగింపుని తెలుసుకోవాలని పాచికలు జరిపారు.

మేడమెట్లు ఎక్కుతూ సగంలో ఆగి లలిత అతన్ని అడిగింది:

“మీరు ఇవాళ సాయంకాలం శేషయ్యా ఇంటికి వెళ్తున్నారా?”

“హూం, ముందు వెళ్దామనుకున్నాను, అందుకే నిన్నూ పిలిచాను. కాని ఇవాళ సాయంకాలం ఒక client వస్తానని నాకు ఫోన్ చేసారు. నేనూ సరే అనేసాను. నువ్వు వచ్చావంటే అతన్ని పిలిచి రావొద్దని చెప్తాను. మనం వెళ్దాం.”

“ఇవాళ నాకు మహిళా సమాజంలో పని ఉందే . . . ” అని లలిత అంగలార్చుకుంది.

లలిత మేడమీద తన గదికి వెళ్ళడానికి ముందు తన handbag నుంచి కొన్ని కథల అచ్చుప్రతులు బయటకి తీసింది. ఆమె ఇటీవల రాసిన కథల సంకలన త్వరలో రాబోతుంది. వాటిని సరిదిద్దాలని, తన అభిమాన పాఠకులు రాసిన ఉత్తరాలు చదువుకుంటూ మేడమీదకి వెళ్ళింది.

గదిలో ప్రవేశించగానే కొంచెం నిద్రపోవాలనిపించింది. ఆమె నిద్రపోవడం, పని చేయడం ఈ గదిలోనే.

ఆ జంట శయనంమీద రెండు తలగడాలు - ఒకటిమీద ఇంకొకటి పరిచి - రాసే clip boardని దానిమీద ఆనుకొని ఆమె రాస్తుంది. సగంలో అలాగే బోర్లపడి ఆలోచిస్తుంది. కొన్ని సమయాల్లో ఆలోచిస్తూనే నిద్రపోతుంది. సగం నిద్రలో గభీమని కలనుంచి లేచి

ఏదో ఆలోచనతో రాయడమూ జరుగుతుంది. కొన్ని సమయాల్లో ఆలోచనలు కలలుగా నిలిచిపోయి అలాగే నిద్రపోతుంది.

నిద్రపోవడానికి, కలలు కనడానికి, ఆలోచించడానికి, రాయడానికి - వీటికన్నిటికీ తగినట్టుగా ఆమె ఆ గదిని అలంకరించుకుంది.

మంచంకి పక్కనే ఒక నవీన radiogram ఉంది.

గది గోడలు పచ్చరంగులో మెరిసాయి. ప్రతీ గోడలోనూ ఒక చిత్రం వేలాడుతోంది. ఆ నాలుగు చిత్రాలు 'నవీన కళ' -Modern Art అనే వర్గంకి చెందినవి. పరిచయంలేని కళ్ళకి అవి ముద్దముద్దగా పూసిన రంగుల్లాగ, అనర్థంలాగ కూడా కనిపిస్తాయి.

కాని అందులో ఒకటి వినాయక రూపం! అదికూడా నవీన కళ ఆధారంలో సృష్టించబడినది. నిద్రనుంచి లేవగానే లలిత దృష్టిలో కనిపించే విధంగా పడకకి ఎదుట గోడలో అది ఉంది. అందులో చిత్రకారుడు తన అపురూప కల్పనా శక్తిని ప్రదర్శించాడు.

ఏనుగు ముఖం చిత్రించి అందులో అతను విశాలమైన మానవ నేత్రాలు చూపాడు. మానవ శరీరం, ఏనుగు ముఖం కలిసే ఆ వినాయకుడి స్వరూపం కనిపిస్తోంది, కాని 'ఏనుగు ముఖంలో చిన్న కళ్ళకి బదులు ఎందుకు మానవుడి పెద్ద కళ్లు ఉపయోగించకూడదు?' అని ఆ చిత్రకారుని ఉద్దేశం కాబోలు . . .

అతను ఆ కళ్ళలో ఒక దైవీక అనుగ్రహం పదిలం చేసాడు. కడుపు, కాళ్ళలో ఒక పసిపాప పుష్టి కానవచ్చింది.

పడకలో దొర్లుతూ ఆ చిత్రంని తేరిపారిచూసిన లలితకి దాన్ని చిత్రించిన ఆంగ్లో ఇండియన్ ఏలన్, ఆ శిల్ప కళాశాల నేత మేనన్ గుర్తుకి వచ్చారు. ఆ తరువాత అవాళ ఉదయం తను మొట్టమొదట కలుసుకున్న సారంగన్ని ఆమె జ్ఞాపకం చేసుకుంది.

'సారంగన్ని మేనన్, ఆ కళాశాలలోని చిత్రకారులకి పరిచయం చెయ్యాలి' అని ఆమె నిశ్చయించింది.

వెంటనే పడకనుంచి లేచి తన handbag తెరిచి డైరీలో సారంగన్ని చూసి ఒక భేటీ ప్రస్తావించాలని గుర్తు చేసుకుంది.

## 2

సారంగన్ వచ్చి ఒక నెల అయిపోయింది.

ఈ నెల ఎడబాటులో వాడు వచ్చిన తరువాత వేసవికాల ఉష్ణం ఇంకా తీవ్రంగా కానవచ్చింది. దిన వార్తా పత్రికలు చెయిలో తీసుకున్నవెంటనే “ఇవాళ ఉష్ణోగ్రత ఎంత?” అని తెలుసుకోవాలనే అందరూ శ్రద్ధ చూపారు.

కమలాంబ, నాగణ్ణా విదేశంనుంచి వచ్చిన సారంగన్ కోసం ఎంత శ్రద్ధ, చింతతో వండినా ఆ ఆహారంలో కారమే అధికంగా వాడి కళ్ళని కంపించాయి. ఒక వారంలో వాడి జీర్ణకోసం చెడిపోయి పొట్టకి సంబంధించిన వ్యాదులు, దేహమంతా ఉష్ణంలో చెమట పొక్కులు కనిపించాయి. ఒక రోజు రెండు సార్లు స్నానం చేసినప్పుడు వేసవిలో అది తాత్కాలిక పరిహారంగా సుఖమిచ్చినా అలవాటు లేకపోవడంవలన వాడికి జలుబు పట్టేసింది.

మద్యం తాగడానికి వాడికి పెర్మిట్ ఉన్నా అందులో అనుమతించిన యూనిట్లు వాడికి కొన్నిరోజుల్లోనే అల్పంగా కనిపించాయి. అంతకు మించి శేషయ్య చెవులకి వినిపించనట్టు దానిగురించి ఇంటిలో అందరూ గుసగుసలాడుకున్నారు.

మురళి సలహా ప్రకారం సారంగన్ తనేదో తప్పు చేస్తున్నట్టు తన గదిలోనే రహస్యంగా మద్యం తాగే అగత్యం ఏర్పడింది. కన్నియప్పన్ కూడా దాన్ని కొని తెచ్చినప్పుడు తువాలుతో కప్పుకొని ఒక దొంగలాగ పిల్లినడకతో వచ్చాడు; అందువలన వాడు సారంగన్ని తక్కువ దృష్టితో చూస్తున్నట్టు కనిపించాడు.

పెద్దన్నయ్య నరసింహన్ సారంగన్ వచ్చిన దినం ఆ సాయంకాలం కొన్ని నిమిషాలు సామాన్యంగా వాడితో మాటాడారు, అంతే! దాని తరువాత ఈ ఒక నెల ఎడబాటులో నాలుగైదు సార్లుకూడా సారంగన్ అతన్ని చూడనేలేదు. ఆఖరికి, అడిగితే అతని స్వభావమే అలాగ అని సారంగన్ తెలుసుకున్నాడు. అంటే, కాలేజీకి వెళ్ళడానికి మాత్రం అతను గదినుంచి బయటకి వస్తారు; తక్కిన సమయాల్లో గదిలోనే, భార్య హామీలో, స్వాధీనంలో అతను కట్టుబడివుంటారని మురళి చాలా హాస్యంగా వివరించడం విని సారంగన్ తనలో నవ్వుకున్నాడు.

సొంత ఇంటిలోనే పూర్తిగా ఒక అన్యుడులాగ, శిక్ష భరించే ఖైదీలాగ జీవించే సారంగన్ జబ్బుతో గదిలో పడివున్న సమయాల్లో ఎప్పుడో ఒకసారి వచ్చి కొన్ని

గంటలు మాటాడిన లలిత-మహాలింగం దంపతులు, పసిపాప కణ్ణన్ మాత్రమే, అమితమైన ఓదార్పు ఇచ్చారు.

అయినప్పటికీ ఒక నెలముందు లలిత తన డైరీలో గుర్తుచేసుకున్న విషయాలు - మహిళా సమాజంలో అతనికి సత్కారం, భేటీ చేసి మనోన్మణి పత్రికలో అతని గురించి రాయడం, ఆధునిక చిత్రకారుడు ఏలన్, కళాశాల నేత మేనన్ కి అతన్ని పరిచయం చెయ్యడం - ఇవన్నీ ఏమఱుపాటున ఆలస్యమవుతూ వచ్చాయి.

సారంగన్ తనకేర్పడిన ఇబ్బందులన్నీ ఆరంభంలో అలవాటు లేక వచ్చే ఉపద్రవాలని, మెట్టుమెట్టుగా తనే వాటిని అనుగుణంగా మార్చుకోవాలని మొండిగా ప్రతిజ్ఞ చేసుకున్నాడు.

అవును మరి. తను బాహ్యంగా మారకపోతే తను ఆశించే అంతర్గత మార్పులని ఇక్కడ స్థాపించడం ఎలాగ సాధ్యం?

ఎలాగో కొంచెం కోలుకున్న తరువాత తనే వంటగదికి వెళ్ళి కమలాంబ, నాగణ్ణా వండుతున్నప్పుడు పక్కనే ఉండి తనకి కావలసిన ఆహారపదార్థాలు తయారుచేసుకున్నాడు.

“బాగుంది, ఇదేం ఉప్పూ, కారం లేని భోజనం!” అని దాన్ని రుచి చూసి కమలాంబ చిరచిరలాడుతూ నోటిలోనిది ఉమ్మింది.

ఒక పళ్ళెంనిండా ఉడికిన కాయగూరలు, రెండు గరిటెల అన్నం, ఎవరికీ తెలియకుండా నాగణ్ణాగారి రహస్యమైన సాయంతో రెండు గుడ్లు - ఇంతే సారంగన్ ముఖ్య భోజనం.

ఆ తరువాత తనకి కావలసిన మాంసాహార పదార్థాలు చక్కని తగర డబ్బాల్లో కొని తీసుకొనివచ్చి సారంగన్ తన గదిలో పెట్టుకున్నాడు. ఎది కావాలో దాన్ని ఎలక్ట్రిక్ కుక్కర్ లో తయారుచేసుకున్నాడు.

అయనప్పటికీ ఈ ఇంటిలో మెలగడం అతని స్వేచ్ఛకి ఒక సవాలుగా కనిపించింది.

ఆఖరికి, పదిరోజులముందు, ఆ బంగళా వెనుక భాగంలో ఉన్న ‘తోట ఇల్లు’ అని అందరూ పిలిచే చిన్న ఇంటికి బస మార్చాలని ఒక రోజు సాయంకాలం తోటలో వాహ్యాళి వెళ్తున్నప్పుడు అతనికి ఒక మంచి ఆలోచన తోచింది.

ఆ తోట ఇల్లు ప్రధాన ఇంటికి కుడిపక్కన గోడని ఆనుకొని ఉంది. ఇదే ఆవరణలో ఉన్నా దాని వెనుక ప్రత్యేకంగా ఒక గుమ్మం, పెద్ద రహదారి కనిపించాయి. ఇన్ని రోజులూ మరమ్మతు లేకపోవడంవలన ధూళి, సాలెగూడులు కప్పేసినా కొంచెం శ్రద్ధతో ఆ జాగాని సరిదిద్దుకోవచ్చనిపించింది.

సారంగన్ తాళం వేసిన ఆ తోట ఇల్లు ద్వారం పక్కనవున్న కిటికీని చాలా శ్రమతో తెరిచి, లోపలకి వెళ్ళి చూసాడు.

ఒక విరిగిన మంచం, పెళ్ళికి వాడే పెద్ద పెద్ద పొగపాటిన పాత్రలు, పాతకాలపు మూడు చక్రాల సైకిలు; 'ఒక వేళ నేనే ఆఖరికి అందులో ప్రయాణం చేసానేమో?' అనే ఆలోచన రాగానే  సారంగన్ తనకీ ఈ కుటుంబంకి ఉన్న మౌలిక చుట్టరికం, ఇప్పుడు తను అనుభవించే పరాధీనం, గుర్తుచేసుకొని నిట్టూర్పు వదిలాడు.

కన్నియప్పన్ని పిలిచి ఆ తోట ఇల్లు తాళంచెవిని తెమ్మనిచెప్పి సారంగన్ తెరిచి చూసాడు. ముందు ఒక హాలు. దాని వెనుక ఒక చిన్న గది. దాన్ని దాటితే వంటగదిలాగ ఇంకోక చిన్న గది, దానికి ఎదురుగా బాత్ రూమ్ వసతులు తనకి అనువుగా కనిపించాయి. ఆ ఇంటిలో ఇంతవరకూ ఎవరూ బస చెయ్యలేదనే కారణం వలన నేలమీద అక్కడక్కడ పందికొక్కులు తవ్విన మన్నుకుప్పలు కనిపించాయి.

వాటిని శుభ్రపరచమని కన్నియప్పన్ కి ఆజ్ఞ ఇచ్చి ఇక తను ఇక్కడకి రావడానికి ముందు నాన్నగారికి ఒక మాట చెప్పాలని సారంగన్ నిశ్చయించాడు.

మేడమీద తన గదిలో సారంగన్ నలుకువుగా ఉండే రోజుల్లో శేషయ్య  రోజు రెండుసార్లు వాడిని వచ్చి చూసేవారు. వాడితో ఉన్నప్పుడు అతను అధిక సమయం మౌనంగానే గడిపేవారు. అతను ఏమంటున్నారని స్పష్టంగా అర్థంకాని విధంగా దేనిగురించైనా మాటాడుతారు. సారంగన్ మౌనంగా చిరునవ్వుతో దాన్ని అంగీకరిస్తాడు.

అతన్ని చూసినప్పుడెల్లా సారంగన్  మనసులో ఒక విధమైన జాలియే మిగిలింది. వాడు అతని జీవితంని, అతనికి సంబంధించిన చుట్టరికాలని - అతని దృష్టిలోనే చూసాడు.

ముప్పైఐదు సంవత్సరాలముందు భార్యని పోగొట్టుకొని, రెండవ పెళ్ళి చేసుకోకుండా, నౌకరీల సాయంతోనే ఒక కూతురుని, మూడు కొడుకులని అతను

పెంచారు; జ్యేష్టకూతురుకి పెళ్ళిచేసారు; ఆమె కొన్ని సంవత్సరాలతరువాత ఒక పిల్లవాడితో పుట్టినిల్లుకి వచ్చేసింది. జ్యేష్టకుమారుడు సంతానం లేకుండా భార్యకి పిల్లవాడైపోయాడు; రెండవ కొడుకు - దశరథుడికి రాముడులాగ దొరికిన వాడిని - అతను గారాబంగా పెంచి, పోషించి, పెళ్ళిచేసారు; ఒక మనవడు పుట్టిన తరువాత ఆ కొడుకు కన్నుమూసాడు. ఇవన్నీ భరించడం అతనికెలా సాధ్యమైంది?

తనపై అతనికి పొరబాటుగా, మొండిగా, కోపమూ, దుఃఖం కలిగినా అతని కోణంలో చూస్తే అది న్యాయమే అని సారంగన్ ఒప్పుకున్నాడు.

అందువలనే అతను ఏం చెప్పినా సారంగన్ జవాబు చెప్పకుండా తలూపాడు.

తను అస్వస్థగా ఉన్నప్పుడు డాక్టరుని పిలిచి, సారంగన్ సరిగ్గా మందులు తాగుతున్నాడా అని విచారించే తండ్రికి తనవల్ల ఎంత బాధ అని వాడు వాపోయాడు.

తోట ఇల్లులో తన బస గురించి సారంగన్ చెప్పినప్పుడు శేషయ్య కొంచెం ఆలోచించారు. అతని కుడికాలు ఉయ్యాలనుంచి వేలాడుతూ నేలని మెల్లమెల్లగా నెట్టుతూ ఉయ్యాలని ముందూ, వెనుకా ఊపింది.

పక్కనే సోఫాలో కూర్చొని 'అతను ఏమంటారో?' అని కాచుకున్న సారంగన్ ఉయ్యాల చలనంలో లేచిన ధ్వని విని ఆనందించాడు. శేషయ్య కుడికాలుని నేలమీద నొక్కి ఉయ్యాల ఆటని ఆపారు. వాడిని తేరిపాటి చూసారు. వాడు మోజెయిని గోకుకుంటున్నాడు.

"తంబుడూ, నీకు ఈ ఎండ చాలా బాధగా ఉందికదూ? నాకు ఒక ఆలోచన, మన తోట ఇల్లుని కొంచెం remodel చేసి air condition ఏర్పాటు చేస్తే నీకు వసతిగా ఉంటుంది."

"Oh, that's all right! దానికేం, ఇప్పుడు అలాగే ఉంటుంది . . . ఇది summer కదా? అందరికీ అలాగే ఉంటుంది . . . " అని సారంగన్ సమాధానం చెప్పాడు.

"అలాగే కానీ . . . ఎండ తగ్గుతే మనం అది వాడవద్దు, సరేనా?" అని శేషయ్య నిశ్చయించారు.

ఒక వారంలో ఆ తోట ఇల్లు పునరుద్ధరించడం పూర్తి అయింది; సారంగన్ ఆ ఇంటిలో ప్రవేశించాడు.

“నేను ముందే చెప్పలేదూ . . . అతనిక్కడ ఉండగలరా? చూడండి, ఒక నెలలో అతను సీమకే వెళ్ళిపోతారు . . . మీకు తెలుసా? మీ తమ్ముడూ నిత్యమూ తాగుతున్నారట!” అని రాజం నరసింహన్ దగ్గర గొణుక్కుంది.

“ఉరుకోవే . . . వాడు తాగడం తెలిసిందంటే నాన్నగారే వాడిని వెళ్ళగొడ్తారు” అన్నారు నరసింహన్.

అతనికి నిజంగానే తమ్ముడు తాగుతున్నాడని విని మనసులో చాలా బాధ కలిగింది.

రెండురోజులముందు ఒక రాత్రి అతను దీనిగురించి తండ్రికి ఫిర్యాదు చేసారు. ఎప్పటిలాగే చాలాసేపు మౌనం వహించి, తరువాత శేషయ్య ఒక నిట్టూర్పు వదిలి చెప్పారు:

“ఇదంతా వాడిని నేను లండన్ కి పంపించడానికి ముందు ఆలోచించి ఉండాలి . . . సరేలే, నువ్వు దీనిగురించి ఎవరితోనూ మాటాడవద్దు! తాగడమంటే మనదేశంలో ఒక అర్థం, సీమలో ఇంకొక అర్థం . . . అందుకేగా సర్కారు వాడికి తాగడానికి పర్మిట్ ఇచ్చారు? అదెలాగో పోనీరా, ఇక మనం చేసేదేముంది? ఎవన్నీ మనం అనుభవించాలో అవన్నీ అనుభవించే తీరాలి!” అని నరసింహన్ కి చెప్పిన తరువాత ఇన్ని సంవత్సరాల తరువాత ఇంటికి తిరిగి వచ్చిన ఈ కొడుకు భవిష్యత్తుగురించి అతను ఆలోచించారు.

పునరుద్ధరించబడిన కొత్త ఇంటికి వెళ్ళిన మూడు రోజుల తరువాత సారంగన్ తనకి కావలసిన శాకాహార పదార్థాలు కమలాంబ మూలంగా, మాంసాహార పదార్థాలని కన్నియప్పన్ మూలంగా తయారుచేసుకున్నాడు.

అతనికి అనుమతించిన యూనిట్లకిమించి మద్యం దొరుకుతుందనే సంగతి ఒకరోజు రహస్యంగా కన్నియప్పన్ సారంగన్ చెవిలో వల్లించాడు.

మద్యం గురించి మాటాడడమే కన్నియప్పన్కి ఒక రహస్యమైపోయిందని తెలుసుకున్న సారంగన్ వాడి సందేశంలో ఇమిడివున్న అర్థంని ఊహించక “Thank you . . . Thank you . . . ” అని వాడిని పొగడాడు.

ఆఖరికి ఎలాగో ఈ నెల అనుభవించిన కష్టాల తరువాత మనసుకి పూర్తిగా తృప్తి కలిగే విధంగా రోజులు గడపడం సారంగన్ నేర్చుకున్నాడు.

నిద్రపోయే సమయంలో మాత్రం dressing gown  లేక color pyjama ధరించే అలవాటు చేసుకున్నాడు. తక్కిన సమయాల్లో పంచె, జిబ్బా తొడుక్కున్నాడు. అందువలన కొన్ని ఇబ్బందులు కలిగినా వేసవిలో పొక్కులతో బాధించే దేహంకి అది అనుకూలంగా కనిపించింది.

ఈ రోజు ఉదయం శేషయ్య సారంగన్ గురించి, వాడి భవిష్యత్తు గురించి తన యోచనలు మాట్లాడడానికి మురళీని రమ్మని పిలిచారు.

అతని అవగాహనలో ఈ అబ్బాయిలెవరూ పని చేసి సంపాదించాలనే నిర్బంధం లేదు;  పూర్వీకంగా కూడబెట్టిన బోలెడు డబ్బు ఉంది.

చెన్నై నగరంలోనే నాలుగు పెద్ద ఇళ్లు, ‘శేషయ్య కాలనీ’ అనే పేరుతో ఉన్న గృహ నిర్మాణ సంఘం మూలంగా నెలా వెయ్యేళ్ళ ఆదాయం అద్దెగా వస్తోంది; నెల్లూరుకి సమీపంలో కొంచెం భూరూప ఆస్తి కూడా ఉంది. వాటిని నిర్వహించాలనే ఉద్దేశంతో civil engineering చదివి ఏమైనా ఉద్యోగం చెయ్యాలనుకున్న మురళిని “వద్దు!” అని శేషయ్య ఆపేసారు. ఇప్పుడు సారంగన్ వచ్చిన తరువాత వాళ్ళిద్దరూ కలిసి ఏదో వ్యాపారం - తమకిష్టం వచ్చినట్టు - చెయ్యవచ్చు అనే ఆలోచన అతనికి కలిగింది. నలభై దాటిన సారంగన్ కి ఒక పెళ్ళి చెయ్యాలని అతను ఆలోచించినప్పుడు ‘వాడు ఏమంటాడో, వాడి మనసులో ఏముందో?’ అని ఊహించలేక అతన్ని వివరింపలేని భయం ఆవరించుకుంది.

‘సరే, కొన్నిరోజులు నిమ్మళంగా గడిపిన తరువాత ప్రేమతో వాడిని స్వాధీనం చేసుకోవాలి’ అని అతను నిశ్చయించారు.

మేడమీదనుంచి చెయిలో ఒక లెడ్జరు పుస్తకంతో మురళి కిందకి వచ్చాడు.

తాతయ్య అప్పుడే లేచి వెళ్ళారని ఊరకే ఆడుతున్న ఉయ్యాల మూలంగా వాడు తెలుసుకున్నాడు. హాలుకి పక్కనేవున్న పూజాగదిలో మురళి ప్రవేశించినప్పుడు శేషయ్య శయ్య లేకుండా కొయ్య మంచంమీద పట్టు చాప పరచి, తలగడమీద వాలి, కళ్లు మూసుకొని దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నారు.

మురళి చాలా మర్యాదగా ఒక మూల నిల్చున్నాడు.

“తాతయ్యా, పిలిచారా?” అని భవ్యంగా అడిగాడు.

“అవును” అని తలెత్తి వాడిని చూసి అతను “ఇలాగ రా, వచ్చి కూర్చో” అని కాలు ముడుచుకొని మంచంలో జాగా ఇచ్చారు.

కాని మురళి అక్కడ కూర్చోకుండా పక్కనే ఉన్న ఒక స్టూల్ లాగ్గొని అతని సమీపంలో కూర్చున్నాడు.

మురళి తాతయ్య మనసు తెలుసుకొని మెలగడంలో సమర్థుడు. వాడే అతనికి కార్యస్థుడు హోదాలో సేవ చేస్తున్నాడు. ఇంటి ఖర్చులు నిర్వహించడం, రొక్కం ఇవ్వడం, వసూలు చెయ్యడం, ఇవన్నీ వాడి బాధ్యతలు. నెలకొకసారి వాడు చూపే లెక్కపుస్తకం చూసి అప్పుడప్పుడు వాడు సూచించే కాగితాల్లో సంతకం చెయ్యడమే శేషయ్య పని.

గతించిన రంగయ్య స్థానంని కొంతమట్టుకు పూర్తిచేసేవాడు వాడే అని ముసలాయనకి మనవడుమీద ప్రత్యేక అభిమానం ఉంది.

“ఏమంటున్నాడు నీ చిన్న మామయ్య?” అని నవ్వుతూ అతను మురళిని అడిగారు.

“ఏమీ చెప్పలేదే?”

“నువ్వే వాడిదగ్గర close గా ఉన్నావని అడిగాను . . . వాడిదగ్గర ఏమైనా plan ఉందా? భవిష్యత్తులో ఏం చెయ్యాలని నీతో మాటాడాడా?”

శేషయ్య ప్రశ్నకి సముచితంగా జవాబు చెప్పే విధంగా సారంగన్ తనకేమైనా చెప్పాడా అని మురళి ఆలోచించాడు.

“వాడిదగ్గర డబ్బు ఏమైనా ఉందా?”

“ఉన్నట్టు కనిపించదు . . .ఉన్నాకూడా ఎక్కువగా ఉండదు” అని దానికి మాత్రం మురళి వెంటనే జవాబు చెప్పాడు.

“దానికేం? వీడు సంపాదించాలని ఎవరు ఎదురుచూసారు? కాని ఇలాగే నలభైయేళ్ళవరకూ చెడిపోయి వచ్చాడే? కర్మ, కర్మ!” అని గొణుకుతూ, కొంచెంసేపు ఆగి, ఏదో ఆలోచనలో పడి అతను అడిగారు: “వాడికి మాటాడంకూడా తెలీదు!

తమిళం తెలీదు, తెలుగూ తెలీదు! పూర్తిగా తెల్లవాడైపోయాడు! వాడిని చూసినప్పుడెల్లా నా మనసుకి చాలా బాధగా ఉంది. మనతో కలుపుకోవాలని వాడు ప్రయత్నిస్తున్నట్టు కనిపించదే!”

“నువ్వు వాడి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి!” అని చెప్పిన తరువాత శేషయ్య ‘నేను దేనిగురించి ఈ హెచ్చరిక చేసాను?’ అని సూటిగా చెప్పలేక ‘ఎందుకు నేను అలాగ చెప్పాను?’ అనికూడా ఆలోచించారు.

ఆ క్షణంలో మురళికికూడా ‘ఇతను ఏదైనా వదంతి విని, దానిగురించి విచారించడానికి నన్ను పిలిచారేమో?’ అని లోలోపల ఒక భయం కలిగింది. ‘నిన్నరాత్రి సారంగన్ తో నేను రహస్యంగా మద్యం తాగినది కన్నియప్పన్, లీలకి కూడా తెలీదే!’ అని వాడి మనసు కలవరపడింది.

“ఇదిగో విను. వాడి బుఱ్ఱనిండా చాలా పిచ్చి పిచ్చి ఊహలు ఉన్నాయి . . . ఈ దేశంలో మన ముత్తాతల కీర్తి వాడికి బోధపడదు . . . దౌర్జన్యమైన నాగరికమే గొప్ప అని వాడు వాదిస్తాడు . . . నీలాంటి లేతైన మనసుకి అది చాలా న్యాయంగా కనిపిస్తుంది. అందుకే చెప్పాను నువ్వు వాడి విషయంలో జాగ్రత్తగా ఉండాలని. ఎందుకంటే ధనం, ఆస్తి పోగొట్టుకోడం ఏం పెద్ద నష్టం కాదు. కాని తరతరాలుగా మనం పోషించి, కాపాడిన నీతులు, నియమాలని ‘నవీనత’, ‘విప్లవం’ అనే యౌవన పరవశత్వంలో కోల్పోతే ఆది భర్తీ చెయ్యడం కష్టం! సారంగన్ విషయంలో అదే నాకు బాధగా ఉంది. వాడు బాగా చెడిపోయాడు . . . వాడేం సంపాదంచవద్దు. ‘వాడిని మనం మెల్ల మెల్లగా కొత్తమనిషిగా మార్చాలి, అదెలాగ?’ అని నేను ఆలోచిస్తున్నాను . . . చెప్పు, నువ్వేమంటావ్ ?”

మురళి ఏం జవాబు చెప్పాలని తెలియక కూర్చున్నాడు.

అతనే చెప్పారు.

“ముందు వాడికి ఒక పెళ్ళి చేసేయాలి. దానితోబాటు ఏమైనా వృత్తికి ఏర్పాటు చేస్తే వాడికి బాధ్యత వచ్చేస్తుంది” అని చెప్తూంటే ఇంతకుముందు సారంగన్ ఒక ఉత్తరంలో రాసిన వాడి ‘అనాచార ప్రేమ వ్యవహారం’ అతను గుర్తుచేసుకున్నారు. దానిగురించి మురళి దగ్గర ఎలా ప్రస్తావించడం అని జంకుతూ తల గోకుకున్నారు.

మురళికి తన మనసులోని పాత అభిలాషకి ఇదొక మంచి అవకాశం అనిపించింది.

వాడి మనసులో - చాలా రోజులుగా నిలకడగా ఉన్న వాస్తుశాస్త్రంని ఆరంభించాలనిపించింది; తనకి సాయం చెయ్యగలిగిన మిత్రులందరిని గుర్తుచేసుకున్నాడు.

"తాతయ్యా . . . నేను ఇంతకు ముందే మీకొకసారి చెప్పాను . . . మీరు 'తరువాత ఆలోచిద్దాం' అని అన్నారు. ఇందుకు investment కూడా ఎక్కువగా కావాలనిలేదు. Establishment charges మాత్రం చాలు. నాకు కొందరు మంచి architects తెలుసు. మన పని ఆధునికంగా, modernగా ఉంటే భవిష్యత్తు బాగుంటుంది. కొత్తకొత్తగా కల్పనాశక్తితో plans, designs చెయ్యడానికి ముగ్గురు చాలు. చాలారోజులుగా నాకిదే ఆశ . . . " అని మురళి ఉత్సాహంతో చెప్పాడు.

"సారంగన్ అంకుల్ కి ఇందులో ఏ శ్రమా ఉండదు. అతను Managing Director గా ఉంటే చాలు. తక్కినవన్నీ నేను చూసుకుంటాను . . . " అని మురళి అభయం విని శేషయ్య వాడిని తేరిపారి చూసారు. "సరే, నేనిప్పుడు వాడికేకదా ఏదైనా వృత్తికి ఏర్పాటు చెయ్యాలని చెప్పాను? నువ్వూ అందులో పోతే మరి నాకెవరున్నారు?" అని నవ్వుతూ అడిగారు.

"నేనెక్కడ పోతాను, తాతయ్యా? అన్నీ నేనే చూసుకుంటాను. నేను చదివానుగా, అది పనికి వస్తుంది."

"సరేలే, దీనిగురించి నువ్వు ఎవరెవరితో సంప్రదించాలో వాళ్ళందరినీ చూసి ముందు నాకొక Estimate తీసుకొని రా . . . 'ఒక సంవత్సరంలో మనం ఎంత ఖర్చు చేస్తాం, మొదటి సంవత్సరం నష్టం లేకుండా జరుగుతుందా?' అని మనకి తెలియాలి, అవునా? ఇవన్నీ నీకు తెలుసుగా? ఇందుకు వాడు ఎంతవరకు సమ్మతించుతాడని నువ్వు వాడితో మాటాడాలి. ఆ తరువాత నేను వాడితో మాట్లాడతాను . . . " అని సారంగన్ని అంచనా వెయ్యడానికి మరళిని తయారుచేసి శేషయ్య వాడు తెచ్చిన లెక్కపుస్తకాలు తిరగేసి చూడసాగారు.

మురళి లేచి నిలబడి వాచీ చూసాడు.

"నేను బ్యాంకుకి వెళ్ళాలి."

“సరే, వెళ్ళు.”

మురళి వెళ్ళిన తరువాత అతను ఆ లెక్కల పుస్తకం మూసేసారు. దాన్ని పక్కనే పెట్టి పడకలేని ఆ మంచంలో పట్టు చాపమీద పండుకున్నారు.

‘సారంగన్ ఇంతకు ముందు ఒక సారి తన ఉత్తరంలో రాసిన ఆ ప్రేమ వ్యవహారం ఏమైందో? దాన్ని ఎలాగో పరిష్కరించిన తరువాతే వాడిక్కడికి వచ్చాడా? లేకపోతే తిరిగివెళ్ళి మళ్ళీ . . . ఒక వేళ ఆమెని వదిలేసి ఇక్కడికి తాత్కాలికంగా వచ్చేసాడా? ఏమీ మాటలాడడే? నా కర్మ, నేనే ఇవన్నీ అడిగి తెలుసుకోవాలా?’ అని తన కొడుకు గురించి లేచిన ప్రశ్నలతో అతను కలవరపడ్డారు.

సాయంకాలం నాలుగు గంటలకి సారంగన్ని భేటీ చెయ్యడానికి వస్తానని లలిత చెప్పి వెళ్ళింది.

Air Condition చెయ్యబడిన అగ్ర గదిలో ఆమెకి స్వాగతం చెప్పడానికి సారంగన్ తయారుగా కూర్చొనివున్నాడు.

గోడమీద సారంగన్ తెచ్చిన ఒక విదేశ గడియారం ఉంది. దానికి మించి ఆ గదిలో ఏ అలంకార వస్తువులూ లేవు. ఆ ఒంటరి అలంకారం వినోదంగా ఆ గదికి ఎవరు వచ్చినా వాళ్ళని ఆకర్షించింది.

చూడడానికి ఆ చిన్న గడియారం ఒక చిన్న ఇల్లులాగ ఉంది. దాని పైకప్పుమీదున్న ఒక ద్వారంని తెరుచుకొని ఒక పిట్ట ప్రతి గంటా తొంగిచూసి ఎన్ని గంటలో అన్నిసార్లు కేకపేసిన తరువాత తలని లోపలికి లాగ్గుంటుంది; ద్వారమూ మూసుకుంటుంది. ఆ ఇంటి ముందు హాలులో మంచి సోఫాలు అమర్చబడివున్నాయి; నేలమీద రత్నకంబళి పరచివుంది; హాలు, గది మాత్రమే air condition చెయ్యబడివున్నాయి.

సారంగన్ నిర్మలమైన తెల్ల జిబ్బా, పంచె ధరించి ఉన్నాడు. అప్పుడే స్నానం చేసివున్నా, క్షవరం చేసుకొని చాలా రోజుల తరువాత చెవుల మూల, నుదురు చర్మంలో వెంట్రుకలు దండిగా పెరిగివున్నాయి. మోజెయిలోనూ, వేళ్ళ మధ్య ఇంకా

పూర్తిగా స్వస్థపడని పొక్కులకోసం మందు వేసుకున్నాడు; గదినిండా వాసన వ్యాపించి ఉంది.

నాగణ్ణా వాడికోసం టిఫన్ కావాలా అని అడగడానికి వచ్చినప్పుడు నడుములో తను ఎత్తుకొని వచ్చిన కణ్ణన్ని, పత్రిక చదువుతూ కూర్చున్న సారంగన్ దగ్గర అప్పగించి వెళ్ళారు.

సోఫాలో కూర్చున్న సారంగన్ మోకాళ్ళను పట్టుకొని వాడిమీద ఎక్కి ఒడిలో కూర్చోవాలని కణ్ణన్ ప్రయత్నిస్తున్నాడు.

పిల్లవాడిని ఎత్తుకొని ఆ ఇంగ్లీషు పత్రికలోని రంగు చిత్రపటాలు చూపుతూ సారంగన్ పిల్లవాడిని ముద్దాడాడు.

ఆ ఆట చూసి కొంచెంసేపులో ఇద్దరికీ విసుగు పుట్టేసింది; పసివాడు పక్కనేవున్న రేడియోకి వెళ్ళాడు.

సారంగన్ పిల్లవాడిని ఎత్తుకొని వాడికోసం రేడియో డయల్ చేసాడు.

ఈ దేశ పారంపర్యంకి చేరని సంగీతం కాదు, పాశ్చాత్య సంగీతమూ కాదు. ఈ నాటి సినిమా పాట ఒకటి వినిపించింది. అది వినడానికి సారంగన్ కి వినోదంగా, ముచ్చటగా ఉంది. వట్టి శబ్దం విని పిల్లవాడు చప్పట్లు కొట్టి ఆహ్లాదించాడు.

సారంగన్  కూడా పసివాడితో కలుసుకొని ఆనందించి నవ్వాడు.

కొన్ని సినిమా పాటలు టేపులో రికార్డు చెయ్యాలనే తన ఆలోచన వాడికి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది; వెంటనే పక్కనేవున్న tape recorder తీసి రేడియో వచ్చే పాటని పదిలం చేసాడు.

అప్పుడు ఎవరో తలుపుని లేతగా తట్టారు.

"Come in . . .లోపలికి రండి." మురళి వచ్చాడు.

" How do you like this kind of music?" అని అడుగుతూ మురళి సోఫాలో కూర్చున్నాడు.

"What shall I say?" అని ఆరంభించి సారంగన్ తమిళంలో మాటాడసాగాడు. ఆ భాషలోనే మాటాడడం అలవాటు చేసుకోవాలని వాడి మనసులో ఉంది. కాని ఆ తమిళ పదాలు నాలికలో పడకుండా వదులుగా ఉచ్చరించాడు.

మురళి నవ్వుతూ "You better talk in English" అన్నాడు.

"No, No, you are wrong! ముందు కష్టంగా ఉంటుంది, తరువాత సరిగ్గా మాటాడతాను . . . నువ్వే చూస్తావ్ . . . నాకు చదవడం, రాయడం పెద్ద problem కాదు . . . కాని మాటాడడం అలవాటు లేదు . . . అందుకే ఈ practice . . . నేను కణ్ణన్ తో మాటాడి నేర్చుకుంటాను . . . ఏంరా కణ్ణా . . . " అని పాపతో సారంగన్ లాలించాడు.

"సరేలేండి, వాడుకూడా మీలాగే మాటాడతాడు" అని అంటూ హాలుని నాగణ్ణా నిష్క్రమించారు. మురళి నవ్వాడు. అతను తెలుగులో చెప్పినది గ్రహించలేక సారంగన్ మురళిని అడిగాడు: "నాగణ్ణా హాస్యంగా ఏమో అన్నారు, అందుకేనా నువ్వు నవ్వావ్?"

మురళి నాగణ్ణ చెప్పినది తర్జుమా చేసి తమిళంలో చెప్పగానే సారంగన్ కూడా నవ్వాడు.

ఇద్దరూ తలా ఒక సిగరెట్టు వెలిగించుకున్నారు. తాతయ్య పథకంని సారంగన్ కి ఎలా చెప్పాలని మురళి ఆలోచిస్తున్నాడు.

అప్పుడు రేడియోలో ఒక పాట అగి, తరువాత వచ్చే పాట గురించి ఒక ప్రకటన వినిపించింది. కొంచెం tape మాత్రమే ఉందని గ్రహించిన సారంగన్ 'తరువాత మార్చుదాం' అని ఆలోచించి రేడియోను మూసాడు.

ఆ విరామంలో మురళియే మొదట మాటాడాడు:

"ఇవాళ ఉదయం తాతయ్య నన్ను పిలిచారు; మీగురించి మాటాడారు."

తనగురించి నాన్నగారు ఏమిటి మాటాడారని ఆతురతతో సారంగన్ తలెత్తి కూర్చున్నాడు.

"మీకు పెళ్ళి చెయ్యాలట" అని చెప్పి మురళి వాడిగా అతని మొహం చూసాడు. అందుకు ఎటువంటి చలనమూ లేకుండా, 'ఆ తరువాత?" అని అడిగాడు సారంగన్.

"ఆ తరువాత . . . ఒక business ఆరంభించాలి . . . అది పూర్తిగా అతని plan కాదు . . . నేనే చాలా రోజులుగా దానిగురించి ఆలోచించాను . . . నా మిత్రులలో కొందరు

architects ఉన్నారు. వాళ్ళతో కలిసి ఒక company ఆరంభిస్తే భవిష్యత్తులో bright గా ఉంటుంది.”

“అందుకు నేనేం చెయ్యాలి?”

“మీరే దానికి యజమాని. తాతయ్య అందుకు కావలసిన డబ్బు ఇచ్చేస్తారు. నిర్వహించడం నేను చూసుకుంటాను.”

“అతను డబ్బు ఇస్తున్నారు. నడిపించడం నీ వంతు. ఇక నేను చేసేదేముంది?”

“మీరేం చెయ్యనక్కరలేదు. ముందు ఒక మంచి అమ్మాయిని చూసి తాత్తయ్యకి తృప్తిగా  పెళ్ళి చేసుకోండి . . . ఆ తరువాత ‘ఈ business కి నేను యజమానిగా ఉంటాను’ అని అతనికి మాట ఇవ్వండి. అది చాలు, తక్కినవన్నీ నేను చూసుకుంటాను.”

మురళి మాటలు విని సారంగన్ కి నవ్వు వచ్చింది. పెళ్ళి, వ్యాపారం రెండూ ఐక్యమైపోవడం, అంతకు మించి తనకంటే వయస్సులో చాలా చిన్నవాడైన మురళి ఇలాగ మాటాడడం అతనికి ముందు హాస్యంగా కనిపించింది.

సారంగన్ హోరుమని నవ్వాడు.

“Don’t be silly . . . నాన్నగారికంటే నువ్వే old man గా పోవాయావ్! నేను ఈ రెండు పనులూ చెయ్యలేను! You are still living in a feudal society! నాన్నగారికి చెప్పేయ్ . . . ‘ Please . . .  నా విషయంలో మీరు అనావశ్యకముగా జోక్యం చేసుకుంటే ఇద్దరికీ నష్టం’” అని హాస్యంగా ఆరంభించి చాలా స్థిరమైన ధోరణిలో తన ఉద్దేశం అతను తెలియజేసినప్పుడు మూసివున్న తలుపుని ఎవరో లేతగా తట్టే సద్దు వినిపించింది.

సారంగన్ గోడ గడియారం చూసాడు. దాని పైకప్పుని తెరచుకొని వచ్చిన పిట్ట తొంగిచూసి ‘కుహూ, కుహూ’ అని నాలుగు సార్లు రమ్యంగా కేకపెట్టింది. దాన్ని చూసి పిల్లవాడు కణ్ణన్ చప్పట్లు కొట్టుతూ నవ్వాడు.

సారంగన్ చెయిలో పిల్లవాడితోనే లేచి వెళ్ళి ముందు హాలు తలుపు తెరిచాడు. లలిత, ఆమె వెనుక అతని విదేశ కళ్ళకి చూడగానే గణింపలేని వయసులో అతీత నాగరిక అలంకారంతో ఒక యువతి కనిపించారు.

“Hello, come in please!” అని ఇద్దరికీ చిరునవ్వుతో స్వాగతం చెప్పి లోపలికి పిలుచుకొని వచ్చాడు.

వాళ్ళు రాగానే సోఫాలో కూర్చొనివున్న మురళి వెళ్ళిపోవడానికి సిద్ధంగా లేచి నిల్చున్నాడు.

“నువ్వెక్కడికి బయలుదేరావ్? No problem, you too can stay” అని సారంగన్ వాడికి చెప్పాడు.

“లేదు . . . నాకు తాతయ్యతో కొంచెం పని ఉంది” అని మురళి చెప్పి లేచినప్పుడు సారంగన్ చెయిలోవున్న కణ్ణన్ మురళి దగ్గర దూకాడు.

“ఓ, నీకూ తాతయ్యని చూడాలా?” అని నవ్వుతూ సారంగన్ పిల్లవాడిని వాడికి అప్పగించినప్పుడు కణ్ణన్ని చేతుల్లో తీసుకుంటూ మురళి చెప్పాడు:

“వీడు తాతయ్య దగ్గరకి వెళ్ళడు. అతనూ వాడిని ఎత్తుకోరు . . . నేను నాగణ్ణా లేక కమలమ్మ దగ్గర వదిలేస్తాను . . . ”

“Why, what’s the matter?”

“Some sort of superstition . . . రంగయ్య మామ చావుకి వీడి పుట్టుకే కారణమట . . . ” అని మురళి చాలా తేలికగా చెప్పేసి పిల్లవాడితో నిష్క్రమించినా ఆ సంగతి విని సారంగన్ మనసు గూఢంగా నొచ్చుకుంది. కాని వేరొక ముఖ్య సంగతికోసం వచ్చిన ఈ అతిథులముందు దీనిగురించి తన భావనలు తెలియజేయకూడదని నిశ్చయించి సోఫాలో సారంగన్ వచ్చి కూర్చున్నాడు.

వాడిని చూస్తూ ఒక చిరునవ్వు నవ్వి లలిత తనతో వచ్చిన యువతిని పరిచయం చేసింది.

“Meet Miss. Madhavi, మా మహిళా సమాజం joint secretary.”

“Pleased to meet you” అని అంటూ మాధవి వాడిముందు చెయి చాటింది.

సారంగన్, మాధవి ఆంగ్లేయ సంప్రదాయంలో చేతులు కలుపుకొని పరిచయం చేసుకున్నారు.

మన ఆచారంకి తగినట్టుగా ముకుళిత హస్తాలతో నమస్కరించడం ఎదురు చూసిన లలిత, ఒక క్షణం, లోలోపల సణుగ్గుంది.

“Please take your seats . . . ” అని సారంగన్ సోఫాలను చూపాడు.

రేడియో పక్కనేవున్న ఒంటరి సోఫాలో సారంగన్, అతని ఎదుట ఉన్న ఇంకొక ఒంటరి సోఫాలో మాధవి, అతనికి ఎడం పక్కన ఉన్న సోఫాలో లలిత కూర్చున్నారు.

వాడు తన తీక్షణమైన కళ్ళతో మాధవిని అంచనా వెయ్యడం లలిత గమనించింది.

మాధవి అలంకారం చాలా వింతగా కనిపించడం వలన సారంగన్ దాన్ని శ్లాఘించి చూసాడు. శిరస్సే చాలా నిడివిగా పెరిగినట్టు గొత్తిగా ఉంది. ఆభరణాలేవీ లేకుండా మొటిమలు మాత్రం కనిపించే ఆ ముఖంలో పెద్ద తిలకం, పెదిమలలో ఎర్రగా lipstick రాచుకొనివుంది. ఆమె కళ్ళు ఒకచోట నిలబడక తొందర తొందరగా ఇలాగా అలాగా ఊగాయి. దవళ భుజాలు, కడుపు బయటకి కనిపించే విధంగా చేతులు లేకుండా భుజంని మూసే ప్రకాశమైన నల్లరంగులో రవిక, తెల్లని చీర ధరించింది. కంఠంలోని హారంలో ఒకటి విడిచి ఒకటిగా కనిపించే ఆ నలుపు, తెలుపు మొగ్గలు చూసినవారికి ‘ఇది ఈమె అలవాటుగా ధరించే నగ కాదు. ఈ దుస్తుకి match గా దీన్ని ఎంచుకుంది’ అని సులభంగా బోధపడుతుంది.

సారంగన్ అమెను చూసి, “మీ hairstyle చాలా అందంగా ఉంది. ఇలాగ పారీసులో యువతులు అలంకరించుకోడం నేను చూసివున్నాను” అని ఆమెని పొగడాడు.

ఆమె కూడా నవ్వుతూ “Thank you” అని జవాబు చెప్పి “దీనికి పేరే Paris Style!” అని వివరించింది.

“Really? I see . . . ” అని తను సరిగ్గా చెప్పినందుకు సారంగన్ సంతోషించాడు.

“మీరు విదేశాలకి వెళ్ళివున్నారా?”

“లేదు . . . లేదు . . . ” అంది మాధవి.

అప్పుడు లలిత జోక్యం చేసుకొని మాటాడింది:

“ఈ modern ప్రపంచంలో మనుషులు వెళ్ళకపోతేనేం? విదేశీయ ఆలోచనలు, నాగరికత, మంచిదీ, చెడ్డదీ - అవన్నీ మన దగ్గరికి వస్తూనేవున్నాయి.”

పెదవులమీద ఎడమ చేతి బొటనవేలుని నొక్కుతూ తక్కిన వేళ్ళతో గడ్డంని పట్టుకొని లలిత మాటలు వింటున్న సారంగన్ ఆమెని ఎగతాళి చేసే ధోరణిలో వచ్చిన నవ్వుని ఆపుకున్నాడు.

“అలాగైతే ఆ విదేశీయ గుణాలూ, వాటి విశేష ప్రభావం నాకు మీలో కనిపించడంలేదే?”

ఆ రోజు విమానాశ్రయం రెస్టారెంట్ లో సంభాషణలో తన భర్త మేం “మీ admirers!” అని చెప్పినప్పుడు సారంగన్ కంగారుపడడం లలిత ఇప్పుడు గుర్తుచేసుకుంది. అలాగే ఇప్పుడుకూడా అతను తొందరపడుతున్నాడని ఊహించి నవ్వుతూ అడిగింది:

“బయటికి కనిపించే ప్రభావం గురించి మీరు అడుగుతున్నారా? ‘Modernity’ అని అన్నప్పుడు అవి మన మనస్సులో ఏర్పడే మార్పులేకదా?”

సారంగన్ తన చూపుని మాధవిమీద మళ్ళించాడు. పకపకమని నవ్వాడు. నవ్వుతూనే గభీమని అడిగాడు:

“అంటే . . . మీ friend లో కనిపించే ‘modernity’ బయటకి కనిపించే స్వరూపం మాత్రమే - మరేంకాదు - అంటున్నారా?”

“Please . . . దయచేసి మా ఇద్దరిమధ్య కలహం అంటగట్టకండి . . . Miss మాధవి బయటకి ఎలా కనిపిస్తోందో, అందుకు విరుద్ధంగా ఆమె అంతర్గతంలో చాలా మార్పులున్నాయి. ఈ ఆధునిక యుగంలో మా ఇద్దరికీ చాలా అభిప్రాయ భేదాలు ఉన్నాయి. అది వేరే సంగతి . . . ” అని లలిత వివరించింది.

తనగురించి సారంగన్ కొంటెతనంగా మాటాడసే కారణం వలన మాధవి మొహం ఎర్రబారిపోయింది. కాని ఆమె అతన్ని అపార్థం చేసుకోలేదు. తన అందం, అలంకారం అతను పొగడినా అతనిలో ఉన్న ఒక మగవాడి దుడుకుతనం గ్రహించి ఆమె ఆహ్లాదించింది.

కొంచెంసేపు వాళ్ళందరూ మౌనం వహించారు.

ఈ నిశ్శబ్దంలో లలిత తను తెచ్చిన పెద్ద సంచెనుంచి కొన్ని పుస్తకాలు బయటకి తీసి, వాటి మెదటి పుటలో ‘ప్రియ మిత్రులు సారంగన్ కి’ అని తమిళంలో సంతకం చేసింది.

ఆ మూడు పుస్తకాల్లో రెండు ఇటీవల ప్రచురింపబడిన ఆమె కథానిక సంకలనలు. ఇంకొకటి ఒక నవల. ఆమె వాటిని అతనికి ఇచ్చినప్పుడు సారంగన్ ఆతురతతో కృతజ్ఞత చెప్పి అందుకున్నాడు.

మొదటి పుస్తకం పేరు తమిళంలో చదివాడు. “Is it right?” అని అడిగాడు.

“Absolutely right! . . . అవాళ మీరు ‘ఇక తమిళంలోనే మాట్లాడతాను’ అని చెప్పారుగా?” అని లలిత నవ్వుతూ అడిగింది.

“అవును. నేనూ try చేస్తున్నాను . . . కాని కష్టంగా ఉంది . . . ఎలాగైనా I shall try . . . ” అని చెప్పి వాడూ నవ్వాడు. తరువాత “సరేలేండి . . . నేను విదేశంలో పెరిగాను . . . కాని మీరందరూ ఎందుకు ఇంగ్లీషులో మాట్లాడుతున్నారు?” అని వాడు అడగ్గానే మాధవి నాలిక కఱచుకొని లలితను చూసింది.

“అదా? మీరు ముప్పై సంవత్సరాలు విదేశంలో జీవించి ఉన్నారు. అలాగే ఇక్కడ విదేశమే రెండు వందల సంవత్సరాలుగా జీవించుతోంది! ఆధునిక ప్రపంచంలోని భావనలు, ఆచరణలు అన్నీ మనదేశంలో ప్రవేశించడానికి ప్రవేశద్వారంగా లండన్ ఉంది. అందువలనే ఈనాటి కొత్త ఆలోచనలు ఆంగ్ల భాషలో లేకపోయినా ఆంగ్ల పరిభాష లేకుండా అవి మనకి కనిపించడం కష్టంగా ఉంది. అందుకే ఇంగ్లీషు బాగా తెలిసినవారు ఆ భాషలోనే మాట్లాడే అగత్యం వచ్చేసింది! . . . ” అని మాధవి సాలోచనంతో వివరించడం విన్న సారంగన్ క్షమాపణ కోరే ధోరణిలో అన్నాడు: “I am sorry . . . I don’t fully understand what you are saying . . . ”

లలిత ఒక చిరునవ్వు నవ్వి మాధవి తమిళంలో చెప్పినది అలాగే ఇంగ్లీషులో తర్జుమా చేసి చెప్పింది; సారంగన్ అది శ్రద్ధగా విని ఆలోచనలో పడ్డాడు.

“Yes, she may be correct . . . నిజంగానే ఇదొక పెద్ద ప్రశ్న” అని అన్నాడు.

“లేదు. ఇదేం ప్రశ్న కాదు - మనకి ఎది ప్రాధాన్యం అని మనం ఎంచుకుంటే ఇదేం ప్రశ్న కాదు” అని మాధవి నొక్కి చెప్పింది.

“భాషకి ముఖ్యత్వం ఇవ్వాలికదా?” అని శాంతంగా లలిత జోక్యం చేసుకుంది.

మళ్ళీ వాళ్ళమధ్య నిశ్శబ్దం చోటుచేసుకుంది.

లలిత మాధవికి చెప్పింది: “నువ్వు చాలా అదృష్వంతురాలువి. నువ్వు పుట్టి పెరిగినది బొంబాయిలో. చదువుకున్నదేమో convent లో. మీది చాలా sophisticated family. అందువలన నీకిది ప్రశ్న కానే కాదు. కాని తమిళులందరూ బొంబాయిలో పుట్టి convent లో చదివినవారు కాదే?”

“మనం దీనిగురించి తరువాత వాదించుదాం. ఇప్పుడు నువ్వు మిస్టర్ సారంగన్ని భేటీ చెయ్యడానికి వచ్చివున్నావ్ . . . ” అని మాధవి నవ్వుతూ తనకి వచ్చిన తర్కంనుంచి తప్పించుకుంది.

సారంగన్ ఇద్దరినీ మార్చి మార్చి చూసాడు. సోఫాలో స్థిరంగా కూర్చోకుండా ఇలాగా అలాగా కొంచెం కదిలాడు; నుదుటమీద మీద దొర్లుతున్న కేశంని సెట్టి కూర్చున్నాడు.

లలిత మాధవికి చెప్పిన జవాబు తనకి తగినట్టుగా మార్చుకొని సారంగన్ ఆలోచించాడు. కాని ఆమెలాగ ‘నాకు ఇదొక ప్రశ్న కాదు అనే భావన లేదు’ అని అతనికి శాంతి కలిగింది. కాని అందులోనూ పూర్తిగా తృప్తి లేకపోయింది.

ఐదు గంటలైపోయింది. గోడమీదున్న ఆ గడియారం చూసి లలిత, మాధవి బాగా ఆనందించారు.

సారంగన్ సోఫానుంచి లేచి “Excuse me” అని అంటూ లోపలికి వెళ్ళి కన్నియప్పన్ని పిలిచాడు. కన్నియప్పన్ Fridge తీసి మద్యం బుడ్డి తీసాడు. మూధవిని, లలితని మద్యం తాగమని సారంగన్ వేడుకున్నాడు. లలిత అందుకు నిరాకరించి క్షమాపణ కోరుకుంది. కాని మాధవి తనలాగ నిరాకరించక అతనితో కలిసి మద్యం తాగడానికి ఏకీభవించడం చూసి లలిత మనసు మళ్ళీ సణుగ్గుంది.

కన్నియప్పన్ ఒక పళ్ళెంలో తెచ్చిన మూడు గాజు గ్లాసుల్లో “ఎది షర్బత్తు?” అని అడిగి తెలుసుకొని దాన్ని అందుకొని ఒక మింగుడు తాగి లలిత దాన్ని చిన్న మేజామీద పెట్టింది. తరువాత నుంచి ఒక డైరీ, కలం తీసి “ఇక మన భేటీ ఆరంభిద్దామా?” అని అడిగింది.

ఆమె ఏమిటి అడగబోతుందని ఆతురతతో సారంగన్, మాధవి ఆమెని చూసారు.

“ముందు వ్యక్తిగతంగా మీరు మీగురించి కొన్ని వివరాలు చెప్పాలి” అని అంటూ అతని జవాబు ఎదురుచూడకుండా లలిత అడిగింది:

“మీరు ఏ సంవత్సరం విదేశంకి వెళ్ళారు? వెళ్ళినప్పుడు మీ లక్ష్యం ఏమిటి? ఆ లక్ష్యం ఎంతవరకు పూర్తి అయింది? దాని గురించి, మీ కుటుంబం నేపథ్యం గురించి మాకు కొంచెం వివరించండి.”

ఆమె ప్రశ్న అడిగి ముగించగానే ఇంతవరకూ లలితని చూస్తున్న మాధవి ఇప్పుడు సారంగన్ని చూసింది. అతని జవాబుని ఆతురతతో ఎదురుచూస్తూ లలిత షర్బత్తుని రుచిచూసింది.

చేతిలోని గాజు గ్లాసుని పక్కనేవున్న teapoy మీద పెట్టి సారంగన్ రెండుచేతులతో ఒకసారి మొహం తుడుచుకున్నాడు. కొంచెంసేపు కళ్ళు మూసుకున్నాడు. కనుబొమలు తోముకున్నాడు. తరువాత ఒక సిగరెట్టు వెలిగించుకొని “I am sorry” అని అంటూ సిగరెట్టు పేకెట్టుని తెరిచి వాళ్ళకి చూపాడు.

“No, thanks” అని లలిత నిరాకరించింది.

కాని మాధవి తన వేళ్ళతో ఒక సిగరెట్టు తీసుకుంది. అతను లేచి వచ్చి ఆమెని చేరి సిగరెట్టు వెలిగించడానికి సాయం చేసాడు.

మాధవి “Thanks” అని కృతజ్ఞత చెప్పినది లలిత చెవులకి వినిపించడానికి ముందే సారంగన్ లలితకి కచ్చితంగా జవాబు చెప్పే ఆలోచనలో మునిగివున్నాడు. మళ్ళీ తన సోఫాకి తిరిగివచ్చి లలితని తేరిపారి చూసి చెప్పాడు:

“మీకు తెలుసనుకుంటాను. మాది తరతరాలుగా ఒక సంగీత కుటుంబం. ఆ రోజుల్లో సంగీతంని పోషించిన మహారాజుల ఉదారత వలనే మా వంశం జీవించింది. దానివలన కలిగే లాభనష్టాలు రెండూ మా పూర్వీకులు అనుభవించారు. అందువలన మా పూర్వీకులకి విరుద్ధంగా ఒక స్వతంత్రజీవిగా మా నాన్నగారు ప్రకాశించారు. దేశం, రాజకీయం, విదేశీయ అధికారం అనే భావనలకీ, అతని స్వాతంత్ర్యంకీ ఏ సంబంధమూ లేదు. అందువలన ఆ నాటి స్వాతంత్ర ఉద్యమంతో దీన్ని పోల్చుకోవద్దు. అతని వాలకం పూర్తిగా స్వేఛ్ఛ గురించే. కేవలం స్వార్ధం అనికూడా చెప్పవచ్చు. ఇంకా చెప్పాలంటే ఆ స్వార్ధం పెరగడానికి దోహదం చేసినవి అన్యుల రాజ పరిపాలన, దానివలన లభించిన ఇంగ్లీషు చదువు. అందువలనే physical గా ఆ feudal అధీనతనుంచి అతను విముక్తి కావాలని కోరినా mental గా ఇప్పుడుకూడా ఆ అదుపు అలాగే ఉంది. మా పరంపరలో మొట్టమొదట సమస్థానంకి బయట మా కుటుంబంని settle చేసినవారు మా నాన్నగారే . . .”

సారంగన్ స్పష్టంగా British accent ఇంగ్లీషులో పిల్లలకి ఒక చరిత్ర కథ చెప్పే ధోరణిలో వివరించి చెప్తూ వచ్చాడు. కథని వింటున్నట్టు ఆతురతతో వాళ్ళు విన్నారు.

“నేను పుట్టినది ఆ తరువాతనే. పుట్టినప్పుడు నేనొక British citizen . . . ఇప్పుడుకూడా . . . ” అని అతను చెప్పినది లలిత, మాధవి ఆశ్చర్యంతో బోధపరచుకున్నారు. లలిత తన డైరీలో దాన్ని రాసుకుంది.

“మీరెలాగ permanent British citizen అయ్యారు?” అని మాధవి జోక్యం చేసుకొని అడిగింది.

“I will tell you” అని నవ్వుతూ సారంగన్ ఆమెకి చెప్పాడు. ఆ తరువాత లలితని చూసి “నేను దేనిగురించి చెప్తూ వచ్చాను?” అని అడిగాడు.

“మీ కుటుంబం సమస్థానంకి బయట settle ఐన తరువాత మీరు పుట్టారని చెప్పారు” అని గుర్తు చేసి, “By the by, in which year?” అన్ జన్మదినం అడిగింది.

“May second, 1925” అని సారంగన్ చెప్పాడు.

“Really? You are forty?” అని మాధవి గొణుక్కుంది. సారంగన్ లెక్క చెయ్యకుండా చెప్పసాగాడు:

“అందువలన సమస్థానంలో జీవించిన రోజుల్లో జరిగిన అనుభవాలు నాకు తెలియవు. అవన్నీ నాకు తెలిసినది మిస్టర్ ముదలియార్ మూలంగానే. అతనే - మిస్టర్ నటేశన్ - అతని కుటుంబంతో నాన్నగారు నన్ను లండన్ కి పంపించారు . . . ” అని చెప్పినప్పుడు అతను తను తండ్రిలాగ ప్రేమించిన ఒకతన్ని గుర్తు చేసుకున్నాడని ఆతని ముఖభావనలో తెలిసింది.

“నాన్నగారు ఇక్కడ Christian College లో చదవడానికి వచ్చినప్పుడు అతనికి ముదలియార్ classmate. వాళ్ళిద్దరూ చాలా గొప్ప మిత్రులు. ఆంధ్రదేశంనుంచి మా పూర్వీకులు ఇక్కడకి వచ్చినప్పుడు మా కుటుంబంకి పరిచయమైన మొదటి వ్యక్తి అతనే అని నా ఉద్దేశం” అని అంటూ సారంగన్ కొంచెం మద్యం రుచిచూసాడు.

“అతను తరచుగా మా నాన్నగారిని విప్లవకారుడనేవారు. అతను ముచ్చటగా నాన్నగారిని Angry Artiste అని పిలిచేవారు. అదే అతనికి తగిన బిరుదు కూడా. మా నాన్నగారు మహారాజుతో - మొదటిసారిగా, ఆఖరిసారిగా - తన సంబంధం

తెంచుకున్న ఘటన గురించి మిస్టర్ ముదలియార్ నాకు చెప్పివున్నారు. నేనుకూడా దాన్ని సూటిగా చూసినట్టు అనుభవించివున్నాను. కొంచెం ఊహించుకొని చూడండి, ఆ రోజుల్లో సమస్థానంలో ఏం జరుగుతోందని . . . సమస్థానంలో ఆ రోజుల్లో రాజు ఉండేవాడు, కాని రాజరికం లేదు . . . వాళ్ళ పంజాలో ఒక మనిషి చిక్కుకున్నాడంటే చాలా కష్టం, అందులోనూ ఒక కళాకారుడు! కాని వాళ్ళే కళని పోషించారు. ఎందుకు? కళాసౌందర్య దృష్టి కారణమా? ఏమో, కాని మా నాన్నగారి అవగాహనలో ఆ రాజులు కళని పోషించడానికి కారణం అభిరుచి కాదు, వాళ్ళమధ్యవున్న పోటాపోటీ! ఆ సమస్థానం లోపలా అవతలా ఉన్న కళాకారులని సమస్థానంకి రమ్మని పిలిచి ఈ సమస్థానంలోని కళాకారులతో ఢీకొట్టించి వాళ్ళని మానభంగం చేసి పంపడానికే ఇక్కడ వీళ్ళు కళని, కళాకారులని పోషించారు. ఈ వైఖరి మల్లయుద్ధంనుంచి వేదాంత ప్రసంగం వరకూ వ్యాపించివుంది. ఏ వృత్తి అయినా సరే, ఇదే సంగతి. ఇందులోని ఆనందం, ఆతురత చూసి అసహ్యపడిన మొదటి కళాకారుడు మా నాన్నగారే!" అని చెప్పి సారంగన్ గర్వంతో లలిత, మాధవిని చూసాడు.

"ఆ రోజుల్లో మైసూరులో ఒక వైణిక ప్రవీణుడు ఉండేవారు. అతనంటే నాన్నగారికి చాలా అభిమానం, అతని విద్యలో చాలా మర్యాద. అతను ఇక్కడకి వచ్చినప్పుడు అతనితో 'సంగీత పోటీకి' మహారాజు మా నాన్నగారికి ఆజ్ఞ ఇచ్చారు. రాజుగారి ఆజ్ఞ నిరాకరించడం ఎలాగ? పాపం, మా నాన్నగారు! రహస్యంగా అతను -మానసికవ్యధ ఎంత అనుభవించారో? ఇంటికి వచ్చి "నేను మహారాజు ఆజ్ఞకి లొంగను!" అని అతను ఘోషించినప్పుడు ఆ కుటుంబం అతనేదో దైవనింద చేసినట్టు స్తంబించిపోవడం అతను చూసారు. ఆఖరికి అందరూ ఆవేశంతో, ఆతురతతో ఎదురుచూసిన ఆ 'సంగీత పోరాటం' కోసం అన్ని ఏర్పాట్లు నెరవేర్చడమైంది. సభలో రాజఠీవితో అహంకారం న్యాయాధిపతిగా ఏలుతోంది; రంగంలో ఇద్దరు వైణిక విద్వాంసులు కాళ్ళకి కత్తులు కట్టిన కోడిపుంజులలాగ నిలబడివున్నారు. ముందు ఆ మైసూరు నిపుణుడు తన కళా సమర్ధతని చూపారు. 'ఇక మన విద్వాంసుడు దీనికి మించి ఏం చేస్తాడో?' అనే భయం రాజుగారి పక్షంని ఆవరించుకొనివుంది; జనులూ అలాగే ఉన్నారు. ఈ పరిస్థితిలో తన

ఆసనంనుంచి లేచి వెళ్ళి ఆ కళాకారుని కౌగిలించుకున్న ఆస్థాన విద్వాంసుడుని చూసిన తరువాత అక్కడ ఏమైందో మీరు ఊహించగలరా? Oh, how brave he was!"

'చాలా ఆస్తికుడు, సంప్రదాయ పాక్షికుఁడు' అని తనూ తన భర్త నిర్ణించిన శేషయ్యని గురించి సారంగన్ చెప్పిన ఈ సత్యం విని లలిత మనసులో ఆశ్చర్యపడింది. కథ వినే ఆతురతతో మాధవి గాజు గ్లాసులని రెండు చేతుల్లో తీసుకొని మోజెయిలు తొడలమీద ఆనుకొని ముందుకు వొంగి కూర్చోంది.

"Then, what happened?"

"అంతకు మించి అతను తన ప్రవర్తనకి కారణం చెప్పారే, అదే ఒక గొప్ప సాహసం అనాలి! అతను అన్నారట: 'మహారాజా, నన్ను క్షమించండి. పవిత్రమైన ఒక నాదంని అలవరించే ఒక సంగీత ఉపాసకుని నమస్కరించడం ఒక నేరమంటే మహారాజా, ఈ సభ నన్ను క్షమించనీ. నాదప్రహ్మం ముందు, మానవుడి అల్పాలోపాలు మరచిపోయి, 'దేవుని ముందు అందరూ సమం' అనే భావన ఈ సభలో నేరం అని నిర్ణయించబడితే మహారాజు నన్ను క్షమించాలని నా ప్రార్ధన!' అని అతని మాటలు ముదలియార్ నాకు చెప్పినప్పుడు, కత్తులు దూసి కోపంతో నిలబడిన ఆ రోమ్ నగర పౌరులముందు నిలబడి వాళ్ళని గెలిచిన మార్క్ ఏంటొనీ నాకు జ్ఞాపకం వచ్చాడు . . . "

సారంగన్ ఆవేశంతో మాటాడుతున్నప్పుడు కన్నియప్పన్ హాలుకి వచ్చి వాళ్ళు ఖాళీ చేసిన గాజు గ్లాసులని తీసుకొని వేరే రెండు మద్యం నింపిన గ్లాసులు తీసుకొనివచ్చి, ఒకటి మాధవి దగ్గర, ఇంకొకటి సారంగన్ దగ్గర పెట్టాడు.

"ఆఖరికి ఆ సంగీత పోటీలో ఏకీభవించకపోవడం వలన మా నాన్నగారికే విజయం కలిగింది. కాని దాన్ని ఎదురు చూసినవారికి నిరాశే కలిగింది. అందుకు మా నాన్నగారి బలహీనతే కారణం అని వాళ్ళు వాదించడం చూసి నాన్నగారు చిఱచిఱలాడారు. 'సంగీతం ఈశ్వరార్పణం, ఇక నేను ఎవరికోసమూ వీణ వాయించను!' అని శపధం చేసి నలభై సంవత్సరాలముందే వీణని పూజాగదిలో ఖైదీగా పెట్టేసారు . . .

"ఆ తరువాత ముదలియార్ తో కలిసి వ్యాపారంకని అతను మద్రాసు వచ్చారు. వాళ్ళ ఎగుమతి వ్యాపారం ఉత్కృష్టదశలో ఉన్నప్పుడు నేను పుట్టాను. వ్యాపారంకోసం ముదలియార్ కుటుంబం లండన్ కి వలస వెళ్ళి అక్కడ స్థిరపడ్డారు. పుట్టగానే తల్లిని

కోల్పోయిన నన్ను ఆ ముదలియార్, అతను భార్య గారాబంతో, తమ పిల్లలలో ఒకడుగా పెంచారు. ఇక్కడ ఉన్నప్పుడు నేను వాళ్ళ కుటుంబంతోనే పెరిగాను. అందుకే వాళ్ళతో నేనూ లండన్ కి వెళ్ళాను. ఆ తరువాత రెండవ మహాయుద్ధం ఆరంభమైంది. 1943లో, నా పద్దెనిమిదవ వయస్సులో నేను British Army లో చేరాను. యుద్ధం ముగించి నేను తిరిగివచ్చినప్పుడు మిస్టర్ ముదలియార్ లేరు. అతను నా పేరులో అతని బ్యాంకులో డబ్బు వేసి నాకది చేరాలని రాసిపెట్టారు. అతని తరువాత నాకు అతని కుటుంబం ఎవరో అన్యుల కుటుంబంలాగ కనిపించింది. ఎవరితోనూ నాకు ఏకీభావం లేకుండాపోయింది. నేను ఏకాంతంగా జీవించాను. ఎందుకో, అప్పుడుకూడా నాకు ఇందియాకి వచ్చేయాలని అనిపించలేదు. అప్పుడు ఇంగ్లాడులాగ ఇందియాకూడా ఒక British రాజ్యం . . .

"లండన్ లో మేమున్న చిన్న ఇంటిలో మేడమీద ఒక violinist ఉండేవారు. బాల్యంలో నాకున్న గోళ్ళు కొఱికే అలవాటు చూసి ఆవిడే నాకు వయలిన్ నేర్పించమని ముదలియార్ కి చెప్పారు. మా పూజాగదిలో ఉన్న నాన్నగారి వీణ నాదం విని నాకు సంగీతంలో ఆసక్తి వచ్చేసింది. నేను బాగా పాడేవాడిని. Mrs. Manuel, ఆ violinist నన్ను పిలిచి మన కీర్తనలు పాడమని చెప్పి వినేవారు. మన రాగాల పేర్లు అడిగి తెలుసుకొని వాటిగురించి ఆతురతతో పరిశోధనలు చేసేవారు . . . ఏ లక్ష్యమూ లేకుండా ఆ రోజుల్లో army నుంచి తిరిగివచ్చిన తరువాత నేను నా సొమ్ముని వేరే ఒక వ్యాపారికి అప్పగించేసి, హాయిగా కాలం గడిపినప్పుడు నేను మళ్ళీ వయలిన్ అభ్యాసంకి పూనుకున్నాను . . .

మీరు అడిగారుగా - అలాగ - వయలిన్ ఆభ్యాసంకని, ఒక గురితో నేను ఇంగ్లాండుకి వెళ్ళలేదు, అటువంటి భావనతో దాన్ని నేర్చుకోలేదు. తరువాత ఎన్నో ఘటనలు . . . నేను దూబరదిండిగా నా డబ్బంతా ఖర్చు చేసేసాను. ఆ తరువాత ఆఖరికి ఒక చిన్న wine shop లో నా కళా వృత్తి ఆరంభమైంది. అప్పుడే ఆఖరిసారిగా నేను ఇందియాకి వచ్చాను . . . " అని అంటూ సారంగన్ కొంచెం ఆగాడు. నానావిధ ఆలోచనలలో లీనమైపోయి, వరుస తప్పి, కొన్ని జ్ఞాపకాల్లో చిక్కుకొని, అతను కొంచెం మద్యం రుచి చూసాడు. గభీమని మొహంలో మార్పు కనిపించింది. తన మౌనంని తనే

గ్రహించి, నవ్వుతూ, “మీ ప్రశ్నకి నేనింకా జవాబు చెప్పలేదు . . . ” అని తనలో గొణుక్కున్నాడు.

“లేదు. మీరు సరిగ్గానే చెప్తున్నారు” అని లలిత అంది.

“అప్పుడు నేను ఒక French యువతి, violinist జీన్ తో పెళ్ళి సంబంధంకి పూనుకున్నాను. దానిగురించి నాన్నగారికి రాసాను. అందువలనే నేను తిరిగి వెళ్ళకూడదని అతను నొక్కిచెప్పారు. అతను నన్ను ద్వేషించడానికి అది మాత్రం కారణం కాదు, కాని అది ఒక ముఖ్య కారణం. జీన్ తో నేను పారీసు వెళ్ళాను. అక్కడ నా జీవితం బాగా జరిగింది. మా గుంపులో అందరూ నన్ను ‘ఉత్తమ violinist’ అని పొగడేవారు. ఐనప్పటికీ పాశ్చాత్య సంగీతం ప్రఖ్యాతి గురించి నాకు తెలిసినది తక్కువే. మన సంగీతంలో లాగ వాద్యకారుడికి పాశ్చాత్య సంగీతంలో నిరంకుశ హక్కులు లేవు. వాడికి ఇవ్వబడిన స్వేఛ్ఛకి ఒక పరిమితి ఉంది. వాళ్ళ సంగీతంలో సాంకేతిక గుర్తులే పూర్తిగా సార్థికంగా, స్వాభావికంగా పొదిగివున్నాయి. అందువలనే అతని స్వతంత్రతని అదుపులో  ఉంచారు.”

“మీరంటున్నది నాక అర్ధం కావడంలేదు. దయచేసి వివరించి చెప్పండి . . . ” అని లలిత జోక్యం చేసుకుంది.

“వాళ్ళ notation ఉందే, అది absolute అని అంటున్నాను! అక్కడ వాద్యకారుడు అనేవాడు వాద్యం వాయించేవాడు, అంతే! అక్కడ సంగీతంని రాసిపెట్టారు; సంగీతంని కల్పనగా సృష్టించి, ఏదో ఒక వాక్యంలో పాడి, రాసిపెట్టారు. అందులో ఏ ఏ భాగాలు - అది ఎంత పెద్దదైనా, ఎంత చిన్నదైనా - ఏ వాద్యంతో వాయించాలని, వేరే వేరేగా, ప్రతీ వాద్యంకని, ప్రత్యేకంగా రాసిపెట్టారు. అలాగ భావం, శ్రేష్ఠత కలిసిన కల్పనాశక్తితో పుట్టిన సంగీతం అక్కడ రాయబడివుంది. అలాగ రాసినవాడిని composer అని పిలుస్తాం. అతనే ప్రథమ సృష్టికర్త! ఆ తరువాత - దానికి రూపం ఇచ్చేవాడు - ఆ సృష్టికర్త కల్పనాదృష్టిని ఆరసించి, బోధపరచుకొని, వాద్యకారులతో కలిసి తనకిష్టం వచ్చినట్టు సృష్టికర్త కల్పనలు అమలు చేసేవాడు - వాడిని conductor అని పిలుస్తాం. వాద్యకారుడయిన నాలాంటి artist కి ఇవ్వబడిన  స్వతంత్రతకి పరిమితి ఉంది. composers ని రాజులతో సరిపోల్చుతే, conductors సేనాధిపతులవుతారు, మేం వట్టి

సైన్యం అన్నమాట! అందువలనే పాశ్చాత్య సంగీతంలో బృంద సంగీతం - orchestral music అనే ప్రక్రియ - అతిశయంగా పెరిగిపోయింది. మన రాగాల్లోని విశేషతలు చూసి అందరూ పొగటుతున్నారన్నది నిజం. అందుకే కాబోలు - ఇక్కడ వాద్యకారులకి ఆధిక్యంగా ఉన్న స్వేఛ్ఛ వలన - సంగీతంని ఎవరూ రాసిపెట్టలేదు! . . . ”

“ఏం, మన త్యాగరాజు, దీక్షితర్ సంగీతం రాసిపెట్టివున్నారే?” అని లలిత అడిగింది.

“నేను దానిగురించి చెప్పలేదు. వాళ్ళు కీర్తనలు రాసి, స్వరపరచి, సంగీతంకి అద్భుతంగా కృషి చేసారు. కాని పాశ్చాత్యులలాగ సంగీత ప్రదర్శనగా ఏదీ రాసిపెట్టలేదు. మన సంగీతం ఒక రాగంలోని సూక్ష్మభేదాలని ఒక గాయకుడు లేక వాద్యకారుడు తెలియజేయడంలో ఉంది. పాశ్చాత్య సంగీతంలో scales మూలంగా మాధుర్యం, సమతాళం, శ్రుతి - ఇవన్నీ - బట్టలు అల్లినట్టు ప్రదర్శించడం మనం చూస్తాం.”

సారంగన్ చెప్పేది బాగా అర్థం చేసుకోవాలని లలిత శ్రద్ధతో వింటోంది; అతను చెప్పాడు:

“మీరే చెప్పండి. మన కర్ణాటక సంగీతంలో ‘సాహిత్యం లేకుండా సంగీతమే లేదు!’ అనే పరిస్థితి వచ్చేసింది, అవునా? ఇక్కడ చెవులకి ఇంపుగా వాద్యకారులు వాయించుతున్నారు, కాని వాళ్ళు చాలామట్టుకు ఒక రాగంలో ఆలాపన చేసి, అదే రాగంలో ఒక కీర్తన స్వరాలని ఆ వాద్యంలో వాయించుతారు. అందువలన ఇప్పుడు కల్పనాశక్తికంటే, కళ కంటే, లెక్క పెట్టడమే ముఖ్యమైపోయింది! ఆవేశపూరిత సంగీతం పోయింది! దీనికి కారణం మన సంగీతంకి ఆధారమైన సిద్ధాంతమే అని నా ఉద్దేశం. ఈశ్వరుని అనుగ్రహం పొందడమే సంగీతం ఫలితం అని అంటే అందులో రౌద్రం, శృంగారం, మానవ జీవితంలోని విశిష్ఠగుణాలు - వీటిని తెలియపరచడం ఎలాగ? వీటిని తొలగిస్తే కళలో మిగిలేది ఏముంది?భక్తి, మంత్రాలు వల్లించం అన్నమాట! సంగీతంలోనూ భక్తికి వాటా ఉంది. అక్కడకూడా church music అని ఉంది, కాని music అంటే అది మాత్రమే కాదు . . . ఇంకొక సంగతి . . . సరే, దానిగురించి తరువాత చెప్తాను . . . అందువలనే భాషతోబాటు, సాహిత్యమూ కలిసి పెరిగిన కర్ణాటక సంగీతం నిశ్చలంగా నిలిచిపోయిందని నాకనిపిస్తుంది. ‘ఈ నాటి సంగీతం -

contemporary music' - అని మనకొక సంగీత ప్రక్రియ ఎందుకు లేదు? ఎక్కడో పారీసు నగరంలో wine shop లో violinistగా ఒక బృందంతో పని చేస్తూ, నా కుటుంబం ఒక కులధర్మంగా పోషించివచ్చిన ఆ కర్ణాటక సంగీతం గురించి నేను చాలా గూఢంగా, బెంగతో ఆలోచించేవాడిని."

మూడవసారి కన్నియప్పన్ మద్యం నిండిన గ్లాసులతో పచ్చినప్పుడు మాధవి వాడి దగ్గర "ఇక నాకు వద్దు!" అని చెప్పి తాగడం మానుకుంది.

"With your permission . . . " అని ఆమెకి చెప్పి సారంగన్ ఆ గాజు గ్లాసుని తన చెయితో తీసుకున్నాడు.

చీకటి వచ్చేసిందని గమనించి కన్నియప్పన్ హాలు దీపం వెలిగించాడు.

"అంటే . . . మీ ఆ French wife ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?" అని మాధవి అడిగింది.

"ఇప్పుడు ఆమె నా భార్య కాదు. 1959 లో మేం divorce చేసుకున్నాం" అని ఆ సంగతిని సారంగన్ చాలా సాధారణ ధోరణిలో చెప్పాడు.

"సరే, మీరు ఇందియాకి తిరిగి రావడానికీ, కర్ణాటక సంగీతం గురించి మీ ఊహలకీ, ఏమైనా సంబంధం ఉందా?" అని లలిత అడిగింది.

"దాని గురించి నేనింకా ఆలోచిస్తున్నాను . . . నా ఆశ: 'ఆవేశపూరితమైన సంగీత ఆచరణలు ఇందియా చెవులకి సముచితంగా సృష్టించాలి'; అటువంటి కోరిక నాకు ఉంది.  అందుకు నేను మన కర్ణాటక సంగీతం, మన దేశ జీవితం అభ్యసించడం చాలా ముఖ్యం. వాయించని వాద్యాలు ఎన్నో మన గ్రామస్తుల దగ్గర ఉన్నాయి. అలాగే పాటలూ, సంగీత సంప్రదాయాలున్నాయి. మన సంగీతంలోని ఆరోహణ, అవరోహణ పద్ధతులు చాలా శ్రేష్ఠమైనవి. మన ఆ నియమంని ప్రపంచం మనదగ్గర నేర్చుకుంది. అలాగే అభివృద్ధి తగ్గి నిల్చిపోయిన ఈ నాటి సంగీతంలో రాగాలని, రాగిణులని స్వరమాధుర్యంతో సవరించుకొని ఒక మంచి బృంద సంగీతం కల్పించడం సాధ్యం అని నా నమ్మకం. అదే మనకిప్పుడు కావలసినది. దానిగురించి ఏ ప్రజ్ఞా లేకుండా ఎలాగో అనియత మార్గాల్లో ఆ అగత్యంని పూర్తిచేసుకొనే ప్రయత్నాలు నేను సమకాలీవ సినిమా పాటల సంగీతంద్వారా గ్రహించాను."

“ఈ భేటీ వ్యాసంలో మీరొక French స్త్రీని పెళ్ళిచేసుకొని, తరువాత divorce చేసుకున్నారన్న సంగతి ప్రచురించవద్దని కోరుతున్నారా?” అని అడిగింది లలిత.

“ఎందుకు?” అని సారంగన్ కనుబొమలు ఎత్తి చూసాడు.

“మీ నాన్నగారికి తెలీదేమో?”

“ఓ, అతనికి తెలుసనుకుంటాను. ఒక వేళ అతను నా ఉత్తరాలు చదవకుండా చింపి పారేసివుంటే తెలిసివుండదు . . . ఏమైనా సరే, ఇప్పుడు తెలుసుకున్నా సరే . . . అదొక పాత సంగతి, అవునా?”

“మీరు ఇండియా పౌరుడుగా మారాలనే ఉద్దేశంతో వచ్చారుకదూ?”

“అవును. కాని ఒక సంవత్సరంకి విదేశీయ పౌరుడుగా ఇండియాలో మెలగడానికి అనుమతితో వచ్చాను. కావాలంటే తరువాత మార్చుకోవచ్చు . . . నేనొకసారి వెళ్ళి రావాలి.”

“London or Paris?” అని మాధవి ఆతురతతో ఆడిగింది.

“Both cities . . .నా దృష్టిలో ఆ రెండూ అన్య దేశాలు కావు. ఇక్కడే నేనొక విదేశీయ పౌరుడుగా జీవిస్తున్నాను . . . అది నాకు చాలా బాధగా ఉంది.”

వాళ్ళు మళ్ళీ మౌనం వహించారు. లలిత తను డైరీలో రాసుకున్నవి ఇంకొకసారి చదివి చూసుకుంది. గభీమని ఏదో గుర్తుచేసుకున్నట్టు అతన్ని అడిగింది.

“మీరు ఆ రోజు విమానాశ్రయంలో ‘సంగీతం ఒక ప్రాంతీయ భాష కాదు, అదొక ప్రపంచ భాష!’ అని అన్నారు. అలాగ ఒక ప్రపంచ భాష సాధ్యం అని మీరు నమ్ముతున్నారా?”

“A world music . . . ” అని సారంగన్ పెదిమలు సణుగ్గున్నాయి. అతను లలిత మొహంని తేరిపాటి చూసాడు. తరువాత ఒక చిరునవ్వు నవ్వి మాటాడాడు:

“ఏ సంగీతమైనా సరే, అది ప్రపంచ భాషే. మన కర్ణాటక సంగీతంని మనం ప్రపంచంలోని జనులందరికీ అనుగుణంగా మార్చుతే చాలు. అది సాధ్యం కూడా. పాశ్చాత్య సంగీతం అ పని పద్దెనిమిదో శతాబ్దంలోనే చేసేసింది . . .”

“జెర్మన్ సంగీతం ఇటాలియ సంగీతంలోని అంశాలని అనుసరించడం; జెర్మన్ వాద్యకారుల సాంకేతిక ప్రక్రియలు ఇటాలియన్ కళాకారులు వాడడం; లండన్, పారీసు

నగరాల్లో వాటికున్న గొప్ప ప్రజాదరణ; రష్యా విద్వాంసుడుని అమెరికాలో ప్రజలు శ్లాఘించడం; ఆఫ్రికా దేశంలో పుట్టిన కళాకారులు దక్షిణ అమెరికాలో కీర్తి పొందడం, అందువలన సూటిగా ఏర్పడిన ఎగుమతులు; మన దేశం సినిమాల్లో అది రహస్యంగా చొరబడడం . . . పద్దెనిమిదో శతాబ్దంలోనే 'World Music' అనే యోగ్యతకి తగినట్టుగా Bach, Schubert, Beethoven, Mozart, ఆ తరువాత Tchaikovsky, పాశ్చాత్య సంగీతంని పైకెత్తారు. ఆ శతాబ్దమే ప్రపంచంలో - ముఖ్యంగా ఐరోపా ఖండంలో - అన్ని విధాలా ఒక సువర్ణ యుగం! ఆ శతాబ్దం అన్ని విషయాల్లోనూ ఒక World Perspective' సృష్టించింది . . . పద్దెనిమిదో శతాబ్దం! . . . అదొక Cosmopolitan Age!"

- ఇప్పుడు అతని మాటలు పూర్తిగా లలిత తన డైరీలో రాసుకుంది.

"నేను 'సంగీతం ఒక ప్రపంచ భాష' అని చెప్పినది మీరు చులకనగా తీసుకోనద్దు. నాదగ్గర ఒక పెద్ద లోపం; అది నిత్యమూ నా అవగాహనలో ఉంది. నేను ఎది తలపోసినా, అలాగే మాటాడడం నాకు అలవాటైపోయింది. నా ఆలోచనలన్నీ ఇతరులకి బోధపరచాలనే శ్రద్ధ లేకుండా నేను కొన్నిసార్లు మాటాడడం జరుగుతోంది. అందువలన ఒకరిని ఒప్పించడానికి క్రమంగా వాదించకుండా గభీమని నా నిశ్చయం తెలియజేసినప్పుడు వాళ్ళు నన్ను ఎదిరించడం జరుగుతోంది . . . నాకూ, మా నాన్నగారికి మధ్య అభిప్రాయభేదంకి నా ఈ స్వభావమే కారణం. నేను నా కార్యకలాపాలు ఎటువంటి పీఠిక లేకుండా గభీమని అతనికి చెప్పడం వలన అతను అదిరిపడిపోయారు. ఆ ప్రజ్ఞతోనే నా ప్రవర్తనకి కారణం చూపుతూ అతనికి నేను ఉత్తరాలు రాసాను . . . అలాగే, నేను 'సంగీతం ఒక ప్రపంచ భాష' అని అనగానే నేను వేరేవేరే దేశాల సంగీత సంప్రదాయాలు, సాధనలు, నిరాకరిస్తున్నాను అని అర్థం చేసుకోవద్దు . . . ఇవన్నీ దాటి కళలకి విశ్వజనీన ఏకచిత్తత ఉంది. చెవులద్వారా ప్రవేశించి పురిగొల్పే సంగీతంకి అది చాలా ఉంది. దేశాలలో విభాగాలు, రంగుల్లో భేదాలు ఉన్నా మానవుడి కన్నీరు, నవ్వులలో ఏ వియోగమూ లేదు. అలాగే మానవజాతి దేశ ఎల్లలలో భిన్నమైనా, ఆ భేదాలు ఏ దేశంలో ఎలాగున్నా, World Citizen - విశ్వ పౌరుడు - అనే ఒక ఉదాత్త వ్యక్తిని మనం

ఎలాగ ఎదురు చూస్తున్నామో, ఆమోదించుతామో, అలాగ. ఒక మనిషికి అది సాధ్యమైతే, ఏం, ఒక కళకి అది సాధ్యం కాదా?"

సావధానంగా అతను చెప్పిన మాటలు విని మత్తెక్కినట్టు మాధవి అతని మొహం చూస్తూవుంది. లలిత అతని విశాల హృదయం, బుద్ధి సూక్ష్మత చూసి ఆశ్చర్యపడింది.

"మీరు చక్కగా, సరిగ్గా అన్నీ ఆలోచిస్తున్నారు. కాని ఈ ఘనమైన ఉద్యమం మీరు ఎలా అమలు చేయబోతున్నారని చెప్పగలరా?" అని అతన్ని పొగడుతూ లలిత అడిగింది.

"మీ దగ్గర ఈ భేటీకి నేను మాటాడడం కూడా ఒక విధమైన సేవ అని నా నమ్మకం. ఈ భూమికి స్వాభావికంగా ఎంత సాధ్యమో అంతవరకే ఈ ఉద్యమం సాగడమూ జరుగుతుంది. కాని మహనీయ సంగీత విద్వాంసులు జీవించిన పుణ్యభూమి ఇది! వాళ్ళ మనసుని నొచ్చకుండా వాళ్ళ వివేకంకి అందని ఒక విషయంకి వాళ్ళని సిద్ధపరచడం అంత సులభమైన పని కాదు. కాని ఆదర్శభావనలు ఊరికే ఉండిపోతే ఎలాగ? ముందు నా అభిప్రాయాలు నేను మీలాంటివారుతో వాదించాలి. మీరుకూడా ఈ భేటీ వ్యాసంలో నాగురించి వ్యక్తిగత విషయాలకి ముఖ్యత్వం ఇవ్వకుండా ఆ దృక్పథం, లక్ష్యం గురించి వక్కాణించి రాసారంటే మంచిది."

"తప్పకుండా . . . " అని చెప్పి లలిత తన డైరీ మూసుకుంది.

"I love your new ideas" అని పిచ్చిమాటలాడుతూ మాధవి లేచి సారంగన్ని చేరుకుంది. ఆమె చాటిన చెయిని అందుకొని సారంగన్ "Thank you very much " అని కరచాలనం చేసాడు.

"You are out of control . . . " అని లలిత మాధవికి గుర్తుచెయ్యగానే మాధవి "I am sorry" అని క్షమాపణ కోరుతూ మళ్ళీ వచ్చి సారంగన్ చేతులు పట్టుకుంది.

"వచ్చేవారం మీకు మా మహిళా సమాజంలో ఒక స్వాగతంకి ఏర్పాటు చేసాం. ఆదివారం సాయంకాలం మీరు తప్పకుండా రావాలి!" అని మాధవి వాడిని లాలించి, బతిమాలింది. ఆ ప్రవర్తన చూసి లలిత మొహం చిట్లుకుంది.

“వచ్చేవారం మీకు మా మహిళా సమాజంలో ఒక స్వాగతంకి ఏర్పాటు చేసాం. ఆదివారం సాయంకాలం మీరు తప్పకుండా రావాలి!” అని మాధవి వాడిని లాలించి, బతిమాలింది. ఆ ప్రవర్తన చూసి లలిత మొహం చిట్లుకుంది.

“I accept your invitation with honor” అని అంటూ సారంగన్ ఆమె భుజం తట్టాడు.

## 3

లలిత, మాధవి సారంగన్ని భేటీలో కలుసుకున్న తరువాత లలిత మాత్రం ఈ వారంలో తరచుగా ఏదో నెపంమీద సారంగన్ని చూడడానికి వస్తూనే ఉంది.

రాసిన వ్యాసంని అతనికి చదివి చూపించడానికి; పత్రికలో ప్రచురించడానికి ఫోటో అడగడానికి; మిస్టర్ మేనన్ తో సంప్రదింపుకి తేదీ నిర్ణయించడానికి; ఊరకే ఏదో అనుమానంకి స్పష్టత కావాలని; ఆ మరుదినం సాయంకాలం మహిళా సమాజంలో జరగబోయే కార్యక్రమంకి తనే వచ్చి కారులో అతనితో వెళ్ళడం గురించి - ఇలాగ, ఒంటరిగానూ, మహాలింగంతోనూ, ఆమె వస్తూనేవుంది. అలాగ వచ్చినప్పుడెల్లా లలిత గంటలకొలదీ సారంగన్ తో మాట్లాడింది. లలితకి సారంగన్ లో ఒక లోపం మాత్రం కనిపించింది: అది అతను అమితంగా మద్యం తాగడం, అది చూసి ఆమె తీవ్రంగా చీదరపడింది. ఒక రోజు ఆమె మహాలింగంతో వచ్చినప్పుడు సారంగన్ అతనికీ మద్యం ఇవ్వబోతుంటే అతను నిరాకరించడం చూసి లలితకి మనసులో కొంచెం గర్వం కూడా కలిగింది. ఆ అమితమైన గర్వంతో యథేచ్ఛగా ఆమె చెప్పేసింది:

“ఐరోపాని చూసి మనం అభ్యసించకూడని అలవాటులు కొన్ని ఉన్నాయి. అందులో ఇది ఒకటి . . . ” అని పలికిన తరువాతే తను అలా మాటాడడం పొరబాటు అని ఆమెకి అనిపించింది. కాని సారంగన్ ఆమె మాటలు విని గౌరవంతో ఆమోదించి మాటాడాడు: “You are right . . . మన దేశంలో పెద్దలు కూడా నాగరికం అనే వంకలో Europeans లాగ మద్యం తాగడం, దుస్తులు ధరించడం, ఇంగ్లీషులో మాట్లాడడం అలవాటు చేసుకుంటున్నారు. అందువలన Indians అనే స్వభావం వాళ్ళు పోగొట్టుకుంటున్నారు, అంతకుమించి మరేం లాభం లేదు. మద్యం తాగేవాడు వేరే;

తాగుబోతు వేరే. కాని నేను తాగుబోతుగా మారిపోయానని ఒప్పుకుంటాను. ఒకవేళ ఇందియా వాతావరణం, కొత్త పరిసరాలు నన్ను మార్చు తాయేమో?”

సారంగన్ అలాగ తన్ను ఏదో వ్యాధి పట్టుకున్నట్టు, అది క్రమంగా పెరిగిపోయి తన త్రాగుడుమత్తుకి తను లోలోపల బాధపడుతున్నట్టు, తల వొంచి, చెయిలోని గ్లాసుని తేరిపార చూసాడు. అతని మనసులో ఈ  త్రాగుడుమత్తు వలన గతకాలంలో జరిగిన అనియతాచారాలు గుర్తుకి వచ్చాయి. ఆ మత్తు వలనే తన ఒక వ్యాపారంలో సముచితంగా ఉన్న సొమ్ముని వాపసు తీసుకున్నాడు. ఆ మత్తువలనే ఆ French యువతి జీన్ తో పారీసుకి పరుగెత్తాడు. కాని అతన్ని దిద్దడానికి భార్య జీన్ చేసిన ప్రయత్నాలు, ఆమెను అతను ద్వేషించడానికి ఈ మద్యమే కారణం; ఆఖరికి వాళ్ళ విడాకుకి మూలకారణమూ అదే.

వాడు తలెత్తి లలితని చూసి చిరునవ్వుతో “Thank you very much” అని అన్నాడు.

అతనెందుకు తనకి కృతజ్ఞత చెప్తున్నాడని లలితకి తెలియకపోయినా, అది సహజంగా అతని గుణం అని లలిత ఊహించుకుంది.

ఇంటికి తిరిగివచ్చే దారిలో మహాలింగం దానిగురించి లలితని తప్పుపట్టారు. కాని ఎన్నో అభ్యుదయ అభిప్రాయాలు పాటించే తన భార్య కొన్ని సమయాల్లో తనొక హిందూ స్త్రీ అని రూఢీ చేస్తుందని అతనికి గర్వం కూడా కలిగింది. దారంతా లలిత మాధవి గురించి మహాలింగంతో ఎత్తిపొడుచతూ, ఫిర్యాదు చేస్తూనే ఉంది. ‘ఆ రోజు మాధవి సారంగన్ తో కరచాలనం చెయ్యడం, మద్యం తాగడం, సిగరెట్టు కాల్చడం - ఇవన్నీ ఐరోపానుంచి మనం నేర్చుకున్న చెడ్డ అలవాటులు’ అని సారంగన్ కి చెప్పాలనే తను అలా మాటాడినట్టు లలిత భర్తకి వివరించింది.

‘అసలు మాధవి గురించి చాలామందికి మా సమాజంలో మంచి అభిప్రాయం లేదని నాకు తెలుసు. అందువలనే నాకు ఆమెపై కొంచెం ఎక్కువగానే అభిమానం ఉంది. కాని ఆమె ప్రవర్తనకోసం నేను ఇంత తీవ్రంగా ద్వేషించి మాటాడడం న్యాయం కాదు” అని లలిత మనసులో అంగలార్చుకుంది.

మాధవి పూర్తిగా పాశ్చాత్య పరంపరలో పెరిగిన యువతి అని, నీతిప్రవర్తన గురించి ఆమెకి విరుద్ధ అభిప్రాయాలు ఉన్నాయని, ఆమెలో ఇంకా ఎన్నో లోపాలున్నాయని, లలితకి ఇంతకు ముందే తెలుసు. తను గభీమని అసూయ పడడానికి ఇదేం పెద్ద కారణం కాదని ఆమెకి కొన్నిసార్లు అనిపించింది.

కాని ఆరోజు మాధవిని తనతో సారంగన్ భేటీకి రమ్మని పిలవడం పొరబాటు అని లలిత కొన్నిసార్లు బాధపడింది.

'నాతో వచ్చినా, రాకపోయినా, చివరికి వాళ్ళిద్దరూ తప్పకుండా మహిళా సమాజం కార్యక్రమంకి వచ్చివుంటారుకదా?" అని ఆలోచించింది.

'అదెలా సాధ్యం? మహిళా సమాజం అవతల నాకు మాత్రం సారంగన్ కుటుంబంతో స్నేహం ఉంది. నా ద్వారా పరిచయం లేకపోతే సమాజంలోని తక్కిన సభ్యులులాగ మాధవి ఒంటరిగా సారంగన్ని కలుసుకొని ఉంటుంది. ఆ పరిచయం ఇంత అన్యోన్యంగా మారే అవకాశం లేదే? ఛీ, ఛీ, నేను పెద్ద పొరబాటు చేసేసాను!' అని తన్నే నోచుకుంది. కాని మరు క్షణం 'ఏది ఎలాగున్నా, ఆమెకున్న స్వభావం వలన మాధవి సారంగన్ తో ఇంతమట్టుకు పరిచయం చేసుకొనివుంటుంది' అని గింజుకుంది.

ఎందుకు తనిలా ఈ విషయంలో బాధపడాలి? ఆ ఆలోచన రాగానే ఆమెకి తనమీదే కొంచెం భయంకూడా కలిగింది!

'ఛీ, ఛీ, ఇదేం పిచ్చితనం! సారంగన్ మన కుటుంబంకి కావలసినవారు, మిత్రులు అనే భావన వలనే నాలో ఈ కనికరం చోటుచేసుకుంది. నా మనస్సే నన్ను ఇలా సందేహించకూడదు. ఈ మనస్సు చాలా దుడుకైనది. కొన్ని సమయాల్లో అది యజమానుడిని బెదిరించే కావలివాడుగా ఐపోతుంది! నా మనస్సాక్షి నేను పొరబాటు చెయ్యకూడదని నాకు హెచ్చరిక చేసే విధంగా ఈ ఆలోచన వాలో లేచింది . . . " అని సారంగన్ గురించి తను అధికంగా తలపోయడానికి లలిత న్యాయం కల్పించుకుంది.

ఇవాళ సాయంకాలం . . . ఆమె న్యాయాలన్నీ ఓడిపోయినట్టు తను అంగలార్చుకున్నది గుర్తు చేసుకొని లలిత నొచ్చుకుంది.

మహిళా సమాజంలో సారంగన్ పాల్గొన్న స్వాగతం కార్యక్రమంలో మాధవి అతని కంఠంలో పూలమాల వేసివుండ కూడదు! మాధవి తనకి సారంగన్ తో ఇంతకుముందే మంచి పరిచయం ఉన్నట్టు చాలా అసహ్యంగా ప్రకటన చేసుకుందట!

ఆ కడుపు మంటతో సాయంకాలం జరిగిన అన్ని కార్యక్రమాల్లోనూ లలిత కలుసుకోకుండా ఓరగా నిల్చుంది. ఏదో ఒక సమయం మాధవి వచ్చి ఆమెతో మాటాడినప్పుడు కారణం లేకుండా లలిత పైబడి, అరచింది. మరు క్షణం ఇద్దరూ 'ఇలాగ ఎందుకు జరిగింది?' అని ఆశ్చర్య పడుతున్నట్టు ఒకరినొకరు తేరిపాసి చూసారు. తన అనాగరికమైన ప్రవర్తనకి సిగ్గుపడినట్టు లలిత తల మళ్ళించుకొని, నిష్క్రమించి, నడిచి వెళ్ళి, ఒంటరిగా దానిగురించి బాధ పడింది.

ఈ ఘటన తరువాత లలిత తన్ను తనే దిద్దుబాటు చేసుకోవాలనే బాధ్యత తనకుందని తెలుసుకుంది.

శేషయ్య సారంగన్ని చూడాలని వార్త పంపించారు.

సాయంకాలం ఐదు గంటలకి మేనన్ని చూడడానికి సారంగన్ తో కలిసి వెళ్ళడం గురించి లలిత ముందే చెప్పడం వలన సారంగన్ ఆమెకోసం కాచుకొని ఉన్నాడు. అప్పుడే శేషయ్య దగ్గరనుంచి అతనికి ఈ పిలుపు వచ్చింది.

కన్నియప్పన్ దగ్గర లలిత వస్తే కాచుకొని ఉండమని చెప్పి సారంగన్ వెళ్ళాడు.

కళ్ళు మూసుకొని గూఢంగా ఆలోచిస్తున్న శేషయ్య కళ్ళు తెరవకుండానే సారంగన్ వచ్చి కూర్చున్నాడని గ్రహించారు.

'నా విషయంలో జోరపడితే ఇద్దరికీ చిక్కు' అని సారంగన్ హెచ్చరికగా అన్న మాటలు శేషయ్య గ్రహించాలనే ఉద్దేశంతో మురళి అతనికి ముందే చెప్పివున్నాడు.

ఆ వాక్యంలో కలసిన సందేశం గ్రహించి 'వాడు ఇంకా మారలేదు' అని అతను తెలుసుకున్నారు. కళ్ళు తెరవకుండా పడుకొనివున్నా, తను మెలుకువతో ఉండడం తెలియజేయాలని కంఠం అడుగున ముడుచుకున్న రెండు చేతుల వేళ్ళని మెలితిప్పుతూ అతను లేచారు.

“ఎక్కడికో వెళ్ళడానికి  సిద్ధంగా  ఉన్నట్టు కనిపిస్తున్నావే?” అని తలెత్తి వాడిని చూసారు.

“ఆరుగంటలకే ఆ engagement” అని తన వాచీని చూసి సారంగన్ అన్నాడు. “నాకేం తొందర లేదు.”

“‘నీ విషయంలో జోరపడితే మన ఇద్దరికీ చిక్కు’ అని నువ్వు అన్నది నిజమే కావచ్చు. చిక్కు రాబోతుందని బాధ్యత నెరవేర్చకుండా ఉండగలమా?”  అని వాడికి బోధపడాలని ఇంగ్లీషులోనే అడిగారు శేషయ్య.

అతను తన మాటలతో అలాగ గభీమని తనమీద పైబడతారని సారంగన్ ఎదురుచూడలేదు.

అతను ఇంకా చెప్పారు:

“నువ్వు ఎక్కడో ఉన్నప్పుడు నీగురించి తెలుసుకోవాలని నాకు ఎటువంటి ఆతురతా లేదు. దానిగురించి నాకు బాధగా ఉండేది. సరే, అదెలాగో పోనీ . . . సరియో, తప్పో, అవన్నీ ఇక మనం మరిచిపోవాలి . . . ఇప్పుడు నువ్వు ఇంటికి వచ్చేసినతరువాత నీ సంరక్షణ గురించి నేను ఆలోచించకపోతే నీకది  సరే అని అనిపించినా నేను అలాగ ఉండలేను. విను, నీ స్వతంత్రతకి నేను అడ్డురాను; కాని నీ భవిష్యత్తు గురించి ‘నువ్వు ఏం చెయ్యబోతున్నావ్, నీ పథకం ఏమిటి?’ అని నాకు తెలియవద్దా? అటువంటి ప్రణాళిక లేదంటే నీకు ఏ బాధ్యతా లేదన్నమాట! అలాంటి పరిస్థితిలో నీకు సాయం చెయ్యడం నా బాధ్యత. ఇలాంటి సమయాల్లో నువ్వు నీ ఆప్త మిత్రులని సంప్రదించి మాటాడుతాం, అవునా? ఆ మిత్రుల బోధన, వాళ్లకి నీమీదున్న అభిమానం నీ స్వతంత్రకి హాని చేస్తున్నాయి అని నిందించుతావా? అలా నిందించుతే అది సరేనా? నువ్వు నేను అంత చెడ్డ స్నేహితుడని అని  అంటున్నావా? ఆ మిత్రుల విషయంలో చూపవలసిన నాగరికత ఒక కొడుకు తన తండ్రి విషయంలో చూపాలనే ఆలోచన నీకు లేదా?” అని నాజూకుగా, కటూక్తితో, తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ మాటాడుతూ  అతనితో దీర్ఘ తర్కంకి శేషయ్య సిద్ధమైనట్టు కనిపించారు.

సారంగన్ కోటు జేబుల్లో రెండు చేతులూ గుచ్చుకొని త్వరగా లేచి నిష్క్రమించాలని సిద్ధంగా ఉయ్యాల ఓరలో కూర్చున్నవాడు ఇప్పుడు కాలుమీద కాలు వేసుకొని బాగా కూర్చున్నాడు.

"సైనా . . ." అని అతన్ని పిలిచి ఇంగ్లీషులో మాట్లాడాడు:

"I am sorry . . . నేను ఆ విధంగా అర్థం చేసుకొని మాటాడలేదు. ఒక కళాకారుని మనసు, భావనలు మీకు బాగా తెలుసు. వాడిని చూసి 'నువ్వు వ్యాపారం చెయ్!, ఉద్యోగం చెయ్!' అని సలహా ఇస్తే అది ఎంత రెచ్చగొట్టే విషయం! అలాంటి రోషం వలనే నేను ఏమేమో మాటాడేసాను! అంతే కాదు, ఇతరుల తృప్తికోసం నేను పెళ్ళిచేసుకోగలనా? మిత్రులమధ్య ఉన్న నాగరికమైన సంప్రదాయం గురించి మీరు చెప్పారు . . . మంచిది . . . నా మిత్రులెవరూ నేను ఒక violinist గా ఈ పారీసు నగర మకాంలో ఎంత శ్రమ అనుభవించినా 'నువ్వు వేరే ఉద్యోగం చెయ్!'అని నాకు సలహా ఇవ్వలేదు . . . సైనా, అలాగ ఒక మిత్రుడు కళాకారుడికి సలహా ఇస్తే ఆతన్ని ఆ మిత్రుడు అవమానించాడు అన్నమాట!"

"నాకు తెలుసు, నువ్వు ఏదో అలుక వలనే అలాగ మాటాడాడివుంటావ్ . . . దాన్ని వదిలేయ్ . . . ఆ తరువాత నువ్వు మురళి చెప్పిన సలహా గురించి ఆలోచించావా? నేను నిన్ను నిర్బంధించడం లేదు . . . వాడు ఇంజినీరింగ్ చదివి ఊరకే ఉన్నాడు . . . నువ్వు సంపాదించి నాకు ఆస్తి కూడబెట్టాలనే ఉద్దేశంతో నేనది అనడంలేదు . . . 'నువ్వు నీకే ఉపకారం చెయ్యాలి' అనే ఆలోచనతో చెప్పాను . . . నువ్వు పెళ్ళిచేసుకోవాలని_అన్నప్పుడు నేనేదో ఒక అమ్మాయిని మనసులో పెట్టుకొని మాటాడడం లేదు. నువ్వే చూసి, నువ్వే ఆలోచించి, నీకు నచ్చినట్టు . . . ఒకటి కాదు, నలుగురు అమ్మాయిలని చూసిన తరువాతే నువ్వు పెళ్లిచేసుకోవాలి . . . నీ మనస్సులో ఏముందో నాకు తెలియాలి . . . నువ్వు నా దగ్గరనుంచి చాలా దూరం తొలగిపోయావ్, కాని ఇటువంటి ఏదో ఒక కుటుంబ చుట్టరికంలో నువ్వు పాల్గొంటే మనిద్దరి అన్యోన్యత పెరుగుతుందనే తృప్తి నాకు కలుగుతుంది. రంగయ్య లేని లోపం నువ్వే నెరవేర్చుతావ్! ఒక కళాకారుడి

మనసు నాకు తెలిసినట్టు నీకు ఒక తండ్రి మనసు తెలుసని నేను నమ్ముతున్నాను. సరేనా?"

ముసలాయన చాలా చమత్కారంగా తన్ను పడగొట్టుతున్నారని గ్రహించి, సారంగన్ మనసులో నవ్వుకున్నాడు.

"సైనా . . . " అని తలెత్తిన సారంగన్ అతని ఆలోచనని తను మీరుతున్న ప్రవర్తనకోసం దుఃఖించాడు. కాని సూటిగా చెప్పేసాడు: "నాకు జీవితమే తారుమారుగా ఉంది . . . మీరు చెప్పినట్టు పెళ్ళి చేసుకోవడం, ఉద్యోగం చెయ్యడం - ఇవన్నీ నేను ఊహించలేని విషయాలు. ఇది చాలా చాదస్తంగా కనిపిస్తోంది. మీరు దీనిగురించి ఇక ఆలోచించడం మానుకుంటే మంచిది."

శేషయ్య నిట్టూర్పు వదిలారు. అతనికి కొంచెం కోపమూ వచ్చింది. 'అసలు నువ్వెదుకు వచ్చావ్? పారీసులోనే నీకిష్టం వచ్చినట్టు ఉంటే బాగున్ను!' అని చెప్పాలని అతని నోరూ, మనసూ, చిరచిరలాడాయి.

ఆ సమయంలో సారంగన్ కోసం అక్కడికి వచ్చిన లలిత హాలులో కూర్చున్న శేషయ్యని చూసి నమస్కరించింది.

"రామ్మా, మిస్టర్ మహాలింగం రాలేదా?" అని అనురాగంతో శేషయ్య ఆమెకి స్వాగతం చెప్పారు.

బయలుదేరడానికి సిద్ధంగా - పక్కనేవున్న సోఫాలో - లలిత కూర్చుంది.

శేషయ్య సారంగన్ తో తన సంభాషణ కొనసాగించారు.

"గతకాలంలో నువ్వు నాకు మంచి కొడుకుగా ప్రవర్తించలేదు . . . " అని అతను ఏదో చెప్పబోతుంటే సారంగన్ తడబడుతూ మధ్యలో జోక్యం చేసుకున్నాడు: "అవును, నా దృష్టిలో మీరూ ఒక మంచి తండ్రిగా నడుచుకోలేదు! నేను రాసిన ఉత్తరాలకి జవాబుకూడా రాయలేదు! నా అన్నయ్య గతించిన విషయంకూడా నాకు తెలియపరచాలనే బాధ్యత లేకుండా, చాలా సంవత్సరాల తరువాత మిమ్మల్ని చూడాలని వచ్చిన నన్ను "రా, నాయనా . . . " అని ఒక వాక్యం కూడా రాయని రోషం మించిన తండ్రి కదా మీరు? . . . దయ చేసి తండ్రి - కొడుకు అనే చుట్టరికం గురించి మనం వివాదం చెయ్యవద్దు."

"అప్పుడు నువ్వు నా మాట వినకుండా పరుగెత్తావ్, అవునా? నేనేం ఉపచార వాక్యాలు చెప్పి నువ్వు వెళ్ళలేదు. నువ్వే వెళ్ళావ్, ఇప్పుడు నువ్వే తిరిగివచ్చావ్! నా ప్రవర్తనకి జవాబుదారి ఎవరు, నువ్వే!" అని శేషయ్య కేక విని సారంగన్ కూడా అఱిచేసాడు: "జవాబుదారి గురించి చెప్పాలంటే అది మీరే అని మీరు ఒప్పుకోవాలి. నేనా మిమ్మల్ని నన్ను లండన్ కి పంపమని అడిగాను? అది మీరే చేసారు. నాకిప్పుడు ఏ దేశంతోనూ, కుటుంబంతోనూ సంబంధం లేకుండా పోయింది! స్వతంత్రమైన ఈ భారత దేశంలో నేనింకా బ్రిటిష్ పౌరుడుని . . . I am still a British citizen! అన్నిటికీ మీరే కారణం!"

ఇద్దరూ ఇలాగ ఉన్నత స్థాయిలో పరస్పరం కోపంతో వాదించుకున్న తరువాత, కొంచెం సేపు మౌనం వహించారు.

శేషయ్యతో ఇలాగ మాటాడే ఒక మనిషి ఆ కుటుంబంలో ఉన్నాడని ఇప్పుడే మురళి సూటిగా గమనించాడు.

తల వొంచి కూర్చున్న సారంగన్ "I am sorry . . . " అని మూలుగుతూ లేచాడు. శేషయ్యని చూసి ధృడమైన స్వరంతో చెప్పాడు: "సైనా, నేను ఏ ఉద్యోగమూ చెయ్యలేను. పెళ్ళి గురించి నాకు ఏ ఆలోచనా లేదు. మీ సలహాలు మీరడం గురించి నాకు చాలా బాధగా ఉంది. క్షమించండి" అని చెప్పి బయలుదేరడానికి సిద్ధమైయ్యాడు.

లలిత శేషయ్యని చూసింది. అతను ఒక చిరునవ్వు నవ్వి "మీకు ఆలస్యమా? ఎక్కడికో వెళ్తున్నారు కాబోలు" అని శెలవిచ్చారు.

"మిస్టర్ మేనన్ అని ఒకతను - modern painter - ఇతన్ని కలుసుకోవాలని చెప్పారు . . . " అని వివరించిన తరువాత లలిత శెలవు పుచ్చుకుంది.

సారంగన్, లలిత, బయట కాచుకొనివున్న టాక్సీకి నడిచారు.

శేషయ్య సారంగన్ వీపుని తేరిపాఱి చూస్తూ తనలో గొణుక్కున్నారు: "హూం . . . వీడు మారనేలేదు."

ఉయ్యాల గొలుసుని పట్టుకొని నిల్చున్న మురళికి అతను చెప్పారు: "ఇక నేనేం చెయ్యగలను, చెప్పు! చూసావా, వాడు ఎంత మొండిగా ఉన్నాడో? నీ business plan idea గురించి ఇక మనం చేసేది ఏముంది? మరిచిపోవలసిందే . . ."

మురళి అతన్ని తేరిపాటి చూసాడు. వాడి మనసులో తాతయ్యమీద జాలి కలిగింది.

'ఎక్కడనించో వచ్చిన ఇతను తన కొడుకుకోసం - వాడు భవిష్యత్తులో వ్యాపారం చెయ్యడానికి, అందుకు పెట్టుబడిగా, తగుపాటుగా - డబ్బు ఖర్చు చెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు; ఇంతకీ నా సాయం లేకుండా ఆ కొడుకు కూడా ఏమీ చెయ్యలేడు అని ఇతనికి తెలుసు. కాని ఆ కొడుకు నిరాకరించడం వలన మానుకోవాలని అంటున్నారే . . . ఆ కొడుకు కోసం అతను చూపే శ్రద్ధ నా విషయంలో ఎందుకు చూపించరు?" అని మురళి మనసు అల్లాడింది.

'హూం . . . సారంగన్ అతని కొడుకు. తాతయ్య ఆజ్ఞ మీరడానికి, నెరవేర్చడానికి అతనికి హక్కు ఉంది. నేను ఎవరు? అతని మనవడు, అంతే కదా? మనకున్నది అధికారం లేని చుట్టరికం!' అనే ఆలోచనతోబాటు వాడికి విచారం కలిగింది.

అప్పుడు మురళి తల్లి బాలాంబ అక్కడకి వచ్చింది. తన వాడిన మొహం ఆవిడ చూడకూడదని మురళి గబ గబ మేడెక్కి తన గదికి వెళ్ళాడు.

వాడి మానసిక వ్యధ తెలుసుకొని బాలాంబ వాడిని వెంబడించి మేడమీదకి వెళ్ళింది. మురళి త్వరగా వెళ్ళి తన గది తలుపుని కోపంతో బాది, మూసాడు. పడకలో వాలి, ఏదో పుస్తకం చదువుతున్న లీల గభీమని లేచి -

"ఏమైంది, ఎందుకు మీరు ఇలాగ? . . ." అని కంపించింది.

గది అవతలనుంచి "నాయనా, నాయనా . . . " అని ప్రేమతో పిలిచే బాలాంబ కంఠధ్వని వినిపించింది.

మురళి తన భావనలన్నీ సవరించుకొని తలుపు తెరచాడు. బాలాంబ గదిలోకి వచ్చి వాడిని అడిగింది:

"ఏమైంది? తాతయ్య ఏమిటి చెప్పారు?"

"మరేం లేదు . . . " అని మురళి తల వొంచాడు. "అన్నిటికీ నువ్వే కారణం . . . అతని కొడుకుకొసం అతను ఏమైనా చేస్తారు, మనకెవరున్నారు?" అని వాపోయాడు.

బాలాంబ ఒక నిమిషం మౌనంగా వాడిని చూసి ఆలోచించింది. "నాయనా, ఏం జరిగిందో చెప్పు . . . " అని వాడి చుముకం తాకి బతిమాలింది.

"మరేం లేదు. నేను నిత్యమూ తాతయ్యకి కరణంగా ఉండాలా? నేను నిర్వహించితే ఒక వ్యాపారంకి ఆర్థిక సహాయం చేస్తానని ముందు మాట ఇచ్చారు. అది నమ్మి నేను ఎన్నో ఏర్పాట్లు చేసేసాను. ఇప్పుడేమో సారంగన్ సమ్మతించలేదని అవన్నీ మానుకోవాసని అంటున్నారు . . . " అని ఒక పసివాడులాగ మురళి ఫిర్యాదు చేసాడు.

"సరే, నువ్వేం బాధపడకు. నేను తాతయ్యతో మాటాడతాను. మనమే సర్దుకొని పోవాలి. ఏమమ్మా లీలా, ఏమంటావ్?" అని బాలాంబ ఊరడించింది.

మురళి తల్లిని చూసి చికాకుతో చేతులు ముకుళించి చెప్పాడు "అమ్మా, దయచేసి నువ్వు అతనితో దీని గురించి మాటాడవద్దు. అతన్ని అడగడానికి మనకేం హక్కు ఉంది?"

బాలాంబకి కోపం వచ్చింది.

"ఒరేయ్, నువ్వేమంటున్నావ్? మనకేం హక్కు ఉందా? హూం, అతని కొడుకులకి లేని చుట్టరికం నాకుందిరా . . . " అని ఆమె వక్కాణించి చెప్పుకుంది.

"ఆ చుట్టరికం ఏమిటో నీతోనే ఉండనీ . . . అందులో నాకు ఏ వాటా వద్దు . . . " అని మురళి తనలో గొణుక్కున్నాడు.

'సరే, ఇప్పుడు వాడు కోపంలో ఉన్నాడు, తరువాత మాటాడుకుందాం' అని నిశ్చయించి బాలాంబ అక్కడనుంచి నిష్క్రమించింది.

"అవును మరి, ఏం మహా చుట్టరికం? కమలాంబ, నాగణ్ణా వంటగదిలో పడివున్నట్టు మనం మేడమీద ఉన్నాం, అంతే!" అని మురళి లీలాకి చికాకుతో చెప్పిన మాటలు మేడమెట్లు దిగుతున్న బాలాంబ చెవులకి వినిపించాయి. ఆవిడ కళ్ళు వణికాయి.

టాక్సీలో వెళ్తున్నప్పుడు కోపం, కలవరంతో బాధపడుతున్న సారంగన్ లలితతో ఏమీ మాటాడకుండా ఉండిపోయాడు. అతని ఉద్వేగస్థాయిని తెలుసుకొని లలిత దారిలో అతనితో ఏమీ మాటాడక ఒక రెండు సార్లు అతన్ని చూసింది. ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నప్పుడు సారంగన్ తను స్వకీయమైన మనస్థితిలో ఉన్నట్టు తెలియజేయాలని చిరునవ్వు నవ్వాడు.

“ఇవాళ మీకు మనసు సరిగ్గా లేదంటే మనం మేనన్ని ఇంకొక రోజు కలుసుకుందాం” అని లలిత ఆదరణతో చెప్పింది.

“అదెలాగ? అతను మనకోసం కాచుకొని వుంటారే?”

“లేదు. ఇప్పుడు టైము ఐదున్నరే అయింది. మనం తిన్నగావ ఇంటికి వెళ్తే అతనికి ఫోను చెయ్యగలం.”

“అవును. ఇప్పుడు నాకున్న mood లో అతన్ని కలుసుకోవడం మంచిదికాదు” అని సారంగన్ అనగానే లలిత డ్రైవరుతో కారుని తిరువళ్ళిక్కేనుకి మళ్ళించమని చెప్పింది.

మళ్ళీ ఇద్దరూ మౌనం వహించారు. దాన్ని మార్చాలనే ఉద్దేశంతో సారంగన్ ఒక సిగరెట్టు వెలిగించుకొని, నిట్టూర్పుతో శ్వాస విడిచాడు.  ఆమెని చూసి ఇంగ్లీషులో మాటాడాడు:

“ప్రపంచంలో ఎది మారినా కొందరి మొండితనం మారనేమారదు కాబోలు. ఈ ముసలాయన్ని చూడండి. నేను పుట్టిన రోజుల్లో ఎంత పట్టుదలతో ఉండేవారో, అలాగే ఇప్పుడూ ఉన్నారు! ఇతరుల స్వతంత్రతలో జోక్యం చేసుకోవడం తన బాధ్యత అని అతని ఉద్దేశం! అది ఎంత ముచ్చటగా జరుగుతోందో చూసారా? అతను నన్ను ఏదో వ్యాపారం చెయ్యమంటున్నారు . . . అందుకు వేరే అర్థం ఉంది . . . అతను నన్ను ఒక కళాకారుడుగా గౌరవించనేలేదు, నన్ను అవమానించాలనే ఇటువంటి ఆలోచనలు చెప్తున్నారు. అతని సలహాలో ఉన్న ఏవగింపు - బజారులో మనం వస్తువులు ఎంచినట్టు నాలుగు చోట్లకి వెళ్ళి నా భార్యని నేను ఎంచుకోవాలట . . . What a stupid idea!”

“ఒక తండ్రిగా అతను మీ విషయంలో ఎక్కువగా శ్రద్ధ తీసుకుంటే అందుకు మీరింత తీవ్రంగా విమర్శించకూడదు” ఆమె అన్న మాటలు సారంగన్ నిబ్బరంగా విన్నాడు.

“I am sorry . . . మీకలా అనిపించడం న్యాయం . . . ” అని చెప్పి సారంగన్ కొంచెం సేపు మౌనం వహించాడు. తరువాత గభీమని ఆమెని అడిగాడు:

“మీకు ఎన్ని రోజులుగా మా నాన్నగారితో పరిచయం ఉంది? దానిగురించి నాకు తెలియాలి. మీకెప్పుడు మా కుటుంబంతో స్నేహం ఏర్పడింది?” అని తెలుసుకొనే ఆతురతతో సహజభావంతో సారంగన్ అడిగాడు.

“ఇప్పుడే - ఐదు సంవత్సరాలుగా. మీ అన్నయ్య నరసింహన్, మిస్టర్ మహాలింగం classmates అని విన్నాను. పెళ్ళికి ముందు, అంటే ఐదు సంవత్సరాలకి ముందు మా ఆయన తన తమ్ముడి ఇంటిలోనే ఉండేవారు. అతను శేషయ్య కాలనిలో బస చేసారు. మా పెళ్లి తరువాత మేం కొత్తగా కాపురం ఆరంభించినప్పుడు ఇప్పుడు మేమున్న ఇల్లుని మీ నాన్నగారి దగ్గర కొన్నాం. ఈ స్వల్పకాలంలోనే మీకు మిస్టర్ మహాలింగం గురించి తెలిసివుంటుంది. అతనికి కళ, సాహిత్యంలో సంబద్ధత లేకపోయినా కళాకారులు, బుద్ధిజీవులు, మేధావులుని చూస్తే చాలు, అన్నీ మరిచిపోతారు. మీకు జ్ఞాపకం ఉందా? మీరు వచ్చిన దినం మీకు స్వాగతం చెప్పాలనే ఆతురతలో అతను శనివారంని ఆదివారం అని అనుకున్నారు . . . ”

ఐదు సంవత్సరాలకి ముందే వాళ్ళకి పెళ్ళయిందని వినగానే సారంగన్ కి కొంచెం ఆశ్చర్యం కలిగింది. అటువంటి పెళ్ళులు విదేశాలలో ఉంటాయని అతని ఉద్దేశం. కాని తన ఆశ్చర్యంని బయటకి తెలియజేయకుండా “మీరు సరే అంటే ఇవాళ మిమ్మల్ని నేను భేటీ చేస్తాను” అన్నాడు.

“With pleasure . . . మనం ఇంటికి వెళ్దాం . . . ఏదైనా భోంచేసి కొంచెంసేపు మాటాడుకుందాం” అని సారంగన్ కి చెప్పి లలిత టాక్సీ డ్రైవరుకి తన ఇంటి అడ్రసు ఇచ్చి ఆపమని చెప్పింది.

మహాలింగం ఇంకా ఇంటికి రాలేదు.

ఇప్పుడు అతనికి న్యాయతఃగా సెలవు కాలం. కాని ఆ సాయంకాలం లలితని శేషయ్య ఇంటి గేటుముందు వదిలేసిన తరువాత ఆ రాత్రి ఆమె ఆలస్యంగా ఇంటికి వస్తుందని అతని మనసులో అనుకున్నారేమో?

లలిత ఒక ట్రేలో కాఫీ సెట్ తీసుకొని వచ్చింది. “ఇవాళ మీకు ఇదే నా అతిథి సత్కారం . . . ” అని చిరునవ్వుతో చెప్పింది.

"మీకు నాగురించి బాగా తెలుసు. ఇది నేను మద్యం తాగే సమయం. కాని మీ ఉనికిలో ఇవాళ ఒకసారైనా నేను తాగకుండా సంతోషంగా ఉండడానికి ప్రయతిస్తాను . . . " అని సారంగన్ నవ్వుతూ జవాబు చెప్పాడు.

అతని ఎదుట సోఫాలో కూర్చొని లలిత కప్పులో కాఫీ పోసింది. "మీకలా అనిపించితే వినడానికి నాకు చాలా గర్వంగా ఉంది. మీకు వీలయినప్పుడెల్లా, ఏకాంతం తొలగించడానికి, మద్యం తాగాలనిపిస్తే మీరు మా ఇంటికి వచ్చేయండి."

గభీమని ఏదో గుర్తుచేసుకొని లలిత, అతని దగ్గర క్షమాపణ కోరుతూ లోపలికి వెళ్ళింది.

"నేను మేనన్ కి ఫోను చేసి వస్తాను" అని చెప్పి ఫోను ఉన్న గదికి వెళ్ళింది.

సారంగన్ ఆ ఇంటికి మొట్టమొదట వచ్చాడు కాని ఆ సమయంలో చుట్టుపక్కలు చూడాలనే ఆతరత అతనికి రవంతైనా లేకుండా ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ, తల వొంచి, కాఫీ తాగాడు.

కొన్ని నిమిషాలలో తిరిగి వచ్చిన లలిత అతని ఎదుట కూర్చొని కాఫీ తాగింది. వేడి కాఫీ తాగడం వలన ఆమెకి మొహమంతా చెమట పట్టేసింది. సారంగన్ తన కోటు గుండీలు విప్పుకొని, వదులుగా కూర్చున్నాడు. ఆ రోజంతా air condition గదిలో గడపడం వలన అతనికి ఈ ఉష్ణం కొంచెం ఎక్కువగానే బాధించింది. అది గమనించి లలిత electric fan వాడాలని లేచింది; కాని లేచిన వెంటనే ఆమెకి మరొక ఆలోచన కలిగింది.

"రండి, మనం మేడమీదకి వెళ్దాం, అక్కడ మంచి గాలి వస్తుంది . . . మీ ఇంట్లో ఉన్నట్టు మీరుండాలి" అని లలిత అతనితో మేడమీదకి వెళ్ళింది.

మేడ హాలులో గోడమీదున్న కళాత్మక వస్తువులు అతన్ని బాగా ఆకర్షించాయి. మేడమెట్లు ఎక్కుతున్నప్పుడు గోడలమీదున్న తంజావూరు పట్టికలని నిలబడి చూసి సారంగన్ ఆనందించాడు. హాలు వసారాలో ఒక పెద్ద గాజు ఆవరణలో భారత దేశంకి చేరిన వివిధ రాష్ట్రాల కళాత్మక వస్తువులు కనిపించాయి. తల వొంచి, ప్రతీవస్తువుని శ్రద్ధగా చూసి నోటిమాటిగా సారంగన్ దాన్ని శ్లాఘించాడు. లలిత కూడా అతను పక్కనే

నిలబడి అది ఏ రాష్ట్రంకి చెందినది, దాన్ని తను కొన్నవివరాలు ఒక చిన్న పిల్ల ఆతురతతో అతనికి వివరించింది.

కొంచెంసేపు తరువాత అక్కడ గది మూల ఒక చిన్న మేజాపై ఉన్న ఫోటో ఆల్బంని సారంగన్ తిరగేసాడు. "May I see?" అని ఆమె అనుమతి కోరాడు.

"By all means," అని లలిత అతనికి అది అందించింది.

ఆ తరువాత హాలుకి పక్కనేవున్న పూలతోటలో ప్రవేశించి ఇద్దరూ అక్కడున్న కుర్చీలలో కూర్చున్నారు.

"మీకు శ్రమగా ఉంటే ఇక మీ కోటుని తీసేయండి" అని లలిత చెప్పగానే సారంగన్ ఆమెకి కృతజ్ఞత చెప్పి తన కోటుని తీసి ఆమెకి అందించాడు. ఆమె దాన్ని హాలులోవున్న hanger లో వేలాడజేసి తిరిగివచ్చేసరికి సారంగన్ తన tie కూడా తీసేసి కాలర్ గుండీని విప్పుకున్నాడు.

"ఇక్కడ శాంతంగా ఉందికదూ?" అని అడిగి అతని ఎదుట కూర్చున్న లలిత "మీరు నన్ను ఇవాళ భేటీ చెయ్యబోతున్నారుకదూ?" అని సంభాషణ ఆరంభించింది.

"అవును. మీ జీవితంలో సరసమైన చాలా విషయాలున్నాయి అని నా నమ్మకం" అని ఆతరతతో సారంగన్ తలెత్తి ఆమెను చూస్తూ మళ్ళీ ఆల్బంని తిరగేసాడు.

కొంచెంసేపు ఇద్దరూ మౌనం వహించారు. ఆమె ముఖభావం దృఢంగా మారింది, గతకాలంలోని కటువైన ఘటనలననీ గుర్తుకి వచ్చాయి. గభీమని అతన్ని చూసి భుజాలు దులుపుకొని చిరునవ్వుతో ఆమె చెప్పింది: "ఎక్కడనుంచి ఆరంభించాలని ఆలోచిస్తున్నాను!" అని మళ్ళీ నవ్వింది.

"మీ యౌవనంలోని ఘటనల గురించి . . . లేకపోతే మీ కుటుంబం గురించి నాకు ఏమైనా చెప్పండి . . . మీ వసతికోసం నేనొక ప్రశ్న అడుగుతాను - మీరు పుట్టినది మధ్యతరగతి కుటుంబంలోనా లేక మంచి ధనవంతుల కుటుంబంలోనా?" అని తన గురించి లలిత మాటాడడానికి అనుకూలంగా సారంగన్ అడిగాడు.

లలిత అతని ఎదుట తన గుండెమీద చేతులు కలిపి పెట్టుకొని, తిన్నగా నిలబడి మాట్లాడింది:

“నేను పుట్టినది బ్రాహ్మణ కులంలో. మా నాన్నగారు బడిపంతులుగా పనిచేసారు, అందులోనూ తమిళ పండితులుగా. అది ఏ వర్గంకి చెందినదని మీరే నిశ్చయించాలి. నేనే జ్యేష్ట కొమార్తె. నా తరువాత ముగ్గురు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు ఉండేవారు. నేను హైస్కూల్ చదువు పూర్తి చేసినప్పుడు . . . 1946 లో . . . మా నాన్నగారు కన్ను మూసారు . . . ఆ కుటుంబంని కాపాడవలసిన భారం నా పదహారో వయస్సులో నేను మోసాను. దానిగురించి నేను గర్వపడుతున్నాను. ఆ పెద్ద భారంని ధైర్యకరమైన బలంతో అంగీకరించాను. నాకు పద్దెనిమిది నిండినప్పుడు మా అమ్మకూడా పోయింది. నా ముగ్గురు చెల్లెళ్ళని,ఇద్దరు తమ్ముళ్ళని, నా సొంత కృషితో, ఆదాయంతో నేను పెంచాను. అప్పుడు ఒక private company లో steno గా పని చేసాను. నా ఇరువయ్యో వయస్సులోనే - పద్దెనిమిది నిండిన చెల్లెలుకి - తగిన వరుడు చూసి పెళ్ళి చేసాను. నా ముగ్గురు చెల్లెళ్ళకి పెళ్ళి చేసిన తరువాత, నా తమ్ముళ్ళు ఉద్యోగం చేస్తూ, పెద్ద తమ్ముడు పెళ్ళి చేసుకున్నంతవరకూ నాకు నాపెళ్ళిగుంచి ఏ ఆలోచనా లేదు . . . నేనేం గొప్పగా చెప్పుకోడం లేదు . . . నా తోబుట్టువుల గురించి నా బాధ్యతలు పూర్తి అయిన తరువాతే నాకు నా గురించి బెంగ కలిగింది. ఆ సమయంలో నా తోబుట్టువుని చదువించి, అందరికీ పెళ్ళి చేసి, ఉద్యోగం, కాపురం అని స్థిరపరచిన తరువాత నేను ఏ చుట్టరికం లేకుండా ఒంటరిగా నిలబడిపోయాను. చెల్లెళ్ళు అందరూ తమ తమ భర్తలతో కాపురం అని వెళ్ళిపోయారు. నాతో ఉన్న తమ్ముళ్ళలో ఒకడు పెళ్ళవని అక్కయ్యతో తను మాత్రం పెళ్ళిచేసుకొని జీవించడం అసాధ్యం అనే కారణంతో నన్ను వదలి వెళ్ళిపోయాడు. నా ప్రియమైన ఆఖరి తమ్ముడు . . . వాడే ఒక మంచి ఉద్యోగంలో, మంచి ఆదాయంతో ఉన్నాడు; నేను వాడిని ఒక తమ్ముడుగా పెంచలేదు, ఒక తల్లి తన కొడుకుని పెంచినట్టు పంచాను . . .” అని చెప్తూంటే, ఆమె తన్ను మించి ముఖంలో ఏడ్పుతోబాటు, గట్టిగా కళ్ళు మూసుకొని, పెదవులని కఱచుకుని, పొంగివస్తున్న శోకంని గభిమని మింగింది. ఆమె కళ్ళు తెరిచి సారంగన్ని చూసినప్పుడు ఆమె కళ్ళు ఎర్రబారి నిగనిగలాడాయి. ఆమె మళ్ళీ మాట్లాడాలని ఆరంభించినప్పుడు, గొంతు గరగరమనిపించింది. ఒక సారి దగ్గుకొని “I am sorry . . . ” అని తన్ను సర్దుకుంది.

"ఆ ప్రియ తమ్ముడు . . . " అని దానికి మీరి ఇంకా ఏదో చెప్పలేక లలిత పెనగులాడుతుంటే, ఆమె వాడిగురించి ఏదో దుర్ఘటన చెప్పబోతుందని ఆ క్షణంలో అనుమానించి సారంగన్ కూడా గతించిన తన సహోదరుని గుర్తుచేసుకున్నాడు: "What happened to him?" తడిసిన కళ్ళతో, "He's all right . . . " అని కటువైన నవ్వుతో లలిత కొనసాగింది: "ఆ ప్రియ తమ్ముడికి నా నడతలో అనుమానం కలిగింది. పదే పదే నన్ను ప్రశ్నలు అడగడం ఆరంభించాడు. రోజువారి మా ఇద్దరి మధ్య పోట్లాటలు, ఏడ్పులు సహజమైపోయాయి. అప్పుడుకూడా నాకు వాడిమీద రవంతైనా ద్వేషం రాలేదు. కాని వాడికి నేనంటే పూర్తిగా ద్వేషం వచ్చేసింది. ఒక రాత్రి నన్ను ఇంటినుంచి వెళ్ళగొట్టి, వీధిలో  నా దస్తులు పారేసాడు. తల్లిదండ్రులు లేని వాడు, నా తల్లికంటే నేను గారాబంగా పెంచినవాడు అంత క్రూరంగా నన్ను భ్రష్టం చేసి అనాధగా వీధిలో వదిలేసాడు. ఆ తరువాత అదే కారణం వలన నా తక్కిన చెల్లెళ్ళు, ఇంకొక తమ్ముడు నాతో ఛుట్టరికం వద్దని మానుకున్నారు, I was desperately alone . . . " అని లలిత తనలో గొణుక్కుంది.

తన అంతర్గత భావనలని వడిగట్టి బయట చెప్పడానికి ఆమె చాలా శ్రమ పడింది. 'నా గురించి అన్ని వివరాలు అతనికి చెప్పడం సరేనా?' అని సంకోచంతో బాధపడింది; కొన్ని క్షణాలు అతన్ని తేరిపారి చూసింది.

ఆ చూపులో 'వీడికి ఇవన్నీ తప్పకుండా నేను చెప్పితీరాలా?" అనే స్వాభిమానం చోటుచేసుకుంది. సారంగన్ కూడా ఆమెని సానుభూతి, అనురాగంతో చూస్తున్నాడు. అతని చిన్న కన్నుల దీర్ఘమైన చూపు ఆమె గుండెని దూసుకొనిపోయింది. తనగురించి అన్ని విషయాలు అతనికి చెప్పడంలో ఒక విధమైన సుఖముందని, ఒక అన్యోన్య స్నేహంకి అది అగత్యమని కూడా ఆమెకి తోచింది; యోగ్యతలేని తన తోబుట్టువులకంటే ఈ సారంగన్ తో తనకి పొత్తు ఉన్నట్టు అనిపించింది.

ఆమె తన తమ్ముడు గురించి ఇంకా చెప్పింది:"వాడు నా ప్రవర్తన అనుమానించడానికి న్యాయం ఉంది అని ఒప్పుకుంటాను. కాని అందువలన వాడు ఇంత క్రూరంగా నన్ను ద్వేషించడంలో ఏ న్యాయమూ లేదు. ఆ తరువాతనే నేను ఏకాంతంగా రోజులు గడిపాను. ఆ ఏకాంతంలోని శూన్యత, నిలకడ లేని  జీవితంగా

కొందరితో సాగింది. నియమం, లక్ష్యం లేని అటువంటి జీవితంలో నేను జారిపోయాను, చెడిపోయాను. అంటే నన్నెవరో మొసగించారని కాదు! నేను మొసం పోయే మనిషిని కాదు, నేను ఎవరినీ నమ్మేదాన్ని కాదు! అందువలనే నేను ఎవరినీ ప్రేమించలేకపోయాను. ఎవరిమీదనో ఉన్న పగ తీర్చుకోడానికి - తలుచుకుంటే ఇప్పుడు నాకు నవ్వాలనిపిస్తోంది! - ఆ రోజుల్లో సిగ్గుమాలిన చాలా పనులు నేను చేసివున్నాను! ఇప్పుడు మీతో ఇవన్నీ చెప్పడానికి నాకేం లజ్జ లేదు, అప్పుడూ లేదు. అదొక జీవితం, అంతే! . . .

"ఆ రోజుల్లో నేను రాయడం ఆరంభించాను. మిస్టర్ మహాలింగం ఆఫీసులో steno గా పనిచేసాను. అప్పుడు ఒక సందర్భంలో . . . నా జీవితం నాకు సహింపలేని కటువుగా కనిపించింది. మద్రాసు వదిలేసి మరెక్కడైనా వెళ్ళిపోవాలని ఆలోచించాను. అలాగైతే . . . నా గతకాల జీవితం తెలియని మగవాడు ఎవడైనా నన్ను పెళ్ళిచేసుకుంటాడు, అందువలన నాకొక కొత్త జీవితం దొరికే అవకాశం ఉంది అనే నమ్మకంతో ఒక రోజు మిస్టర్ మహాలింగం మేజామీద నా రాజీనామా ఉత్తరం టైపు చేసి పెట్టి వచ్చేసాను. మరుదినం ఉదయం నేను ఆఫీసుకి బయలుదేరే సమయం మిస్టర్ మహాలింగం నన్ను వెతుక్కుంటూ వచ్చారు. నన్ను అతని కారులో ఆఫీసుకి తీసుకొని వెళ్ళారు . . .

"ఆఫీసుకి వెళ్ళగానే అతను తన సొంత గదికి నన్ను తీసుకొని వెళ్ళి నా గురించి అంతరంగ విషయాలు అడిగారు. ఒక యువతి ఒక సంస్థనుండి గభీమని ఇలాగ రాజీనామా చెయ్యాలంటే అందుకు ఎన్నో కారణాలు ఉంటాయని గ్రహించి అతను నాతో చాలా కనికరంగా ప్రవర్తించారు. "నువ్వు ఇక్కడ ఉద్యోగం చేసినా, చెయ్యకబోయినా, నీలాంటి యువతి ఇలాగ గభీమని మానుకోడానికి కారణాలు నాకు తెలియాలి" అని అన్నారు. నేను నా పరిస్థితి వివరించాను. నా జీవితం నేపథ్యం తెలుసుకున్న తరువాత "ఈ ఉద్యోగమూ గభిమని తోసిపారేసి భవిష్యత్తులో ఏం చెయ్యాలని నీ ఉద్దేశం?" అని అతను అడిగినప్పుడు నాకు నిజంగానే ఏమీ బోధపడలేదు . . .

"కలకత్తాలో నాకున్న ఒక స్నేహితురాలు అడ్రసు నాదగ్గర ఉంది. 'అక్కడకి వెళ్ళి ఆమెతో జీవించాలని నిశ్చయించాను' అని ఆ క్షణంలో తోచిన ఆలోచన అతనికి

తెలియజేసాను. "అది పొరబాటు" అని అతను నాకు అడ్డు చెప్పారు. "మీకిక్కడ ఉద్యోగం చెయ్యడానికి ఇష్టం లేదంటే సరే, కాని మీకున్న ఒకే స్నేహితురాలుని నువ్వు కోల్పోవుతావ్! అవును, అదే జరుగుతుంది!" అని అతను వక్కాణించారు. "నువ్వు నిజంగానే కలకత్తాకి లేక వేరే నగరంకి వెళ్ళాలని నిర్ణయిస్తే నేను నీకు సాయం చేస్తాను. ఈ ఆఫీసులో . . . నీకిష్టం లేని పరిసారాల్లో నువ్వు బాధపడవద్దు . . . కలకత్తాలోనే నీకొక ఉద్యోగంకి ఏర్పాటు చేస్తాను, ఆ తరువాతే నీ రాజీనామా అంగీకరించాలని నేను ఆలోచిస్తున్నాను . . . " అని అతను నా విషయంలో గారాబం చూపి నా పరిస్థితిని పరిశీలించినప్పుడు ఆ సమయంలో నాకు సహింపలేని దుఃఖం వచ్చేసింది.

"నేను అతని సముఖంలో వెక్కి వెక్కి ఏడ్చాను. 'ఈ ఉద్యోగం, పరిసరాలు నాకు తృప్తిగా లేవని నేను బాధపడడంలేదు. రోజువారీ నేనిక్కడ ఆరు, ఎనిమిది గంటలే గడుపుతున్నాను. మిగిలిన సమయమంతా అసహ్యమైన వేరే పరిసరాల్లో గడుపుతున్నాను" అని నేను అతనికి చెప్పినప్పుడు అతను కొంచెంసేపు మౌనం వహించారు. అతను తరచుగా నాతో 'నువ్వు నీ జీవితం స్థిరపరచుకోవాలి' అనేవారు. అది నాకు సాధ్యం కాదని అతనికి చాలా రోజులవరకూ బోధపడలేదు. కాని ఒక రోజు అతనే నా జీవితంని స్థిరపరచాలని నిశ్చయించారు కాబోలు! ఒకరోజు, గభీమని నా చెయి పట్టుకొని ఖరారుగా అడిగారు: 'నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా?' అని . . . అతని ప్రవర్తన చూసి నేను అదిరిపడలేదు. ఇంకా చెప్పాలంటే అది నేను ఎదురుచూసాను, ఏం, నేనే అతన్ని పురిగొల్పాను అనికూడా చెప్పవచ్చు . . " అని ఎక్కడో చూస్తూ, ఏదో పాత జ్ఞాపకంలో మునిగి తేలుతూ లలిత నవ్వింది; ఆమె బుగ్గలు వొణికాయి.

"నాకు తెలుసు అతనొక తీవ్రమైన బ్రహ్మచారి అని . . . కాని ఆ శపధం విరగగొట్టాలని, అది నాకు సాధ్యం అనే నమ్మకం నాలో ఎక్కడో లోతుగా పాతుకొని ఉందేమో? ఆ తరువాత నేను తరచుగా ఆలోచించేదాన్ని: 'ఉద్దేశపూర్వకంగా నేను అలాగ అన్నీ చేసి అతన్ని నావశం చేసుకున్నానా?' అని. అటువంటి తలంపు ఉండేదంటే అది పూర్తిగా అబద్ధం కాదు. అది నాకే తెలియకుండా నాలో రహస్యంగా దాక్కొని ఉన్న ఫధకం అని నేను ఒప్పుకోవలసిందే. నా రాజీనామా ఉత్తరం

రాసినప్పుడే అతను దాన్ని చదివి నన్ను పిలుస్తారనే నమ్మకంతోనే రాసానని నేను ఆ తరువాతనే గ్రహించాను. నేను ఎదురుచూసినట్టే అన్నీ జరిగాయి. అతను నా గురించి పూర్తిగా, సరిగ్గా అన్ని వివరాలు తెలుసుకోవాలని నేను ఏమీ దాచక అతనికి అన్నీ చెప్పాను. అప్పుడుకూడా అతను నన్ను అదే ప్రశ్న అడిగారు: "నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా? జరిగినదంతా మరిచిపో? ఒకరికొకరు నిష్కపటంగా నడుచుకుంటే దానికే సత్ప్రవర్తన అని పేరు . . .'

"నాగురించి అన్నీ తెలుసుకున్న తరువాతనే అతని విశ్వాసంకి నాకు యోగ్యత ఉందని అతను గ్రహించారు కాబోలు! ఆ సమయంలో నా కధలు కొన్ని పత్రికలలో ప్రచురమయ్యాయి. 'నువ్వడిగినట్టు నేను నీ రాజీనామా అంగీకరిస్తాను. నీకు నచ్చిన పరిసరాల్లో ఇక్కడే నీ సాహిత్య అభిరుచి పెంచుకో!' అని నాకు సలహా ఇచ్చారు."

లలిత ఒక కధలాగ చెప్పిన నిష్కపటమైన ఆమె గతకాల జీవితంలోని ఘటనలు విని సారంగన్ కి చాలా ఆశ్చర్యం కలిగింది. ఇటువంటి ఘటనలు అతను ముందే వినివున్నాడు. ఆ అనుభవాలకి సంబంధించిన ఒక స్త్రీ - ఒక హిందూ స్త్రీ - తన జీవితంలోని గుప్తమైన విషయాలని ఇంత దృఢమైన మనసుతో వివరించడం చూసి ఆమెలో ఉన్న నిజాయితీ తెలుసుకున్నాడు.

సుమారు ఏడుగంటలకి, సాయంకాలంని చీకటి కమ్ముకునే సమయంలో మహాలింగం కారు ఇంటి కాంపవుండులో ప్రవేశించడం సారంగన్ చూసాడు. అతను కారులోనుంచే మేడమీద ముందుభాగంలో కూర్చొనివున్న సారంగన్ని చూసి కారు బయట తన చెయి చాటి అతనికి స్వాగతం చెప్పారు.

మహాలింగం తన గదికి వెళ్లి దుస్తులు మార్చుకొని సారంగన్ దగ్గరకి వచ్చారు. లలిత లేచి అతనికి జాగా ఇచ్చింది.

"లేదు . . . నాకు కొంచెం పని ఉంది . . . " అని వాళ్ళకి చెప్పి మహాలింగం కిందవున్న తన ఆఫీసుకి వెళ్ళారు. అతను మేడమెట్లు దిగడం చూస్తునే లలిత సారంగన్ కి చెప్పింది:

“మా ఆయనగురించికూడా నేను మీకు కొంచెం చెప్పాలి. అతను ఒక అద్భుతమైన మనిషి. మీ తృప్తికోసమే అతన్ని మనిషి అంటున్నాను. వ్యక్తిగతంగా అతను నాకు దేవుడు . . .

“ఒకానొకప్పుడు అతను తీవ్ర దేశభక్తుడుగా మహాత్మాగాంధిగారి సహవాసంతో పది సంవత్సరాలు వార్ధాలో సేవ చేసారు. చాలా సంవత్సరాలు చెఱసాలలో గడిపారు. అతని కుటుంబ సభ్యులు అతను తన జీవితమంతా బ్రహ్మచారిగానే గడుపుతారని నిశ్చయించుకున్నారు. అతనూ ఆ తీర్పుని అంగీకరించారు. నేను అతని జీవితంలో జోక్యం చేసుకున్నంతవరకూ అదే నిజం కూడా! నేను నామనసులో నాకే తెలియని పథకంతో అతని భావనలని చెదరగొట్టేసాను. జీవితం గురించి అతనికున్న మౌలిక సిద్ధాంతంలో నా ప్రవేశం ఒక చలనం ప్రేరేపించిందని నేను తెలుసుకున్నాను. అతను నన్ను పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించి నా అనుమతి కోరినప్పుడు నేను చాలా మాసాలు నా అనుమతి ఇవ్వలేదు. నా అనుమతి కోరిన అతనితో - నన్ను తప్పిస్తే - మా సంస్థలో ఉన్న వారందరూ, మా సంస్థకి చేరనివారు కూడా - తమ తమ అభిప్రాయలు తెలియజేసేసారు.

“అతని అభిలాషకి తగినట్టుగా అతను భారతదేశంలోని ఆనేక ప్రతినిధులనుంచి ఒకర్తెని భార్యగా ఎంచుకొనివుండవచ్చు. అతనిలాంటి పురుషోత్తముడుకి నాలాంటి ఒకర్తె భార్య అవడం చాలామందికి ఇష్టం లేదన్నది నిజం. అందులోని న్యాయం నేనూ గ్రహించాను. కాని ‘ఎవరికి ఎవరు అనే ప్రశ్నలో సంబంధించిన ఆ ఇద్దరి హక్కు మరెవరికి ఉంది?’ అని అతను వాదించారు; అందరి ద్వేషంకి విరోధంగా నిల్చున్నారు. ఆ ఒక్క కారణం వలనే నేను అతని శరణుకోరాను, ఆఖరికి నేను కూడా నా సమ్మతి తెలియజేసాను. యాభై సంవత్సరాలవరకూ ఎటువంటి చలనం లేని అతని ఏకాంత జీవితంకి, అతని ఆస్తికి, తమకు తామే వారసులు అని నమ్ముకున్న అతని తమ్ముడు బంధువులు నిరాశతో మమ్మల్ని నిందించారు. నేను అతని పరువు తీసానని అరిచారు. అంతేకాదు, అతని సత్ప్రవర్తన గురించి ఊసులాడారు. అతనికి ముందునుంచే బ్రహ్మచారి అనే వంకలో ఆఫీసులో పనిచేసే యువతులతో పొత్తువుందని, అతనొక వేషధారి, స్త్రీలోలుడు అని వదంతులు పరిచారు. అందువలనే తోబుట్టువులగురించి నా

దృక్పథం పూర్తిగా మారిపోయింది. నాలో, అతనిలో నేను ఒక ఏకత్వం చూసాను . . . ” అని చెప్తూ వచ్చిన లలిత, ఒక నిమిషం ఆగి, “ఇక మా గురించి చెప్పడానికి మరేముంది?” అని చిరునవ్వు నవ్వింది.

“సాహిత్య ప్రపంచంకి సంబంధించిన మీ జీవితం గురించి మీరింకా చెప్పాలని నా ఉద్దేశం . . . మీలాంటి పేరుమోసిన రచయిత్రికి చెప్పడానికి ఎన్నో ఉంటాయి, అవునా?” అన్నాడు సారంగన్.

“వద్దు, వద్దు, మీరు నన్ను పొగడవద్దు!” అని లలిత సిగ్గుతో అతని పొగడ్తని ఆపింది. “నేను ఇచ్చిన పుస్తకాల్లో ఏదైనా చదిపారా?” అని అడిగింది.

“తప్పకుండా. మీ కథలు కొన్ని చదివాను. వాటిలో కథల ఇతివృత్తం మాత్రం నాకు బోధపడింది, కాని మరేం సాహిత్యయుక్తులు కనిపించలేదు. కాని అటువంటి కల్పనలు వాటిలో ఉన్నాయని నేను గ్రహించాను. నా మాతృభాషలో నాకున్న కొఱతని గుర్తుచేసుకొని బాధపడాడాను.”

“మీ మాతృభాష తెలుగు కదూ?”

“అవును. అలాగైతే నేను ఇంకా ఎక్కువగా సిగ్గుపడాలి. అందులో నాకు ఒక అక్షరం కూడా తెలీదు. ఐదవక్లాసు వరకూ నేను తమిళం చదివాను. ఆధునిక తమిళ పుస్తకాలు చదవడానికి అది చాలదని నా ఉద్దేశం.”

“అసలు సాహిత్య అభిరుచికి బడిలోని చదువుకీ ఏ సంబంధమూ లేదు. సాహిత్య అభిరుచికి ఆధారం ఈ రెండు: జీవితంలో మనం ఎంతవరకూ నేర్చుకున్నాం? జీవితం ఎంతవరకు మన పరిపూర్ణతకి దోహదం చేసింది? మీరు తమిళంలో చదివే అలవాటు కొనసాగిస్తే, సులభంగా అన్నీ బోధపడతాయి. మీకు ఇంకొక సంగతి చెప్పాలి. మీరనుకున్నట్టు తమిళ సాహిత్యంలో అపరిమితంగా ఎటువంటి ప్రజ్ఞలు లేవు. నవీన తమిళ సాహిత్యం అనే ప్రక్రియ గత నలభై సంవత్సరాలుగా మనం చూస్తున్నాం. పద్యంగా ఆరంభించి సాహిత్య రచనలు ఆ తరువాతనే మనకి గద్యంగా పరిచయమయ్యాయి. మీరన్నట్టు ఐరోపా ఖండంలో మనం చూసే modern trends లాంటి పెద్ద మార్పులు ఇక్కడ లేవు. నవీన యుగంకి తగినట్టుగా ఒక విధమైన journalism ఇక్కడ ఏర్పడడం నిజం, కాని అదికూడా వ్యాపారపరంగా mass level

appeal కోసమే సాగుతోంది. పత్రికలకి తగినట్టుగా రాసేవారందరూ ఏదో రెండో ఉద్యోగం లాగ, hobby లాగ కథలు మాత్రం రాస్తున్నారు. 'ప్రజలకి ఎది నచ్చుతుంది?' అనే ప్రజ్ఞతో రాసేవారే ఇక్కడ గుమిగూడివున్నారు. 'ఎవరికి నచ్చికపోయినా సరే, ఈ కాలంకి ఇది అత్యవసరం' అనే సాహిత్య ఆతురతతో రాసేవారు నన్ను తప్ప మరెవరూ లేరు!"

"Mr. సారంగన్! మీరు లలితతో సాహిత్యం, రచయితల గురించి వాదించుతున్నారా? అది ఏదీ ఒప్పుకోదే? లోపాలనే చమత్కారంగా వాదించుతుంది . . . మీరు దాని అభిప్రాయాలకో ఏకీభవకించకండి!" అని హెచ్చరిక చేస్తూ మహాలింగం మేడమదకి వచ్చారు. వస్తూనే ఒక కుర్చీని చెయితో మోసుకొనివచ్చి సారంగన్ పక్కన వేసి దానిమీద కూర్చున్నారు.

"అవునులెండి. ఇతనులాగ ఏదీ చదవకుండావుంటే అందరిగురించి మంచి అభిప్రాయాలే మిగులుతాయి. కాని నా కర్మ - నేను అన్నీ చదువుతున్నానే?" అని లలిత విసుగ్గుంది.

"మీరేం చదవనే చదవరా?" అని సారంగన్ అతన్ని అడిగాడు.

"హూహూం, కాని చాలా సినిమాలు చూస్తాను. లలిత చెప్తోంది, ఇవాళా రేపు వచ్చే కథలన్నీ సినిమాలాగే ఉన్నాయని. మరెందుకు చదవాలి? అంతేకాదు, మన స్థాయికి నచ్చినది ఒక కొలబద్ధగా పెట్టుకొని ప్రతీ ప్రయత్నంని కొలవడం అనుచితమని నా ఉద్దేశం. ప్రతీదానికి ఒక స్థాయి ఉంది, దానికి తగిన కొలబద్దతో చూస్తే అది చోద్యంగా కనిపిస్తుంది, మనమూ మెచ్చుకుంటాం. అదే నా అభిప్రాయం, మీరేమంటారు?" అని మహాలింగం సారంగన్ని అడిగారు. సారంగన్ అతన్ని చూసి తేటగా నవ్వాడు. ఆ నవ్వులోనే తను చెప్పినది అతనికి సరిగ్గా బోధపడలేదని తెలిసింది.

"నేను చెప్పినది మీకు సరిగ్గా అర్థమవలేదనుకుంటాను" అని అంటూ మహాలింగం తన దృక్పథం విపులంగా వివరించ సాగారు:

" . . . లలిత ఒక average type కాదు. సమాజంలోని సగటు ప్రజలతో పోల్చుతే ఆమెకి అనేక విధాల్లో విరుద్ధ భావనలు ఉన్నాయి. ఆమె తారతమ్యం గురించి నేను విమర్శించను. కాని ఆమెవంటి బుద్ధిజీవులు, మేధావులు ఏ సమాజంలోనూ

కొంతమందే ఉంటారు. తమకు సాటిలేని ఇతరులని చూసి అసూయపడడం, వాళ్ళని నిత్యమూ చులకన చెయ్యడం -అందుకే వీళ్ళు ఉన్నారంటే, వీళ్ళవలన ఈ సమాజంకి ఏ లాభమూ లేదు. వీళ్ళు తమ అభివృద్ధి కోసం ఎక్కువ ప్రజ్ఞతో మెలగుతున్నారు. తమ స్థాయికి తక్కువగా కనిపించేది ఎద్దైనా సరే, దాన్ని నిర్లక్ష్యం చెయ్యడంవలన తమ స్థాయి ఎదిగినట్టు ఊహించుకుంటున్నారు. ఇతరుల భావనలు గౌరవించే సుశీలత, సహనం వీళ్ళకి లేనేలేదు. ఇతరుల భావనలు నాశనం చేసి వీళ్ళు తృప్తి పడుతున్నారు. అందుకే లలిత అభిప్రాయాలకి విరుద్ధంగా నేను మాటాడుతున్నాను. “

అతను ఇంకా చెప్పారు:

“విద్యార్థులకి కొన్ని పాఠాలు తెలియలేదని చీదరపడి, వాళ్ళని అవమానించే గురువు ఎంత మూర్ఖుడు! బాధ్యతలేని విద్వాంసుడు! అలాగే జ్ఞానులు - నిజమైన జ్ఞానులు - ప్రజల ప్రయత్నాలని అసూయతో ఆరసించడం, విమర్శన అనే వంకలో వారిని నిందించడం నేను సమ్మతించను!”

అప్పుడు లలిక మూర్ఖంగా జోక్యం చేసుకుంది:

“తెలియలేదనే కారణం వలన ఎవరూ చీదరపడలేదు, వాళ్ళని నిందించలేదు. తమకి తెలియలేదనే సంగతే వాళ్ళకి తెలీదు. కొందరు అన్నీ తెలిసినట్టు నటించుతున్నారు; జ్ఞానులని చూసి అసహ్యించుకొని, జ్ఞానంని బొత్తిగా నిరాకరిస్తున్నారు. అది చూసే కడుపుమంటగా ఉంది,” అని సారంగన్ కి బోధపడాలని ఇంగ్లీషులో చెప్పింది.

మహాలింగం నవ్వుతూ ఆమెకి చెప్పారు:

“నువ్వు చెప్పేది సరే అని ఒప్పుకుంటాను. కాని, నీకెందుకు కడుపుమంట? నువ్వు అన్నట్టు సమాజంలో మాయలమారులు, వంచకులు ఉన్నారని ఒప్పుకుంటాను. కాని వాళ్ళకున్న బాధ్యత, సహనం నీలాంటివారికి లేకపోవడం నాకు బాధగా ఉంది. కొంచెం ఆగు, వాళ్ళని కొంచెం పరిశీలించుదాం. ఆ మాయలమారి వ్యక్తులులో చాలామంది నువ్వన్నట్టు మూఢులుగా ఉండవచ్చు. తమకేం తెలియదని వాళ్ళకి తెలీదు, కాని అంతా తెలిసినట్టు నటిస్తారు. నువ్వే చెప్పు - నిన్న బడిలో చేరిన ఒక పిల్లవాడు తన తండ్రిని చూసి - అతనొక ప్రొఫెసరు - ‘నాన్నగారూ, మీకు రెండవ

ఎక్కం తెలుసా?' అని తను కొత్తగా నేర్చుకున్న పాఠం గురించి గర్వంతో అడిగాడు అనుకో, ఆ తండ్రికి తన కొడుకుమీద కోపం వస్తే అది న్యాయమేనా? బాధ్యత గల తండ్రి "నాకు తెలీదురా, ఏదీ, నువ్వు చెప్పు, వింటాను' అని సంతోషిస్తాడు. నీకు నిజంగా పక్వమైవ జ్ఞానం ఉందంటే నువ్వు ఇలాగే మెలగాలి . . . ' అతను అన్న మాటలు లలిత ఉపేక్షగా వింటోంది.

"మీరేమో వాదంకని ఇలా మాటాడుతున్నారు. ఇక్కడ ఎవరూ ధీమంతుడుగా నటించడం లేదు. ఈ ప్రపంచంకి పాఠం చెప్పే యోగ్యత నాకు లేదు. ఈ సమాజంతో వాదించడమే నాకు తెలుసు . . . "

మహాలింగం తనలో నవ్వుకున్నారు. "చూసావా, నీలో ఒర్పు రవంతైనా లేదు, నీకు కోపం వచ్చేసింది . . ."

"అవును మరి. సాధ్యంకాని ఉపదేశంవలన ఎవరికి లాభం?" అని సణుగ్గుంటూ, లలిత కోపంతో తల వంచుకుంది.

మహాలింగంని, లలితని, సారంగన్ మార్చి, మార్చి చూసాడు. ఇంతకు ముందు అతను జంటగా ఇద్దరినీ చూసివున్నాడు, కాని ఇప్పుడు - కొంచెం సమయం ముందు లలిత చెప్పిన ఆమె గతకాల జీవితంలోని నేపథ్యం గ్రహించిన తరువాత - ఆ దంపతులని చూసినప్పుడు అతని మనసులో ఒక కొత్త భావన లేచింది. లలిత చెప్పిన వివరాలు విన్న తరువాత ఆమెకి భర్తపై ఉన్న అవగాహన కంటే ఎక్కువగా అతనికే ఆమె గురించి బాగా తెలుసు అని సారంగన్ గ్రహించాడు.

ఇటువంటి స్నేహితులు తనకి దొరకడం గురించి సారంగన్ మనసార సంతోషించాడు.

ఇటువంటి స్నేహంకి మూలకారణమైన తన తండ్రి గుర్తు రాగానే, దానితోబాటు కొన్ని గంటలముందు అతనితో ఏర్పడిన ఘర్షణ కూడా జ్ఞాపకం వచ్చింది. ఇక భవిష్యత్తులో తండ్రి తన జీవితంలో అడ్డువస్తారని, అతన్ని ఎదిరించడం ఎలాగ అని సారంగన్ మనసులో భ్రాంతి కలిగింది.

సారంగనో ఏదో ఆలోచనలో లీనమైపోవడం మహాలింగం గమనించారు. అతని తత్తరపాటు లలితకి తెలిసింది.

"సాయంకాలం మిస్టర్ మేనన్ని కలుసుకోవాలనే మేం బయలుదేరాం. కాని సారంగన్  mood సరిగ్గా లేదన్నారు. ఆ తరువాతే అతన్ని ఇక్కడికి రమ్మని పిలిచాను."

సంభాషణలో తన పేరు విగానే సారంగన్ తల తిప్పి మహాలింగంని చూసాడు: "I am sorry."

"ఏం జరిగింది? మిస్టర్ శేషయ్య ఏమంటున్నారు?" అని మహాలింగం అడిగారు.

"కొత్తగా అతనేం చెప్పలేదు . . . " అని ఏదో చెప్పాలని ఆరంభించిన సారంగన్, భుజాలు ఊపుతూ, ఒక నిట్టూర్పు వదిలాడు.

"లలితని అడగండి."

ఏడు గంటలైపోయింది. సారంగన్ మహాలింగం దంపతులదగ్గర శెలవు తీసుకున్నప్పుడు అతన్ని రాత్రిభోజనంకి ఇద్దరూ పిలిచారు. కాని అప్పుడున్న అతని మనస్స్థితిలో భోజనం కంటే మద్యమే అగత్యం అనిపించింది. వాళ్ల పిలుపుని మర్యాదగా నిరాకరించి సారంగన్ తనింటికి బయలుదేరాడు.

సారంగన్ని అతనింటిలో దింపడానికి మహాలింగం అతనితో బయలుదేరారు.

కారు బయలుదేరేముందు లలిత కాంపౌండు గేటువరకూ వాళ్ళతో నడిచివచ్చి, అతనికి చెయి ఊపి వీడ్కోలు చెప్పింది.

కారులో ప్రయాణం చేస్తన్నప్పుడు, మధ్యలో మహాలింగం సారంగన్ని అడిగారు:

"కొంచెం సమయం బీచ్ లో గడుపుదామా?"

కలవరంతో, దీర్ఘమైన ఆలోచనలో లీనమైన సారంగన్ "I am sorry, నాకు ఇంటికే వెళ్ళాలని ఉంది" అన్నాడు.

అతని తొందర చూసి మహాలింగం తనలో నవ్వుకున్నారు. సారంగన్ దారంతా సంచరించే జనుల గుంపులుని చూస్తూ కాలం గడిపాడు.

అతను గభీమని లలిత గురించి మాటాడారు:

"దానికి సహనం అన్నది రవంతైనా లేదు. సమీక్ష అనే వంకలో అందరినీ తీవ్రంగా తప్పులుపట్టి రాస్తోంది. అందువలనే చాలామంది ఆమెని విరోధించి రాస్తున్నారు. ఆమెను గర్వి అని పిలవడానికి నాకు బాధగా ఉంది. కాని ఆమె అద్భుతంగా

రాస్తోందని అందరూ పొగడడం నాకు తెలుసు. కాని ఆమె నిర్దయతో, మూర్ఖంగా రాసే అభిప్రాయాలవలన ఆమెపై ద్వేషం చూపుతున్నారు."

"అలాగైతే, దానికి ఎవరు కారణం?"

"తప్పకుండా ఆమెయే కారణం. ఆమెలాంటి హోదా, బాధ్యత గల విమర్శకులు - వాళ్ళు ఎది రాసినా - అందుకు జవాబుదారులు. అది లలితకి తెలుసు, అందుకే ఆమెకి కోపం వస్తోంది. అది పొరబాటు అని నేను అంటున్నాను."

ఇప్పుడు మహాలింగంతో వాదించే ధోరణిలో సారంగన్ లేడు. ఇంటినుంచి తను బయలుదేరినప్పుడు శేషయ్యతో తర్కం, అందువలన ఆ నోటి మాటలు అతన్ని తీవ్రంగా బాధించాయి. అంతకుమించి లలిత వివరించిన ఆమె గతకాల అనుభవాలు విన్న తరువాత అర్థం కాని ఒక శోకం అతన్ని ఆవరించుకుంది. ఈ భావనలు తాళలేక అతనికి ఏడవాలనిపించింది.

ఈ భావనలు, గడబిడల మధ్య మరేం చేతకాక, అతనికి తల భారీగా కనిపించింది. అటువంటి పరిస్థితిలో తాగి తీరాలనే ఆవేశం అతన్ని పట్టుకుంది.

మహాలింగం సారంగన్ మనోదశ తెలుసుకొని ఓపికతో ఇరవైఐదు మైళ్ళ వేగం మించకుండా కారుని నడిపారు. తన భావనలకి సముచితంగా కారు కదలడం సారింగన్ గమనించాడు.

వాడు వాచీ చూసుకున్నాడు. ఎనిమది గింటలైంది.

సారంగన్ని ఇంటిలో దిగబెట్టిన తరువాత మహాలింగం అతనిదగ్గర శెలవు తీసుకొని బయటకి వచ్చారు.. అప్పుడే నిద్రపోవడానికి తొమ్మిది గంటలవరకూ కాచుకొనివున్న శేషయ్య, వెన్నెల రాత్రిలో, ఇంటిముందున్న తోటకి వ్యాహాళికోసం వచ్చారు.

"నమస్కారం సార్!" అని కారుని ఆపి మహాలింగం కారునించి దిగడానికి కారు తలుపు తెరచారు.

"ఓ, నమస్కారం . . . " అని పలుకుతూ శేషయ్య మహాలింగం కారు దగ్గరకి వచ్చి అతను కారునుంచి దిగవద్దని కారు తలుపుని పట్టుకొని నిలబడ్డారు. ఆ నిమిషం ఇతని ద్వారా వాడికి బుద్ధి చెప్పి సారంగన్ మనస్సు మార్చాలని శేషయ్య మనసులో ఆశ లేచింది.

“సారంగన్ మా ఇంటికి వచ్చారు. . అతన్ని దిగబెట్టి తిరిగి వెళ్తున్నాను” అన్నారు మహాలింగం.

శేషయ్య ఒక నిట్టూర్పు వదిలి, కారులోపల తొంగి చూసి, మహాలింగంతో అన్యోన్యంగా మాటాడారు:

“నాకు ఎంచెయ్యాలో తెలీదు . . . ‘నలభై సంవత్సరాల తరువాత వచ్చాను’ అనే చింత వాడికి లేనేలేదు. తనకేం తెలీదు, ఇతరులు చెప్పినా వినడు. మీలాంటి మిత్రులే వాడికి బుద్ధి చెప్పాలి. ఈ కుటుంబంలో నన్ను తప్పిస్తే మరెవరికీ వాడిగురించి ఆలోచన లేదు. నేను పోతే వీడి గతి? దయచేసి మీరు వాడితో మాట్లాడండి, వాడికి ఏగైనా మంచి మార్గం చూపాలి. వాడు మోటుగా మాటాడుతున్నప్పుడు నాకు ఒక పక్క కోపం, మరొకపక్క జాలిగా ఉంది.”

శేషయ్య కారు బయట నిలబడి మాట్లాడడం చూసి మహాలింగం కారునుంచి దిగారు. శేషయ్యని ఎలాగ ఓదార్చడం అని అతనికి బోధపడలేదు.

శేషయ్య మాటాడుతునేవున్నారు:

“వీడి సిద్ధాంతం, లక్ష్యం గురించి నాకు ఏ బాధా లేదు. ఇలాంటి వెయ్యి పిచ్చి ఆలోచనలు ప్రతీ మనిషికి ఎప్పుడో ఒకసారి రావడం మామూలే! దానిగురించి నేను ఏమీ అనను. కాని ఆ ఆలోచనలవలన practical గా జీవించడం సాధ్యం కాదంటే వాటిలో ఏదో పొరబాటు ఉందని గ్రహించాలికదా? ఇవన్నీ నేను వాడితో వాదించను. మీరందరూ వాడితో Intellectual discussions లో పాల్గొనేవారు. ఆ సమయంలో మీరు వాడికి నయంగా చెప్పాలి. ‘ఇది వేరే, అది వేరే’, అని లక్ష్యం, చర్యల మధ్య భేదాలు స్పష్టంగా చూస్తేనే లక్ష్యం నెరవేరుతుంది. బాధ్యతగల మనిషిగా మారని వ్యక్తికి ఉన్న ఆదర్శభావనలు చాలా హానికరమైనవి . . . మీరు కొంచెం ఆలోచించండి. దీనిగురించి నేను వాడితో మాటాడను. మీకు చెప్తున్నాను. వీడు సిద్ధాంతం, లక్ష్యం అని అంటున్నాడే, అవేకదా ఇప్పుడు వీడిని ఈ పరిస్థితికి ఈడ్చుకొని వచ్చాయి? లేకపోతే వీడికి దొరికిన డబ్బుతో వీడు విదేశంలో హాయిగా జీవించవచ్చుగా? ‘పారిస్’, ‘పారిస్’ అని పరగెత్తాడు . . . ఇప్పుడు అనాధగా, అన్నీ పోగొట్టుకొని, సగం జీవితం

పాడుచేసుకొని, ఇక్కడ వచ్చి నిలబడడం చూస్తే నా కడుపు మండుతోంది సార్ . . . ” అని అతను వాపోయారు.

“అదెలాగ? ఇప్పుడు సారంగన్ పరిస్థితికి అతని ఆదర్శభావనలు కారణం అంటున్నారా? కాదు. అతనిలోవున్నకొన్ని బలహీనతలే కారణం” అని మహాలింగం మర్యాదగా అన్నారు.

“సరే, అలాగే కానీయండి. ఆ బలహీనతలు పోగొట్టుకోడానికి వాడు శ్రద్ధ తీసుకోవాలి, అవునా? మీ దగ్గర చెప్పడానికి నాకు మోమాటం లేదు, మీరు మా కుటుంబంలో ఒకరు . . . నేను చెప్పేది వినండి. వాడు విదేశంలో జీవించాడు. తాగడం వాడికి అలవాటైపోయింది, నాకది తెలుసు. ‘వాడు తాగవద్దు!’ అని నేను అనలేదే? లండన్, పారీసు జీవితం కంటే వీడికి మంచి వసతులు నేను ఇక్కడ ఏర్పాటు చేసివున్నాను . . . వీడి పేరులో ఒక వ్యాపారం ఆరంభించాలంటున్నాను, అది వీడి భవిష్యత్తు కోసం. వీడికి అందులో ఏం బాధ్యత?ఎందుకంటే, మా పెద్దబ్బాయి ఉన్నాడే, వాడికి నాగురించి ఎన్నో తప్పు అభిప్రాయాలున్నాయి. ‘సరే, ఇక నీ జీవితంకి నేను అడ్డురాను’ అని వాడి జీవితంలో జోక్యం చేసుకోడం మానుకున్నాను. కాని నిజంగా నాలో పక్షపాతం ఉన్నట్టు కనిపించకూడదు. వీడికి ఒక పెళ్ళిచేసి, ఒక వ్యాపారంలో అమర్చితే ఈ కుటుంబం ఎంత బాగుంటుంది! లేకపోతే పారిపోయినవాడిని నా తలమీద పెట్టుకొని నేను ఆడుతున్నానని నా పెద్దబ్బాయి, వాడి భార్య అనడం నిజమైపోతుంది!” అని శేషయ్య గుంజుకున్నారు.

మహాలింగం అతని మాటలు అనుతాపంతో ఆమోదించారు. కాని శేషయ్య అన్నట్టు సారంగన్ని అంత సులభంగా మార్చడం సాధ్యమని అతనికనిపించలేదు; శేషయ్యని చూసి అతను నమ్మకంగా నవ్వారు.

“మీరన్నది నాకు బోధపడింది. ఇవన్నీ సారంగన్ కొంచెం కొంచెంగా తెలుసుకుంటారు. మనం తొందరపడకుండా అతనికి చెప్పాలి. అదే మంచిది.”

అప్పుడే లోపలనుంచి తొమ్మిది గంటలగొట్టు వినిపించింది.

“ఇక మనం చేసేదేముంది? ఎవరి కర్మ ఎవరు మార్చగలరు? సరే, మీకూ ఆలస్యమైంది . . . మీరు వెళ్ళాలి . . . ” అని ముకుళిత హస్తాలతో శేషయ్య

మహాలింగంకి వీడ్కోలు చెప్పారు. తొమ్మిది గంటలకి అలవాటుగా శేషయ్య నిద్రపోతారనే సంగతి మహాలింగంకి తెలుసు కాబట్టి అతను వెంటనే శెలవు తీసుకొని కారులో ఎక్కారు.

శేషయ్య తన గదిలోకి ప్రవేశించారు.

సాయంకాలం జరిగిన ఘటన తరువాత మురళీకి ఈ ఇల్లు అన్యుల ఇల్లులాగ, ఇక్కడ బస చెయ్యానికి, భోజనం చెయ్యడానికి తనకి తగిన కారణం లేదనిపించింది. వాడు తన తల్లికీ, భార్యకీ తెలియకుండా పదిహేను సంవత్సరాలుగా, రహస్యంగా, నెలకొకసారి, తన తండ్రిని కలుసుకోవడం గుర్తుచేసుకున్నాడు. తన్ను బాల్యంలోనే తన తండ్రినుంచి ఎడబాటు చేసిన తల్లిమీద అప్పుడప్పుడు తనకేర్పడే దుఃఖం ఇప్పుడు పెరిగి కోపంతో భారంగా వాడి భావనలను అణచింది. తన తాతయ్య ధనవంతుడు అనే పొగరుతో తన తల్లి అతనితో కలిసి తన తండ్రిని భ్రష్టుడుగా చేసి అతను సన్యాసిగా మారిపోయాడనే పచ్చి అబద్ధాని మనసార ప్రకటించి మెలగుతున్న బుకాయింపుని తను ఇంత కాలం సహించివచ్చినందుకు వాడికి తనమీదే కోపం వచ్చింది.

వాడు కలతతో తన గదిలో మంచంలో దొర్లుతూ ఉండడం అతని భార్య లీల గమనించింది. అతనిలో ఇంత తీవ్ర వేదన చూసిన తరువాత లీల అతన్ని తొందరచెయ్యకూడదని నిశ్చయించి, అతన్ని ఊరడించాలని గది మూలనున్న ఒక ఏటవాలు కుర్చీలో కూర్చుంది.

పెళ్ళైన రోజునుంచి తన మనస్సుని నొప్పించే నిజం ఇప్పుడు తన భర్త మనస్సుని భాదించడం చూసి లీల మనసార సంతోషించింది. అది తన ప్రయత్నం లేకుండా అతనే తెలుసుకున్నాడని ఆమెకి తృప్తి కలిగింది.

'అవును మరి, నా భర్త అడుగుతున్నది న్యాయమేకదా? తాతయ్యకి ఇతను ఇంటిలో కర్ణంగా పని చేసారు, కాని అదే శాశ్వతంగా ఇతని ఉద్యోగమైపోవాలా? నాన్నగారి గురించి వదిలేయ్ . . . తండ్రి లేనివారందరూ ఇలాగ తల్లి పుట్టినిల్లులో ఆశ్రయం కోరాలా ఏమిటి? మా ఆయనకున్న ప్రజ్ఞ, నిర్వహణ నైపుణ్యంతో అతను మరెక్కడైనా ఉద్యోగం చెయ్యవచ్చుకదా? ఎవరి దయా ఏదురుచూడకుండా లేకుండా

స్వతంత్రంగా జీవించవచ్చుకదా?ఎవరికి కావాలి ఈ సొంతం కాని, హక్కులేని వసతులు? స్వతంత్రతకంటే మనిషికి అమూల్యమైన వేరే వసతి ఉందా? ఇన్నిరోజుల తరువాత ఇతను తెలుసకున్నారు, అదే నాకు సంతోషం! త్వరగా ఇక్కడనుంచి బయలుదేరాలి . . . " అని లీల మనసులో తలపోస్తూ, నిశ్చయించి, ఆ నిశ్చయం అతనికి కూడా కలగాలని ఆతురతతో కాచుకొనివుంది.

సమయం పదిగంటలయింది. మురళి ఇంకా భోజనంకి లేవలేదు. వాడు భోంచెయ్యలేదని లీలకూడా భోంచెయ్యలేదు. వాడి కోపమూ, చికాకు ఆమెకి అర్థమైంది. కాని ఇంతసేపు వాడి ఉపవాసం ఆమె భరించలేకపోయింది. మెల్లగా అతన్ని చేరుకొని భుజాన్ని తోముతూ చెవిలో రహస్యంగా అడిగింది: "పదిగంటలయింది, ఆకలిగా లేదా? హూం, లేవండి . . . "

"No! . . . నాకు ఆకలిగా లేదు . . . " అని తలగడని అణచుకున్న నోటినుంచి అసంగతమైన ధ్వనితో మురళి పలికాడు.

ఆమెకూడా తనకోసం భోజనం చెయ్యక ఇంతసేపు కాచుకొనివుందని గ్రహించి మురళి మంచంలో లేచికూర్చున్నాడు. లీలని తేరిపారి చూసాడు. తనూ, లీల ఆ ఇంటిలో ఏ హక్కులు లేని దంపతులుగా మారి ఎవరి దయతోనో అంటుకున్నట్టు జీవించడం గుర్తు వచ్చి వాడి మొహం తెల్లపారిపోవడం లీలకి బోధపడింది.

"పరవాలేదు . . . దీనిగురించి మనం బాధపడితే ఎలాగ? ఇకనైనా మనం మన సొంత కాళ్ళతో నిలబడాలి . . . " అని ఆమె భర్తని ఓదార్చింది. ఇటువంటి పరిస్థితిలో తన భర్త లక్ష్యంని తాతయ్య చిన్నబుచ్చారని, తను ఎటువంటి సాయమూ లేనని గుర్తు రాగానే ఆమె కళ్ళు తడిసిపోయాయి. అది చూసి తన మొహంని ఆమె బుగ్గతో జోడించి మురళి చెప్పాడు: "నేనేం చేతకానివాడనుకున్నావా? చూడు, తాతయ్య సాయం లేకుండా నేను నా పథకంని ఆరంభిస్తాను."

"మీకు ఏ సాయమూ చెయ్యలేను అని నాకు బాధగా ఉంది. ప్రతీ ఇంటిలో భర్తకోసం పుట్టినిల్లునుంచి ఎంతమంది ఎలాగ తోడ్పడతారని నాకు తెలుసు. కాని నేను చేసేది ఏముంది?" అని లీల ఏడ్చింది.

"అందుకేనా ఈ ఏడ్పు? నువ్వు నాతో ఉన్నావ్, ఆ సాయం నాకు చాలు. ఇక ఈ నిమిషంనుంచి ఇది మన ఇల్లు కాదు. ఇక నేను ఇక్కట ఒక పూట కూడా భోజనం చెయ్యను. రేపే తాతయ్య దగ్గర ఇంతకాలం ఈ ఇంటిలో సేవ చేసినందుకు అతను నాకేమైనా కానుక ఇవ్వాలని నిశ్చయిస్తే దాన్ని పుచ్చుకొని మనం వెళ్ళిపోవాలి . . . ఎలాగైనా, ఎన్ని కష్టాలు పడినా, నేను స్వేచ్ఛగా ఉద్యోగం జీవించగలను. అలాగే మనం ముందుకు రావాలి. ఏమంటావ్?" అని మురళి తడబడుతూ అడిగాడు.

లీల అతని తీర్పుతో ఏకీభవించింది. కాని అది ఎతవరకు సాధ్యం అని ఆమె ఆలోచించింది. ఆమె మనస్సు తెలుసుకున్నట్టు మురళి మాట్లాడాడు: "ఆరంభంలో కొంచెం కష్టంగానే ఉంటుంది. మరి జీవితమంటే కష్లాలు రావడం, వాటిని ఓడించి ముందుకు సాగడం మామూలే కదా? దానికే జీవితం అని పేరు! లోకంలో ఉన్నవారందరూ బంగళాలో కాపురముంటున్నారా? ముప్పై, నలభై రూపాయలకి - అద్దెకి - ఒక ఇల్లు దొరుకుతే అది మనకి చాలదా? మీ అమ్మ, నాన్న, ముగ్గురు, నలుగురు పిల్లలతో ఆ ముప్పైఐదు రూపాయల అద్దె జాగాలో జీవితమంతా గడిపారు. ఈ బంగళా జీవితం కంటే ఆ ఒంటరి కాపురంలో వాళ్ళకి నిండుగా సంతోషం కలిగింది, అవునా? ఇదేం జీవితం? అంతా డబ్బుకోసం! ధనవంతులనే అహంకారం, మరేం లేదు! నిజంగా దీన్ని విడిచిపోవడం గురించి మనం సంతోషించాలి . . ." అని అంటూంటే లీల జొక్యం చేసుకుంది: "అత్తయ్య?"

"అమ్మ గురించా? అమ్మ వలనే ఈ గొడవ అంతా! . . . రావాలంటే అది మనతో రానీ, లేకపోతే 'ఇది నా ఇల్లు!, ఇది నా ఇల్లు!' అని తన హక్కుని వాగుతూ ఇక్కడే ఉండనీ! తాళిబొట్టు కట్టిన మొగుడుని తిరస్కరించినట్టు, మనల్నికూడా వదులుకోనీ! మనం ఎవరికోసమూ ఇక్కడ ఉండనక్కరలేదు!"

"ఏమిటి? తాళిబొట్టు కట్టిన మొగుడుని తిరస్కరించారా?" అని లీల అడిగినప్పుడు ఆమె కనుబొమ్మలు పైకి లేచాయి.

గభీమని ఆమె ముందు తను ఒక రహస్యం అజాగ్రతగా పలకడం గ్రహించి మురళి ఒక నిమిషం మౌనం వహించాడు.

“సరే, నువ్వు డ్రెస్ చేసుకొని బయలుదేరు . . . మనం ఎక్కడికైనా వెళ్ళి భోంచేద్దాం . . . ” అని మురళి దుస్తులు మార్చుకోడం ఆరంభించాడు.

“ఇప్పుడు ఎక్కడ భోజనం చెయ్యాలంటున్నారు?”

“Mount Road లో ఏమైనా హోటలు తెరిచివుంటుంది.”

“దేవుడా . . . అవన్నీ Military Hotels[1] కదా?”

“ఐతేనేం? మనకి కావలసినదే మనం భోంచేస్తాం, .సరే, నువ్వు బయలుదేరు . . . నేనేదో కోపంతో అమ్మగురించి మాటాడాను అనుకున్నావా? ఇటివల నేను కొన్ని సంగతులగురించి నిర్ణయం చేసివున్నాను . . . . ఇప్పుడు తగిన సమయం వచ్చేసింది . . . సన్యాసం పుచ్చుకున్నారట! సన్యాసం! కానీ . . . ” అని సగం తనతోనూ, సగం మనసులోనూ పగతీర్చుకొనే ధ్వనిలో మురళి మాటాడాడు.

వాళ్లు బయటకి వచ్చినప్పుడు సారంగన్ గదిలో దీపం వెలుగుతోంది. అక్కడనుంచి ఆ రాత్రి శాంతిలో రేడియోగ్రామునుంచి తేలి వచ్చే పాశ్చాత్య సంగీతం మధ్య మురళి స్కూటర్ మోత విని సారంగన్ కిటికీ ద్వారా బయటకి తలెత్తి చూసాడు. లీలని వెనుక ఎక్కించుకొని త్వరగా కాంపౌండు దాటి మురళి స్కూటర్ని ఎడం పక్క మళ్ళించాడు. స్కూటర్ గర్జన అంతమవగానే, సారంగన్ మళ్ళీ గానంలో మైమరచి, కొంచెం మద్యం తాగాడు.

సారంగన్ సోఫాలో వాలి పడుకున్నాడు. పక్కనేవున్న గ్లాసులో కొంచెం మద్యం మిగిలివుంది. మత్తుగావున్న సారంగన్ మనస్సులోని కలవరంని ప్రతిఫలించే విధంగా ఆ రాత్రి శాంతిలో రేడియోగ్రామునుంచి శోకమైన చైకోవ్స్కీ[2] గీతం - నాలుగవ సింఫొనీ - వినిపించింది.

ఆ గీతం త్వరిత గతిలో ఆరంభమవగానే సారంగన్ - నిషాలో ఉన్నవాడు - ఏదో మంత్రముగ్ధకి వశమైనట్టు లేచి కూర్చున్నాడు.

‘అది ఒక మధురమైన కల’ అని ఆ త్వరిత గతి గురించి స్వరకర్త అన్నది సారంగన్ ఇప్పుడు గుర్తుచేసుకున్నాడు. ఆ కల త్వరగా తనకి ఉత్సాహం, అభయం ఇస్తున్నట్టు

---

[1] మాంసాహారులు భోజనశాలలు

[2] ప్రముఖ స్వరకర్త

బాగా దగ్గరకి వచ్చి, కౌగిలించుకున్న తరువాత, మెల్లమెల్లగా దూరమవుతున్నట్టు భావన అతనికి కలిగింది.

మిగిలివున్న మద్యంని సారంగన్ తాగాడు. ఇంకా తాగాలని బుడ్డిని చూసినప్పుడు అది ఖాళీగా ఉంది. లేచివెళ్ళి గదిలోనున్న అన్ని సారాయి బుడ్డీలు తీసి చూసాడు. అన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇంటి వెనకభాగంకి వెళ్ళి నిద్రపోతున్న కన్నియప్పన్ని లేపాడు.

అప్పుడు సమయం పదిగంటలు దాటేసింది.

"ఇప్పుడు నన్నుఎక్కడికి వెళ్ళమంటున్నారు సార్? ఇవాళకి ఇంతే . . . " అన్నాడు కన్నియప్పన్.

"ప్లీజ్ . . . ప్లీజ్ . . . ఎక్కడైనా వెళ్ళి కొని తీసుకు రా . . . " అని సారంగన్ రూపాయల నోట్లు వాడికి ఇస్తూ బతిమాలాడు. అతని వాలకం చూసి కన్నియప్పన్కి జాలి కలిగింది. వాడు నవ్వుతూ చెప్పాడు: "ఏదైనా నాటు సరకు మాత్రమే ఇప్పుడు దొరుకుతుంది సార్! అది నీకు వద్దు సార్!"

"You mean country stuff? I love to taste it! కొని తీసుకురా!" అని వాడికి డబ్బు ఇచ్చి పంపించిన తరువాత సారంగన్ మందుగదిలో కూర్చొని ఒక సిగరెట్టు వెలిగించుకున్నాడు.

సారంగన్ సిగరెట్టుని ash tray లో నలగగొట్టాడు. మత్తెక్కిపోయి అతని తల భారం ఎక్కువైంది. రెండుసార్లు తలని దులుపుకున్నాడు. కాని తాగాలనే ఆవేశం పోలేదు. లేచి ఇంటి వెనుకతట్టు తలుపు తెరచి రహదారిని చూసాడు. కన్నియప్పన్ ఇంకా రాలేదు! బయట గాలి ఉష్ణంగా ఉంది. ఇంటిలో నిద్రలో పిల్లవాడు కణ్ణన్ ఏడ్పు వినిపించింది; వీధిలో ఒక సైకిలు రిక్షా గంట వాయించుకుంటూ సాగడం చెవులకి అపస్వరంగా వినిపించింది; వీటిమధ్య తను వింటున్న చైకోవ్స్కీ గీతం అమోఘమైన ముగింపుగా - జీవితంలో విశ్వాసం, 'ఇంకా ఈ లోకంలో సంతోషం ఉంది!' అనే సందేశం ప్రకటించే విధంగా మ్రోగింది. గీతం సమాప్తమవగానే సారంగన్ లోపలికి వచ్చి రేడియోగ్రాముని ఆపాడు.

అతను సోఫాలో కూర్చున్నప్పుడు హాలులోని గడియారం పైకప్పు తలుపులు తెరుచుకున్నాయి. బయటికి తల చాపుకొని పిట్ట కూత వినిపించింది.

సమయం పదకొండు గంటలు.

తను ఇలా మైకంతో అల్లాడడం గుర్తు చేసుకొని సారంగన్కి తనమీదే ఏవగింపు కలిగింది. పెదవులు కొరుకుతూ అతను ఒక నిట్టూర్పు వదిలాడు. తనగురించి తలపోసినప్పుడు - ఈ క్షణం అతనికి అసంతృప్తి, విరక్తి కలిగాయి. తన జీవితమంతా - నలభై సంవత్సరాల వరకూ పాడుచేసుకున్న తరువాత - ఇక మిగిలివున్న జీవితమూ నాశనమవబోతుందనే కల్పనలో అతను దుఃఖించాడు. పాత జ్ఞాపకాలు అర్థంకాని శూన్యంలో తారుమారయ్యాయి. గభీమని సారంగన్ లలితని గుర్తుచేసుకున్నాడు. ఆమె జ్ఞాపకంలో అతనికి ఆహ్లాదమూ, ఏదో ఒక విధమైన నమ్మకమూ కలిగాయి.

'ఓ, ఆమె ఒంటరిగా జీవితంలో ఎన్ని కష్టాలు, బాధలు, భరించింది?' అని అతను మనస్సులో సణుగ్గున్నాడు. మత్తెక్కిన అతని కళ్ళ ముందు - రాత్రి, చీకటిలో, ఒక ఇంటి తలుపులు తటాలున తెరచుకొని, లోపలనుంచి ఒక స్త్రీ దుస్తులు, బయటికి పారవేయబడ్డడం; దానితోబాటు ఒక స్త్రీ మెడని పట్టుకొని బయటికి తోయడం; ఆ యువతి ఏడుస్తూ, బయటికి వచ్చి, తడబడుతూ, ఆ దుస్తులు సేకరించుకొని మళ్ళీ ఇంటిలో ప్రవేశించాలని ప్రయత్నం చేసినప్పుడు, ఆమెకి ఆ ఇంటి తలుపులు శాశ్వతంగా మూయబడడం, ఆమెకి అనుమతి నిరాకరించబడడం - ఈ అఘోరమైన దృశ్యాలు కల్పన చేసుకొని సారంగన్ చిన్నబోయాడు.

జీవితంలో ఆమె ఎంత క్రూరంగా మోసపోయిందని సారంగన్ ఆలోచించినప్పుడు ఈ క్షణం అతనికి తన బాధలు అల్పంగా కనిపించాయి. ఆమెతో మెలగిన కొన్ని మాసాలలో ఆమెపై కనకేర్పడిన గౌరవం, అనురాగం, వాటి మూలం, ఇప్పుడే - ఆమె గతకాల జీవితంని ఆరసించినప్పుడు - తనకి బోధపడిందని సారంగన్ గ్రహించాడు; 'ఆమెతో మాటాడుతున్నప్పుడు కష్టాలుమాత్రం కాదు, కాలమూ మరచిపోవచ్చు' అని అతనికనిపించింది.

'మహాలింగం చాలా భాగ్యవంతుడు!' అని సారంగన్ నోరు తెరచి గొణుక్కున్నాడు. లలితలాగ జీవితంని తీవ్రంగా, ధైర్యంతో చూడలేని, పోరాడలేని అతనిమీద వాడికి

ఎక్కువగా గౌరవం ఏర్పడలేదు; ఆమెలాగ అతని గురించి అతీతమైన ఘనత సారంగన్ చూడలేదు; ఆమె అతనికి నిర్హేతుకంగా దొరికిన సంపత్తు అని భావించాడు. కాని ఆమె అతన్నే తన దేవుడుగా భావించడం చూసిన తరువాత తన మనసులో ఆమెని కొనియాడాడు. అందువలనే అతని మనస్సులో అతనికంటే లలిత ఒక మెట్టు అతిశయించింది.

'ఓ, లలితా, లలితా . . . ' అని ఆమె పేరు పలుకుతూ, కళ్ళు మూసుకొని, ఆమె మొహంని తన మొహం ఎదుట కల్పన చేసుకొని, సారంగన్ గాలిలో ఆమెను ముద్దాడాడు.

గభీమని కళ్ళు తెరచుకొని తన చర్యని ఒక భ్రమతో ఆరసించాడు. ఎదుట కనిపించే అద్దంలో తన మొహం చూస్తూ తన్ను తానే అడుక్కున్నాడు:

'ఏంరా . . . ఈ నీ చర్యగురించి నీకేమైనా ప్రజ్ఞ ఉందా?' అని ఇంగ్లీషులో అడిగి, కొంచెం ఆలోచించి, నిశ్చయం చేసుకొని, దానికి జవాబుకూడా చెప్పుకున్నాడు.

'Yes, I admire her! ఆమెలాగ నన్ను, నాలాగ లలితని, మా ఇద్దరిని మించి మరెవరూ ఇంత సరిగ్గా, ఇంత పూర్తిగా తెలుసుకోలేదు. ఇది నేను ధైర్యంగా చెప్పగలను!'

అప్పుడే ఇంటివెనుక రహదారికి వెళ్లే తలుపు తెరిచే సద్దు వినిపించింది. కండువాతో కప్పుకున్న సారాయి బుడ్డితో భారంగా నడుస్తూ కన్నియప్పన్ లోపలికి వచ్చాడు. వాడిని చూడగానే సారంగన్కి ఉత్సాహం కలిగింది. చవుకైన సరకు కాబట్టి సారంగన్ ఇచ్చిన డబ్బులో అధిక భాగం కన్నియప్పన్ అతనికి తిరిగి ఇచ్చాడు. దాన్ని తీసుకొని, లెక్కపెట్టి, "Oh, very cheap!" అని సంతోషించిన సారంగన్ కన్నియప్పన్ని చూసి "వెళ్ళు! నువ్వూ ఒక గ్లాసు తీసుకొని రా," అని అన్నాడు. తడబడుతూ కన్నియప్పన్ తల గోకుతూ నిలబడ్డాడు.

" . . . నేను తాగాను సార్ . . . మీరు తాగండి . . . " అని పళ్ళు ఇలుకుతూ కనినియప్పన్ అన్నాడు.

సారంగన్ ఒక కొత్త సీమ గ్లాసులో సారాయి నింపుకొని, "ఇది లలిత కోసం!" అని చెప్పుకొని తాగాడు.

కన్నియప్పన్కి సారంగన్ని చూసి చెప్పరాని జాలి కలిగింది.

"నీకు ఇదేం కర్మ సార్? ఈ నాటు సరకు నువ్వు తాగాలా?"

సారంగన్ కన్నులు ముడుచుకొని కన్నియప్పన్ని వాడిగా చూసాడు. కన్నియప్పన్ కూడా కొంచెం మత్తులో ఉండడం వలన వాడు మనసు విప్పి మాటాడే పరిస్థితిలో ఉన్నాడు.

వాడు చెప్పాడు: "సార్, నేను చెప్తున్నాను. నువ్వు ఏమనుకున్నా సరే . . . ఇక్కడ ఎవరికీ నువ్వంటే ఇష్టం లేదు. నువ్వెందుకు ఇక్కడ ఇలా కష్టపడాలి? ఈ country సరకు కావాలని నువ్వు తహతహలాడడం చూస్తే నాకు జాలిగా ఉంది . . . అందుకే నేను చెప్తున్నాను . . . నువ్వు మరేం అనక పారీస్ కి తిరిగి వెళ్ళిపో! అవును, అదే మంచిది . . . మా కర్మ, మేం మరేం దారి లేక ఇక్కడ ఉన్నాం, నీకెందుకీ అవస్థ? నువ్వు అక్కడ మహారాజులాగ ఉండవచ్చు, పారీసుకే వెళ్ళిపో!"

సారంగన్ నివ్వెరపోయి వాడిని తేరిపార చూసాడు.

## 4

వేసవి ఉష్ణం తగ్గుతూ వచ్చింది.

సారంగన్ వచ్చిన తరువాత అతన్ని మేనన్కి పరిచయం చెయ్యాలన్న లలిత ఉద్దేశం ఇంతవరకూ నెరవేరలేదు. అందుకు కారణం ఇటీవల ఏర్పడిన వేసవి శెలవులు.

క్రిందటి వారం కాలేజీ తెరిచిన దినం లలిత మేనన్ని చూడడానికి వెళ్ళింది. ఆ కాలేజిలో ఒక కళా ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంకి సారంగన్ని ఆహ్వానించాలని మేనన్ తన నిర్ణయం తెలియజేసారు. అది మేనన్ తనకి ఇచ్చే పెద్ద గౌరవమని లలిత సంతోషించింది.

'మనోన్మణి' పత్రికలో ఆమె సారంగన్ని భేటీ చేసి రాసిన వ్యాసం చదివి కొందరు పాఠకులు, సంగీత విమర్శకులు కలవరపడ్డారు.

సారంగన్ అభిప్రాయాలని విమర్శించి, ఆక్షేపించి వచ్చిన ఉత్తరాలు ఆ పత్రిక సంస్థవారు లలితకి పంపించారు. విమర్శలు, ఆక్షేపణల వలనే రూపొందిన లలిత వాటిని చదివి చాలా సంతోషించింది.

సారంగన్ని కలుసుకున్నప్పుడెల్లా ఆ ఉత్తరాలు అతనికి చదివి చూపి చాలాసేపు వాదించినప్పుడు - అతనికి తన అభిప్రాయాలలో ఎంత స్పష్టత, విశాలహృదయం ఉన్నాయని - లలిత గ్రహించింది. కాని పాశ్చాత్య సంగీతం గురించి ఆమెకి పరిచయం లేకపోవడం వలన కర్ణాటక సంగీతంని పాశ్చాత్య సంగీతంతో పోల్చి సారంగన్ చెప్పే రుజువులు ఆమెకి అంత సులభంగా బోధపడలేదు. కాని ఇతరులలాగ అతని అంతరంగ  చిత్తశుద్ధిని ఆమె అనుమానించలేదు.

ఇంకా చెప్పాలంటే సారంగన్ అభిప్రాయాలపై ఆమెకున్న నమ్మకం కంటే అతని మానసిక ప్రక్రియపై ఆమెకి మేలైన నమ్మకం కలిగింది.

అందువలన అతనితో తరచుగా సంప్రదించడం, వాదించడం వలన వివేకంతో మెలిగే ఆమెకి ఒక కొత్త  జ్ఞానోదయం లభించింది. ఆ జ్ఞానోదయంతోబాటు చాలా ప్రశ్నలు కూడా లేచాయి. ఆ ప్రశ్నలు విడదీయాలని అతనితో సంభాషణ కొనసాగినప్పుడు చాలా కొత్త తలుపులు తెరచుకున్నాయి. ఆతనిలాగే ఆమెకికూడా పాశ్చాత్య సంగీతంలో అపేక్ష పెరిగింది, అతని స్నేహంతో దాన్ని శ్లాఘించాలనే అభిలాష కలిగింది.

ఇటీవల ఒక నెలగా ఇద్దరూ కలిసే పగటి సమయమంతా - సారంగన్ ఇంటిలో లేక లలిత ఇంటిలో గడిపారు. అప్పుడప్పుడు మహాలింగం కూడా వాళ్ళ సంభాషణలో కలుసుకునేవారు. వాళ్ళ సంభాషణలలో, సామాన్యంగా, అధికంగా వ్యక్తిగత పరస్పర అనుభవాలు, గతకాల, భవిష్యత్తులో అభిలాషలు, ఇక సాధింపవలసిన ప్రణాళికలు, చోటుచేసుకున్నాయి. అందువలన ఇద్దరూ ఇంకా లోతుగా, విశాలంగా ఒకరినొకరు అవగాహన చేసుకున్నారు.

మహాలింగం కోర్టుకి వెళ్ళే మార్గంలో, మౌంట్ రోడ్డులో, లలితని 'మనోన్మణి' పత్రిక కార్యాలయం ముందు దిగబెట్టారు. అక్కడ ఆకస్మికంగా ఆమె పనులు ముగించిపోవడం జరిగింది. దానితోబాటు ఆ భేటీగురించి కొత్తగా చాలా ఉత్తరాలు వచ్చివున్నాయి. సారంగన్ని చూడడానికి ఇవన్నీ కారణమయ్యాయి.

'ఇవాళ సాయంకాలం కాలేజీలో జరగబోయే కళా ప్రదర్శనలో సారంగన్ని తప్పకుండా కలుసుకుంటాం, మరిప్పుడు ఎందుకు అతన్ని చూడాలని పరుగెట్టాలి?' అనే ఆలోచనలో లలిత తడబడుతూ ఇంటికి తిరిగి వెళ్ళాలని బస్ స్టాండ్ కి నడిచింది. అప్పుడే ఎదుట ఒక టాక్సీ వచ్చింది. ఆమె ఒక క్షణం కలవరపడి ఆ టాక్సీని ఆపింది. టాక్సీలో ప్రవేశించగానే ఆమెను చూసిన డ్రైవరు "ఎక్కడికి?" అని అడగ్గానే లలిత స్వయంప్రజ్ఞ లేకుండా "Egmore కి. . . " అని చెప్పేసింది.

తను ఇలాగ తరచుగా సారంగన్ని కలుసుకోవడం, అతన్ని సంప్రదించకుండా ఉండకపోవడం - వీటి గురించి తనకేర్పడిన బలహీనత - ఆమె గుర్తుచేసుకుంది; వెంటనే ఆమె మనసులో కలవరం, దేహంలో ఒక ఉద్వేగం లేచాయి.

వెళ్ళే దారంతా 'నేను సరైన తోవలో వెళ్తున్నానా?' అని లలిత వేదన పడుతూనే ఉంది.

లలిత టాక్సీనుంచి దిగి ఇంటి కాంపౌండులో ప్రవేశించినప్పుడు ముందు హాలులో ఉయ్యాలమీద కూర్చున్న శేషయ్యని చూసి నమస్కరించింది. శేషయ్య కనుబొమలు ఎత్తి, ఆమెను చూసి "ఎవరు, లలితకదూ? నీతో మాటాడాలనే నేను ఆలోచిస్తున్నాను, రామ్మా" అని పిలిచారు.

లలిత ముందు హాలుకి వచ్చింది. అతను లేచి వెళ్ళి సారంగన్ భేటీ ప్రచురమైన 'మనోన్మణి' సంచికని చెయిలో అందుకొని ఉయ్యాలమీద కూర్చున్నారు; కళ్ళద్దాలు తొడుక్కొని తను రేఖలు గీచి గర్తించిన కొన్ని వాక్యాలు చదివారు.

'ఇతనిదగ్గర చిక్కుకున్నాం, ఇతనేం అడుగుతారో?' అని కలవరపడుతూ లలిత అక్కడే నిల్చుంది.

అతను ఆమెని కూర్చోమని చెప్పారు.

"నేను ఈ వ్యాసం చదివాను. కర్ణాటక సంగీతం గురించి ఏమీ తెలియనివాడు ఏమేమో వాగుతాడు. దానికి మీరు ఇంత ప్రాముఖ్యం ఎందుకు ఇవ్వాలి? ఎందుకంటే, వాడికి దేనిగురించీ ఏ బాధ్యతా లేదు . . . మీకది ఉండాలి, ఒక పత్రికకి తప్పకుండా ఆ బాధ్యత ఉండాలి . . . " అని అతను ఆరంభించారు.

"అతని అభిప్రాయంని పూర్తిగా నేనూ, ఈ పత్రికా అంగీకరించలేదే? ఒక కొత్త ఉద్దేశ్యం అనే వంకలో మేం దాన్ని ప్రచురించాం, అంతే . . ." అని లలిత మర్యాదగా తన స్థితిని, పత్రిక స్థితిని తెలియజేసింది. కాని ఆమె చెప్పి ముగించడానికి ముందే అతను దాన్ని నిరాకరించి తల ఊపారు:

"అజ్ఞానంలో కొత్త, పాత అని ఏమైనా ఉందా?"

ఇప్పుడు లలితకూడా తీవ్రంగా జోక్యం చేసుకుంది:

"ఇతరులలాగ 'ఇది అజ్ఞానం, ఇది మూర్ఖత్వం' అని మేం ఒక అభిప్రాయం గురించి తీర్పు చెప్పలేం. మీ కొమారుడు ఉద్దేశ్యంని ఒక తండ్రిగా అంగీకరించడానికి, నిరాకరించడానికి మీకు హక్కు ఉంది. ఆ విధంగా, లేక ఆ అభిప్రాయంకి విరుద్ధంగా ఎద్దైనా సరే, అదికూడా మేం ప్రచురిస్తాం . . . కావాలంటే, మీరూ రాయవచ్చుగా?"

శేషయ్య కొంచెంసేపు ఆమె మొహం తేరిపారి చూసారు. "హూం, కాలం చెడిపోయింది . . . " అని గొణుక్కుంటూ ఒక నిట్టూర్పు వదిలారు.

"ఇటువంటి ఆలోచనలకి జవాబు చెప్తే వాటిని గౌరవించినట్టనిపిస్తుంది. నిజమైన జ్ఞానస్తులు మూర్ఖులతో వాదించరు. నాకంటే కర్ణాటక సంగీతంలో పేరుమోసినవారు ఈ అబద్ధాలని ఆ ధోరణిలోనే క్షమించివున్నారు. కర్ణాటక సంగీతం అనేది ఒక పవిత్రమైన కోవిల వంటిది. దాన్ని తిట్టి, ఖండించే కూతలు మన బజారు వీధుల్లో, మురికివాడల్లోనే చెలామణి అవుతాయి; అవి కోవిలలోకి ప్రవేశించడం ఏ నాడూ జరగదు. ఐనా, మీకోసం చెప్తున్నాను, వినండి. మన సంగీతం చాలా పురాతనమైనది. వీడు చెప్తున్నట్టు బాహ్యభావనలు పురిగొల్పే సంగీతం కావాలంటే - మన గ్రామాల్లో, తాగేసి, మత్తెక్కి, జనులు బాకాబాజా బజంత్రీలతో ఆడుతున్నారే - అలాంటిది ఇక్కడా ఉంది. నేను పాశ్చాత్య సంగీతంని చులకన చేసి మాటాడుతున్నాని అపార్థం చేసుకోవద్దు. 'దానితో మన సంగీతంని సరిపోల్చి మన సంగీతంని అవమానించకూడదు' అని అంటున్నాను, అంతే . . .

"వివాదాలనే మాటకొస్తే అవి జ్ఞానంని ఆధరించి జరగాలి. పాశ్చాత్య సంగీతం మానవనీయమైనది. మనది ఈశ్వరీయమైనది. నాస్తికులు ఈశ్వరుడిని తిరస్కరించడం

నాకు బోధపడింది. కాని దేవునికంటే మానవుని లోపాలే మేలు అనే వాదంతో ఆస్తికులు ఎలా ఏకీభవించగలరు? ఒక కళగురించి తెలుసుకోవాలంటే ముందు దాని లక్ష్యం తెలుసుకోవాలి, అవునా? మన సంగీతం గురి మానవుని ఆత్మని పైకెత్తడం . . . భిన్నమైన రెండు కళలని సరపోల్చాలనే ప్రయత్నంలో ఇది గొప్ప, అది తక్కువ అని వాదించడం పిల్లాటతనం. ఎందుకంటే లక్ష్యం భిన్నమైతే, ప్రకృతికూడా భిన్నంగానే ఉంటుంది. మన సంగీతం వేరే సంగీతంనుంచి భిన్నంగానే ఉంటుంది. మన సంగీతం వేరొక సంగీతంనుంచి తీసుకోవడం, వేరొక సంగీతంకి ఇవ్వడం - ఇది జరుగుతూనే ఉంది. ఇక, పరిణామం గురించి అడుగుతున్నారా? వినండి, కర్ణాటక సంగీతంకీ ఒక పరిణామం ఉంది. మీరివాళ వింటున్న కర్ణాటక సంగీతం ఇలాగే పుట్టిందనుకున్నారా? పాశ్చాత్య సంగీతంని మీరు శాస్త్రీయంగా పరిశోధించినట్టు కర్ణాటక సంగీతంని విమర్శించాలి . . . మన సంగీతంలో రౌద్రం, శృంగారం, పోకిరీతనం లేవని వీడు నింద మోపుతున్నాడు. అది ఎలాగ ఉందంటే, ఒక మహత్తైన జ్ఞానిని చూసి 'ఇతనికి అసలు కోపమే రాదు, ఇతను ఎవరినీ తిట్టరు, ఇతనేం మనిషి?' అని అడుగుతున్నట్టుంది." తర్కరీతిగా ఆరంభించిన శేషయ్యని ఇప్పుడు ఆవేశం ఆవరించుకుంది.

అతని న్యాయమైన ధర్మావేశంముందు వాదించడానికి లలితకి ధైర్యం లేదు. అతను ఇంకా చెప్పారు:

"నాకు వాడిగురించి, వాడి కల్పనలు, ఊహలు గురించి ఏ విచారమూ లేదు. కాని, లలితా, మీరొక స్త్రీ. ఒక దేశం నాగరికత స్త్రీలలోనే ఉంది. ముఖ్యంగా మన భారత దేశంలో అది భారత స్త్రీలని నమ్ముకొని ఉంది . . . ఇంగ్లీషు చదువు చదివి విదేశంకి వెళ్ళివచ్చి తెల్లదొరల్లాగ ఈ దేశంలో మగవాళ్ళే సూటు బూటూతో తిరగడం మనం చూస్తున్నాం. స్త్రీలు ఎంత గొప్ప చదువు చదివినా ఈ దేశపు స్త్రీలలాగే ఉంటున్నారు. అందువలనే దీనిగురించి వాడితో వాదించడం నాకిష్టంలేదు. నేను కఠినంగా మాటాడుతున్నానని మీరు బాధపడకూడదు. ఈ వ్యాసం మీరు రాసారనే కారణంవలనే నేను చదివాను. దాన్ని చదివిన తరువాత 'మీరు కూడా వాడి అభిప్రాయాలు పూర్తిగా అంగీకరించారేమో?' అని నాకు బెంగ కలిగింది. అందువలనే దీనిగురించి మీతో

మాటాడాలని నిశ్చయించాను . . . నేను చెప్పేది మీకు బోధపడిందా?" అని ఆమెని చూసి శేషయ్య చిరునవ్వు నవ్వారు.

అతని మాటలు విని లలిత మనసు కలవరకంపగా మారిపోయింది. "నాకు సంగీతం గురించి ఎక్కువగా ఏమీ తెలీదు . . . " అని హీనస్వరంలో గొణుకుతూ లేచింది.

"ఐతేనేం?మీకు మన కళలు, సాంస్కృతిక పరంపర గురించి తప్పక తెలిసివుండాలి, అవునా? వాటిని మించి, వాటికి విరుద్ధంగా ఏ కళా లేదు. వాడు చెప్తున్నది అలాగే ఆమోదించకుండా మీరు వాడితో మాటాడాలి . . ." అని అంటూ అతనూ లేచి ఆమెకి శెలవిచ్చారు.

అప్పుడు మేడమీదనుంచి దిగివస్తున్న మురళి శేషయ్యని, లలితని చూసీచూడనట్టు, అందరిమీదా కోపంతో హాలు దాటి వెళ్ళాడు. శేషయ్య వాడి వీపుని తేరిపారి చూసి తనలో నవ్వుకున్నారు.

మురళి వ్యాపార ప్రణాళికని శేషయ్య తిరస్కరించిన తరువాత వాడు తను స్వతంత్రంగా వ్యాపారం చెయ్యాలని నిశ్చయించాడు. అందుకు ఆస్తిలో తన వంతు అడిగినప్పుడు, అతను నవ్వుతూ "సరే, చూద్దాంలే . . . " అని బదులు చెప్పారని వాడికి కోపమని అతను తెలుసుకున్నారు. ఒక నెలగా వాడు ఇంటిలో భోజనం చెయ్యడంలేదని శేషయ్యకి తెలుసు. కాని వాడు తనతో సంప్రదించకుండా తన భార్యని పుట్టినిల్లుకి పంపించాడని తెలిసినప్పుడు అతనికి కోపం కలిగింది.

బాలాంబ మాత్రం తరచుగా అతనిదగ్గరకి వచ్చి "వాళ్ళు పిల్లలుకదా, ఇలాగే ఉంటారు. మనమే సర్దుకుపోవాలి . . . " అని సమాధానం ఇచ్చింది.

కొంచెం సమయం ముందు పిల్లవాడు కణ్ణన్ని సోఫాలో కూర్చోబెట్టి ఎదుట నిలబడి వయలిన్ వాయించుతున్న సారంగన్ లలిత రావడం Air Condition గదిలోని కిటికీద్వారా చూసాడు.

వయలిన్ సంగీతం వింటూ ఆనందిస్తున్న పిల్లవాడిని చూసి అదే సమయంలో రాబోయే లలిత సాహచర్యం వాడిని ఇంకా తీవ్రంగా ఉత్సాహపరచింది.

ఆ తరువాత చాలా సేపు ఆమె రాకపోవడం గమనించి - ఆ కాంపౌండులో ముందున్న ప్రధాన గృహంలో ఆమె ప్రవేశించిందని ఊహించి - అతనికి కొంచెం నిరాశ కలిగింది.

టాక్సీనుంచి దిగివచ్చిన లలిత తిన్నగా ఇక్కడ రాకపోవడం వలన తన తండ్రి ఆమెతో మాటాడుతున్నారని సారంగన్ గ్రహించాడు. తనే అక్కడకి వెళ్ళాలనికూడా అతని మనసు, దేహమూ తహతహలాడాయి. లలిత తన తండ్రిని చూడడానికి మాత్రం ఇక్కడికి వచ్చివుంటుందా? తప్పకుండా తన్ను చూడకుండా ఆమె వెళ్ళదనే నమ్మకంతోబాటు తన తండ్రి ఆమెతో తనగురించి ఏదైనా చెప్పడానికి అడ్డుగా తను వెళ్ళి అక్కడ నిలబడకూడదని సారంగన్ ఆమె రాకని ఎదురుచూస్తూ అర్ధగంటకి పైగా తన గదిలోనే కాచుకొనివున్నాడు.

భుజంమీదున్న ఫిడిలుని సోఫాలో పెట్టి కిటికీదగ్గర నిలబడి సారంగన్ తలవొంచి గదిలో ఇలా అలా సంచరించడం కణ్ణన్ తేరిపారి చూసాడు.

గభీమని అర్ధంకాని వదరుభాషలో సారంగన్ని పిలిచి తన పక్కన ఉన్న ఫిడిలుని కణ్ణన్ చూపాడు. సారంగన్ సోఫాకి సమీపంలో కాళ్ళు ముడుచుకొని కూర్చొని, కణ్ణన్ నుదుటని ముద్దాడాడు. పిల్లవాడి చిన్నిచేతులకి కమాను అందించి వాయించమన్నాడు. అప్పుడు ఆ చిన్నిచేతులవలన లేచిన అపశ్రుతిని ఏదో గొప్ప సంగీతంలాగ భావించి సాపంగన్ చప్పట్లు కొట్టాడు:

"Oh, marvelous!"

కొంచెంసేపు పిల్లవాడితో ముచ్చటలాడి తలెత్తి బయటకి చూసాడు.

'అదిగో, ఆమె వస్తోంది. కాని లలిత మొహంలో ఆమె వచ్చినప్పుడు తను చూసిన సంతోషం లేదు. గూఢంగా ఏదో ఆలోచిస్తూ, కలవరపడుతూ నడుస్తూంటే ఆమె కనుబొమలు నిక్కబొడుచుకున్నాయి. 'నన్ను తరచుగా చూడడానికి ఆమె రావడంగురించి నైనా ఏమైనా చెప్పారేమో?' అని అపరాధభావంతో సారంగన్ బయటకి వచ్చి తలుపు తెరచే సమయం లలిత వచ్చి మెల్లగా తలుపు తట్టింది.

అతన్ని చూడడానికే రాత్రంతా కాచుకొనివున్నట్టు సారంగన్ని చూడగానే ఆమె మనసూ, మొహమూ, వికసించాయి. నవ్వుతూ అతని ఎదుట లలిత నిల్చొనివుంది.

"Good Morning"

"Good Morning, please come in."

సారంగన్ ఆమెకి స్వాగతం చెప్పాడు.

శీతలమైన గది తలుపు తెరచినవెంటనే బయటనున్న ఉష్ణం వాడిని, లోపలి చల్లని గాలి లలితని తాకాయి.

సారంగన్  రెండర్థాల మాటగా ఆమెకి చెప్పాడు:

"Oh, what a warm welcome!"

అలాగ అనడం ఆంగ్లభాషలో ఎంత సార్ధకంగా ఉంది! అని తలబోస్తూ, లలిత నవ్వుతూ వాడికి జవాబు చెప్పింది.

"Oh, what a cold reception!"

"దయచేసి మీరు దీన్ని ముందు తమిళంలో తర్జుమాచేసి అవగాహన చేసుకోవాలి" అని లలిత వేడుకుంది.

ఆ భాషా సామ్యంగురించి ఆలోచిస్తూ ఇద్దరూ నోరుతెరచి నవ్వుకున్నారు.

"మీరు రచయిత్రికదా? భాషలోని సూక్ష్మభేదాలన్నీ మీకు బాగా తెలుసు" అని సారంగన్ ఆమెను పొగడాడు. సోఫాలో కూర్చోమని చెప్పాడు.

"భాషలోని వట్టి సూక్ష్మభేదాలు తెలిసినవారు పండితులు . . . భావనలోని నిజం గుర్తించినవారు, దాన్ని ఇతరులకి బోధించేవారు - వాళ్ళే రచయితలు" అంది లలిత.

"రచయితలకి మాత్రమేకాదు . . . కళాకారులందరికీ ఆ సంబంధం ఉంది." సారంగన్ ఆమె ఎదుట సోఫాలో కూర్చున్నాడు.

వాళ్ళిద్దరిమధ్య ఉన్నసోఫాలో కణ్ణన్ వయలిన్ మీద కమాను నొక్కడం లలిత ఇప్పుడే గమనించింది. "ఏంరా కణ్ణా, నువ్వూ మీ బాబాయ్ లాగ వయలిన్ వాయించుతావా?" అని పిల్లవాడితో ముద్దాడడం చూసిన సారంగన్ "ఎందుకు?" అని అడిగాడు.

కొంచెం సమయం ముందు శేషయ్య సారంగన్ సంగీత ప్రజ్ఞగురించి, అతని అభిప్రాయాలగురించి, కఠినంగా విమర్శించినది లలిత గుర్తుచేసుకుంది.

"నేను మీ నాన్నగారితో ఇంతసేపూ మాటాడుతూవున్నాను. అతనికి మీమీదా, నామీదా, చాలాకోపం . . . " అని చెప్పి లలిత సారంగన్ని తేరిపారి చూసింది.

'నేను ఊహించినది సరే. ఆమె ఇక్కడ రావడం గురించి అతను ఏమో చెప్పేసారు' అని అనుమానించిన సారంగన్ గాబరా పడకుండా "ఎవరు ఏమన్నా దయచేసి మీరు ఇక్కడకి రావడం ఆపేయకండి. మీరు రాకపోతే నేను మిమ్మల్ని వచ్చి చూడడానికైనా అనుమతి ఇవ్వండి. మీరు ఎక్కడున్నా నేను మీకోసం పరుగెత్తుకొని వస్తాను. మిమ్మల్ని చూస్తే నా ఆత్మకి ఒక విధమైన తృప్తి కలుగుతోంది. ప్రస్తుతం నేనొక నిరాకరింపబడిన జీవితం నడుపుతున్నాను. ఈ బాహ్యప్రపంచంతో నాకున్న పరిచయమంతా మీ వలనే . . . " అని మానసికంగా ఆమెను బతిమాలాడు.

ఆ కొన్ని క్షణాల మౌనంలో లలిత సారంగన్ ముఖంలో మార్పు చూసి అతని కలవరం తెలుసుకుంది. "What's wrong? మీరెలాగో ఉన్నారే?" అని అనురాగంతో అడిగింది.

"మరేం లేదు. నేను చెప్పానుగా, He still lives in a feudal society . . . " అని ఏదో చెప్పడానికి ఆరంభించి, మరే అనక ఒక నిట్టూర్పు వదిలి ఒక విధమైన విరక్తితో సారంగన్ తనలో నవ్వుకున్నాడు.

"అతనూ అదే అంటున్నారు. ఒక పురాతన కళని చులకనచేసి పాశ్చాత్య సంగీతంని మీరు పొగడుతున్నారని అతనికి కోపం. మీ అభిప్రాయం గురించికూడా అతనికి విచారం లేదు. 'ఈమెకూడా ఏకీభవించుతుందే?' అని ఆ భేటీ వ్యాసం రాసిన ఒకే కారణంవలన నన్నుకూడా అనుమానించి నాతో ఒక పెద్ద తార్కిక పోరాటంకి అతను సిద్ధమయ్యారు, నేను తప్పించుకొని వచ్చేసాను . . . " అని ఆల్లాడే ధోరణిలో దాన్ని లలిత వివరించింది.

సారంగన్ ఒక నిట్టూర్పు వదిలాడు. "నేను మరేదో అనుకున్నాను" అని తనలో గొణుక్కున్నాడు. "అసలు అతని వాదం ఏమిటి? నేను కర్ణాటక సంగీతంని చులకన చేసానని అతను నిరూపించగలరా? లేక దాని వంశపారంపర్యంని నేను నిరాకరించానని అంటున్నారా? సరే, అతను అసలు ఏమంటున్నారు?" అని శేషయ్య విమర్శ వినడానికి ఆతురతతో అడిగాడు.

"మీకేం భయం వద్దు. దీనిగురించి అతను మీతో ఇక వాదించరు. కాని మీ ఇద్దరిమధ్య నన్ను నిల్చోబెట్టి మీతో వాదించాలని పూనుకున్నారు."

"అలాగా? That's a good idea" అని ఒక కొత్త మనోభావం, ఉత్సాహంతో సారంగన్ చెప్పాడు: "దయ చేసి మనం ఈ వివాదం చాలా విపులంగా జరపాలి. అదే అన్నివిధాలా మంచిది."

ఒక పసిపాపలాగ ఉబలాటంతో అతనన్న మాటల్లోని గూఢార్థం తెలుసుకొని లలిత మనస్సు, దేహం పులకరించాయి; లజ్జతో, ఎర్రబారిన మొహంతో అతన్ని చూసింది.

అప్పుడే స్వయ ప్రజ్ఞలేకుండా ఏదో పనిమీద ఎక్కడికో వెళ్ళాలని బయలుదేరి తను ఇక్కడ ఇతన్ని చూడడానికి వచ్చేసిన సంగతి ఆమె గుర్తుచేసుకుంది. తన పెదవులపై చాటుగా పాకుతున్న చిరునవ్వుతో అతన్ని అడిగింది: "మీరు నన్ను ఇప్పుడు ఎదురుచూసారా?"

"అవును . . ." అని సారంగన్ తుంటరి నవ్వుతో జవాబు ఇచ్చాడు. "నేను నిత్యమూ మిమ్మల్ని ఎదురుచూస్తున్నాను."

"అదెలాగ?"

"నేను ఎవరినైనా ఎదురుచూస్తున్నాను అని అంటే అది మిమ్మల్ని మించి మరెవరూ కాదు. నాకు మరెవరున్నారు? మనసు విప్పి చెప్పాలంటే మిమ్మల్ని కలుసుకొని మీతో జరిపిన సంభాషణలే మనం మళ్ళీ కలుసుకొనేవరకూ నేను నెమరువేస్తూవుంటాను. మీరు నిత్యమూ నా చేరువలో ఉన్నట్టు నా కల్పన. మీరు ఇప్పుడు ఇక్కడికి రాకపోతే నేను తప్పకుండా మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చివుంటాను."

సారంగన్ ఇంకా ఏమో చెప్తాడని లలిత భయపడుతూ, సంభాషణ దిశ మార్చింది.

"అతను చెప్తున్నారు - 'మన కర్ణాటక సంగీతంలో రౌద్రం, వీరం - ఇంకా చాలా మానవజీవితంలోని గుణాంశాలని వ్యక్తపరచడం అసాధ్యం' అని మీరు అంటున్నారే - అది మన సంగీతంకి ఉన్న బలం అంటున్నారు. 'మన సంగీతం లక్ష్యం మానవుని ఆత్మని ఉద్ధరించడం' అని అతను అంటున్నారు. మీరన్నట్టు 'బాహ్యావేశాలు పురిగొల్పే సంగీతంని - బాగా తాగేసి, మత్తెక్కి, బాజాబజంత్రీలతో దొమ్మరులు మురికిపేటలో ఆడుతున్నారే - అక్కడ చూడవచ్చు' అని అంటున్నారు. ఇవన్నీ మీరు కర్ణాటక సంగీతంలో లోపం అంటున్నారు -అదెలాగ ఉందంటే ఒక గొప్ప జ్ఞానిని చూసి 'ఇతనికి

కోపమే రాదు, మానవ అల్ప గుణాలేవీ ఇతనికి లేవు. ఇతను అసలు మనిషేకాదు!' అని వాదించినట్టుంది అంటున్నారు . . . ”

“అవును. అతను ఇంకొకటి కూడా చెప్పారు: 'పాశ్చాత్య సంగీతం మానుష్యమైనది. మన సంగీతం దైవికమైనది. ఈ రెండిటిని సరిపోల్చి మన సంగీతంని అవమానించడం వట్టి పొగరెక్కిన అజ్ఞానం' అని అతను అంటున్నారు. ఎందుకంటే మన సంగీతం లక్ష్యం వేరే. ఉద్దేశం వేరైతే దాని స్వభావమూ వేరుగా ఉంటుంది. అలాంటప్పుడు స్వాభావిక గుణాలు వేరువేరుగావున్న పాశ్చాత్య సంగీతంని కర్ణాటక సంగీతంతో సరిపోల్చడం పిచ్చితనం అని అతను చాలా కోపంతో, బలవంతంగా వాదించారు.”

లలిత మాటలన్నీ గూఢంగా పరిశీలించే ధోరణిలో సారంగన్ అప్పుడప్పుడు చిరునవ్వుతో విన్నాడు. చాలామట్టుకు శేషయ్య చేసిన విమర్శ సారాంశంని పూర్తిగా చెప్పేసిన తృప్తితో లలిత మౌనం దాల్చింది.

“సరే, దానిగురించి మీరేమంటున్నారు?” అని సారంగన్ లలితని అడిగాడు.

“నిజం చెప్పాలంటే అతను అన్యాయంగా మిమ్మల్ని నిందించుతున్నారని నాకు కోపం వచ్చింది. నేనూ అతనితో కోపించుకున్నాను.”

లలితకి తనపై ఉన్న గాఢమైన అభిమానం, సానుభూతి గ్రహించిన సారంగన్ కృతజ్ఞతతో ఆమెను అడిగాడు: “అతని విమర్శ గురించి మీ అభిప్రాయం ఏమిటి?”

“అది అసలు ఒక విమర్శ కానేకాదు. మతం, దైవంకి సంబంధించిన ఒక నమ్మకం లాంటిది . . . నేను దాన్ని మూఢ నమ్మకం అని అనడం లేదు . . . ఎందుకంటే విమర్శకి మించి కొన్ని నమ్మికలు ఉన్నాయికదా? అలాంటిది . . . భారత స్త్రీలకి పాతివ్రత్యం గురించి ఒక నమ్మకం ఉందే, అలాంటిది. అందువలన వాటికి ఒక శక్తి ఉంటుంది. విమర్శ అని ఏదైనా వచ్చి దాన్ని ఎదిరించుతే, ఆ శక్తి విమర్శని పగబెట్టి ధ్వంసం చేస్తుంది. అందువలన ఆ నమ్మికలు విమర్శించడం వ్యర్థం! ఒకటి, మనం వాటిని పూర్తిగా అంగీకరించాలి, లేకపోతే అలాగే వదిలేయాలి. కాని దయచేసి కర్ణాటక సంగీతంలో అభిమానం ఉన్నవాళ్ళందరికీ ఇలాంటి మొండి అభిప్రాయం ఉందని అపార్థం చేసుకోవద్దు. ఈ భేటీ వ్యాసం ప్రచురణ తరువాత వచ్చిన ఉత్తరాలు మీరు చూసారుగా, అందులో చాలామంది కర్ణాటక సంగీతంలో అభిరుచి ఉన్నవారే! మీ

అభిప్రాయాల్లో ఉన్న సత్యం వాళ్ళు గ్రహించారు . . .  కలకత్తానుంచి ఒకతను రాసారు - కర్ణాటక సంగీతంలో అతను పేరు మోసినవారు . . . ” అని చెప్పి  తన  handbag నుంచి లలిత ఒక ఉత్తరం తీసి చదవసాగింది: “మతాలపై ఆధారపడిన సంగీతం పరిస్థితి అలాగే ఉంటుంది. మన దేశంలో మతసంబంధంలేని కళంటూ ఏదీ లేదు. మతం అనేది ఈ రోజుల్లో అర్థంలేని మాయగా మారిపోయిన తరువాత, నమ్మకం, ఆసక్తి లేని వట్టి సాంప్రదాయంగా అది ప్రతీ ఇంట్లో ఏదో ఒక మూల లేక ప్రతీ మనిషి మనసు చీకటిలో దాక్కున్నప్పుడు, అది పెంచిన కళలు నిశ్చలమై పోవడంలో ఏ ఆశ్చర్యమూ లేదు.”

ఆమె ఇంకా చదివింది:

“పాశ్చాత్య సంగీతం అభివృద్ధికి ఐరోపా పారిశ్రామిక పరిణతి, దానికి ముందు జరిగిన సామాజిక ఆందోళనలు దోహదం చేసాయి. మన కళలకి అటువంటి ప్రాప్తి లేదు. ఇక్కటి సామాజిక, రాజకీయ ఉద్యమాలనుంచి అవి రక్షించబడ్డాయి.

“‘మతప్రమేయం లేని ప్రభుత్వం’ అని మనం వినడం మన దేశంకి స్వాతంత్రం వచ్చిన తరువాతనే. కాని ఆ పదబంధంని అనుసరించిన జీవితశైలి ఇంకా మనలో రూపొందలేదని మనం ఒప్పుకోవాలి. Vatican తప్ప తక్కిన దేశాల్లో మతం వేరే, ప్రభుత్వం వేరే; కోవిల అంటే church మాత్రమే. ఇక్కడ ఏదైనాసరే మనం దాన్ని కోవిలగా చేసేసాం. అందువలనే కోవిలకి కూడా గణ్యం లేకుండా పోయింది . . .

“మన పురాణ జీవితశైలి గొప్పగా ఉండవచ్చు. కాని మనం ఒక కొత్త శతాబ్దంలో, కొత్త ప్రపంచంలో, ఒక నూతన జీవితం జీవించుతున్నప్పుడు వొట్టి పురాతన గౌరవం మనకి దోహదం చెయ్యదు. భారతదేశంలో విద్యావంతులు, తత్వవేత్తలు అని పేరుమోసినవారుకూడా ఈ విషయంగురించి సముచితంగా ఆలోచించడం లేదు. ఈ నిజంని మొట్టమొదట తలపోసినవారు స్వామీ వివేకానంద. ముఖ్యంగా మన సంగీతంగురించే అతను చాలా చెప్పివున్నారు. Mr. సారంగన్ అభిప్రాయలతో చాలా వివేకానంద అభిప్రాయాలు సమ్మతమైవున్నాయి. ‘ఆరంభంలో వినడానికి  పాశ్చాత్య సంగీతం లయలేని కూతలాగ మన చెవులకి వినిపిస్తాయి’ అని స్వామి అన్నారు. ‘పరిచయంలేని భారతీయుల చెవులకి అలాగే ఉంటుంది’ అని చెప్పిన తరువాత అతనే పాశ్చాత్య సంగీతం కీర్తిగురించి వివరంగా మాటాడారు.

'అవును. కొత్త మార్పులు నిర్బంధంగా మన జీవితశైలిలో ప్రవేశించకూడదు. వాటిగురించి ఒక నూతన అవగాహన పండితులమధ్య లేవాలి. ఆ అవగాహనలో పక్వమైన ఒక సిద్ధాంతంలో సాహిత్యం, కళలు రూపొందాలి. అప్పుడే మన జీవితంకి, లక్ష్యంకి మధ్య ఉన్న విరుద్ధాలు తీరుతాయి. కాని భారతదేశంలో ఎల్లప్పుడూ జీవించే అందరు భారతీయులకి లక్ష్యం అంటే 'మోక్షం', మరేం కాదు! సన్యాసికి గురి ఏమిటో అదే సంసారికికూడా! లక్ష్యం అన్నప్పుడు అది ఎటువంటి ఆసక్తి లేకుండా మాటవరుసకని నిరర్థకంగా నిలిచిపోయింది. ప్రతీ భారతీయుడు - ముఖ్యంగా తమిళుడు - ఒకే మనిషి - అనేక గూడుల్లో కాపురం చేస్తున్నాడు. ఎదైనా సరే, మనకి పైపైన చూసి దాన్ని సరిచెయ్యాలని ఉంది; మనం ఎదీ లోతుగా ఆరసించడం లేదు. ఎదైనా చేసి మార్పులు రావాలని తొందరపడుతున్నాం. అలంటివారికి మనం కృతజ్ఞత తెలియజేయాలి. ఎందుకంటే ఒక నూతన అవగాహనకి మన దేశం పూర్వకాలంనుంచి కాచుకొనివుంది. దానికి దూతలే మన జవహర్ లాల్ నెహ్రూ వంటి నాయకులు. కాని మనదగ్గర ఉన్న పెద్ద చెడ్డ అలవాటు: ఎదైనా సరే, దైవీకరించడం. పూజించడంలో మనం సమర్థులం, వృద్ధిపొందడంలో కాదు.

"కాని 'జీవితంని మించి మరొక శక్తి లేదు' అని సారంగన్ లాంటివారు, అతని అభిమాన రచయిత్రి లలిత లాంటివారు గ్రహించివున్నారు. జీవితమే వీరికి కొత్త ప్రతిమగా రూపమిచ్చింది. ఇప్పటిలో వీరే విప్లవాత్మక విత్తనాలు నాటుతున్నారు. అవి తప్పకుండా పెరిగి సాయం చేస్తాయి. ఈ శోధనలో వెనకాడే అపాయమూ ఉంది. అందులో దృఢంగా నిలబడాలని ఇక వచ్చే తరం తరపున నేను Mr. సారంగన్ని వేడుకొంటున్నాను" అని ఆవేశంతో, తీవ్రమైన కంఠధ్వనితో ఆ ఉత్తరంని ఒక శాసన ప్రకటనలాగ లలిత అతనికి చదివిచూపింది. అది తమిళంలో రాయబడినా అందులోని భావనలకి ఆంగ్లభాషతో బాంధవ్యం ఉండడం వలనా, ఆ అభిప్రాయాలతో దీర్ఘమైన పరిచయం ఉండడం వలనా, అనువాదం లేకుండానే ఆ ఉత్తరం సారంగన్ కి స్పష్టంగా బోధపడింది.

"లలితా, దయచేసి ఆ ఉత్తరం నాదగ్గర ఉండనీ. ఎంత అద్భుతమైన భావనలు!" . అని ఆతురతతో సారంగన్ ఆమె ముందు చెయి చూపాడు.

"మీకు ఇవ్వాలనే దీన్ని తీసుకొనివచ్చాను" అని లలిత ఆ ఉత్తరం అతనికి అందించింది.

ఉత్తరం రాసినవారి పేరు చూసి సారంగన్ ఒకమారు గట్టిగా నోరు తెరచి పలికాడు: "సుందరం."

అతనికి జీవితంమీద ఒక కొత్త నమ్మకం కలిగింది. ఈ ఉత్తరం చదివిన తరువాత ఫిన్లాండు దేశంలో స్వాతంత్ర ఉద్యమం విజయంకి తోడ్పాటుగా 'జీన్ సెబిలియన్' కల్పించిన పద్యం 'ఫిన్లాండియా' వింటున్నట్టు అతనికి ఉత్సుక కలిగింది. తనకోసం ఆమె ఆ ఉత్తరం తెచ్చినందుకు లలితకి ఇంకొకసారి సారంగన్ తన కృతజ్ఞత తెలియజేసాడు.

చాలాసేపు తరువాత ఇప్పుడే సారంగన్ మళ్ళీ కణ్ణన్ పక్క తిరిగి చూసాడు. నిద్రపోయే కళ్ళని చిన్ని వేళ్ళతో రుద్దుకుంటూ, ఆవలించే పసివాడి అందం చూసి లలిత ఆనందించింది.

"నిద్రపోవాలా కణ్ణా?" అని పిల్లవాడిని ఆమె రెండు చేతులా పట్టుకొని, ఎత్తి, తన భుజంమీద వేసుకుంది.

సారంగన్ కూడా లేచి ఆమె దగ్గరకి వచ్చాడు. లలిత భుజంమీద నిద్రపోతున్న కణ్ణన్ తలజుత్తుని అభిమానంతో లాలించుతూ "I am sorry, నువ్వు చాలాసేపు నా వయలిన్ వినాలని కాచుకొనివున్నావ్ కదూ? Now, I shall play for you!" అని లలితని చూస్తూ సోఫామీదున్న వయలిన్ అందుకొని భుజంమీద చేర్చుకొని గంభీరంగా నిలబడ్డాడు.

కణ్ణన్ని గుండెలో కౌగిలించుకొని ఆ సంగీత వర్షంలో మునిగి, మునిగి, ఆనందించాలని లలిత సిద్ధంగా సోఫాలో కూర్చొనివుంది.

త్వరలో గభీమని ఒక పూలగుత్తి తనమీద ఒలకబోసినట్టు లలిత ఉద్రేకంతో కళ్ళు మూసుకుంది. సారంగన్ మైమరచి వెర్రిగా చెవులకింపైన కల్పనా కృతులు ధారపోసాడు.

అవును, ఆ వయలిన్ విల్లు అదుముతున్నవి నరాలుకదా?

చిత్రం, శిల్పం లాంటి కళలతో ఎటువంటి సంబంధమూ లేకపోయినా సారంగన్ పారీస్ నుంచి వచ్చాడనే ఒకే కారణం వలన, 'మనోన్మణి' పత్రికలో ప్రచురమైన ఆ భేటీని చదివిన తరువాత అతని నూతన సిద్ధాంతాలపై తనకేర్పడిన గౌరవం వలన, ఆ కళాశాల ప్రధానాధ్యాపకుడు Mr. మేనన్ ఒక welcome party కి ఏర్పాటు చేసారు.

ఆ కళాశాల ప్రవేశ ద్వారంలో ఒక పెద్ద పలకలో 'ఈ రోజు కార్యక్రమం' అని ఇంగ్లీషులో రాయబడివుంది. అందులో ఆ సాయంకాలం కార్యక్రమంలో సారంగన్ని ఉపన్యాసకుడుగా ప్రకటన చేసారు. విషయప్రధాన అంశం: Modernity అని గుర్తించారు.

ప్రత్యేకంగా ఆహ్వానింపబడిన ఒక చిన్న గుంపు మాత్రం అక్కడ గుమిగూడివుంది. మనకి రోజువారీ పరిచయమైన కళ్ళకి చోద్యంగా కనిపించే ధోరణిలో దుస్తులు ధరించిన ఆడవారు, మగవారు, అక్కడ ఉన్నారు. వారిలో ఎక్కువమంది తమకి నూతన కళలతో పరిచయం ఉందనే ఒక అబద్ధంని సహజంగా తెలియజేసే నిపుణులు. ఆ కళాశాలలో చాలామంది విద్యార్థులు చింపిరి జుత్తు, చిన్న గడ్డం, బిగించిన చొక్కాయిలు, ఇజారులతో దర్శనమిచ్చారు.

ఇదొక వేరే లోకం! ఈ లోకంలో సంచరించే ప్రజలకి ఒక అపూర్వత ఉంది. వీరిలో చాలామంది ఇంగ్లీషులోనే మాటాడుతారు; అందులోనూ సరళంగా ఒక అన్య ధోరణిలో ఇంగ్లీషు మాటాడుతారు.

ప్రదర్శన హాలులో నూతన శైలిలో వందలకొలది చిత్రలేఖనలు గోడలని వరుసవరుసగా అలంకరించుకున్నాయి; నవీన సంప్రదాయంలో శిల్పాలు, పెద్ద శిల్ప ప్రతిమలు, ఇంకొక హాలులో నిలబెట్టివున్నాయి. వేరొక హాలులో, ఒక వైపు నవీన శైలిలో చీరలు వేలాడాయి. మరొక పక్షం వీటికి ఆధారమైన స్మారక గుర్తులుగా మట్టి బొమ్మలు, శృంగారించిన మట్టి పాత్రల విరిగిన ముక్కలు, గుహలోని చిత్తరువులు ఉన్నాయి.

ప్రదర్శన హాలుకి వెనుక వరుస వరుసగా మేజాలమీద తినుబండారాలు వినియోగించడానికి మనోహరమైన యువతులు నిల్చొనివున్నారు. చెయిలో పింగాణి

కంచంతో క్యూ లో నిలబడివున్న అతిధులు ఆ యువతులతో నవ్వుతూ, పిచ్చాపాటీ చేస్తూ తమకి కావలిసినది కొనుక్కొని ముందుకు సాగుతున్నారు.

ముందు హాలులో loud speaker లో పాశ్చాత్య సంగీతం ప్రసారమౌతోంది.

కళాశాల ప్రధానాధ్యాపకుడు Mr. మేనన్ ఒక చెయిలో పింగాణి కంచెంనుంచి సమోసాని కొరుకుతూ నూతన శైలిలో నేయబడిన ఆ చీరలగురించి కొందరు యువతులకి ఇంగ్లీషులో వివరించారు. అతనికి వయస్సు యాభైకి పైగా, అరవైలోపల, ఉండవచ్చు. వయసు చెల్లినట్టు కనిపించినా అతని దుస్తులలో, స్పందనలలో యౌవనం, నవీనత రాణించాయి. చాలా బక్కచిక్కిన దేహం; తీక్ష్ణ మాసిన కన్నులు. కట్టుడు పళ్లు వలన అతను ఏమాత్రం నోరు విప్పి మాడాడినా ఆ కట్టుడు పళ్ళు ప్రత్యేక స్థాయిలో ఆ నోటిలో మ్రోగాయి! అతను అలవాటుగా ఆవేశంతో మాటాడే మనిషి. అందువలన నిత్యమూ ఆ దేహంలో ఒక వొణుకు; మాటాడినప్పుడు ఆ వొణుకు తెలియకూడదనే ప్రయత్నంలో - ఆ సంకోచం వలనే - అతను ప్రతీ మాట నొక్కిచెప్పినట్టనుపిస్తుంది!

“ఈ paintings ఎలాగో, అలాగే ఈ చీరలు కూడా ఒక కళాకారుని కల్పనలో సృష్టించబడినవి. ఈ design లో ప్రపంచంలో ఈ ఒక చీర మాత్రమే ఉంది. ఈ చిత్రంలాగ ఇంకొకటి లేనేలేదో, అలాగన్నమాట!” అని అంటూ అతను ఆ చీరని ఒక చెయిలో తీసుకొని, విప్పి చూపించారు.

ఆ యువతులు దాన్ని చూస్తూనే, కొంచెం వెనుక తిరిగి, దూరంనుంచి దాన్ని శ్లాఘించారు.

“Oh, marvelous!” అని ఒక అమ్మాయి - పొగడింది.

అప్పుడే కళాశాలముందు - ఉపన్యాసం కోసం కుర్చీలు అమర్చబడివున్న బహిరంగ స్థలంలో వచ్చి నిలబడిన ఒక టాక్సీనుంచి - లలిత, సారంగన్ దిగారు. లలిత ఆతురతతో మేనన్ని వెతుక్కుంటూ లోపలికి పరుగెత్తింది.

గభీమని లలిత వచ్చి తన చెయిని తాకగానే ఆ యువతులతో మాటాడుతున్న మేనన్ అదిరిపడి తిరిగిచూసారు.

“Oh, Lalita . . . ” అని ఒక తండ్రి వాత్సల్యంతో అతను ఆమె చెయ్యిని తట్టారు.

“క్షమించండి. నేను ఇతన్ని మన ఇవాళ main speakerకి పరిచయం చెయ్యబోతున్నాను . . . ” అని ఆ యువతుల దగ్గర అనుమతి కోరుతూ లలిత మేనన్ చెయిని తన పిడికిలితో అణచుకొని ఆ గుంపులలో దాగియున్న సారంగన్ని వెతుకుతూ ముందుకు నడిచింది.

కొంచెం దూరంలో ప్రదర్శన రంగం ప్రవేశ ద్వారంలో నిలబెట్టిన ఒక శిల్పంని చూస్తూ, కబిలవర్ణంలో సూట్ ధరించిన సారంగన్ని ఆమె సూచించడానికి ముందే అతను గుర్తుపట్టేసారు.

“అతనేకదూ?” అని మేనన్ సారంగన్ వైపు చెయి చాటినప్పుడు అతనూ తిరిగి చూసాడు. “I am sorry . . .  “ అని తన్ను వెతకడానికి అవకాశమిచ్చినందుకు క్షమాపణ కోరుతూ సారంగన్ వాళ్ళని సమీపించాడు.

లలిత ఇద్దరినీ, ఒకరకొకరిని, పరిచయం చేసింది.

“చాలారోజులుగా మిమ్మల్ని కలుసుకోవాలని నేను కాచుకొనివున్నాను” అని అంటూ మేనన్ అతనితో కరచాలనం చేసారు.

ఆ తరువాత అతను ప్రదర్శన చూడడానికి సారంగన్ని లోపలికి ఆహ్వానించారు. సారంగన్ ఆతురతతో అన్నీ చూసి ఆనందించాడు. అతని శ్లాఘన తన మనస్సులో పొగడుతూ లలిత అతని వెనుక నడచింది. కొన్ని కొత్త వర్ణచిత్రాలు చూసి లలిత పరవశమవడం సారంగన్ గమనించాడు.

మధ్య, మధ్య, మేనన్ కొన్ని చిత్రలేఖనలు, కొందరు ప్రముఖులు సారంగన్ కి పరిచయం చేసారు; బహూశా, ప్రతీ నిమిషం ఎవరో ఒకరిని అతను కొత్తగా పరిచయం చేస్తూ వచ్చారు. సారంగన్ అందరితో కరచాలనం చేసి ఉపచార వార్తలు పరివర్తన చేసుకున్నాడు.

ఒక గుంపులోనుంచి “Hello, Mr. Sarangan!” అనే అఱుపుతో పరుగెత్తుకొని వచ్చిన మాధవి  సారంగన్ చేతులు గట్టిగా పట్టుకుంది. దాన్నిచూసి ఈ సారి లలిత మనస్సులో, మొహంలో ఏ కలవరమూ లేదు.

ఆమె మనస్సులో ‘ఇక సారంగన్ తో నన్ను తప్ప మరెవరికీ ముఖ్యమైన స్నేహభావం లేదు!’ అనే ధైర్యం వచ్చేసిందా?

మాధవి సారంగన్ కి చెప్పింది: "నేను మీ lecture వినడానికి మాత్రం వచ్చాను. నాకీ Modern Art గురించి ఏమీ బోధపడదు. అంతా పిచ్చితనంగా ఉంది."

ఆమె మేనన్ తో Modern Art గురించి చులకనగా ఏదైనా మాటాడుతుందో అనే భయంతో లలిత ఆమెని మేనన్ కి పరిచయం చేసింది: "Please, meet Miss. Madhavi, our Ladies Club Joint Secretary . . . ఇతనే మేనన్, ఈ కాలేజీ Principal."

బాగా నెరసిన జుత్తు, చిన్నగడ్డం, బక్కచిక్కిన దేహంతో అరవై ఏళ్ల మనిషిగా కనిపించే వ్యక్తి కాలేజీ Principal అని కల్పనకూడా చెయ్యలేని మాధవి, వినయంతో అతన్ని నమస్కరించింది. Modern Art గురించి తన అభిప్రాయం గుర్తుచేసుకొని అతనికి చెప్పింది:

"Mr. Principal, నాకు బోధపడనిది నేను 'నాకు బోధపడదు!' అని చెప్తే మీకు బాధగా ఉందా?"

అతను స్వాభిమానంతో జవాబు ఇచ్చారు.

"లేదు. తప్పకుండా లేదు.  మీకు బోధపడనిది బోధపడదని చెప్పడానికి మీకు విచారం వద్దు. కాని చాలామంది బాగా బోధపడినట్టు నటించుతున్నారు! అదే ముచ్చటగా ఉంది!" అని కళ్ళు గీటుతూ అతను నవ్వారు.

"ఇది చాలా అద్భుతంగా ఉంది" అని ఒక శిల్పంని సారంగన్ వారికి చూపాడు.

స్పష్టంగా ఏ మానవ అంగమూ చూపకుండా, ఒక యువతీయువకుల జత కౌగిలించే భంగిమ ఆ శిల్పంలో కానవచ్చింది. ప్రేమ తీవ్రతని ప్రసరింపజేసే ఒక స్వరూపంగా ఒక శిల్పకారుడు తన కరలాఘువం, కల్పనతో, ఒక కవితగా సృష్టించిన ఆ శిల్పంని సారంగన్ అనేక కోణాల్లో చాలా సేపు పరిశీలించి ఆనందించాడు.

మాధవి కళ్ళకి ఆ శిల్పం 'అర్ధంకాని వట్టి ముద్ద' గా కనిపించింది.

సారంగన్ మేనన్ కి చెప్పాడు: "కొన్ని సమయాల్లో సంగీతం వింటున్నప్పుడు నాకు ఇటువంటి దృశ్యాలు కనిపిస్తాయి. అలాగే ఇప్పుడు దీన్ని చూస్తూంటే నా చెవులు ఒక మంచి గీతం వింటున్నాయి." అతని అనుభవం విని ముగ్గురూ గాఢంగా ఆలోచించారు; మేనన్ మర్యాదగా చిరునవ్వు నవ్వారు.

ఆరున్నరకి సభ ఆరంభమైంది. నూరుమందికి తగ్గువగా గుమిగూడిన సంప్రదాయేతర గుంపు కాబట్టి, అక్కడ మైక్, పూలదండలవంటి సామాన్య వ్యవహారాలు ఏవీ లేవు.

ముందు మేనన్ అక్కడున్నవారికి సారంగన్ని పరిచయం చేసే విధంగా ఇంగ్లీషులో మాటాడారు:

"సంగీతవేత్త Mr. సారంగన్ని మన కళాశాలలో ఉపన్యాసం ఇవ్వాలని ఆహ్వానించడానికి ముఖ్య కారణం అతనికి సంగీతశాస్త్రంతోబాటు జీవితంలో అనేక కళలగురించికూడా కొత్తకొత్త ఊహలున్నాయని లలిత మూలంగా, ఆమె వ్యాసం మూలంగా, నేను తెలుసుకున్నాను. అతను చాలా కాలం లండన్ లో, పారిస్ లో, జీవించారు. కాని భారతదేశం గురించి, భారతీయుల జీవితంగురించి అతను గాఢంగా ఆలోచిస్తున్నారని నేను తెలుసుకున్నాను. అందువలనే ఇవాళ సాయంకాలం అతనితో కలుసుకొని మాటాడాలని పిలిచాను. అతనూ సమ్మతించి మనతో అనియతంగా మాటాడానికి వచ్చివున్నారు. ఇక్కడ గుమిగూడివున్న విద్యార్థులు, మిత్రులు తరపున అతనికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను . . . " అని క్లుప్తంగా చెప్పి అతను కూర్చున్నారు.

సారంగన్ లేచాడు. కళాభిమానులమధ్య అతను ముందే బాగా పరవశమైపోయివున్నాడు. చింపిరి జుత్తుని ఒక చెయితో నెట్టుతూ, తలెత్తి, ఏదో ఆలోచిస్తూ, అందరినీ చూసి ఒక చిరునవ్వు నవ్వి, వొంగి, తన కోటు జేబులలో రెండు చేతులూ పోనిచ్చి నిమ్మళంగా నిల్చున్నాడు. అలా నిలబడడం కొన్ని క్షణాలేకాని, అసలు ఏం మాటాడాలని తెలియక అతను కలవరపడుతున్నట్టు ఒక భావన అందరికీ కలిగింది; లలిత కూడా ఒక విధమైన నిరాశ, భయంతో అతన్ని తేరిపారి చూసింది.

ఏదో ఒక క్షణం అందరి చూపు తనపై ఉందని గ్రహించిన సారంగన్ తొందరగా "Dear friends," అని పిలిచాడు. ఒక సారి అందరి మొహాలు విరివిగా చూసిన తరువాత మాటాడాడు:

"నేనొక చిత్రకారుడు, శిల్పి, ఉపన్యాసకుడు కాదు. మీ మధ్య మాట్లాడానికి లేవగానే నేను వెనుకాడడానికి అదే కారణం. కాని ఈ శతాబ్దంలో పుట్టిన ఒక మానవుడనే

కారణంవలన ఆధునిక చిత్రకళ, ఆధునిక శిల్పకళ, ఆధునిక సంగీతం - వీటితో ప్రత్యక్షంగా పరిచయం ఉన్నా లేకపోయినా ఆధునిక అభిప్రాయాలతో అతనికి సాన్నిహిత్యం తప్పక ఉండితీరాలికదా? ఆ విధంగా నేనుకూడా మీలో ఒక సభ్యుడను. అందువలనే మిస్టర్ మేనన్ నా ప్రసంగంకి చర్చావిషయం 'Modern Painting, లేక 'Modern Arts' అని ఇవ్వకుండా Modernity అని ఇచ్చారని నా అభిప్రాయం . . . " అని అంటూ సారంగన్ మేనన్ని తిరిగి చూసాడు.

అతని మాటలు విని శ్రోతలు తేలికగా నవ్వారు.

"కాదు, అలాగేంకాదు! Modernity గురించి Mr. సారంగన్ అభిప్రాయాలు 'మనోన్మణి' లో లలితా వ్యాసంలో నేను చదివాను. ఆ అభిప్రాయాల గురించి అతన్ని ఇంకా స్పష్టంగా అడగాలని నా ఉద్దేశం . . . " అని మేనన్ వివరించారు.

"నాకు ఇవ్వబడిన చర్చావిషయం నాకు అనుకూలంగా ఉంది, thanks," అని సారంగన్ మిస్టర్ మేనన్కి తన కృతజ్ఞత తెలియజేసాడు.

"మన జీవితం ఎంతమట్టుకు నవీనతని స్వీకరించిందో అంతవరకే మన కళలలో, సాహిత్యంలో మార్పులు కనిపిస్తాయి. దీన్నే ఇంకొక విధంగా చెప్పవచ్చు: ఒక జీవితం ఎంతవరకు పక్వమైంది? ఒక సమాజంలో వర్ధిల్లే భావనలు, దృక్పథం, ఎంతవరకు పరిపక్వమయ్యాయి అని అక్కడ వ్యాపించివున్న సమకాలీన కళల, సాహిత్య సాధనలమూలంగా మనం గ్రహించగలం; వాటి ఆకృతి మాత్రమేకాదు, అంతర్గత తర్కమూ మనకి బోధపడుతుంది.

నేను తమిళ దేశంకి వచ్చిన ఈ మూడు మాసాలలో చూసిన సినిమాలు, నాటకాలు, చదివిన పుస్తకాలు, పరిచయమైన ప్రజల అనుభవాలు ఎన్నో - కాని వాటి స్పందన వలన మాత్రం నేనిలా మాటాడుతున్నానని మీరు అపార్థం చేసుకోవద్దు. నేనూ మీలాగే ఐపోయాను, నాకూ మనగురించి కొంచెం తెలుసు. మన జీవితంలో - అంతర్గత జీవితంలో - ఎటువంటి మార్పు లేనే లేదు. అంతేకాదు. 'మనం కొన్ని శతాబ్ధాలు వెనకబడివున్నామా?' అనే అనుమానం కూడా నాకు కలుగుతోంది. నాకు కొందరు ఆధునిక వ్యక్తులతో పరిచయముంది. నేను వారిగురించి ఇలా మాటాడడానికి క్షమాపణ కోరుతున్నాను. వారు ప్రాతినిధ్యం వహించేది నవీన సంస్కృతి కాదు! వాళ్ళు

దేహాల్లోనూ, కొంచెం మనసులోనూ భరించేది పాశ్చాత్య సంస్కృతి! Modern doesn't mean Western!

"మనకొక ప్రత్యేక సంప్రదాయం ఉందికదా, మరి మనకని ఒక కొత్తదనం సాధ్యమనే నమ్మకం మనకి ఎందుకు లేదు? ఒకటి: మనం భూస్వాముల(feudal) రాజ్యం తోసిపారేసాం, ఐతే దానికి బదులు మనం విదేశీయ వాడుకలే పాలించాలా ఏమిటి? అది ఎంత శోచనీయం! 'మనం ఎక్కడున్నాం, ఎక్కడకి వెళ్తున్నాం?' అనే ప్రజ్ఞ లేకుండా మనం రోజులు గడుపుతున్నామా? Modernity అంటే ఇప్పుడు నేను తొడుక్కున్నదుస్తులు, నేను మాటాడే భాష అని అపార్థం చేసుకోవద్దు. ఈ జీవితంకి సంబంధిన అన్ని వ్యవహారాల్లో నేను ఎంత వివేకంతో మెలగుతున్నానో అంతవరకే నేను ఒక నూతన యుగ పురుషుడని నిరూపించగలను.

"ఈ ప్రదర్శనలో ఈ నూతన కళావస్తువులు చూసి ఒకతను మురిసిపోయారనుకోండి. అందుకు కారణం వీటి పైఖరికి చాలామట్టుకు ఫ్రాన్సు దేశపు సంస్కృతితో పొత్తు ఉందని కాదు. అలాంటివారు కొందరు ఉండవచ్చు, కాని మనం వాళ్ళని లెక్కచెయ్యవద్దు. ఈ నూతన కళావస్తువులన్నీ భారతీయ వంశపారంపర్యంని చాటుతున్నాయి. ఇక్కడ - ఇంకొక విభాగంలో- నేను కొన్ని ప్రాచీన కళావస్తువులు చూసాను. అవి ఎంత అద్భుతంగా ఉన్నాయి! ఆ ప్రాచీన కళా ప్రక్రియతో ఆధునిక సృజనాత్మక కృషికి ఉన్న వారసత్వం నేను గుర్తించాను. అలాగే ఒక సమాజం ప్రాచీన ప్రఖ్యాతితోబాటు ఒక నూతన సంస్కృతిని తనతో లీనం చేసుకొని వర్ధిల్లుతుంది, అది తప్పకుండా సాధ్యం అని నా నమ్మకం. ఉదాహరణకి ఈ modern painting తీసుకుంటాను. ఈ నూతన శైలి చిత్రంలో రూపమే ప్రధానం! 'సుందరి' అనే ఒక చిత్రం నేను చూసాను. అది ఒక ప్రత్యేక యువతి చిత్రం కాదు; సర్వసాధారణంగా ఆడతనంని సూచించే ఒక చిత్రం. ఈ రెండింటికీ పెద్ద భేదం ఉంది. ఇక్కడ జాడగా మనకి తెలియపరచే శక్తి మాత్రమే ఎక్కువగా ఉంది, అంతేకాని, ఒక పరిమిత ప్రమాణంలోలో గ్రహించడం, ఒక 'ప్రత్యేక' అందంని గుర్తించడం - అటువంటి అంశాలు లేవు. ఒక 'ప్రత్యేక' అందంని గుర్తించే అంశం ఇక్కడ లేదు. ఇక్కడ కల్పనా శక్తికే ప్రధాన పాత్ర.

అంటే కవిత్వం లాగ . . . సంగీతం లాగ . . . కవిత్వం, సంగీతం అనుభవించడానికి కాల్పానిక మనస్సు కావాలికదా?

"ఒక యువతి - నా friend - ఈ గుంపులో ఉన్నారు. ఆవిడ నాకు చెప్పారు, 'ఈ Modern Art గురిచి నాకేం బోధపడదు,' అని". ఇక్కడ సారంగన్ తన ప్రసంగం కొంతసేపు ఆపి, ఆ గుంపులో మాధవిని వెతికాడు. లలిత నవ్వుతూ మాధవిని, సారంగన్ని, చూసి నవ్వింది.

"Yes, that's a point . . ." అని సారంగన్ తనలో గొణుక్కున్నాడు. ఇక అతను ఏం చెప్తాడని ఆతురతతో మేనన్ అతన్ని చూసారు.

సారంగన్ నుదుటని తోముకొని, కొంచెం సేపు ఏదో ఆలోచనలో పడి, కొనసాగాడు: "మీకు కళ బోధపడలేదని మీరెందుకు అవస్థ పడుతున్నారు? ముందు దాన్ని అనుభవించడానికి try చెయ్యండి. కళకి ఉన్న మహత్వం అదే. మనకి బోధపడలేదంటే దాన్ని అది మనకి తెలియజేస్తుంది."

మాధవి సారంగన్ వివరణ శ్రద్ధగా వింటోంది. కాని సారంగన్ ఏమంటున్నాడని ఆమెకి బోధపడలేదు. 'అర్థం కాని విషయంని అర్థంకాని శైలిలో వివరించడమే modern art కాబోలు!' అనే ఆలోచన రాగానే మొహంలో ఒక ఎగతాళి నవ్వు కనిపించింది; పెదిమలు కొరుకుతూ ఆమె మౌనంగా కూర్చుంది.

తన అభిప్రాయం ఇంకా స్పష్టంగా తెలియజేయాలని సారంగన్ నిశ్చయించాడు. నుదుటమీద పొరలుతున్న జుత్తుని వెనక నెట్టుతూ కొంచెంసేపు ఆలోచించాడు. గభీమని తొందరగా మాటాడాడు:

"ఒక వయలిన్ విద్వాంసుడు తన వాద్యంలో ఒక పాట వాయించుతున్నాడు. దీనికి ముందు మీరు దాన్ని వినలేదు. తన కల్పనాశక్తితో, అప్పుడు తనకున్న mood కి తగినట్టు, వేగంగా లేక నెమ్మదిగా. ఆలోహస్థాయిలో లేక హీనస్వరంలో, లేక - ఇవన్నీ కలిసిన ఒక ధోరణిలో, కొంచెం సేపు మన చెవులకి, హృదయంకి, భావనలకి తగినట్టుగా అతను వాయించినప్పుడు మనకి ఒకప్పుడు గుండె ఝుల్లుమంటుంది; ఇంకొక సమయం కన్నులు తడిసిపోతాయి; మరొక సమయం మన వీపుని ఒక మంచుగడ్డ తాకినట్టనిపిస్తుంది. దీనిగురించి మీరు ఏమంటున్నారు? ఇందులో మీకు

ఎది బోధపడిన తరువాత మీరిలా అయ్యారు? ఏమీ బోధపడని 'నిరర్థకం'లో ఇంత భావవృత్తి ఉంది! అందులో 'బోధపడడం' కంటే 'అనుభవించడం' ముఖ్యం! అలాగే . . . అదే కళలకి ఉన్న విశిష్ట లక్షణం.

"ఆ 'సుందరి' చిత్రంలో, ఇతర చిత్రాల్లో, అలాగ తెలియజేయే సూచనలు, రూపాలు ఉన్నాయి. అలాగే మనం ప్రాచీన కళావస్తువులలోనూ చూడగలం . . . అక్కడ నేను పురావస్తు శిల్పం ఒకటి చూసాను, అది ఒక సుందరి లేక నర్తకి. అదీ చూడండి. భుజాలవరకూ గాజులు తొడుక్కొని, నడుముని ఒక చెయితో ఆనుకొని పెదురు బొమ్మలాగ కనిపించే ఒక కంచు ప్రతిమ. అందులో మనం చూసేదేముంది? కాని అదికూడా ఒక నర్తకి, నాట్యం అభ్యసించని కాలంలో, మనముందు సొగసుగా వచ్చి నిలబడుతున్నట్టుంది . . .

"చూసారా, కళ స్వభావం - ఆత్మ - పూర్వకాలం, ఆధునిక కాలం మధ్య - భిన్నం లేకుండా, బయటకి మార్పులు చూపిస్తూ, లోతట్టులో అందం పోగొట్టుకోకుండా - ఒక వంతెన కట్టి రక్షించుతోంది! ఇలాగే జీవితంలో అన్ని వృత్తులలో జరగాలి, అవునా?"

- సారంగన్ తర్కరీతిగా, అక్కడున్న కళావస్తువుల ఈడు, జోడు గురించి మాటాడుతూ మార్గదర్శకంగా వివరించిన అభిప్రాయాలలో మగ్నమై శ్రోతలు ఆతురతతో వింటున్నారు.

అతని సముఖంలో, ప్రసంగంలో, పరవశమైపోయి, అతని కాళ్ళముందు శరణు కోరుతూ. తన దేహం అతనికి అప్పగించినట్టు, లలితని దిగ్భ్రమ ఆవరించుకుంది; స్వయం ప్రజ్ఞ పోగొట్టుకొని, ఎర్రబారిన కళ్ళతో ఆమె చకితమైపోయింది.

సారంగన్ ముప్పావుగంటకి పైగా మాటాడాడు. అతని అభిప్రాయాలు అక్కడున్నవారు అందరూ ఆమోదించారా, నిరాకరించారా అని తెలియకపోయినా అతని అభిప్రాయాలు విని అందరూ తీవ్రంగా ఆలోచించారన్నది ముఖ్యం.

ఉపన్యాసం సమాప్తమైన తరువాత, ఒక అర్థగంట వరకూ, చాలామంది వచ్చి సారంగన్ తో పరిచయం చేసుకున్నారు. కరచాలనం చేసి అతనికే ఆయాసం వచ్చేసింది! కొంతమట్టుకు గుంపు తగ్గగానే, మాధవి అతని దగ్గరకి వచ్చింది.

"చాలా thanks. మీరు నాకు బాగా వివరించి చెప్పారు. కాని, excuse me, principal! . . . మీ lecture నచ్చినా  నాకు ఇంకా modern art తలతోకగానే ఉంది. మీరు ఏదో అన్నారుగా - 'బోధపడడం', 'అనుభవించడం' అని . . . నాకు ఆ రెండూ చేతకాదు . . .  ప్రజలు తమకు తామే మోసం పోవడానికి ఇదొక కుట్ర . . .  ఊరకే అందరినీ మోసం చేస్తున్నారనిపిస్తోంది."

"Oh, this is too much!" అని లలిత జోక్యం చేసుకుంది.

"'అనిపిస్తుంది' అనేకదా అన్నాను . . . " అని మాధవి సమాధానం ఇచ్చింది.

మేనన్ నోరు తెరిచి నవ్వారు. ఆ నవ్వే అతను లోలోపల నొచ్చుకున్నారని సూచించింది. అతని కంటిచూపు ఒకసారి ఆ కళాశాల కట్టడం, అక్కడున్న కళావస్తువుల మీద వాలింది.

ఆ సమయం చాలామంది విద్యార్థులు అగ్రద్వారం దాటి బయటకి వెళ్తున్నారు.

"ఈ కాలేజీ, ఈ విద్యార్థులు, ఇక్కడున్న టీచర్లు, ఈ కళావస్తువులు - వీటి మూలాధారం - వీటికి సంబంధించిన ప్రతీవాడు తన్నే మోసగించుకొని, ఇతరులని కూడా మోసగించడం వలనే అని నువ్వనడం వింటే  . . . నాకు పకపకమని నవ్వాలనిపిస్తోంది. My dear girl!  నీకు ఇవన్నీ బోధపడడం, నువ్వు అనుభవించడం - అది అలాగ ఉండనీ . . . నీకు మనుషులగురించి బోధపడుతుందని నా నమ్మకం. నన్నే తీసుకో, నాకు త్వరలో అరవై నిండుతాయి. I am like your grandpa! నేను నా జీవితమంతా ఈ కళని అభ్యసించడం, నేర్పడం, సృష్టించడంలో గడిపాను. నేను బుద్ధిస్థిరతతో ఈ కృషి చేస్తున్నానని అందరూ అంటున్నారు. Modern Art గురించి విమర్శ చేసేవారందరూ ఒకటి మరచిపోతున్నారు. మీకు బోధపడని, నచ్చని modern art painting చూసిన తరువాతే దానిగురించి మీరు ఆలోచించడం ఆరంభించారు. వెంటనే, తొందరతొందరగా మీ అభిప్రాయం ఏమిటో చెప్పేసారనే సంగతి మరిచిపోయారు. అలాగే మేం మా జీవితమంతా ఈ పనికి సమర్పించుకున్నాం అనే సంగతి మరచిపోయి మీ అభిప్రాయంతో మమ్మల్ని ఏకీభవించమంటున్నారు. ఈ కళ మీకు బోధపడకపోయినా దీనికి సంబంధించిన కళాకారుడుని గౌరవించండి! మీకంటే మేం ఇందులో పూర్తిగా పాల్గొనడం వలన, ఈ చిత్రాలు, ఈ శిల్పాలు గురించి మాకు

కొంచెం ఎక్కువగా తెలుసనే కారణం వలన మాకు గణ్యత చూపండి. ఒకడిని మోసగించవచ్చు, ఒకడు మోసం పోవచ్చు, కాని లోకమంతా మోసంపోవడం సాధ్యమా? అది సాధ్యమంటే ఆ సార్ధక నిరాశకే కళ అని పేరు! అందువలన మనకేం నష్టం? నష్టం లేనంతవరకూ మోసపోవడానికి నేను రెడీ!" అని నవ్వుతూ మేనన్ మాధవిని చూసారు.

"Modern Art గురించి, తన కళాభిమానుల గురించి పికాసో చెప్పివున్నారే, దానిగురించి మీ అభిప్రాయమేమిటి?" అని మాధవి అడిగింది. ఆ ప్రశ్నకి ఇంతకుముందే జవాబుని ఆలోచించిపెట్టినట్టు మేనన్ వెంటనే చెప్పారు:

"స్వతఃగా పికాసో ఎటువంటి వ్యక్తి అని మీకు తెలియాలి. అంతేకాదు. నేను సృష్టించిన కళావస్తువులగురించి నా అభిప్రాయం కంటే ఇతరుల తీర్పు, భవిష్యత్తు ఏమంటుందో అదే ముఖ్యం. Count Tolstoy కూడా 'పునర్జీవితం' (Resurrection) నవల మినహా తను రాసిన తక్కిన రచనలన్నీ తగలపెట్టాలని అన్నారు. 'సరే, అలాగే కానీ' అని వాటిని మనం దహనం చెయ్యాలా? My girl, అబద్దాలు, వేషాలు, అన్ని వృత్తుల్లోనూ ఉన్నాయి. అది గమనించక అన్ని వృత్తులూ మనం తోసిపారేయడం సాధ్యమా? Miss. Madhavi, మీరు నిష్కపటంగా మీ అభిప్రాయాలు తెలియజేస్తున్నారు, అందుకు నేను మిమ్మల్ని పొగడుతున్నాను. కాని చాలామంది - ఊరకే - వీటిని పొగడుతున్నారు. వాళ్ళగురించే పికాసో జాడగా చెప్పాడనుకుంటాను. కవిత్వం, గద్యం, నాటకం, అన్నిటిలోనూ మంచి, చెడు, అబద్ధం, పవిత్రత ఉన్నాయి. అలాగే modern art లో కూడా. 'Modern Art' అనగానే, వెంటనే 'ఓహో . . . ' అని అభిరుచి వచ్చేస్తుందా? అందులో మీకు ఏ అంశం ఇష్టమో దాన్ని పోషించండి; దాన్ని ఇంకొక కళావస్తువులో వెతకండి. అలాగే క్రమంగా మెచ్చుకోలు పెరుగుతుంది. సృజనాత్మక ప్రయాసకి త్రాణ ఉన్నట్టే మెచ్చుకోలుకి ఒక తాహత్తు, అభివృద్ధి ఉంది. ఆ ధారణశక్తి లేని గుంపుని చూస్తే సృష్టికర్తకి ఒళ్ళు మండుతుంది! పికాసో క్షోభకి అదే కారణమేమో? అతను అన్న ఒక మాటని పట్టుకొని వేలాడడం కంటే అతని కళాత్మక విధానంలో నాకు ఆసక్తి ఉంది. ఇవాళ మీరు చూస్తున్న నూతన భవనాలు పికాసో కల్పనలో పుట్టినవి. పికాసో నిరాకరించడం వలన అవన్నీ ఒక రాత్రి మాయమైపోవు!

కన్నతల్లికి తన బిడ్డలమీద ద్వేషం రాకూడదు అంటారు. అంతేకాదు, వారిని చంపడానికి కూడా న్యాయతఃగా ఆమెకి అనుమతి లేదు!”

ఇంతలో సారంగన్ రెండు సిగరెట్లు కాల్చిపారేసాడు. Tolstoy తన రచనలన్నీ తగలపెట్టాలని చెప్పాడని మేనన్ అన్నప్పుడు సారంగన్ అతనికి ఒక సిగరెట్టు అందించాడు. అతను వేగంగా మాటాడుతున్నారు; సారంగన్ దిశలో మొహం తిప్పి, తల వొంచి, “వద్దు!” అని సూచించారు. ఇప్పుడు సారంగన్ మూడవ సిగరెట్టు వెలిగించాడు. ఆ అగ్గిపుల్ల కాంతిలో తన వాచీ చూసాడు.

“I am sorry, నేను మిమ్మల్ని చాలాసేపు నిల్చోబెట్టేసాను. రండి, మనం లోపలికి వెళ్ళి మాట్లాడదాం . . . ” అని మేనన్ సారంగన్ భుజం తట్టారు.

“Sorry, Principal! నాకు ఎనిమిది గంటలకి Central Station కి వెళ్ళాలి. నేను ఇంకొకసారి మిమ్మల్ని కలుసుకొని దీని గురించి అన్నీ తెలుసుకుంటాను. నేను పొరబాటుగా ఏమైనా మాటాడివుంటే క్షమాపణ కోరుతున్నాను . . . ” అని అంటూ మాధవి అతనితో కరచాలనం చేసింది.

“Oh, not at all, my dear girl!”

“మేమూ వెళ్ళాలి . . . ” అని లలిత లేచింది.

“ఇలాగ మనం తరచుగా కలుసుకోవాలి, మాట్లాడాలి. ఇక్కడ మీతో నూటికి ఏకీభవించే వ్యక్తి ఉన్నాడని మరచిపోకండి . . . ” అని మేనన్ సారంగన్ని కౌగిలించుకున్నారు.

‘ఈ లలిత మనుషులని ఎంత బాగా అంచనా వేస్తోంది!’ అని మనస్సులో ఆశ్చర్యపడుతూ సారంగన్ ఆమెను చూసి నవ్వాడు.

ఆ చీకటిలో సారంగన్ మొహం కాంతితో ప్రకాశించడం చూసి లలితకి మూర్ఛిల్లినట్టయింది.

కాలేజీనుండి బయటకి రాగానే మాధవి శెలవుపుచ్చుకొని నిష్క్రమించింది. సారంగన్ ఇల్లు సమీపంలో ఉందనే కారణం వలన సారంగన్, లలిత మాట్లాడుకుంటూ వెళ్ళాలని నిశ్చయించి పైవంతెనమీద నడిచారు.

కింద రైలుబండి హుటాహుటిగా పరుగెడుతోంది.

సారంగన్, లలిత, ఇరుకుగా ఆ వంతెన దోవలో నడుస్తున్నారు. ఒక సారి సారంగన్ బాటని వదలి కిందకి దిగినప్పుడు అతన్ని తాకుతున్నట్టు ఒక బస్సు రాగానే, లలిత అతని మీద వాలింది. సారంగన్ భద్రతకోసం ఆమె భుజంని గట్టిగా పట్టుకున్నాడు.

"ఇది బస్సు ప్రయాణంలాగ, రైలు ప్రయాణం కాదు!" అనే భావనతో సారంగన్ లలితని చూసి నవ్వాడు.

లలిత ఇంతకు ముందే కిలకిలమని నవ్వుతూవుంది. ఆ తరువాత ఇద్దరూ మౌనంగానే నడుస్తూవున్నారు. ఒక బస్సు స్టాండ్ లో వచ్చి నిలబడినప్పుడు సారంగన్ లలితకి చెప్పాడు: "నాకు Mr. మేనన్ అంటే చాలా ఇష్టం!"

"కాని చాలామందికి అతనంటే ఏవగింపు."

"అందులో ఆశ్చర్యం ఏముంది?" అని అన్నతరువాత. కొంచెం సేపు మౌనం వహించి, సారంగన్ "మనం ఇక్కడ ఎందుకు నిలబడ్డాం?" అని అడిగాడు. ఇద్దరూ తమ తమ భావావేశపూరిత తడబాటుని గుర్తుచేసుకొని, నవ్వుకుంటూ మళ్ళీ నడిచారు.

చెట్లు నిండిన బంగళాలు, జనసమూహం లేని ఒక ఇరుకైన వీధిలో ఇద్దరూ నడుస్తున్నారు. ఆ వీధిలో ఉన్న రెండు, మూడు దీపాలనుంచి వచ్చే కాంతి దీప స్థంబాల వలన, దట్టమైన చెట్లవలన, అడ్డగించుకొనివుంది. ఒక రెండుసార్లు వీధి మూలనుంచి తిరిగే కారుల కాంతి వీరిద్దరిమీద వాలి మాయమైంది.

'ఎల్ల లేకుండా, ఇలాగ ఎడతెగకుండా సాగే ఒక వీధిలో, కాలం గురించి ఏ ప్రజ్ఞా లేకుండా నడుస్తూవుంటే జీవితం ఎంత సఫలంగా ఉంటుంది!' అనే తలంపుతోబాటు కుతూహలం వాళ్ళ మనస్సులో చోటుచేసుకుంది.

"మీకీ మేనన్ ఎలా పరిచయమయ్యారు?"

"నేనే చెప్పాలనుకున్నాను. ఒకప్పుడు - పది సంవత్సరాలముందు - కళాకారుల కళ్ళకి నా దేహంలో అందం, తళుకు కనిపించినప్పుడు, నేను ఈ కాలేజీలో, ఒక model గా పనిచేసాను. ఇక్కడున్నవారులాగ దాన్ని మీరు అపార్ధం చేసుకొరు. నా పేదరికం వలన నేను ఆ పని చెయ్యలేదు. అప్పుడు అది నాకొక hobby గా ఉండేది. దానితొబాటు ఒక ప్రశిద్ధ కళాకారుడు ఒకడు కొంతకాలం నాకు చెడ్డ స్నేహితుడుగా ఉండేవాడు . . . ఇవాళ వచ్చిన గుంపులో వాడిని ఎదురుచూసాను. కాని వాడు

ఇక్కడ లేడని చెప్పారు . . . నేను ఇంతకుముందే ఆలన్  అనే ఒక Anglo-Indian painter గురించి మీకు చెప్పివున్నాను . . . నేనేమో వాడిదగ్గర మోసం పోయానని అనుకోవద్దు! నేనెవరినీ ఎప్పుడూ నమ్మలేదుకదా?"

ఆమె చెప్పినదంతా విని - పది సంవత్సరాలముందు - తన దేహంలో కూడా అందం, తళుకు ఉన్నప్పుడు, ఒక model గా పనిచేసినట్టు ఆమె చెప్పిన వార్తకి మాత్రం -  సారంగన్ జవాబు చెప్పాడు:

"ఏం, ఎందుకు? ఇప్పుడుకూడా మీదగ్గర ఆ అందం ఉంది"  అని ఆమెని వీధి దీపాల కాంతిలో దీర్ఘంగా చూసాడు.

'దేహం కొంచెం బలిసివుంది, ఐతేనేం? ఆ రెండు కళ్ళలో మిణుకుతున్న తీక్షణమైన ప్రజ్ఞలో వెయ్యి కళలు ఉత్పత్తి అవుతాయి. ఆమె చుబుకంని తాకినప్పుడు అందులో నేను ఒక పల్లం చూసాను. అలాంటి చుబుకంని నేనింతవరకూ ఏ శిల్పంలోనూ చూడలేదే?' అని మనస్సులో తలపోస్తూ సారంగన్ ఆమెని చూస్తూనేవున్నాడు. కళ్ళు పైకెత్తి అతన్ని చూస్తూ లలిత ఒక ప్రతిమలాగ నిల్చుంది.

" Please, నన్ను అలాగ చూడకండి!" అని లలిత అతన్ని వేడుకుంది.

ఒక ఆడది అలాగ అడగడంలో ఉన్న అర్థం ఏమిటో అతనికి తెలుసు. ఒకసారి తన దృష్టిని ఆ వీధి పరిసరాలకి మళ్ళించాడు.

ఇద్దరూ మళ్ళీ నడుస్తూంటే సారంగన్ వాచీని చూసి అడిగాడు: "ఎనిమిది గంటలు దాటిపోయింది. మిమ్మల్ని ఇంటిలో దింపమంటారా?"

"నాకేం తొందర లేదు. ఇవాళ అతను రావడానికి పదకొండు అవుతుంది. ఒకవేళ అతను సూటిగా మీ ఇంటికే రావొచ్చు. మీతో కలిసి Western Music వినాలని నాకూ ఆశ . . . మీకేం ఆక్షేపణ లేదుకగా?"

సారంగన్ ఆమెని చూసి చిరునవ్వు నవ్వాడు.

సారంగన్ మహాలింగం గురించి అడిగాడు: "ఇవాళ కాలేజీ ఉపన్యాసంకి అతను వస్తారని నేను ఎదురుచూసాను."

"అతనికి ఇవన్నీ చాలా ఇష్టం. కాని ఇవాళ అతనికి Chief Justice ఇంటిలో ఒక ముఖ్యమైన విందు."

ఇద్దరూ ఇల్లు చేరుకున్నంతవరకూ మహాలింగం గురించే ఇద్దరూ పరస్పరం తమకుతామే ఆలోచిస్తున్నారు.

'అతనొక అపురూప మనిషి, మీ తృప్తికోసం అతన్ని మనిషి అని అంటున్నాను. నా దృష్టిలో అతనొక దైవం' అని ఒక రోజు లలిత తనకి చెప్పినది సారంగన్ ఇప్పుడు గుర్తుచేసుకున్నాడు.

"మీకెది ఇష్టం, light music or classical?" అని అడుగుతూ సారంగన్ రేడియోగ్రాంకి సమీపంలో ఉన్న రికార్డుల కుప్పనుంచి ఒక్కొక్కటిగా తీసిచూసాడు.

ఆ పక్కనేవున్న ఒక అల్మారాలో తను అతనికి బహుమతిగా ఇచ్చిన పుస్తకాలతోబాటు మరికొన్ని తమిళ పుస్తకాలు ఉన్నాయని గమనించిన లలిత అతన్ని ఏమో అడగాలని నిశ్చయించి అతనికి జవాబు ఇచ్చింది.

"సంగీతం అనే మాట వస్తే నేను మీ student. నా ఆరంభ పాఠం గురించి మీరే నిశ్చయించాలి. సరే, ఇవన్నీ ఏం పుస్తకాలు?"

సారంగన్ లలిత దగ్గరకి వచ్చి పుస్తకాలు అందుకున్నాడు.

"ఇవన్నీ నాగణ్ణా నాకు ఇచ్చారు, అతనే ఈ ఇంటిలో వంటమనిషి . . . కాని అతనికి వీటితో ఏ యాజమాన్యం లేదు . . . How sad! I am sorry, నాకు ఆవిడ పేరుకూడా తెలీదు - కణ్ణన్ తల్లి - ఆవిడ ప్రపంచమంతా ఇదే కాబోలు . . . " అని చెప్పి తను వచ్చిన ఆ దినం ఒకే ఒక సారి ఒక క్షణం చూసిన మొహం గుర్తుచేసుకొని సారంగన్ గభీమని చిన్నబోయాడు.

ఆ తరువాత ఇద్దరూ భారతదేశ స్త్రీల పరిస్థితి గురించి మాటాడుకున్నారు.

"ఇది చాలా ఘోరమైన ఆచారం. కళలో, సాహిత్యంలో, సంగీతంలో, మనం modernity గురించి గొప్పగా మాటాడుకుంటున్నాం. కాని మన జీవితం స్త్రీల విషయంలో ఎంత ఘోరంగా వెనుకబడి ఉందని చూసారా! మీలాంటివారు దీనికి విరుద్ధం!" అని సారంగన్ లలితని సూచించి అన్నాడు.

"పగతీర్చుకోవడం గురించి మాట్లాడాలంటే మేమూ బాధితులే," అని తల వొంచి లలిత హీనస్వరంలో గొణుక్కుంది.

"లలితా, మీరేమంటున్నారు?"

"విమోచనం అంటే సమాజంలో కొందరు స్త్రీలకే అది ప్రాప్తం అని కాదు. సమాజం కళ్ళకి నాలాంటివారు కలహం చేసేవారని అర్థం."

ఆమె మాటలు విని సారంగన్ కలవరపడ్డాడు. లలిత ఒక స్వతంత్రజీవిగా, హాయిగా జీవితం గడిపే ఒక ఆధునిక, భారత స్త్రీ అనే తన భావన ఒక కల్పన అనే నిజం అతనికి మింగుడు కాలేదు.

అతను ఆమెని తేరిపారి చూస్తూ మౌనంగా నిల్చున్నాడు. అతని కళ్ళని చూస్తూ ఆమె నిలబడింది.

ఆ పరిసరాలు అచలమైపోయినట్టు ఆ కొన్ని క్షణాల్లో అక్కడ మౌనం అధిగమించింది.

వీధిలో ఒక బస్సు పరుగెత్తింది. దాని సందడి గభీమని ఆ మౌనంని చెదరగొట్టగానే సారంగన్ కరకరధ్వనిలో లలితని అన్యోన్యముగా అడిగాడు:

"లలితా, నాకు మీగురించి ఏమీ బోధపడదు. మీకు సాహిత్యరంగంలో స్థిరమైన స్థానం ఉంది. మీకు స్వతంత్రంగా. అభ్యుదయకర భావనలున్నాయి. జీవితంలో కటువైన అనుభవాలన్నీ మీరు దాటేసారు. ఒక అపురూప మనిషిని భర్తగా పొందారు . . . Still, I can't understand you . . . "

అతన్ని సూటిగా చూస్తున్న ఆమె మొహంలో కొత్తగా కాంతి కనిపించింది; ఏడ్పుకి సిద్ధమౌతున్నట్టు పెదిమలు వొణికాయి. మొండిగా ఏదో వల్లించినట్టు ఆమె పలికింది: "దైవంని ఆరాధించేవారు ఒక మనిషితో స్నేహం కలుపుకోడం పొరబాటు అంటున్నారా?"

విశాలమైన ఆమె కన్నులు తడిసిపోయాయి. చెవుల చేరువలో కన్నీటి బొట్లు కనిపించాయి. ఆమె నుదుటమీద వాలిన జుత్తుని సారంగన్ తన చెయితో కొంచెం పక్కకి నెట్టాడు.

"మీరేమంటున్నారు? అతను మీకు ఒక దైవం మాత్రమేనా?"

ఆ సమయంలో కూడా ఆమె తన్ను నిభాయించుకొని అతన్ని చూసింది. ఆ చూపు 'అతన్ని మీరు అంతగా అపార్థం చేసుకోవద్దు' అనిపించినట్టుంది.

తన చెయిలోని పుస్తకం జారి నేల వాలకుండా, చాలా జాగ్రత్తగా అతని వెనుక ఉన్నఅల్మారాని చూస్తూ ఆమె నిల్చుంది. అతని చేతులు ఆమె భుజంని గట్టిగా పట్టుకున్నాయి. ఆమె చేతులు కదలకుండా అలాగే ఉన్నాయి.

'అతను నాకు దైవంగా మాత్రం ఉండాలని నా ఆకాంక్ష' అని ఆమె తనలో గొణుక్కోడం అతనూ విన్నాడు. అంతమట్టుకు ఇద్దరిమధ్య చేరువలో అతను ఆమెతో చొచ్చుకుపోయాడు.

5

"ద్రోహమా?" అనే ఆలోచనతో లలిత తన గదిలో ఒంటరి పడకమీద వెల్లకిలా పడుక్కోని hysteria వచ్చినట్టు తనలో తనే నవ్వుకుంటోంది.

ఈ ఒక నెలగా ఆమె తనకుతానే ఈ ప్రశ్న అడుగుతూ ఒకప్పుడు నిట్టూర్పు వదలుతోంది; ఇంకొకసారి భ్రమ ఆవరించుకున్నట్టు గాఢమైన శాంతంతో ఎదుటనున్నదేదో చాలా సేపు తేరిపారి చూస్తూ అదే ఆలోచనని చురుకుగా వెళ్ళగొట్టుతోంది; ఇంకొక సమయం గభీమని అదిరిపడి 'ఒక ఉత్తమ భర్తకి నేను మోసం చేస్తున్నానా?' అని వాపోవుతోంది; ఇంకొకసారి తన చలనం, పిరికితనంకి సిగ్గుపడుతోంది. ఇలాగ ఆమె నిత్యమూ బాధపడినా ఈ ముప్పై రోజుల్లో ముప్పైసార్లకి పైగా ఆమెని సారంగన్ లేక సారంగన్ని ఆమె కలుసుకోడం జరుగుతూనేవుంది. ఆ సంప్రదింపులు వాళ్ళు ఆపలేకపోయారనికాదు, అసలు ఆ సమాలోచనలు నివారించాలాని ఆశించారా అని వాళ్ళకే బోధపడలేదు.

మధ్యాహ్నం ఒక గంటకి వచ్చిన సారంగన్ ఇప్పుడే నాలుగంటలకి ఆమెని వదిలి వెళ్ళాడు. అతను వెళ్ళి పదిహేను నిమిషాలుకూడా అవలేదు. కాని అతన్ని ఇంకొకసారి కలుసుకొని మాటాడుతూ ఉండాలనే అభిలాష వేదనలాగ పెరుగుతోంది. ఇలాగ విడదీయబడడం గురించి మళ్ళీ మళ్ళీ వాపోవుతూ ఆమె మనస్సులో విరక్తి. అతృప్తి లేచాయి. ఆ విరక్తితోబాటు 'ఈ ప్రవర్తన నీకు తగునా? సమాజంలో ఒక ముఖ్య స్థానం వహించే నువ్వు ఇలాగ ఒక అబద్ధంని పోషించాలా? నేరస్తులని వారి వారి నేరాల ఆధారంగా శిక్షంచాలంటే మరి నీ నేరంకి శిక్ష ఏమిటి?' అని ఒక కంఠధ్వని ఆమెని

అడుగుతోంది. తన బలం ఏమిటో, తన బలహీనత ఏమిటో - ఈ రెండూ లలితకి బోధపడలేదు.

వెల్లకిలా పడుక్కున్న ధోరణిలో తలగడని కౌగిలించుకొని ఆమె తలెత్తి చూసినప్పుడు ఆ Anglo-Indian చిత్రకారుడు ఆలన్ గీసిన వినాయకుని పఠం కనిపించింది.

దాన్ని చూడగానే ఆలన్ జ్ఞాపకం, అతనిలాగే - అంతకు ముందూ, ఆ తరువాతా - ఆమెకి స్వల్పకాలమే పరిచయమైన మరికొందరు గుర్తుకి వచ్చారు. వాళ్ళందరూ ఆమెకి నమ్మక ద్రోహం చేసారా? ఛీ, ఛీ, ఆమె వాళ్ళెవరినీ నమ్మలేదే? నమ్మితేనేం, నమ్మకపోతేనేం, ద్రోహం ద్రోహమే కదా?

'ఆలాగేంకాదు. ఎవరి ఎడబాటు వలనా నా మనస్సులో చలనం, చంచలం లేవు; ఏ ఆశాభంగం వలనా దుఃఖమూ, భ్రాంతి లేవు; అది ద్రోహం కాదు! నాకు ఎంతమందితో పొత్తు ఉన్నా ఎంతమందితో నా దేహం వికృత చేష్టల్లో పాల్గొన్నా, స్వయంగా, నా మనసులో నేనెవరికీ చోటు ఇవ్వనేలేదు. నేను ఇంతవరకూ ఎవరినీ ప్రేమించలేదు. ఒకవేళ వాళ్ళు నన్ను ప్రేమించివుండవచ్చు. అదొక ప్రేమ అంటే వాళ్ళు నన్ను ఒక సాధనంగా ప్రేమించారన్నమాట! అదొక నిరాశ అంటే నన్ను ప్రేమించినవారు నన్ను బోధపరచుకొని ఆ నిరాశతో నన్ను వదలి వెళ్ళిపోయారు.'

గతకాల నిస్సార జ్ఞాపకాలతో ఆమె గుండె భారమైంది. దేహంలో బడలిక. తలగడలో మోహం ఒత్తుకొని లలిత అలాగే నిద్రపోయింది.

మొట్టమొదట లలిత తన పదహారేళ్ళ వయస్సులో బడిచదువు ముగించి కుటుంబ భారం మోయాలని గ్రహించి - ఎటువంటి లోకజ్ఞానం లేని ఒక బాలిక మనసుతో - ఉద్యోగం చెయ్యాలని, సంపాదించాలని ఆ Typewriter Institute కి వెళ్ళినప్పుడు ఆమె నిర్మలమైన చలువరాయిలాగ ఉండేది. వయసుకీ, దేహ అభివృద్ధికీ కొంచెం తక్కువగానే తెలివి ఉన్న ఆ రోజుల్లో ఆమె ఎంత సుఖంగా ఉండేది! ఇప్పుడు 'ఆ తెలివి మఱకబడింది, ఆమె సన్మార్గంకి కళంకం ఏర్పడింది' అనే అపవాదం నిజమంటే ఆ

మఱక, కళంకం ఆమె సంపాద్యం అనవచ్చా? ఏకభోగిగా ఈ లోకంకి ఆమె తీసుకొని వచ్చిందా ఏమిటి?

తలగడని అణుచుకున్న ఆమె మొహం, భుజం, దేహం కంపించాయి. ఆమె ఏడవలేదు. Hysteria రోగిలాగ లేచింది. తలగడని హత్తుకొని మూలుగుతూ ఉన్న ఆ నవ్వు ఆ గది గోడలని తాకి  ప్రతిఫలించింది. లలిత నవ్వుకి కారణం తన మొట్టమొదటి ప్రేమ అనుభవం గురించి ఇప్పుడు పక్వమైన తెలివితో ఆమె ఆలోచించడం వలనే.

ఆ Typewriter Institute లో ఒక గుమాస్తా ఉండేవాడు. వాడి పేరు కూడా ఇప్పుడు ఆమెకి గుర్తులేదు. కాని వాడి మొహం, రూపం, ఆమెకి స్పష్టంగా జ్ఞాపకంలో ఉన్నాయి.

అలలు అలలుగా పెరిగిన కేశంని జడగా అల్లిన పిలకల జుట్టు; నుదుటమీద బక్కపలచని బొట్టు. పడుచులాగ బిడియంతో మెలిగే వాడికి పద్దెనిమిది నిండాయి. పేదరికం వలన నిరాడంబర దుస్తులతో, ఇతరులకి భయపడుతూ హెచ్చరికగా నడిచేవాడు. కాని వాడి కళ్ళలో ఒక అసాధారణ చాతుర్యం, పౌరుషం దాగి ఉన్నాయని ఆ రోజుల్లో గ్రహించలేకపోయినా, ఇప్పుడు లలితకి బోధపడింది . . .

లలిత typewriting అభ్యాసంలో వాడు ప్రత్యేకంగా శ్రద్ధ చూపాడు. ఆమె ఫీజు ఇవ్వలేక బాధ పడిన రోజుల్లో, బోధకులు రావడానికి ముందే ఆమె కోసం Institute తలుపులు తెరిచిపెట్టి వాడు కాచుకొనివుంటాడు. చాలాసార్లు తనే ఆమె కోసం ఫీజు చెల్లించి ఆ తరువాత ఆమె ప్రతిగా ఇచ్చినది తీసుకొనేవాడు. అంతవరకే ఆమెకి సాయం చెయ్యడానికి వాడికి సాధ్యమైంది కాబోలు; అదే ఆమెకి పెద్ద ఉపకారమైంది.

వాడు చేసిన ఈ సాయంకి కృతజ్ఞత చెప్పాలనే జ్ఞానంకూడా రాని ఆ వయస్సులో లలిత దాపరికంగా వాడి సాయం గురించి ఇంటిలో అందరికీ చెప్పేది; వాళ్ళకీ అది మామూలుగా కనిపించింది.

ఒక రోజు ఉదయం - ఫీజు చెల్లించలేని దినం - దొంగతనంగా ఆమె వచ్చినప్పుడు, ఎవరూ లేని ఏకాంతంలో, తలుపు వెనుక దాక్కొని, వాడు ఆమెని కౌగిలించుకొని, ముద్దు పెట్టి, ఆమె తిరిగి చూడడానికి ముందే ఎక్కడికో పరుగెత్తాడు . . .

వోణీ కొనతో లలిత పెదవి తుడుచుకున్నప్పుడు, అకస్మాత్తుగా, వాడు తాకిన ఆమె దేహంలో ఒక భాగం గడ్డకట్టిపోయింది; ఎడంకాలు వొణికింది. అది చూసి తనకేమో ఐపోయిందని బెంగతో ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. అప్పుడుకూడా ఆమెకి వాడిమీద కోపమో, ద్వేషమో రాకపోవడానికి కారణం వాడు చేసిన సాయం ఆ నిమిషం ఆమె గుర్తుచేసుకోవడం వలనే. వాడి ప్రవర్తన గురించి ఆమె ఎవరికీ ఫిర్యాదుచేయ్యలేదు. అది ఫిర్యాదుచెయ్యవలసిన నేరంగా కనిపించలేదు. అందువలన, ఆ తరువాత, అటువంటి సమయాల్లో, వాడు పరుగెత్తకుండా ఆమె సమీపంలో నిల్చున్నాడు. అందులో వాడికి ఏం సుఖమో అని తెలియక, తనకి ఏం నష్టమో అని బోధపడక, ఆమె వాడి చర్యని రోజువారి అంగీకరించింది. కొన్నిసార్లు వాడి సంతృప్తికోసం స్వచ్ఛందంగా వెళ్లి ముద్దులాడింది. దానికి పేరు ప్రేమ అని ఆమెకి తెలీదు. ఇటువంటి పరిస్థితిలో వాడికి ధైర్యం వచ్చినతరువాత వాడే ఆమెని దానిగురించి అడిగాడు: “నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?”

ఆ ప్రశ్నకి ఏం జవాబు చెప్పాలని ఆమెకి తెలీదు. అలాగంటే ఏమిటని ఆమెకి అర్థం కాలేదు. వాడి పంజానుంచి విముక్తి కావాలని ఒక ముద్దునే జవాబుగా ఇచ్చి తప్పించుకుంది. ప్రేమ గురించి తనకి తెలియకపోయినా దానిగురించి ఎవరినీ అడగడం పొరబాటు అని తెలుసుకుంది; అందువలన దాని అర్థమేమిటని ఆమె రహస్యంగా ఆరసించింది.

ప్రేమగురించి కథలు, పుస్తకాలు ఆమె ఆశనాతురంగా చదివింది. చదివినప్పుడు అవి భయంకరంగా, దుఃఖదాయకంగా, అసహ్యంగా ఆమెకి కనిపించాయి. ఆమెకి బోధపడినదంతా ప్రేమవలన కన్యలు గౌరవం పోగొట్టుకుంటారని, ఆఖరికి ఒక బిడ్డతో వీధికి వీధికి తిరిగుతారు, అని.

అందువలన ఆ కథానాయికలకోసం, తనకోసం, ఒక దినం రాత్రంతా ఆమె ఏడుస్తూనేవుంది.

ఆ మరుదినం అలవాటుగా వాడు ఆమె దగ్గరకి వచ్చినప్పుడు ఆమె కొంచెం దూరంలో నిలబడింది. వాడు మళ్ళీ సమీపించినప్పుడు ‘వీడు నాకు ఎంత సాయం చేసివున్నాడు!’ అనే ఆలోచనతో ఆమె కట్టుబడింది. కాని ఆమె మొహం చూస్తూ వాడు

నిలబడినప్పుడు ఆమె కన్నీళ్ళు కార్చడం చూసి వాడు నిర్ఘాంతపోయాడు. ఆమె ఏడుస్తూ వాడిని అడిగింది: "నాకు భయంగా ఉందే! ఇలాగ ప్రేమించుతే పిల్లలు పుట్టరా?"

ఆమె అమాయకత్వం చూసి వాడు - ఆమెకంటే కొంచెం పెద్దవాడు - చాలాసేపు పకపకమని నవ్వాడు.

ఇప్పుడుకూడా లలిత తను పోగొట్టుకున్న పవిత్రమైన ఆ అమాయకత్వంని గుర్తుచేసుకొని ఏడవడానికి బదులు నవ్వుతోంది.

ఆ పేరు తెలియని 'వాడు' నుంచి ప్రస్తుతం తను దైవంగా పూజించే భర్త మహాలింగం వరకు - ఆమె ఎవరినీ ప్రేమించలేదు. అంటే అవన్నీ- అందులో ప్రతిదీ - తన అమాయకత్వం వలనే జరిగిందా?

ఇంతకాలం తరువాత తన సొంత జీవితంలో ఆవేశపూరిత ప్రేమ ఘటనలు ముగిసిపోయాయి అని నిశ్చయించిన తరువాత, ఆ ఆధారంతో ఉదయించిన పరిపక్వత తన్ను ఒక అపూర్వమైన జీవితంకి సిద్ధం చేసినట్టు లలిత నమ్మింది. గత పది సంవత్సరాలుగా అటువంటి జీవితంకి అలవాటు పడిన తనకి ఇటీవల సారంగన్ తో ఏర్పడిన ప్రేమ వ్యవహారం - నైతిక విలువలకి ఎంత వ్యతిరేకంగా కనిపించినా - బుద్ధికుశలతతో ఆమె ఆరసించి చూసినప్పుడు - అది ఇంతకుముందు తనకేర్పడిన అజ్ఞానులతో సరిపోల్చలేని ఒక బంధుత్వం అని ఆమె తెలుసుకుంది.

ఆమె ఎప్పటిలాగే ఎటువంటి బాహ్యామార్పులు లేకుండా, మనసులో ఎటువంటి క్షోభ, సంకోచం లేకుండా మహాలింగంని ప్రేమించుతోంది.

మహాలింగం విశాల హృదయంకి భక్తివిశ్వాసం చూపినట్టే సారంగన్ జ్ఞానసాధనకి ఆమె మనసార బానిసగా ఐపోయింది.

బాహ్య అందచందాలకి లోబడే వయసు దాటిన తనకి ఇటువంటి ఒక పరీక్ష కలుగుతుందని ఆమెకి ఎప్పుడూ తోచనేలేదు.

జీవితంలో ఇప్పుడే మొట్టమొదట ఒకతని ప్రేమించే ఒక యువతిగా, ఆమె భావనలు విచ్చలవిడిగా లేచి సత్తువగా పెరగడం వలన ఇంతవరకు లేని కొత్త అనుభవంతో ఆమె పెనుగులాడింది.

అవును. భవిష్యత్తులో ఇంకొక మగవాడిని ప్రేమించలేని మేరతో ఇప్పుడే ఆమె పూర్తిగా మోహంకి వశమైపోయింది. 'ఈ సారంగన్ తో నేను శాశ్వతంగా కలిసివున్నా సరే, లేక ఒక నిలకడలేని చుట్టరికం ఏర్పరచుకొని మేమిద్దరం కొంచెం కాలం వేరవేరుగా ఉన్నా సరే, ఈ ప్రేమ జ్ఞాపకం నిత్యమూ నా మనసులో ఒక మరపురాని అర్ధంతో ఉంటుంది' అని ఆమె జ్ఞానం, మనసు తెలియజేసిన తరువాత ఈ వయసులో ఇటువంటి స్థితిలో చిక్కుకోవడం గురించి లక్ష్యం చెయ్యక ఆమె ఈ సంబంధంకి ఏకీభవించింది. దీని ముగింపు ఎలా ఉన్నా ఇందులో ఉన్న సమాప్తి, సంతోషం మినహా మరేదీ ఆలోచించడానికి ఆమె సిద్ధంగా లేదు.

తనకీ అతనికీ ఒక కొత్త బంధుత్వం వచ్చేసిందనే ప్రజ్ఞతో అతనితో గడిపిన ప్రతీ నిమిషం ఆమెకి ఒక కొత్త అనుభవమై, ఆమె సాహిత్య సాధనలో కొత్త కొత్త రచనలుగా పరిణమించాయి.

ఈ ఒక నెలలో ఆమె ఎప్పటికంటే ఎక్కువగా వ్రాసింది.

ఒక అసలైన సృష్టికర్త ఒకే ఒక వ్యక్తిగురించినైనా యావత్తూ తెలుసుకోవాలనే ప్రయత్నంలో వెయ్యి పుస్తకాలు చదివినట్టు, ఒక కొత్త ప్రపంచంనే అర్ధంచేసుకోవచ్చు! అటువంటి వ్యక్తిగా సారంగన్ ఆమెకి కనిపించాడు. వాళ్ళ బంధుత్వం కేవలం శారీరక సంబంధం మాత్రం కాదు. అటువంటి సంబంధం ఏర్పడకపోతే  ఆ బంధుత్వం ఫలం ఇంకా ఎంతో అందంగా ఉండివుంటుంది. కాని మనం చేసేదేముంది? మానవులు పరిశుద్ధ జ్ఞానస్తులు మాత్రం కాదే! అందువలనే ఈ ఆత్మీయతలో ఆమెకి ఎంత తృప్తి, సంతోషం కలిగినా, గభీ గభీమని కొన్నిసమయాల్లో లలిత తత్తరపాటుకి, మానసిక వ్యధకి గురి అయింది.

చాలాసార్లు, రాసినప్పుడు గొప్ప రచనగా అనుపించి, ప్రచురమైన తరువాత పాఠకులు శ్లాఘించినా, తన మనసుకి, కళాభిరుచికి నచ్చని కొన్ని కధలని లలిత చింపి పారేయడమూ జరిగింది; కొన్ని కధలు ప్రచురణకి పంపకుండా ధ్వంసం చేసింది; మరికొన్ని కధలు రాస్తూనే, దిద్దడం, మార్పులు చెయ్యడం, మళ్ళీ రాయడమూ జరిగింది. అలాగే తన గతకాల జీవితంని పూర్తిగా కొట్టిపారేసి, ఒక నూతన జీవితం ఆరంభించడం గరించి తరచుగా ఆమె ఊహించింది.

'నా రచనలకి మాత్రం నేను బ్రహ్మ - నాకు కూడానా?' అని నిట్టూర్పు వదలినప్పుడు ప్రతీ జీవికి సొంత జీవితం తన శక్తికి, అందుబాటుకి ఎంత దూరంలో ఉందనే ఆలోచనతో ఆమెకి ఆశ్చర్యం కలిగింది.

దానివలన ఒక నిజం ఆమె చక్కగా తెలుసుకుంది. ఎంత గొప్ప జ్ఞానులు, మునులు, మేధావులైనా సరే, జీవితమే వాళ్ళని సృష్టించుతోంది. జీవితంని - తమ సొంత జీవితంకూడా - సృష్టించడం వాళ్ళకి చేతకాదు.

ఇలాంటి ఒక అభిప్రాయం రాసిన తరువాత ఇటువంటి ఆలోచనకి తన్ను పురికొల్పిన తన జీవితంకి ఆమె కృతజ్ఞత తెలిపింది. 'ఒక సృష్టికర్త జీవితంలో ఎంత కటువైన తాకుడు ఉన్నా దాన్ని ఒక ముచ్చటైన అనుభవంగా తీసుకోవాలి, అందుకు నేనే ఒక మంచి ఉదాహరణం' అని ఆమె సంతోషించింది.

సారంగన్ తన జీవితంకి సంబంధించిన అన్ని విషయాలగురించి తీవ్రంగా ఆలోచించసాగాడు. గత రెండు మూడు మాసాలుగా తన ఖర్చులకి నియమంగా డబ్బు రావడంలేదని గుర్తించి, తన కుటుంబంలో ఏదో చిక్కు లేచిందని ఊహించాడు. కాని దానివలన ఇంతవరకూ అతనికి ఏ బాధా లేదు. లలితాతో సంబంధం ఏర్పడిన తరువాత తన ఆర్థిక పరిస్థితి గురించి అతను లెక్క చెయ్యనేలేదు.

సారంగన్ అలవాటుగా సాయంకాలం మద్యం తాగుతాడు. ఇటీవల చాలామట్టుకు సాయంకాలం లలితాని కలుసుకోవడం వలన అతను తాగడం బాగా తగ్గిపోయింది; బహుశా తాగకుండానే ఉన్నాడు, లేక రాత్రి చాలా తక్కువగా తాగాడు. ఇప్పుడంతా తాగడానికి అతనికి పెర్మిట్ లో విధించిన కొలత చాలునంతగా ఉంది. ఎప్పుడైనా బయటికి వెళ్ళి కొనాలంటేకూడా ఒక రోజ కన్నియప్పన్ కొనితెచ్చిన నాటు సరకే అతనికి నచ్చడం వలన, మద్యంకి సంబంధించిన ఖర్చుకూడా బాగా తగ్గిపోయింది.

లలిత ఇంటినుంచి బస్సులో తిరిగివస్తున్నప్పుడు సారంగన్ తన భవిష్యత్తు గురించి ఆలోచించాడు. ఇవాళ మధ్యాహ్నం ఆమెతో మాటాడుతున్నప్పుడు దానిగరించి ఆమెకి వివరించాడు:

"నేను నా ఆదర్శాలని భేటీలలో చెప్పుకుంటూ, ఉపన్యాసాలలో వ్యాఖ్యానం చేస్తూవుంటే మాత్రం చాలదు. ఉపయోగ్యరీతిగా ఏమైనా చేసి చూపాలి. ముందు వయలిన్ వాయించడానికి నేర్పే బడి ఒకటి ఆరంభించాలని నిశ్చయించాను. తరువాత మన గ్రామీయ సంగీతంలోని సంప్రదాయాలు అభ్యసించి వాటిని మేల్బంతిగా పెట్టుకొని, చిన్నచిన్న పాటలని మన వాద్యాలతో సృష్టించాలని నాకుంది. ఆ తరువాత కొన్ని solo రికార్డులు ఇవ్వాలి. నా ఉద్దేశం బోధపరచుకొని ఒక పదిమంది విద్యార్థులు ముందుకు వచ్చారంటే . . . ఆది నాకు చాలు!"

అప్పుడు లలిత అతనికి చెప్పింది:

"సంగీతం గురించి మీ అభిప్రాయాలన్నీ ఒక పుస్తకంగా లేక 'మనోన్మణి' పత్రికలో ధారావాహికగా వ్యాసాలు రాయండి."

సారంగన్ తల గోకుతూ జంకాడు.

"నాకు తమిళంలో రాయడం తెలీదే."

"మరి నేనెందుకు ఉన్నాను? మీతో మాటాడుతున్న అనుభవంకి నేనే ఒక పుస్తకం రాయగలననిపిస్తోంది. మీరు రాసినది అనువదించడంలో నాకేం శ్రమ లేదు. మీరెందుకు అలాగ రాయకూడదు?"

ఆమె ఆలోచనలకి సాపంగన్ కృతజ్ఞత తెలియజేసాడు. దాని గురించి లలిత మరికొన్ని మంచి సలహాలు ఇచ్చింది:

"మీరు రాసినది అనువదించడం మాత్రం కాదు, నేను మరికొన్నివిధాలుగా మీకు తోడ్పడగలను. కర్ణాటక సంగీతం గురించి, పాశ్చాత్య సంగీతం గురించి మీ అభిప్రాయాలూ, తోచినవన్నీ రాస్తూనేవుండండి. తరువాత ఆ అభిప్రాయాలు వర్గపరచి వివిధ శీర్షికలుగా వేరుచేద్దాం. ఇక్కడ ఒక మౌలిక విషయం విపులంగా చెప్పితీరాలి: మన కర్ణాటక సంగీతంకి నేపధ్యంగా, ప్రాధమికంగా ఉన్న తత్వం. మీరు దాన్ని విపులంగా వివరించినతరువాతే మన సంగీతంకి చెందిన మూలాధారంగా రూపాంతరమైన, భిన్నమైన, పాశ్చాత్య సంగీతం విశాల దృక్పధం గురించి మాటాడగలరు. ఆ రోజు మీ నాన్నగారుతో మాటాడుతున్నప్పుడు అది నాకు తోచింది.

అతను చెప్పినట్టు విభిన్నమైన రెండు ఆశ్రయాలున్న రెండు సంప్రదాయాలని మీరు సరిపోల్చుతున్నారు అనే ఆరోపణకి అదే మంచి జవాబు."

"భిన్నమైన రెండు (కళలు కాదు!) దృక్పథాలని సరిపోల్చడం పొరబాటు కదా? అది సంగీతంకి మాత్రం కాదు. జీవితంలో, అన్ని రంగాల్లో మనం అనుసరించవలసిన ఒక దృక్పథం. 'నాకు సంగీతం గురించి ఏమీ తెలీదు' అని అనగానే, అతను చెప్పారు: 'సంగీతం గురించి తెలియకపోతేనేం, ఈ దేశం సంస్కృతి గురించి తెలుసుకదా? అని. ఆ తరువాత ఈ దేశం స్త్రీలగురించి . . . నేను అప్పుడే ఆలోచించాను - 'ఇతనికి సంగీతం తప్ప మరేం తెలీదు' అని. తెలిసివుంటే నశించిపోయి కుళ్ళిపోతున్న ఆ నకిలీలతో సంగీతంని సరిపోల్చడంలో అతనికి ఏం గొప్ప?" అని లలిత చెప్తూపోతుంటే ఆమె తన సొంత జీవితంలో, ఎంత కటువైన అనుభవాల వలనా, క్రూరమైన మాటలవలనా, కష్టడినా, తన్నూ, తన ఆదర్శమార్గంని, గూడంగా బోధపరచుకుందని గ్రహించి సారంగన్ పరవశమయ్యాడు.

"ఓ, లలితా, మీరుగాని నిత్యమూ నాతో ఉన్నారంటే నా నిండని కలలన్నీ - 'సఫలమవుతాయా?' అని నేను కాంక్షించే కలలన్నీ - ప్రతీ నిమిషం జీవితంలో నెరవేరుతాయి."

"ఏం, ఎందుకు? నేను యెల్లప్పుడు మీతోనే ఉన్నానుగా?" అని ఆమె పలికినప్పుడు ఇంతవరకు ఆమె కంఠధ్వనిలో ఉన్న నిజంలో శ్రుతిభేదం కనిపించింది.

కళ గురించి ఏవేవో బుద్ధికుశలభావనలలో సంచరించుతున్న ఇద్దరూ గభీమని వాటినుంచి విముక్తమై తమకు తామే ఒక ప్రశ్నగా ఐపోయి, దాని వేదన భరించలేక, దుర్భలంగా, కాంక్షతో ఒకరినొకరు తేరిపారి చూసారు.

"ఎవరితో ఉన్నారని కాదు. ఎవరికి సొంతంగా ఉన్నారు?" అని ఏదో అడగాలని అతను ప్రయత్నించినప్పుడు, ఆ మాటలు నోటినుంచి బయటకి రాకుండా మాసిపోయాయి. ఇద్దరూ పరవశమైపోయారు. అతనికి జవాబు చెప్తున్నట్టు లలిత అతని మొహంని బిగువుగా తన గుండెతో ఒత్తుకొని కౌగిలించుకుంది.

చాలా రోజులుగా చెప్పాలని ఆలోచించిన ఆ వార్త ఇవాళ, ఈ నిమిషం సారంగన్ ఆమెకి చెప్పాడు: "నేనిలాగ ఒక సలహా ఇవ్వడానికి నన్ను క్షమించండి. మీరెందుకు

Mr. మహాలింగంని విడాకులు అడక్కూడదు? అతనొక పురోగామి. అభ్యుదయకర భావనలున్న జ్ఞాని.”

లలిత జవాబు చెప్పకుండా, మొహంలో ఎటువంటి చలనం లేకుండా తన్నే తేరిపారి చూడడం గమనించి, ‘నేనేం పొరబాటు చేసానా?’ అనే ఆలోచనతో సగంలో ఆపి, ‘What is wrong?’ అని సారంగన్ ఆమె భుజాలని కదిలించాడు. ఆ కదలికతో ఆమెలో ఒక నిమ్మళమైన విభ్రాంతి కలిగింది!

ఆమె అతన్ని చూసి పసిపాపలాగ నిరర్థకంతో నవ్వింది. విడాకులు గురించి అతని ఆలోచన ఆమె మనసు నిరాకరించింది. కాని అతను స్వభావంతో విడాకులగురించి తన భావనలు ఒక సిద్ధాంతంలాగ వివరించాడు:

“జీవితంలో చిక్కులు తొలగించుకోవడం పొరబాటా? వివాహం అనేది ఒక ఒప్పందం. అది తన్నూ, ఇంకొకరిని ఏ నాడూ మీరకుండా బంధించే చెఱసాల అనే కడపటి తీర్పు కాదు. బంధించబడినవారికి అది ఉచితంగా ఉండవచ్చు. కాని కావలిలో ఉండాలని కోరేవారికి బయటకి రావడానికి అవకాశం ఉండాలి. లేకపోతే ఏదో పెద్ద సదాచారం వంకలో తన్నూ, తనతో కలిసివున్న పాపంకోసం ఇంకొకరిని కేవలం చిత్రవధ చేసే కిరాతులుగా భర్తలు మారిపోతారు. ఎక్కడ ఎక్కువగా సత్ప్రవర్తనల గురించి మనం మాటాడుతన్నామో అక్కడే తక్కువగా నిర్బంధాలు ఉండాలి. లేకపోతే మాటవరుసకి సత్ప్రవర్తనలు అలాగే ఉంటాయి. నేనిది మనకోసం అనలేదు, మామూలు మాటల్లో మీకు చెప్తున్నాను.”

ఆమె మళ్ళీ అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది.

“నేను దీనిగురించి అతనితోనేకదా సంప్రదించాలి?”

“అవును. తప్పకుండా.”

Spur Tank Road లో బస్సు ఆగింది. ఒక దీర్ఘ నిట్టూర్పు వదులుతూ సారంగన్ బస్సునుంచి దిగి తన ఇంటికి నడిచాడు.

## 6

పగలంతా ఉష్ణం ఉగ్రత మామూలుగా కనిపించినా, కొన్ని రోజులు, సాయంకాలం వర్షం కురిసింది.

ఆ రోజు చాలా సేపు వర్షం కురియకుండా ఆకాశంలో మబ్బుతోబాటు ఉక్క, చెమ్మ కలుసుకున్నాయి. లలితతో ఎక్కెక్కడో తిరిగి, తనింటికి వచ్చిన సారంగన్ A.C. గదిలో మీటని నొక్కాడు. ఆ సాధనం పని చెయ్యలేదని గ్రహించి, 'విద్యుచ్ఛక్తి ఉందా?' అని చూడడానికి గది దీపం వెలిగించే మీటని నొక్కాడు; దీపంలోనూ చలనం లేదు.

లలిత నుదురు, మొహంకి చెమట పట్టేసింది. చేతిలోని పత్రికని పటపటమని విసనకర్రలాగ చల్లార్చుకుంటూ ఆమె నిట్టూర్పు వదిలింది. ఆమె రవికలో కంఠమూ, భుజాలు, చెమటతో తడిసిపోయాయి.

ఇంటి లోతట్టునించి వచ్చిన కన్నియప్పన్ జంకుతూ నిల్చున్నాడు. "కరంటు బిల్లు ఎక్కువ అవుతోందని ఇవాళ మధ్యాహ్నం పెద్దాయనే కట్ చేసి వెళ్ళిపోయారు."

లలిత, సారంగన్ ఒకరినొకరు సార్థకంగా చూసుకున్నారు. "సరే, నాకు కొంచెం పని ఉంది . . . తరువాత కలుసుకుందాం" అని లలిత శెలవు తీసుకొని లేచింది. ఆమెని పంపించేసి 'ఈ ముసలాయన ఎంత అహ్యంగా పగతీర్చుకుంటున్నారు!' అని ఆలోచిస్తూ, ఎర్రబారిన మొహంతో, పెదిమని కొరుకుతూ సారంగన్ సోఫాలో కూర్చున్నాడు. తన రోజువారీ ఖర్చులకే వీళ్ళని నమ్ముకొనివుండే పరిస్థితికి తను దిగజారిపోయినందుకు అతని కళ్ళు చెమ్మగిల్లాయి. తను శేషయ్యని చాలా రోజులుగా కలుసుకోలేదని అతనికి జ్ఞాపకం వచ్చింది. ఆఖరిసారిగా అతని వ్యాపార పథకంని తను బలంగా నిరాకరించిన తరువాత తన్ను ఒక విరోధిగా భావించి తన్ను చూసినప్పుడెల్లా అతను మొహం తిప్పుకోవడం ఇప్పుడు సారంగన్ గుర్తుచేసుకున్నాడు. అతను తనగురించి బాధ పడుతున్నప్పుడు తనే ఇష్టపూర్వకంగా వెళ్ళి దాన్ని ఎక్కువచెయ్యవద్దు అని సారంగన్ పడే వ్యాకులతని అతను అపార్థం చేసుకున్నారని కోపమూ వచ్చింది. 'అతనొక సంప్రదాయవాది, మారనే మారరు!' అని ఇప్పుడు ఖాయపరచుకున్నాడు. ఒక నిమిషం 'ఈ ఇల్లు వదలి మరెక్కడైనా వెళ్దామా?' అని ఆలోచించాడు. 'ఎక్కడికి వెళ్ళడం?' అనే ఆకస్మికత వలన ఆ ఆలోచన మార్చుకోలేదు. 'ఎందుకు వెళ్ళాలి?' అని తన హక్కులు గుర్తుచేసుకొని మార్చుకున్నాడు.

'ఇతను యజమానిగా ఉంటూ నిర్వహించే ఈ కుటుంబంలోని ఆస్తికి ఇతనికి మాత్రం అధికారం ఉందా? ఈ కుటుంబం పూర్వార్జితంలో ఇతను స్వతఃగా సంపాదించిన

ధనం కంటే ఖర్చు చేసినదే ఎక్కువగా ఉంటుంది. ఈ లెక్కలు ఎలాగున్నా నాకు ఏ వాటా లేదని నిరాకరించడానికి ఇతను ఎవరు? న్యాయతఃగా నాకూ ఈ ఇంటిలో అన్ని హక్కులూ ఉన్నాయని అతనికి తెలియజేయడం తప్పనిసరి కాబోలు' అని సారంగన్ చాలాసేపు ఆక్రోశంతో ఆలోచించి, గభీమని కోపంతో, గది తలుపుని తెరిచి, బయటకి వచ్చాడు.

'ఏం జరుగబోతుందో?' అని బెంగతో సారంగన్ వెనుక బయటికి వచ్చి కన్నియప్పన్ నిల్చున్నాడు.

సారంగన్ వేగంగా నడిచివచ్చి ఆ ఇంటి ముందు హాలులో ప్రవేశించాడు. అక్కడ ఎవరూ లేరు. శేషయ్య తన సొంత గదిలో ఉన్నారని తెలుసుకొని అదే వేగంతో సూటిగా వెళ్ళి ఆ గది తలుపుని తన్నాలని ముందడుగు పెట్టినప్పుడు అతనే తలుపు తెరిచి బయటకి వచ్చారు.

సారంగన్ని తటాలున చూసి అతను కంపించలేదు; వాడి కోపం చూసి భయపడలేదు. సావధానంగా కళ్ళద్దాలు తీసి, అంగవస్త్రంతో తుడుచుకొని, ఏటవాలైన కుర్చీలో కూర్చున్నారు.

అతన్ని చూడగానే సారంగన్ లో కోపం శమించి, మర్యాద భావమే లేచింది.

అతని నిమ్మళమైన స్వరూపం, ఏమీ జరగనట్టు కనిపించే ధోరణి చూసి, 'ఒక వేళ, ఇతనికి తెలియకుండా, ఈ పని జరగిందేమో? కన్నియప్పన్ పొరబాటున చెప్పాడేమో?' అని జంకుతూ, సారంగన్ తనకి తెలిసిన చేతకాని తెలుగులో, ఒక తండ్రిని ఒక కొడుకు అడిగే పైఖరిలో, "మురళీ ఎక్కడ, సైనా? ఈ నెల పూర్తిగా వాడు నాకు డబ్బు ఇవ్వలేదు . . . ఇప్పుడు లటుక్కున ఈ electricity cut . . . మురళీ మీద ఉన్నాడా?" అని అడుగుతూ తన దృష్టిని మేడమెట్లమీద మళ్ళించాడు.

"వాడు ఇప్పుడు ఈ ఇంట్లో లేడు" అనే వార్త అతను ఎందుకు ఇంత నిగ్రహంతో చెప్తున్నారని సారంగన్ అతన్ని తేరిపారి చూసాడు.

అతను ఇంకా చెప్పారు: "మీరందరూ మీ సుఖం, వసతికోసం ఇక్కడ ఉంటున్నారు, అవునా? హూం, అందరూ నన్ను వదలి ఇలాగే వెళ్ళిపోండి! నాకు ఎవరూ వద్దు!" అని అతను చెప్తూంటే లోపలనుంచి వచ్చిన బాలమ్మ జోక్యం చేసుకొని మాటాడింది:

“నైనా, మీకెందుకు విచారం? మురళీ అత్తగారింటికి వెళ్ళాడు . . . ఎందుకో వాడికి మనమీద కొంచెం కోపం ఉంది . . . కోపం వస్తే వాడు ఎక్కడకి వెళ్తాడు? ఇంకా రెండు మూడు రోజుల్లో తిరిగివచ్చేస్తాడు” అని తండ్రిని ఓదార్చింది.

“హూం . . . వాడు రాలేదని ఎవరు ఏడ్చారు? నన్ను వదిలి వెళ్ళినవాడు ఎవడూ తిరిగి రావద్దు! ఈ ఇంట్లో ఉండాలంటే, నేను బతికివున్నంతవరకూ, నా ఇష్టం ప్రకారం ఉండితీరాలి . . . లేకపోతే, ఎవరైనా సరే, బయటకి వెళ్ళడం మంచిది!” అని అతను అన్నప్పుడు అతని కళ్ళు జివ్వుమని ఎఱ్ఱపారిపోయాయి, పెదిమలు వొణికాయి.

సారంగన్ పెదవిని కొరుకుతూ ఒక క్షణం కళ్లు మూసుకొని తన భావనలు అణచుకున్నాడు. నోరు విప్పితే కఠినమైన మాటలు తన పెదవులనుంచి రాలుతాయని కొన్ని క్షణాలు జంకాడు. కాని శేషయ్య పోట్లాటకి సిద్ధమైన కోడిపుంజులాగ, ఎదిరించే ఏ శత్రువైనా సరే, చితకబాదాలనే పట్టుదలతో నిల్చున్నట్టు కనిపించారు. ‘ఇతనితో మాటాడడానికి వేరే సమయంలో వచ్చివుంటే బాగున్నేమో?’ అని సారంగన్ నిదానంగా ఆలోచించాడు. అందువలనే తన స్వభావంని మించిన మర్యాద, ఓర్పుతో, ఈ గండంనుంచి తప్పించుకోవాలని వెనకాడాడు. కాని శేషయ్య అందుకు అవకాశం ఇవ్వలేదు.

“ఏ తమ్ముడూ . . . ” అని పిలిచి, ఉయ్యాల పలకని చూపి, సారంగన్ని కూర్చోమన్నారు.

‘సరే, ఏం జరుగుతుందో చూద్దాం’ అని సారంగన్ కూడా నిశ్చింతంగా కూర్చున్నాడు.

“What are you actually thinking?” అని శేషయ్య కఠినంగా అడిగారు.

“అదే నేనూ మిమ్మల్ని అడగాలని వచ్చాను” అని సారంగన్ కూడా కఠినంగా జవాబు ఇచ్చాడు.

ఈ ఉగ్రమైన మాటల పరివర్తన తన గదిలోనుంచి వింటున్న నరసింహన్ గది తలుపుని ఓరవాకిలిగా తెరిచి, తొంగి చూసారు; అది సారంగన్ కూడా గమనించాడు.

“నా మనస్సులో ఏముందని నేను ఇప్పుడు చెప్పానుగా, దానికి నీ జవాబు ఏమిటి? ఇక్కడ ఉండాలంటే నా ఇష్టం ప్రకారం ఉండాలి.”

"సరే, మీ ఇష్టం ఏమిటి? అదేమిటో చెప్పేసి మీరు చేస్తే సరే . . . ఈ ప్రత్యేక నివాసం, A.C. వసతి కావాలని నేను అడిగానా? అవన్నీ వ్యర్థం అంటే నాతో మీరు ఒక మాట చెప్పివుంటే సరిపోను . . . అద్దెకున్నవాడితో కావాలని దెబ్బలాడే సొంతదారుడులాగ ఎందుకు ఇంత చెడ్డగా మీరు ప్రవర్తించాలి? మీ అంతస్తుకి అది మంచిదికాదు . . . " అని ఏదో చెప్పడానికి వచ్చి, దానిగురించి సిగ్గు పడుతున్నట్టు సారంగన్ తల వొంచుకున్నాడు.

"నువ్వేమంటున్నావ్? వంకరకొంకరగా మాటాడాడం మీ అందరికీ అలవాటైపోయింది. ఇదిగో, నా సవాలు విను. ఈ కుటుంబం సాయం లేకుండా, నెల నెలకీ నేను ఇచ్చే ఆర్థిక సహాయం లేకుండా - నువ్వు వ్యాఖ్యానం చేసే ఆ జ్ఞానసాధన, ఆదర్శం, కళా నైపుణ్యం - వాటితో నువ్వు నీ సొంత కాళ్ళతో ఒక రోజైనా నిలబడగలవా? నేను నిన్ను ఒక ప్రభువులాగ కాపాడుతున్నాను, అందుకైనా నీ మంచికోసం నా సలహా గౌరవించకూడదా? అంతేకాదు, ఈ కుటుంబం ఖర్చులతో నా ఆస్తిని, నీ భవిష్యత్తుని పాడుచెయ్యడమే నా అంతస్తుకి ఉచితం అని అంటున్నావా?"

-అతను ఎడతెగకుండా మురళీ గురించి, నరసింహన్ గురించి అంగలార్చుకోవడం లక్ష్యం చెయ్యక సారంగన్ చికాకుతో, పొంగి వస్తున్న కోపంని అణచుకొని కూర్చున్నాడు. శేషయ్య చాలాసేపు మాట్లాడుతూంటే జోరపడకుండా, ఆ తరువాత సారంగన్ చాలా మర్యాద, వినయంతో, అతన్ని అడిగాడు:

"సైనా, మీకెందుకు నేనంటే ఇంత ద్వేషం? మీకెందుకు నేనంటే ఇంత కోపం? 'నాకు ఏ ఉద్యోగమూ చేతకాదు' అని నేను ఎన్నిసార్లు చెప్పినా మీకు అర్థం కాదా?"

"నువ్వేం చెయ్యవద్దు. అవన్నీ మురళీ చూసుకుంటాడు."

"అలాగైతే మురళీకే మీరు ఆ వ్యాపారం అప్పగించవచ్చుకదా? అనావశ్యకంగా నేనెందుకు? అదీ చెయ్యకుండా, మురళీ మనసు నొప్పించి, వాడిమీద మీకు కోపం వచ్చేసింది! . . . మీ మనస్సులో ఏముందో నాకు అర్థం కావటం లేదు!"

"నీకేం మతి పోయిందా? మురళీ నా కొడుకు కాదు!"

'ఛీ, ఇతనిలో ఎంత స్వార్థం!' అని సారంగన్ తనలో గొణుక్కున్నాడు.

శేషయ్య కూడా అలాగ చెప్పివుండకూడదని తన మనసులో తన్ను నిందించుకున్నారు. 'నేను చెప్పినది బాలమ్మ వినలేదుకదా?" అని దిగులుతో అతను చుట్టుపక్కలు చూసుకున్నారు. 'మంచి వేళ, మనం ఇంగ్లీషులో మాట్లాడుతున్నాం' అని ఓదార్చుకున్నారు.

"మీకు మురళీ గరించి నమ్మకం లేదా?" అని సారంగన్ అడిగాడు.

"నిన్ను నమ్మడంకంటే వాడినే నేను నమ్ముతున్నాను. ఆ నమ్మకంతోనే ఈ వ్యాపారం లో నా పెట్టుబడి, నువ్వు పాల్గొనడం నిశ్చయించాను . . . వాడికి నీ సాయం దొరుకుతుంది, నువ్వూ సార్ధకంగా ఒక పని చెయ్యడానికి ఇది మంచి ఆలోచన అనిపించింది. పనికిరాని కొడుకుని దూపరదిండిగా ఇంట్లో ఉంచుకొని ఆ వ్యాపారం వాడు మాత్రం ఎందుకు ఆరంభించాలని నేను ఇప్పుడుకూడా ఆలోచిస్తున్నాను . . . ఇప్పుడు చెప్పు: నువ్వు 'ఆ వ్యాపారంలో భాగస్థుడుగా ఉంటాను' అని. నీవలనే నేను వాడి విరోధం, పగ సంపాదించుకున్నాను! ఈ ఇంటిలో పూర్తిగా ఉండేవాడు ఇప్పుడు పరాయివ్యక్తిలాగ ఎప్పుడైనా వచ్చివెళ్తున్నాడు. నన్ను అడక్కుండా ఏదీ చెయ్యనివాడు తన భార్య ఇంటిలో ఒక పేద అల్లుడుగా నా అనుమతి లేకుండా ఉంటున్నాడు. వాడు వచ్చినప్పుడు, నేను ఎదుట కనిపించినా, లక్ష్యం చెయ్యక, నన్ను చూడకుండా వెళ్తున్నాడు! అందువలన నేను వాడిని దూషించగలనా? నన్ను లక్ష్యం చెయ్యని నీ మీద 'నా కొడుకు' అనే కారణంవలన నాకు వాత్సల్యం ఉంది. 'ఇవన్నీ నేను మోసితీరవలసిందే . . . ' అని ఈ తలవంపులు సహించుతున్నాను."

ఆ మాటలు విని సారంగన్కి విభ్రాంతి కలిగింది. అయినప్పటికీ ఇది అసహ్యామైన ఒక బెదిరింపుగా కనిపించింది. 'ఇతని ఆర్ధిక ముట్టడికి లొంగిపోయి ఇతని సలహాతో ఏకీభవించడం నా ఆత్మగౌరవంకి అవమానం' అని నిశ్చయించి, సారంగన్ వెంటనే అతన్ని అడిగాడు: "నేను దీనిగురించి మాటాడానికి ఇప్పుడు రాలేదు. ఈ కుటుంబంలో నేనొక సభ్యుడని నన్ను గౌరవించండి . . . నేను ఈ ఇంటిలో వట్టి అతిథి, paying guest, కాదు."

- తన హక్కులు వక్కాణించే ఉద్వేగంతో సారంగన్ మాట్లాడాడు.

"నాకు ఎవరి దయ, దాతృత్వం వద్దు. మీరు నా తండ్రిఐనా, మీ యాచకంలో జీవించడానికి నాకు ఇష్టం లేదు. మీకు ఒక సంగతి గుర్తు చెయ్యడానికి నాకు బాధగా ఉంది. ఈ ఆస్తులు అన్నీ మీరు సంపాదించలేదు . . . వీటిలో మీకు ఎంత హక్కు ఉందో, అది నాకూ ఈ పూర్వార్జితంలో ఉంది. నేను దీనిగురించి ఇంకా కఠినమైన వ్యాజ్యంకి సిద్ధంగా ఉన్నాను. దానికి ముందు మీరు రాజీకి ఏకీభవిస్తారని నా నమ్మకం. ఆ తరువాత . . . ఇంతకు ముందు మీకు చెప్పినదే మళ్ళీ చెప్తున్నాను - నా స్వాతంత్రంలో మీరు జోరపడితే మనిద్దరికీ కష్టాలు కలుగుతాయి . . . " అని త్వరగా చెప్పి అక్కడనుంచి నిష్క్రమించాలని సారంగన్ లేచినప్పుడు, శేషయ్యకూడా లేచి నిల్చున్నారు; అతన్ని చూసి నవ్వారు.

"కొంచెం ఆగు" అని అతను లోపలికి వెళ్ళారు.

- తమ్ముడికీ, తండ్రికీ మధ్య జరిగిన వాదనలు తన గదినుంచే విన్న నరసింహన్ తనలో శ్లాఘించుకున్నారు.

కొన్ని నిమిషాల తరువాత శేషయ్య ప్రత్యేక గదిలో ఇనుప అల్మారా తెరిచి తాళం వేసే సద్దు వినిపించింది. చేతిలో నీలరంగు గుడ్డతో ఒక మూటగా కట్టబడిన దస్తావేజు కట్టలతో బయటకి వచ్చిన శేషయ్య, దాన్ని సారంగన్ ముందు విసిరి అరిచారు:

"న్యాయం, హక్కులగురించి మాట్లాడడానికి ఇది తగిన చోటు కాదు. ఇక్కడనుంచి తిన్నగా మూడు మైళ్ళు నడిచివెళ్ళు . . . High Court ఎక్కడ ఉందని తెలుసుకదా? అక్కడ మనం కలుసుకుందాం . . . మరెందుకు నేను కన్నాను ఈ కొడుకులని? అయ్యయ్యో, నా రంగయ్యగాని బతికివుంటే . . . " అని పొంగివచ్చే ఏడ్పుతో తన గదికి వెళ్ళి అతను తలుపు మూసుకున్నారు.

ఏదో మహాపాతకం చేసిన వేదనతో, చంచలంతో తలవొంచి, సారంగన్ ఉయ్యాలమీద కూర్చున్నాడు.

ఉయ్యాల సంకెలని రెండు చేతులతో గట్టిగా పట్టుకొని, తల వొంచిన అతని కళ్ళు తడిసిపోయాయి.

"సారంగా, ఇది నేను ఎదురుచూసినదే! నువ్వేం బాధ పడవద్దు. నేను ఉన్నాను; మనం కోర్టుకి వెళ్ళి ఇతని హతం అణచాలంటే, అదీ మనం చేద్దాం" అని ఆదరణతో తన

భుజంమీద పడిన చెయిని పట్టుకొని సారంగన్ లేచినప్పుడు అతని అన్నయ్య నరసింహన్ అతన్ని చూసి నమ్మకం, ధైర్యం ఇచ్చే ధోరణిలో నవ్వుతూ నిల్చున్నారు.

"అతని మొండి పట్టుదలకి మనందరం లొంగిపోతామనే ధైర్యంతోనే అతను ఉంటున్నారు. నువ్వు ఎక్కడనించో వచ్చావ్ . . . ఈ కొన్ని రోజుల్లోనే అతను నీ మనసుని ఎలాగ చెడగొట్టారో చూసావా? కాలమంతా నేను ఇతనితో ఉంటున్నాను, నా గతి గుంరించి కొంచెం ఆలోచించి చూడు . . . ఈ చెల్లిన వయస్సులో 'మనకెందుకు ఈ గొడవ?' అని ఊరకే - ఇతరుల గురించి తలపోయక ఉండడం - ఇతనికి చేతకాదు! కాని మనం స్వంత వ్యవహారాల్లోకూడా అలాగ ఉండాలట! నువ్వు అడిగావుగా ఒక ప్రశ్న, అలాగ అతన్ని అడగాలని నాకు ఎన్నిసార్లు అనిపించిందో తెలుసా?"

"కాని నాకు తెలుసు. 'నువ్వు బయటకి వెళ్ళు!' అని అతను జవాబు చెప్తారని. అలాగని కూడా నేను ఒక సారి బయటికి వెళ్ళివున్నాను. కోర్టు వ్యవహారం అని అప్పుడు వెళ్ళివుంటే 'ఒక కొడుకు చనిపోయాడు, ఇంకొకడు సీమలో ఉన్నాడు, ఉన్న ఆస్తి అంతా ఈ ముసలాయన దగ్గరనుంచి దొంగలాడాలని నాకు పేరాశ' అని అందరూ అంటారు . . . నేనెవరికోసం డబ్బు కూడబెట్టాలి? మా ఇద్దరికీ నేను సంపాదించినది చాలు. అతనైనా తనకిష్టం వచ్చినట్టు జీవించనీ . . . ఒక గౌరవమైన కుటుంబం ఘనత నా వలన చెడకూడదనే నేను తిరిగివచ్చాను . . . కాని అతనికి దానిగురించి ఏ చింతా లేదు. తన మొండి పట్టుదలే అతనికి ముఖ్యం . . . రానూ రానూ నాకూ 'మనం ఎందుకు ఇతనికి లొంగాలి?' అనిపిస్తోంది."

- చాలా రోజులుగా తన తండ్రి తన్ను ఎంత కఠినంగా నిరాకరించారని, అతని వలన తనకేర్పడిన కొఱతలని, తమ్ముడు దగ్గర నరసింహన్ ధారపోసారు.

ఉమ్మడి కుటుంబంలో జీవించినా స్వతంత్ర కాపురంలాగ కనిపించే నరసింహన్ ప్రత్యేక గదిలో మొట్టమొదట ప్రవేశించిన సారంగన్, 'ఈ కుటుంబ రాజకీయాలలో నేనూ చిక్కుకోవాలా?' అని మానసిక బాధతో తల వొంచి కూర్చున్నాడు. కిటికీమీద ఆనుకొని తన భర్త, సారంగన్ మధ్య జరిగే సంభాషణ శ్రద్ధతో వింటూ, వాళ్ళ ఈ నిర్ణయంకి మనసులో సంతోషించుతూ, రాజం సారంగన్కి చెప్పింది: "మీకేం విచారం వద్దు. మనం అతనిమీదున్న ద్వేషంవలన ఇవన్నీ చేస్తున్నామా? మనకేం పగ, అతనిమీద?

అతనికే మనమీద పగ . . . అదెలాగో పోనీ, అతనికి మాతో పొత్తు లేదు . . . పాపం మురళి . . . వాడేం పొరబాటు చేసాడు? కొడుకికి కొడుకుగా, నౌకరీకి నౌకరీగా, ఎంత బాధ్యతతో ఇతనికి సేవ చేసాడు? వెయ్యిరూపాయలు జీతం ఇచ్చినా అతనికి ఇలాగ ఎవరైనా దొరుకుతారా? ఆఖరికి, వాడి మనసుని కూడా చెడిపేసారు! ఇలాగ ఎవరితోనూ సర్దుకోకుండా ఈ ఆస్తిని ఎవరికి ధారపోస్తారో? ఎవరైనా అతనికి పాఠం నేర్పాలి!" అని కారణం చూపుతూ వచ్చిన రాజం, "ఈ కుటుంబంలో నేనేం అనుభవించాను? పేరుకి మాత్రం జ్యేష్ఠ కోడలు . . . పనిమనిషికంటే దిక్కుమాలిన బతుకు . . . ఇంకొకరి ఇంటికి వెళ్ళి తిరిగి వచ్చిన కూతురుకి ఉన్న అధికారం నాకు ఉందా? కాని అతను ఇలాగ కొడుకుని నిర్లక్ష్యం చేస్తూంటే అతని హఠంతో సర్దుకొని పోవడం ఎలాగ?" అని రాజం వాపోయింది.

సారంగన్ అదిరిపోయాడు. ఆమె పటపటమని తెలుగులో చెప్పినది అతనికి పూర్తిగా బోధపడలేదు. భార్య ఏడవడం చూసి తాళలేక నరసింహన్ కూడా చిన్నబోయారు.

గభీమని ఒక నిర్ణయంకి వచ్చి నరసింహన్ మాట్లాడారు: "రాజం, ఊరుకో . . . నేను ఇంత కాలమూ 'సరే' అని ఏమీ చెయ్యకుండా ఊరుకున్నాను. ఇక అలాగ ఉండను. ఏమైనా సరే, న్యాయంగా ఈ ఆస్తిలో నాకున్న వాటా నాకు కావాలి. నాకుగాని పిల్లలు ఉంటే ఇప్పుడు నేను కూడా ఒక తాత అయివుంటాను. నిత్యమూ 'తండ్రికొడుకు'గా ఉండడం జరగదు . . . పట్టుదల అంటే ఇతనికి మాత్రం ఉందా ఏమిటి?"

మంచంమీద కూర్చున్న సారంగన్ ఈ అవస్థనుంచి తప్పించుకోవాలని లేచి నిల్చున్నాడు. ఈ సందర్భంలో తనూ ఏదో చెప్పాలని రాజం, నరసింహన్ దంపతులని చూసి తడబడుతూ చెప్పాడు:

"సైనా గురించి నాకంటే మీకే బాగా తెలుసు. నాకంటే మీరు ఎక్కువగా బాధ పడ్డారని తెలిసింది. ఒక విధంగా మీరు చెప్పేది సరే అనిపిస్తోంది. కాని . . . "

"ఏమిటి కాని . . . " అని నరసింహన్ జోక్యం చేసుకున్నారు.

సారంగన్ అతన్ని ఊరడించే ధోరణిలో చిరునవ్వు నవ్వాడు: "కొంచెం ఆలోచించి తీరికకగా చేద్దాం."

నరసింహన్ లేచి సారంగన్ చేతులు పట్టుకున్నారు. “సారంగా, మరేం ఆలోచనా వొద్దు. నేను చాలా రోజులుగా ఆరసించి చేసిన నిర్ణయం ఇది. నువ్వేం శ్రమపడవద్దు. అన్నీ నేను చూసుకుంటాను. నాకు నీ సాయం ఉంటే చాలు.”

తన చేతులు పట్టుకున్న నరసింహన్ చేతులు గాబరాగా తడుముతూ సారంగన్ ఒక నిమిషం మౌనంగా నిలబడి ఆలోచించాడు. అతని మనసులో ‘కేవలం ఆస్తికోసం నేను పోరాడాలా?అంటే, వకీలు ఇంటికీ, కోర్టుకీ రోజువారీ నడుస్తూవుండాలన్న మాట! ఛీ, అది నా హోదాకి పరాజయం!’ అనిపించింది. ‘అంతకంటే భుజంమీద ఒక ఫిడిలుతో ఆ పారిస్ నగరంలో చవుకబారైన పూటకూళ్ళ ఇళ్ళలో నా మహత్తైన సంగీతంని పోషించడంలో నా జీవితం సార్ధకంగా ఉంటుంది’ అనిపించింది. ఇలాగ అసాధారణ, అల్ప, లౌకిక వ్యవహారాల్లో తను గడిపే ప్రతీ నిమిషం ఒక కళాకారుని జీవితంని పూర్తిగా ధ్వంసం చేస్తుందని సారంగన్ జడిసాడు. ఆఖరికి, నరసింహన్ కి చెప్పాడు.

“Still, I have to think on that . . . ” అని తను చిక్కుకున్న కలవరపాటుని అతనికి దుఃఖంతో తెలియజేసాడు. అక్కడనుంచి నిష్క్రమించడానికి గది తలుపు తెరిచాడు.

ముందు హాలులో ఆ రోజు తపాలులో వచ్చిన ఒక ఉత్తరం చదువుతూ మురళి నిలబడివున్నాడు.

సారంగన్ మురళిని సమీపించిన అదే సమయం, చాలా రోజులుగా కొడుకుని చూడని బాలాంబ, ఆతురతతో మేడమెట్లు దిగి హాలుకి వచ్చింది.

వాళ్ళ ఇద్దరిని లెక్కచెయ్యకుండా మురళి ఆ ఉత్తరంలోనే నిమగ్నమైపోయాడు. హాలుకి వచ్చిన బాలాంబ గది దీపం వెలిగించింది. మురళి తలెత్తి ఆమెని చూసాడు; ‘చేతిలోని ఉత్తరం గురించి వీళ్ళతో ప్రస్తావించడమా వద్దా?’ అని ఆలోచిస్తూ, సంశయంతో, దాన్ని రెండుగా మడిచి, తల్లిని చూసాడు.

“ఏయ్, మురళి, నువ్విలాగ అత్తగారి ఇల్లే దిక్కు అని ఉంటే మంచిది కాదురా . . . తాతయ్యగురించి నీకు తెలుసుకదా, మనమే సర్దుకొని పోవాలి. మొండిగటం వద్దు,

లీలని పిలుచుకొని రా . . . 'వాళ్ల కష్టంలో నువ్వూ, లీలా అక్కడ ఉండడం సరేనా?' అని కొంచెం ఆలోచించు . . ." అని వాడి చుముకంని తాకుతూ తల్లి వేడుకుంది.

"అమ్మా, 'ఎవరు ఎక్కడ ఉంటే మంచిది' అని మనం మాటాడకూడదు. అది నన్ను వదిలేసి పుట్టినిల్లుకి వెళ్ళలేదు. ఇంకా ఒక వారంలో వేరే ఒక ఇంటిలో మేం కాపురం చెయ్యబోతున్నాం . . . ఇంతలో ఈ ఉత్తరం వచ్చింది . . . ఇదిగో, చూడు!" అని నిష్ఠూరంగా ఆమెకి చెప్పి, కోపంతో, దుఃఖంతో, ఎర్రబారిన మొహంతో , పెదిమలు వొణుకుతూ, మురళి ఆ ఉత్తరం ఆమెకి అందించాడు.

బాలాంబ ఏమీ బోధపడక, తన్ను అవమానించే కొడుకుని కోపించుకొనే త్రాణ లేక, ఆ ఉత్తరం చదవడానికి దీపం దగ్గరకి వెళ్ళింది. ఆవేశంతో నిల్చున్న మురళి భుజంని సారంగన్ తాకాడు: "ఏమైంది, చాలా రోజులుగా నువ్వు కనిపించలేదు . . . నువ్వూ, లీలా ఈ ఇంటిలో లేరని నాకు ఇవాళే తెలుసు."

ఎవరితోనూ మాట్లాడలేని దుఃఖంతో మురళి నుదుటని చేతులతో కప్పుకొని ఉయ్యాలలో కూర్చున్నాడు.

దీపం వెలుతురులో తెలుగులో రాసిన ఆ ఉత్తరం చదివిన బాలాంబ చిత్తభ్రమ కలిగినట్టు మిటకరించే కళ్ళతో మురళిని తిరిగిచూసింది.

ఆ చూపులో ఎంత ఏవగింపు!

గభీమని ఆమె ఇరవై సంవత్సరాలు మరిచిపోయింది. వంచించబడిన ఒక భార్య కడుపుమంట ఆమె కళ్ళ మార్గాన తీవ్రమై, జ్వలించింది. ఆ భర్త ఆకృతితో, అదే ఆకారంలో, అదే వయస్సులో, ఎదుట నిల్చున్న తన రక్తంలో పుట్టిన ఆ కొడుకుని తేరిపార చూసింది. ఆ చూపు ఎక్కడో ఉన్న ఆమె భర్తని ఇక్కడ ఎదుట నిలబడిన మురళితో సరిపోల్చింది.

'అబ్బా, ఎంత ఘోరమైన ప్రారబ్ధం! ఎంత ఘోరమైన నిజం! వీడు, నా కొడుకు; నేను వీడిని త్యజించవచ్చు, నిరాకరించవచ్చు, మరిచిపోవచ్చు. కాని త్యజించలేని, నిరాకరించలేని, మరచిపోలేని వాత్సల్యంతో, నా జీవితంకి ఆధారమైన వీడు, వాడికి సొంతమట! ఒక కలలాగ, ఆ కలలో నన్ను బెదిరించే ఒక దెయ్యంలాగ, నేను

మరిచిపోయిన దాంపత్యంకి, ఆ భర్తకీ, వీడికీ ఎంత ఘోరమైన పొత్తు ఉంది! ఈ విచారణకి వీడే వకీలుగా వచ్చి నిల్చున్నాడు . . . నన్ను మోసం చేసిన వాడితో వీడికి రహస్యంగా సాన్నిహిత్యం ఉంది!" అని ఒక తల్లిగా ఆమె చిరచిరలాడింది.

తన కడుపులో పుట్టిన కొడుకు ఇంత కాలమూ తన్ను వంచించి, తను నిరాకరించిన భర్తతో, ఆ అవినీత వేశ్యతో, మెలగడం బాలాంబ భరించలేకపోయింది. ఏ న్యాయంతో, ఏ మాటలతో, వీడిని శపించడం అని తెలియక కలవరపడింది. వీడిని శపించడానికి ఆమెకున్న కోపంకి ఈడుగా ఎటువంటి న్యాయమూ, మాటా లేదనిపించింది.

ఇరవై సంవత్సరాలముందు ద్రోహ ఉద్దేశంతో ఒక వేశ్య నటితో తన సొంత పడుకగదిలో పడివున్న భర్తని చూసిందే - ఏ జన్మలోనూ మరవలేని ఆ కటువైన దృశ్యం - దాన్నే ఇప్పుడు మళ్ళీ చూస్తునట్టు ఆమెకి విభ్రాంతి కలిగింది.

'ఆ వేశ్య ఎంత పొగురుతో నా కొడుకుని 'ప్రియమైన మురళి' అని ఈ ఉత్తరంలో పిలుస్తోంది!' అని ఆలోచించినప్పుడు, ఇరవై సంవత్సరాలముందు తన భర్తని కోల్పోయినట్టు ఇప్పుడు తన కొడుకుని కూడా పోగొట్టుకున్నట్టనిపించింది. అన్నిటికీ మూల కారణం - పరాన్నభుక్కులాగ నాలో పెరిగిన ఈ పాపి ప్రోత్సాహమేకదా? ఆమె ఎంత ధైర్యంతో, అధికారంతో ఈ ఉత్తరం ఈ చిరునామాకి రాసింది!'

చెయిలోని ఉత్తరంని ఉమ్మి బాలాంబ మురళి మొహంమీద విసిరింది.

సారంగన్ ఏమీ బోధపడక, 'ఈ కుటుంబంలో అందరూ వేరేవేరేగా ఏదో ఆవేశం, హఠంలో చిక్కుకొని ఉన్నారా?' అని ఆలోచించాడు. "ఒక తల్లి తన కొడుకుతో ఇలాగ మెలగడం . . . ఒక తండ్రి తన కొడుకుతో ఇలాగ మెలగడం . . . ఛీ, ఛీ, అపక్వమైన, ఆదిమ భావనలతో వీళ్ళ జీవితం సాగుతోంది" అనిపించింది. ఈ సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్నవారి గతే ఇలాగుంటే మన సమాజం ఎంత పురాతనమైన స్థితిలో ఉందని ఆ నిమిషం తెలుసుకొని సారంగన్ నిట్టూర్పు వదిలాడు. అక్కడనుంచి వెళ్ళిపోవాలని నిశ్చయించాడు.

"ఊరునించి వచ్చిన రోజే మీరు అడిగారుగా - మా నాన్నగారు గురించి . . . అతను ఇప్పుడు మరణ అవస్థలో ఉన్నారు . . . ఈ వేళకి ఆయన తప్పకుండా కన్ను

మూసివుండాలి, లేకపోతే ఆవిడ ఇలాంటి ఉత్తరం రాసివుండరు" అని బాలాంబ భావనలు లెక్కచెయ్యకుండా మురళి సారంగన్ కి చెప్పాడు.

"ఎంత ఘోరమైన ద్రోహం!" అని బొబ్బరిస్తూ బాలాంబ, అంతకు మించి మరేం చెప్పాలో తెలియక, పెదిమలు వొణుకుతూ, పళ్ళు కొరికింది.

సారంగన్ ఆమెని సమీపించి శాంతపరిచాడు.

జీవితం ఎంత క్రూరంగా తనకి ద్రోహం చేసిందని బాలాంబ వాపోయింది. నేలమీద కూర్చొని, మొహం మూసుకొని, వెక్కి వెక్కి ఏడ్చింది. సారంగన్ ఆమెని చూసి, జాలి పడి, దగ్గరకి వెళ్ళి, ఆమె వీపుని అభిమానంతో దువ్వాడు. ఆమె ఎంగిలి తగిలి నేల వాలిన ఆ ఉత్తరంని తీసి చూసాడు. అందులో తనకి ఏమీ బోధపడదని తెలుసుకొని దాన్ని మళ్లీ నేలమీద పడేసాడు. మురళి, వొంగి, ఆ ఉత్తరం తీసుకొని, ఎంగిలి తుడిచి, మడిచి, మళ్ళీ తన చొక్కాయి జేబులో భద్రంగా ఉంచుకున్నాడు.

హాలులో జరిగిన ఈ సందడి వలన శేషయ్య తన గదినుంచి బయటకి వచ్చి చూసారు. నరసింహన్, రాజం, ఇంతకు ముందే అక్కడ నిల్చొనివున్నారు. ఇంటి వెనుకతట్టునించి కమలమ్మ, నాగణ్ణ హాలుని చూస్తు నిల్చున్నారు. ఒడిలో పిల్లవాడు కణ్ణన్ నిద్రపోతుంటే, వాడి తల్లి లక్ష్మి, గదిలోనించే అన్నీ వింటోంది.

తన న్యాయంని ఆ కుటుంబంతో పరిచయం ఉన్న అందరికీ తెలియజేయాలని మురళి తన తండ్రితో తనకున్న స్నేహంని, ఆ వృత్తాంతం పూర్తిగా సారంగన్ కి వివరించాడు. వాడి కంఠధ్వనిలో, ఒకప్పుడు, శేషయ్య ఆర్థిక పొగరు వలన తన తండ్రిని నిరాకరించారనే కోపం కనిపించింది. ఇంకొక సమయం, తను పగతీర్చుకోవాలనే దృఢ సంకల్పం కనిపించింది; దుఃఖమూ, కోపమూ, విడిచి విడిచి ప్రతిఫలించాయి.

"దీనిగురించి నేను లీలకి కూడా చెప్పలేదు. నేను ద్రోహి అని అమ్మ అంటోంది. ఆ వార్తకి, ద్వేషంకి భయపడే వీళ్ళతో కలిసి నేను ఈ వేషం వెయ్యడం నేర్చుకున్నాను. ఎందుకో తెలుసా, ఇదొక కుటుంబ గౌరవంకి చెందిన ప్రశ్న అంటున్నారు! ఈ కుటుంబంలో నేను సభ్యుడుగా ఉన్నంతవరకూ ఈ నిజంని దాచిపెట్టాలని అనుకున్నాను. ఏ కారణం వలనా ఈ కుటుంబంతో నా బంధుత్వం తెగించుకున్నా, ఆలోచించి చూస్తే, ఇదే ముఖ్య కారణమనిపిస్తోంది. అమ్మ, తాతయ్య, ఆర్థిక పొగరుకి

వశమైపోయారు . . . అతను - మా సైనా చేసినది - తప్పో, సరియో - దాని గురించి నా తీర్పు చెప్పడానికి నాకు హక్కు లేదు. కాని అమ్మా, తాతయ్య అతన్ని నీచంగా నిరాకరించి, లోకమంతా 'అతను సన్యాసం పుచ్చుకున్నారు' అనే వదంతిని పరచేసారు . . . ఈ కుటుంబ గౌరవం గురించి చెప్పడానికి మరేం లేదు!" అని మురళి ఎత్తిపొడిచాడు.

"పదిహేను సంవత్సరాలముందు నేను బడిలో చదువుతున్నప్పుడు, ఎవరో - ఒక కూలీలాగ - అతను ఒక మధ్యాహ్నం, ఎండలో, నా స్కూలు ముందు నిల్చొనివున్నారు. ఆతనే నా సైనా అని తెలిసినతరువాత అతనితో మాటాడుతున్నప్పుడు, ముందు నాకు కొంచెం తత్తరపాటు కలిగింది. అతన్ని కలుసుకోవాలని అంతకుముందు నాకు ఏ అపేక్షా లేదు. అంటే అంత తీవ్రంగా అమ్మా, తాతయ్యా, నా మనసు మార్చి అతన్ని ద్వేషించినట్టు చేసారన్నమాట! కాని అతనితో గడిపిన ఆ ఒక గంట మొదటి అనుభవంలోనే పుత్రవాత్సల్యంతో అతనెలా బాధపడుతున్నారని నేను గ్రహించాను. . . " అని చెప్పి, మురళి శేషయ్యని, జుగుప్సతో, ఒక జన్మ వైరిని చూస్తున్నట్టు చూసాడు.

కాని శేషయ్య దైవఘటన ఆడే క్రూరమైన ఆటలు గురించి తలపోస్తూ, ఒక వేదాంతి లాగ, లేతగా నవ్వుతూ వాడిని చూసారు.

ఒక ముద్దాయిని విచారణ చేస్తున్నట్టు శేషయ్యని చూసి మురళి అరిచాడు: "తాతయ్యా, మీకు గుర్తు ఉందా?తన భార్య తనతో వెంటరావాలని సైనా వచ్చినప్పుడు మీరు అతనికి వందలకొలదీ రూపాయల కట్టలు చూపి మేజామీద ఉంచారట. 'నేను పేదవాడినే. నేను జీవితమంతా కష్టపడి పనిచేసినా ఇంత సొమ్ము సంపాదించలేను. కాని నాభార్యకి - మీ కూతురుకి - ఇదే ధర అంటే - ఈ ధరకి అమ్మడానికి నేను రాలేదు. ఈ ధరకి ఆమెని కొనడానికే వచ్చాను' అని చెప్పి సైనా మీ డబ్బుని కాలుతో తన్నారట. అతని కొడుకు అని చెప్పుకోడానికి నాకు గర్వంగా ఉంది. కాని, ఎంత ఘోరం! అటువంటి గణ్యమైన ఒకతని కొడుకుని వట్టి ఆర్థిక అహంకారం ఉన్న కుటుంబంలో మీరు చేర్చేసారని నాకు చాలాసార్లు పట్టరాని కోపం వచ్చినా, మీ సంరక్షణ వలనే నేను ఇక్కడే ఉన్నాను . . .

“ఈ పది సంవత్సరాలలో తాలామట్టుకు నెలకొకసారి అతన్ని నేను చూడడం జరుగుతోంది. అది వట్టి తండ్రిని చూసే ప్రేమ కాదు. దాని వలన మిమ్మల్ని పగతీర్చుకొనే తృప్తి కూడా నాకు కలుగుతోంది. ఎలాగైనా నా పెళ్ళికి అతను రావాలని నేను చాలా ప్రయత్నం చేసాను. కాని అతను మొండిగా ‘రాను!’ అని చెప్పేసారు. ‘నేను నా భార్యకి తెలియకుండా, రహస్యంగా, ఒక స్త్రీతో సంబంధం కావాలని ఆశించాను. కాని ఆఖరికి, నేను కన్న కొడుకుతోనే నాకు రహస్యంగా సంబంధం కలగాలని విధి నన్ను శిక్షించడం జరిగింది! ‘ఆ కుటుంబంతో నా చుట్టరికం సాగాలంటే అది నా భార్య మూలంగా జరగాలి - కొడుకు మూలంగా వొద్దు!’ అని నేను నిశ్చయించాను. ఎప్పుడైనా ఒకసారి నీ మొహం నేను చూడాలి, అంతే! నువ్వు దీనిగురించి నీ భార్యకి కూడా చెప్పవద్దు” అని అతను నాకు చెప్పారు. అప్పుడే అతను రక్తపోటు వలన అస్వస్థతగా ఉన్నారు. అతని భార్య - ఆవిడకి ఇతని బీదటికం వలన - జీవితంలో - ఏం లాభం దొరికిందో? ఒక ధర్మపత్నిలాగ ఆవిడ అతనికి సేవ చేస్తోంది. అతని సంరక్షణలో నేను పెరగలేదు, కాని అతన్ని ద్వేషించడానికి నాకు ఎటువంటి న్యాయమూ లేదు. అలాగే మీ సిరిసంపదలతో నేను పెరిగాను, కాని మీతో చుట్టరికం కావాలని నాకు లేదు . . . ఇంతకాలమూ నేను దీన్ని రహస్యంగా దాచినందుకు నాకు సిగ్గుగా ఉంది . . . ” అని మురళి విరోధభావంతో కఠినంగా మాటాడాడు. వాడి కొత్త సమాధానం తనకి బోధపడిన్నట్టు శేషయ్య తన బోసినోరులో పెదిమలు ముడుచుకొని, కొరుకుతూ, ఓర్పుతో వింటున్నారు.

గభీమని తను చేసిన ఏదో నేరం రుజువైనట్టు బాలాంబ దిగులుతో మురళిని తేరిపారి చూసింది. యౌవనంలో, వ్యక్తిగతంగా, యువతిగా తను బలంగా ప్రయోగించిన హేతువులు గుర్తుచేసుకుంది. కాని ఇప్పుడు, ఒక కొడుకుకి తను తల్లి అనే పరిమాణం వలన ఆ కారణాలన్నీ సత్వరగా కూలిపోవడం ఆమెకి బోధపడింది. మురళి బాలాంబని సమీపించి, పళ్ళు కొరుకుతూ అడిగాడు:

“ఎవరు ద్రోహి? కొండలాంటి భర్తని ఎవరికో అప్పగించి, పుట్టినిల్లుకి వచ్చేసి, అతను సన్యాసిగా ఐపోయారని అందరికీ చెప్తున్నావ్, నీకెంత సాహసం! మీలో వెయ్యి ప్రశ్నలున్నా, నీ కొడుకుకోసం భర్తతో ఉండాలనో ఓర్పు నీకు రవంతైనా లేదే? ఆవిడ

కూడా నీలాగ ఒక ఆడది, కాని ఇన్ని సంవత్సరాలుగా అతనితో కాపురం చేస్తోందే? ఆమె దగ్గర డబ్బు లేదు, నువ్వు పెద్ద ధనవంతురాలు! అందుకే వచ్చేసావ్! నువ్వొ ఒక బీద తల్లి కడుపులో పుట్టివుంటే  ఆతను వెయ్యి పొరబాట్లు చేసినా, అతన్ని వదిలేసి వచ్చివుంటావా? నీ తండ్రి బీదగా ఉంటే అతను ఇలాగ నీకు ఇంటిలో రక్షణ ఇచ్చివుంటారా? అతనే మీకంటే పెద్ద ధనవంతుడైవుంటే అతను సన్యాసిగా ఐపోయారనే మీ గుసగుసలు ఎవరైనా నమ్ముతారా?" అని మురళి ఆక్రోశంతో ప్రశ్నలు విసురుతుంటే తరచుగా జోక్యం చేసుకున్న బాలాంబ ఏదో అరుపులు పెట్టింది. కాని మురళి దాన్ని లెక్కచెయ్యక, అంతకన్నా పెద్ద స్థాయిలో అరిచాడు. శేషయ్య బాలాంబని చూసి ఓర్పుగా ఉండమని మధ్య, మధ్య, చెయ్యెత్తి సూచించారు.

తను ఎక్కువగా, కఠినంగా మాటాడినట్టు గ్రహించిన ఆ క్షణమే మురళి గభీమని మౌనం వహించాడు. కన్నీళ్ళు ఎడతెగకుండా వాలాయి. ఏడుస్తూ, తనలో గొణుక్కున్నాడు: "ఇలాంటి పరిస్థితి కలగాలనే  ఇన్ని సంవత్సరాలూ నేను నోరు మూసుకొనివున్నాను . . . కాని అన్నిటికీ ఒక ముగింపు కావాలిగా? అయ్యో, ఇప్పుడు అతను కన్ను మూసారోమో?" అని నిట్టూర్పు వదిలాడు.

అప్పుడు అక్కడున్న అందరూ బాలాంబని చూసారు. ఆమె నిలకడగా, దృఢచిత్తంతో, తన్ను సవరించుకొని, ఏవగింపుతో చెప్పింది: "నన్నడిగితే అతను కన్ను మూసి చాలాకాలమైంది." అని చెప్పి, మళ్ళీ మేడమీదకి వెళ్ళిపోయింది.

శేషయ్య లేచి, మురళి దగ్గరకి వచ్చారు. "ఒరేయ్, విను, past is past . . . నువ్వు ఇప్పుడు ఈ పరిస్థితిని నీ దృష్టికోణంలో చూస్తున్నావ్ . . . నువ్వు చెప్పేది సరే . . . కాని నేను ఇరవై సంవత్సరాలముందు నా దృష్టికోణంలో చూసినది మాటాడుతున్నాను. నాకు ధనవంతుడని గర్వం అని అంటున్నావ్ . . . సరే, అలాగైతే నేను ఆ బీదవాడితో నా కూతురు పెళ్ళికి ఎలా సమ్మతించాను? నీకు నీ తండ్రి గురించి ఇప్పుడే తెలుసు, నాకు అతన్ని బాల్యం నుంచే తెలుసు. అటువంటి ఉత్తముడుని నా కొడుకుల్లోకూడా నేను చూడలేదు . . . అందువలనే ఆ పెళ్ళి సంబంధం . . . నీ అమ్మ నాకు ఒంటరి కూతురు . . .  నేను చాలా గారాబంగా పెంచిన ఒకే కూతురుని,  వాడి నడత, యోగ్యత, చూసి పెళ్ళి చేసాను. కాని ఆఖరికి ఏమైంది? ఆ భర్తని ఒక నర్తకికి

ఒప్పగించి, ఒక పిల్లవాడితో, రాణిలాగ ఇక్కడనుంచి వెళ్ళినది ఒక బిచ్చగత్తెగా తిరిగివచ్చి నా కాళ్ళలో పడి ఏడ్చినది ఊహించి చూడు . . . ఏయ్ మురళీ, నీకది ఇప్పుడు బోధపడదు. ఒక కొడుకుగా నీ దృష్టి నాకు బోధపడినట్టు, ఒక తండ్రిగా, నా న్యాయం ఏమిటని నువ్వు చూడాలి. భర్తని ద్వేషించి, మనఃపూర్తిగా నా దగ్గర తిరిగివచ్చిన కూతురుని నేనెలాగ తిరిగి పంపగలను? ఆమె ఎంత లోతుగా అవినీతికి పాల్పడిందని తెలిసిన తరువాత ఆమె అతనితో రాజీపడాలని నేనెలా నిర్బంధించగలను? చెప్పు, ఇప్పుడుకూడా ఆమె వైరాగ్యం చూసి నాకు గర్వంగా ఉంది."

"మీరెందుకు నా దగ్గర అబద్ధమాటారు? తండ్రి, కొడుకు మధ్య అడ్డు రావడానికి ఏ న్యాయం మీకు సాయం చేసింది?"

"అదే నేనూ నిన్ను అడుగుతున్నాను. మీ అమ్మ తనతో రావాలని మీ నైనా ఒకసారి వచ్చాడు. నువ్వు రావాలని, నిన్ను వెతుక్కుంటూ అతను ఎప్పుడూ రాలేదు. మాతో కలిసి, అతనికి నీమీదకూడా ద్వేషం వచ్చేసిందని నేను అనుకున్నాను. కాని అతను నిన్ను వెతుక్కుంటూ వచ్చాడని ఇవాళ చెప్తున్నావ్ . . . ఈ సంగతి నాకెందుకు నువ్వు ముందే చెప్పలేదు?" అని శేషయ్య కనికరంతో అడిగారు,

మురళి ఏదో చెప్పబోతుంటే, "ఇదేంటి, మీ చర్చలకి, వాదనలకి ఇదేనా సమయం? అబ్బా, మీరేం మనుషులో? అతని ప్రాణంకి అపాయం అని ఉత్తరం వచ్చింది . . . అతనికేమైందో? మురళి, నువ్వు బయలుదేరు . . . " అని రాజం హాలుకి వచ్చి అరిచింది.

అప్పడే, తను వెంటనే వెళ్ళాలనే ఆవేశంతో మురళి, "రైలుబండి ఎన్నిగంటలకి?" అని మూలుగుతూ వాచీని చూసుకున్నాడు.

"రైలు ప్రయాణం లాభం లేదు. నా కారు తీసుకొని వెళ్ళు" అని నరసింహన్ మురళి వీపుని సుముఖంగా తట్టారు.

మురళి నరసింహన్ దగ్గర కారు తాళంచెవి తీసుకొని కారుని సమీపించినప్పుడు, శేషయ్యని చూసి, "లీలకూడా నాతో వస్తోంది" అని చెప్పాడు.

“నీ ఇష్టం” అని అతను అన్నారు. వాడు కారు తలుపు తెరిచినప్పుడు వరండాలో సంచరించుతున్న సారంగన్, ‘మురళీ’ అని పిలిచాడు.

మురళి తిరిగిచూసాడు.

“నేనూ నీతో వస్తాను.”

“సరే, పోయే దారిలో లీల కూడా మనతో వస్తుంది” అని చెప్పి మురళి కారులో కూర్చున్నాడు. అతని పక్కనే సారంగన్ కూర్చున్నాడు.

అప్పుడు మేడమీదనుంచి తొందరతొందరగా బాలంబ దిగివచ్చి కారుని చేరుకుంది. మురళి, సారంగన్ ఆశ్చర్యంగా ఆమెని చూసారు.

బాలాంబ మురళికి చెప్పింది: “నాయనా, నువ్వు వెళ్ళినప్పుడు అతను కన్ను మూసినాసరే, ఆ తరువాత కన్ను మూసినా సరే . . . నాకు వెంటనే ఒక టెలిగ్రాం ఇచ్చేయ్.”

‘నా తండ్రిని ప్రాణంతో చూడడానికే అమ్మకి ఎంత ద్వేషం! ఒక వేళ అతను కన్ను మూసినతరువాత అతన్ని చూడడానికి వస్తుందేమో?’ అని ఆలోచించిన మురళి, “అమ్మా, వెంటనే నువ్వు రావడానికి ఎలాగ సాధ్యం?” అని అడిగాడు.

“రావడానికి కాదురా . . . ” అని అంటూ తన కంఠంలోని తాలిబొట్టుని అందుకొని “ఈ అనావశ్యకమైన భారం తగ్గించడానికే” అని అంటూ అలాగ చెప్పవలసిన, తన దాంపత్య జీవితంకి కలిగిన దౌర్భాగ్య స్థితికి వాపోయి బాలాంబ హోరుమని ఏడ్చింది.

కారు బయలుదేరింది.

## 7

గ్రామంకి బయట బస్సులూ, లారీలు సాగే ఆ రహదారిలో ఒక మిఠాయి దుకాణం ముందు ఆ ‘మారిస్’ కారు నిల్చొనివుంది.

ఆ మిఠాయి దుకాణం వెనుక ఒక చిన్న తోటలో ఉన్న పురాతన పెంకుటిల్లు నరసయ్య పూర్వీక ఆస్తి. ఈ గ్రామంకి చేరువలోనూ, ఐదుమైళ్ళ దూరంలో ఇంకొక గ్రామంలోనూ, అతనికి కొంచెం నెలం, ఒక మామిడి తోట ఉన్నాయి.

ఐదు సంవత్సరాలముందు ఆ ఊరు మధ్యతరగతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుఃడుగా పని చేసిన నరసయ్య, రిటైరయినప్పుడు, చెయిలో ఉన్న

డబ్బుతో ఈ దుకాణం ఆరంభించి, ఒకప్పుడు తన్ను ఆకర్షించిన నాట్యకళామోహిని గంగాకి భవిష్యత్తులో అభయం ఇచ్చే విధంగా నమ్మదగిన ఒకతని ఆ దుకాణంకి తనిఖీదారుగా నియమించారు.

ఒకరోజు బడినుంచి ఇంటికి వచ్చే దారిలో మైకం వచ్చి, నేల వాలి, ఒక నెల పడకలో పడివున్నప్పుడు, తన అంతిమ కాలం వచ్చేసిందని అతను గ్రహించారు. తన్ను తప్పిస్తే మరే సాయం, ఆదరణ, బంధువులు లేని గంగా ఊ లోకంలో ఒంటరిగా జీవించినప్పుడు ఎవరి దయ అడక్కుండా ఉండాలని అతను ఆశించారు. కాని ఆ బాధ్యత తన కొడుకుకి ఇవ్వడానికి అతని అంతరాత్మ సమ్మతించలేదు.

ఇప్పుడు, అతను కన్ను మూసే సమయం, అతని జీవితం నిమ్మళంగా సాగుతోంది. నెలా రెండు వందల రూపాయల ఆదాయం గుత్తలాగ ఆ మిఠాయి దుకాణంనుంచి అతని చెయికి వస్తోంది.

రేపు "ఇది నా తండ్రి ఆస్తి!" అని సంతానం లేని నరసయ్య ఆస్తికి కృతజ్ఞతలేని ధనవంతుల కుటుంబంలో పెరిగిన ఆ మురళి వ్యాజ్యమాడితే, తను చెసేది ఏముంది? అలాగ ఏమైనా జరిగితే, గంగా  ఆ పంట-నేల భూమి కోల్పోయినా, అతని ప్రియమైన విద్యార్థి ఆదికేశవులు పుత్రకర్తవ్యం నెరవేర్చే విధంగా ఆ మిఠాయి దుకాణం తనిఖీదారుగా గంగాకి సాయం చేస్తాడని నరసయ్య పూర్తిగా నమ్మేసారు.

నరసయ్యకి జీవితంలో తీర్చలేని ఒక ఋణం ఉంది. అదే ఆ నాట్యకళారాణి గంగా అతనికోసం తన కళని త్యాగం చెయ్యడం. ఇప్పుడు దాన్ని తలుచుకుంటే అతనికి చోద్యంగానూ, భవిష్యత్తులో రాబోయే సమస్యల గురించి ఏ బెంగా లేకుండా గభీమని, ఒక నిమిషంలో తన్ను మరిచి, ఒక విధమైన ఆవేశంతో తను పూనుకున్న ఆ నిర్ణయం - పిచ్చితనంగా కూడా కనిపిస్తోంది.

ఒకసారి గంగా అనే ఆ నర్తకి ఇంటికి అతను వెళ్ళినప్పుడు, ఇతనిలాగే ఆమె కళమీద అమితంగా అభిరుచివున్న - ఇతనికంటే  గొప్ప ధనవంతులు కొందరు - ఆమె ఇంటికి వచ్చివున్నారు.

నరసయ్యకి  మొదటినుంచే నాటకాల్లో పిచ్చి, గానం, నృత్యం వంటి కళలలో ఆసక్తి ఉండేది. అతను అనేక నర్తకుల భరతనాట్య ప్రదర్శలు చూసివున్నారు.

నాట్యశాస్త్రంలోని అన్ని లక్షణాలు కలిసి శ్లాఘించే జ్ఞానమూ, అభిరుచి కల పరంపరలో పుట్టిన నరసయ్యకి నాటకాలు నడపడం ఒక వృత్తిగా కాదు; అతను ఒక లక్ష్యంగా దాన్ని కొనియాడారు! ఆ రోజుల్లో అతని నాటక బృందంలో చాలా సౌందర్యవంతులు ఉండేవారు. చదువు చెప్పే సమయం తరువాత అతను తన జీవితంని ఈ కళలు పోషించడానికి సమర్పించడం  చూసి అతని భార్య బాలాంబకి తన భర్తగురించి ఏ సందేహమూ లేనేలేదు. భార్య ఉండగా, మరొక మగువని వెతకడం మగవారి స్వభావం అని ఆమెకి తెలీదు.

అతను కూడా తను అటువంటి ఒక పని చెయ్యడం గురించి కల్పనలో కూడా నమ్మలేదు.

ఐనప్పటికీ, గంగా నాట్య ప్రదర్శన చూసినప్పుడు వెలుగుతున్న ఆమె పాదాల అందం; అడుగుల మలుపులు; ఇరుకైన నడుముని ఒక మరచేపలాగ ఆమె గిరగిర తిప్పే వేగం - ఇవన్నీ ఒక మనోరంజకమైన నెమలి రెక్కలు విప్పి నిల్చున్నట్టు అతనికి ఒక ఆహ్లాదం కలిగింది. ఆదర్శాలని మించిన ఒక కలగా, లోకంలోని అన్ని నిజాలు మరిచిపోయే విధంగా అతను మునిసిరిపోయారు.

అక్కడున్న ఆ ధనవంతులు గర్వంతో ధనం ఉన్న చిన్న సంచులు, కట్టలు కట్టలుగా రూపాయల నోటులు ఆమె కాలడుగులకి విసురూతూ ఆనందించారు. పాపం, ప్రధానోపాధ్యాయుఁడు నరసయ్య ఆ దనవంతులకంటే ఎక్కువగానే శ్లాఘించారు. అందువలన ఆమె కాలడుగులలో వాళ్లకంటే గొప్పగా తన కానుకలు సమర్పించాలనే ఆతురత అతనికి కలిగింది. తన ఒడిలో ఉన్నదంతా సమర్పించిన తరువాత కూడా, తన మనసుకి ఇంపైన కానుకలు సమర్పించలేక అతను పెనగులాడారు.

ఆ ధనవంతులు మత్తెక్కి, నాట్యమాడుతున్న యువతి అంగలావణ్య భ్రమలో వశమైపోయి, తరతరాలుగా వారిలో ఎదిగిన ఆర్థిక పొగరుతో, ఈ బీద బడిపంతులుని చూసి వెక్కరింపుతో, ఇంకా ఎక్కువగా ఆమె పాదాలకి సువర్ణ నాణెములు విసరడం ఆరంభించారు. ఆ గుంపునుంచి గభీమని ఒక నవాబు, ఉన్మత్తుడైపోయినట్టు, ఆడుతున్న గంగాని సమీపించి ఉర్దు భాషలో ఒక సవాలు వదిలాడు.

తన్ను ఒక జాగీర్దారు అని ప్రకటించుకొని, ఆ గుంపులో ఉన్నవారి ధనం యావత్తూ తన ఆస్తికి సమానం కాదని నిరూపించిన తరువాత, అతను చెప్పాడు: "నా జాగీరుని పూర్తిగా ఈమెకి దానపత్రంలో రాస్తాను. నాకు సాటిగా ఎవడైనా ధనవంతుడు ఇక్కడ ఉంటే నా బేగమ్ కి అతను బహుమానం ఇవ్వనీ!" అని ఆమె భుజంమీద చెయి వాల్చాడు.

గంగా అతన్ని ఒక మెరుపులాగ వదల్చుకొని భయంతో నిలబడింది. నిత్యమూ తన కళతో వశమైన నరసయ్యని అభయం అడుగుతున్నట్టు ఆమె చూసింది. నేర్పు గల కళ్ళకి అసలైన కళాభిమానులని ఒక క్షణంలో గుర్తించడం సహజమేకదా? ఆ చూపు నిర్బంధం వలన తన్ను ఎరుగని నరసయ్య ఒక పులిలాగ లేచి నిలబడి గర్జించారు:

"ఏయ్, సాహిబ్! ఈ కళారాణి కళా ప్రదర్శన చూడడానికే మనం వచ్చాం, ఆమెని ఈ ఏలంలో కొనడానికి కాదు!" అని నరసయ్య గర్జన విని ఆమె దేహంకోసమే అక్కడకి వచ్చి గుమిగూడివున్న అందరూ నవ్వారు.

"నీకేం మతిపోయిందా? ఆమె ఎవరు -డబ్బుకి ఒడలు అమ్మే వేశ్యకదా?"

నరసయ్య జాలితో ఆమె మొహం చూసారు. ఆమె కన్నులలో కళాత్మక తేజస్సు ప్రకాశించింది.

అతను మళ్ళీ ఆ ధనవంతులకి చెప్పారు:

"ఆమె నిజంగా డబ్బుకి ఒడలు అమ్మే వేశ్య ఐతే,  ఈ జాగీర్దారుతో వెళ్ళివుండాలి. ఆమె ఇంకా ఏదో పెద్దగా ఎదురచూస్తోందని మీకు బోధపడలేదా? అది మీరెవరూ ఆమెకి ఇవ్వలేరు. అదే నిజమైన పొగడ్త" అని చెప్పి, ఒక బోధకుడు ధోరణిలో నాట్యకళ గురించి అతను ఒక పెద్ద ఉపన్యాసమే చేసారు. ఆ ధనవంతులు, అతనూ, కొంచెం సమయంముందు గంగా నాట్యం చూసి ఆనందించినట్టు, ఇప్పుడు గంగా, ఆ ధనవంతులు అతని ఆవిష్కరణ శ్రద్ధతో విన్నారు. నరసయ్య గంగా నాట్యంలోని శ్రేష్ఠమైన  పద్ధతి, అందులో తను అనుభవించిన ఆనందం పొగడుతూ ఒక కావ్యమే పాడేసారు.

"మత్తెక్కిపోయి, ఆర్థిక గర్వంతో నేనిది చెయ్యడం లేదు. నా హృదయంలో ముద్రవేసి నాట్యం అభ్యసించినట్టు, నా ముందు గజ్జెలు కట్టుకొని ఆడిన ఆ పాదాలు చూడగానే

కానుకలు సమర్పించాలని నేను పడిన దుఃఖంని ఇప్పుడు తీర్చుకుంటాను” అని తెలుగులో కవిలాగ పాడిన తరువాత నేలవాలి అతను గంగా పాదాలు ముద్దుపెట్టుకున్నారు.

దిగ్భ్రమతో వొంగి అతని వీపుమీద పడి గంగా అతన్ని కౌగిలించుకున్న దృశ్యం చూసి ఏదో నాటకం చూస్తున్నట్టు ఆనందిస్తూ, గంగా ఇంటి హాలులో ఉన్నవారందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు.

ఈ ఘటన తరువాత అతను తరచుగా కోవిలకి వెళ్ళే భక్తుడులాగ గంగా ఇంటికి వెళ్ళడం ఆరంభించారు. ఆమెని విడిచివున్న అన్ని సమయాల్లోనూ ఆమెగురించి, ఆమె కళానైపుణ్యం గురించి మాటాడితే చాలు, దాన్ని అనుభవించినట్టు సుఖం అతనికి కలిగింది.

అతని భార్య బాలాంబకి ఆ రోజుల్లో అతనిమీద ఏ అనుమానమూ లేదు. ఆతనొక అద్భుతమైన కళాకారుడని ఆమెకి తెలుసు. తన భర్త గృహం ఒక కళామందిరంలాగ వాద్యాలతో, వర్ణచిత్రాలతో నిండివుండడం చూసి, ఆమెకి సంతుష్టి కలిగింది. నరసయ్య స్వతఃగా తెలుగులో కీర్తనలు కల్పించి పాడేవారు. కాని వాటిని ప్రచురించాలని, లేక బహిరంగంగా పాడి ప్రసిద్ధపరచాలని అతనికి లేదు. అందువలన అతని పడుచు భార్య అతని కవితాత్మక. మనసుని, కళా ప్రావీణ్యంని తనే పూర్తిగా అనుభవించింది.

ఇటీవల అతను తన ఉనికి మరిచిపోయినట్టు, పూర్తిగా అతని అందుబాటు దొరకక తను నష్టపోవుతున్నట్టు బాలాంబకి అనిపించింది. అప్పుడుకూడా ఆమె అతన్ని సందేహించలేదు.

ఒకసారి బాలాంబ పుట్టినిల్లుకి వెళ్ళింది. కొన్నిరోజుల్లో వచ్చి ఆమెని చూస్తానని మాట ఇచ్చిన నరసయ్య గంగా మత్తులో పడిపోయి అన్నీ మరిచిపోయినట్టు అదీ మరిచిపోయారు.

అప్పుడు రెండువందల మైళ్ళ దూరంలో భర్తని విడిచివున్న బాలాంబ గర్భిణి ఒక అర్ధరాత్రి - ఒక చెడ్డ కలతో లేచిన తరువాత - అతన్ని అనుమానించింది. ఆ నిమిషమే కలవరంతో ఆమె దేహం వొణికింది; వేకువ వరకు భయపడుతూనే నిద్రపోయింది.

మరునాడు ఉదయం మురళీతో ఆమె గభీమని బయలుదేరడానికి సిద్ధమైంది. శేషయ్య ఎంత ప్రయత్నం చేసినా అతను ఆమెని ఆపలేకపోయారు.

ఆమె తన ఇంటిలో ప్రవేశించినప్పుడు ముందు హాలులో - ఆ కళామందిరం నుంచి - మద్యం దుర్గంధం, మల్లెపూల వాసన వచ్చాయి. వాద్యకారులలో చాలామంది తాగేసి వాద్యాలమీదనే మైకంతో పడివున్నారు. రాత్రంతా అక్కడ కోలాహలం జరిగిందని రుజువుగా విద్యుచ్ఛక్తి లేని ఆ రోజుల్లో రంగురంగుల గాజు గూడులలో తెల్లవారి చాలాసేపైనా కొవ్వొత్తులు వెలుగుతూ ఉన్నాయి.

ఒకప్పుడు, ఒక కళామందిరంలో ప్రవేశించినట్టు, పవిత్ర ఆసక్తితో బాలాంబ ప్రవేశించినప్పుడు, ఇప్పుడు కేవలం ఒక సారాయి దుకాణంలో కాలుపెట్టినట్టు ఆమె మనసూ, దేహమూ, కంపించిపోయాయి. తన పడకగది తలుపుని తెరిచేముందు ఆమె ఒక క్షణం ఆలోచించి, నిల్చుంది. తన చెయిని పట్టుకొని నిలబడివున్న మురళిని చూసింది . . . పిల్లవాడిని ఇంటి లోతట్టుకి వెళ్ళమని చెప్పింది. 'మగువగా పుట్టి ఇతన్ని పెళ్ళాడిన పాపంకోసం ఇది నేను చూసితీరాలి!' అని నిశ్చయించి ఆ గది తలుపు తెరిచింది.

అక్కడ ఆమెకే సొంతమైన శయ్యమీద, ఆమెకే సొంతమైన భర్తతో, ఒక వేశ్య నిద్ర పోతోంది . . . ఆ దృశ్యం చూసి బాలాంబ భరించలేక, 'దేవుడా!' అని తన మొహంలో బాదుకొని నేల వాలింది.

చెంపలో వాయించినట్టు, మైకంనుంచి ఎఱుకతో లేచి, దిగ్భ్రమతో నరసయ్య ఆమె ఎదుట నిల్చున్నారు. పడకమీద గంగా తన దేహంని కప్పుకొని చలిలో వొణుకుతున్నట్టు కూర్చుంది. బాలంబ లేచి నిలబడి కాండ్రించి ఉమ్మింది.

అదే వేగంతో ఆమె గదినుంచి నిష్క్రమించింది.

వాద్యకారులు, మందిరంలోని వాద్యాలు మాయమైపోయాయి. కొవ్వొత్తులు మాత్రం వెలుగుతున్నాయి. ఆమె ఇంటిలోతట్టుకి వెళ్ళి మురళీని ఎత్తుకొని వచ్చినప్పుడు నరసయ్య ఆమెని ఆపి బతిమాలాడారు:

"బాలు! తొందరపడకు. ఈ పొరబాటుకి నువ్వు నన్ను శిక్షించవచ్చు, కాని దయచేసి నన్ను వదలివెళ్ళిపోవద్దు," అని అతను అన్నప్పుడు ఆ మాటలు ఎంతలోతుగా అతని హృదయంనుంచి వచ్చాయని ఆమెకి బోధపడలేదు.

"నేనిక ఎవరితోనూ మాటాడనక్కరలేదు . . . దయచేసి నన్ను ఆపవద్దు!" అని ఆమె అన్నప్పుడు ఆమె అఱుపుని ఆపాలని అతను ఆమె నోరు మూయడానికి ప్రయత్నించారు. ఆగ్రహంతో ఆమె అతనికి దూరంగా నిలబడి "ఒక మంచి తల్లికి కొడుకైతే నన్ను తాకకూడదు!" అని పలికిన తీక్ష్ణమైన మాటలు విని అతను మరేం చెయ్యక ఊరుకున్నారు.

- బాలాంబ నరసయ్యని వదిలి వెళ్ళిపోయింది.

ఆ ఎడబాటుని తలచుకుంటూ అతను దుఃఖించారు. అతను వాడిపోయినప్పుడెల్లా గంగా అతని సమీపంలో ఉంది. అతను ఏడ్చుకుంటూ ఆమెకి చెప్పారు: "బాలు ఉంటేనే నేను మనిషిని. ఆమె నాతో నిత్యమూ ఉందనే నమ్మకంతో నేను ఆమెని మరిచిపోయాను. నాకు లోకంలో మరేం వద్దు. నాకు బాలు మాత్రం కావాలి . . . "

అతని శోకం సరిదిద్దడం తనకి చేతకాదని గంగా గ్రహించింది. కాని ఇప్పుడు ఏం చెయ్యాలి? ఇక బాలాంబతో అతనికి పొత్తు లేదనే నిజం తెలుసుకొని ఇద్దరూ చిన్నబోయారు. నరసయ్య గంగా కళా నైపుణ్యంకి మాత్రం బానిసగా ఐపోయారు. అంతకుమించి గంగా తన భార్యగా లేక తను ఆమెకి భర్తగా అతను కల్పనకూడా చెయ్యలేదు. గంగా ఒక సామాన్య స్త్రీ కాదు, ఆమె సరస్వతి అవతారమని అతని భావన. కాని ఎంత గొప్ప కళామేధావి అయినప్పటికీ, తనూ ఒక స్త్రీ అని ఆమె స్థిరపరచింది. ఆమె కళానైపుణ్యంకి అతని కానుకలు అంగీకరించినట్టే అతని మెప్పు, సహజగుణాలకి ఆమె తన్ను అప్పగించుకుంది. ఆ సమర్పణ నిరాకరించడానికి అతనికి బలం లేక, అతనూ సమ్మతించారు.

ఒక మగవాడు అనే ధోరణిలో, ఒక భర్త అనే ధోరణిలో, అతను బాలాంబ మినహా మరెవరినీ ప్రేమించలేదు. తన సంసారం ధర్మంతో వర్ధిల్లాలంటే, అది బాలాంబ మూలంగానే నెరవేరుతుంది. అతని జీవితంకి ఆధారం బాలాంబ. అదే నిజం, అదే సత్యం! అతను గంగా కళాప్రావీణ్యంకోసం తన్ను పోగొట్టుకున్నారు. కాని గంగా

నరసయ్య కోసం - అతని అన్ని లక్షణాలకి - తన్ను పోగొట్టుకుంది. బాలాంబ నరసయ్య ఆ గంగాతో జీవితమంతా గడపాలని శిక్షించి వెళ్ళిపోయింది. ఒక క్షణంలో తన మనసు, తెలివి పోగొట్టుకొనడం వలన ఏర్పడిన సమస్యలు తలపోస్తూ నరసయ్య జీవితమంతా దుఃఖించారు. ఆ దుఃఖం మధ్య ఎందరో జాగీర్దారులు, జమిందారులు, సంపద, సౌఖ్యం చూపి గంగాని పిలిచినా, ఆమె అవన్నీ త్యజించి, తనకి బానిస ఐపోయిన గంగాని తలుచుకుంటూ నరసయ్య సంతోషించారు.

అతనికోసం గంగా అన్నివిధాలా నష్టపోయింది. అతను చేసిన ఒకే ఒక పొరబాటుకోసం అతని భార్య తిరస్కారం వలన నరసయ్య శాస్వతంగా గంగాతోనే గడపవలసిన అగత్యం ఏర్పడింది.

గంగా కూడా - కొన్ని రోజుల్లో - తనకోసం నరసయ్య పొగొట్టుకొన్న ఘనతలు తలపోస్తూ - అతనికోసం తనూ ఒక ఇల్లాలుగా మారిపోయింది.

అతను ఎంత ప్రోత్సాహించినా గంగా బహిరంగ రంగస్థలాలు, ఇతర ధనవంతుల ముందు నాట్యమాడడానికి సమ్మతించలేదు. వాళ్ళందరూ తన కళని శ్లాఘించి రాలేదు, తనకోసమే వస్తున్నారని ఆమె తెలుసుకుంది. నరసయ్య ఇంటి కళామందిరంలో అతనికోసం మాత్రం తను జీవితమంతా నాట్యమాడడానికి ఆమె సిద్ధంగా ఉంది.

వయసు చెల్లి, బలిసిపోయి, నెరసిన జుత్తుతో, ఈ ముసలి గంగా నృత్యంని ఇప్పుడుకూడా చూసి అతను ఆనందిస్తున్నారు. ఆమె కూడా - ఇప్పుడే తను నాట్యం అభ్యసించి రంగస్థలంలో ఆటకి శ్రద్ధగా సిద్ధమవుతున్నట్టు - అతనిముందు ఆడింది. ముందులాగ ఆమె అభినయంలో ఒక త్వరితం లేదు కాని భావం కొంగ్రొత్తగా కనిపిస్తోంది.

చావు సమీపించే ఈ సమయంలో ఆమె నృత్యంని ఇంకొకసారి చూసి ఆనందించాలని అతనికి ఆతురత కలిగింది.

కొన్నిరోజులముందు ఒక దినం అతన్ని పడకలో వాలి కూర్చోమని చెప్పి నాట్యంకని దుస్తులు అలంకరించుకొని గంగా ఒక గంట అతని సముఖంలో నాట్యమాడింది.

గభీమని ఒక పులకరింపు తరువాత నరసయ్య మొహం ప్రకాశించింది. అది మారకుండా అలాగే ఉంది; గంగా నెవ్వెఅపోయి పరుగెత్తుకొనివచ్చి అతనిమీద పడి అరిచింది.

మిఠాయి దుకాణంనుంచి ఆదికేశవులు, ఇరుగుపొరుగులనుంచి మనుషులు వచ్చి ఇంటిలో గుమిగూడారు.

నరసయ్య కోలుకొని గంగా చెవిలో సణుగ్గున్నారు: "నేనింకా చావలేదు. కాని చావు ఆరంభించేసింది."

డాక్టరులు వచ్చి అదే చెప్పివెళ్ళారు; గంగా మురళీకి ఉత్తరం రాసింది.

తన భర్త పూర్వోత్తరం విన్నప్పుడు లీలకి తను ఎప్పుడో చదివిన ఒక కథ విన్నట్టని పించింది. బాలంబాని తలుచుకుంటే 'స్త్రీల వైరాగ్యంకి ఈవిడ ప్రతినిధి' అనిపించింది. గంగాని చూసి 'ఒక స్త్రీ భర్తని అపహరించిన ఒక వేశ్య' అనే తలంపుతో ఆమె మొహం చిట్లించుకుంది.

ఇవాళ ఉదయం చీకటిలో వాళ్ళు వచ్చి ఆ ఇంటి తలుపు తట్టినప్పుడు చెయిలో ఒక చిన్న దీపంతో గంగా తలుపు తెరిచింది.

ఆ చిన్న దీపం వెలుతురులో రాత్రంతా నిద్రలేక ఎఱ్ఱబారిన కన్నులు, చింపిరి జుత్తుతో కనిపించిన గంగా మొహంలో ఈ వయస్సులోనూ ఎంత తేజస్సు కనిపిస్తోంది! అది కేవలం ముఖవిలాసం మాత్రం కాదు; ఆమె అంతరాత్మలో నిత్యమూ యౌవనంగా ప్రకాశించే ఒక కళామోహినిలో కానవచ్చే బాహ్యత! లీలాకి మాత్రం ఆ మొహంలో ఒక దాసి కళ అంటుకున్నట్టు కనిపించింది. వాళ్ళ ముగ్గురికి గంగా స్వాగతం చెప్పినప్పుడు లీల మొహం చిట్లించుకుంది.

ఆ ఇంటి ముదు హాలు ఒక పురాతన ప్రదర్శనశాలలాగ కనిపించింది. లీల వాటిని మనస్సులో వింతగా చూసి ఆనందించింది. గభీమని ఒక ఆలోచన: 'ఇది నా అత్తగారి ఇల్లు కదా?'

కాని మరుక్షణమే గంగాని చూసి ఆమెకి జుగుప్స కలిగింది. లీల గంగాతో మాటాడనేలేదు. తన చెలిమిని పూర్తిగా తన కళ్ళలో పదిలం చేసుకొని, బతిమాలుతూ, గంగా వాళ్ళకి దూరంగానే నిల్చుంది.

సారంగన్ ఆ ఇల్లు, అక్కడున్న పురాతన కళావస్తువులు చూసి ఆనందించాడు. అదే సమయం 'ఈ కుటుంబంలో ఎంత పెద్ద రహస్యం నాకు తెలియకూడదని దాచేసారు!' అనే ఆలోచన రాగానే తన కుటుంబంలోని కపటం అతనికి కటువుగా బోధపడింది.

మురళి చాలా రోజులుగా తనకి పరిచయం ఉన్నట్టు తిన్నగా నరసయ్య పడుకున్న గదిలో ప్రవేశించాడు. పరిచయం లేని అన్యుల ఇంటికి వెళ్ళే ధోరణిలో సారంగన్, లీల అతని వెనుక నడిచారు.

ఆ విశాలమైన గదిలో ఒక పురాతన మంచంమీద తలగడలని అణచుకొని రవీంద్రనాత్ టాగూరులాగ ఒకతను కూర్చొనివున్నారు. చూడగానే చాలారోజులుగా మంచంపట్టినవారని తెలియజేసినట్టు తెల్లపారిన స్వరూపం; విశాలమైన నుదురు, దీర్ఘమైన ముక్కు, చుబుకం, దళసరి పెదిమలు - అతని బుద్ధిబలం, కళాసౌందర్య దృష్టికి నిదర్శనంగా కనిపించాయి.

నలుకువుగా వున్న దేహంకి, ఈ కంఠధ్వనికి ఏమీ పొత్తు లేనట్టు ఉచిత గాభీర్యంతో - "రండి, రండి . . . ఇలాగ వచ్చికూర్చోండి . . . " అని ఉత్సాహంతో, పాండిత్య తెలుగులో, ఘనమైన స్వరంతో - నరసయ్య వాళ్ళకి స్వాగతం చెప్పారు.

మురళీతో వచ్చినవారు ఎవరని తెలియక, ఎవరో అన్యులు వచ్చారనే ఆలోచనతో, అతను పక్కనేవున్న శాలువతో మాసిన తన దేహం కప్పుకున్నారు, నరసయ్య.

గది ప్రవేశంలో వచ్చి నిల్చున్న గంగా వెనుకనుంచి "మురళీ వచ్చాడు" అని వాళ్ళని దాటివెళ్ళి అతనికి చెప్పింది.

"మురళీని చూసాను . . . వీళ్ళు ఎవరని చూస్తున్నాను . . . రామ్మా, ఇలాగ వచ్చి కూర్చో . . . " అని లీలకి చెప్పారు.

"సైనా, అదే మీకోడలు - లీలా" అని అన్నాడు మురళి. నరసయ్య దేహంలో గభీమని ఒక చలనం చోటుచేసుకుంది.

లీలా వొంగి అతన్ని నమస్కరించింది.

“దీర్ఘసుమంగళి భవ!” అని దీవించినతరువాత అతను ఒక అద్భుతమైన శ్లోకం నోరు విప్పి పాడి, దేవుని ప్రార్థించారు. ఆ కంఠధ్వనిలో మాధుర్యం, అతని సంగీత ప్రజ్ఞ చూసి సారంగన్ నిర్ఘాంతపోయాడు.

ఆ తరువాత మురళి సారంగన్ని అతని దగ్గరకి పిలిచి, “ఇతనెవరో తెలిసిందా?” అని అడిగాడు.

‘ఎవరో విదేశి, మురళి స్నేహితుడు కాబోలు’ - అని ఆలోచిస్తూ నరసయ్య చిక్కిన తన చెయిని చాటి “I am Narasayya . . . ” అని అన్నారు.

ఇప్పుడు అతనికి తరచుగా మఱపు వచ్చేస్తుంది. ఇంతకు ముందు ఇక్కడ వచ్చినప్పుడు మురళి సారంగన్ వచ్చాడని చెప్పిన సంగతి అతను మరిచిపోయారు.

“నేను సారంగా . . . ” అని తెలుగులో చెప్పి సారంగన్ అతని చెయి పట్టుకున్నాడు.

తన పెళ్ళి సమయంలో - మీసం లేని కుఱ్ఱవాఁడుగా - విదేశంనుంచి వచ్చిన చిన్న మేనల్లుడిని చూసినది - ఇప్పుడు అతనికి జ్ఞాపకంలో వచ్చింది.

కొన్ని మాసాలముందు వాడు మళ్ళీ ఇక్కడికి వచ్చేసాడని, అతనితో కలిసి తనేదో కొత్త వ్యాపారం ఆరంభించడం గురించి మురళి చెప్పినది అతను గుర్తుచేసుకున్నారు. అతనికి అమిత సంతోషం కలిగింది.

“నా వివాహ దినం నిన్ను చూసాను; ఆఖరికి నేను చనిపోయే దినం నిన్ను చూస్తున్నాను. కాని . . . దాన్నికూడా నా వివాహ దినమే చూసాను . . . చనిపోయేముందు దాన్ని చూడననిపిస్తోంది . . . ” అని సార్థకంగా ఉద్దేశంతో నరసయ్య ఒక పద్యంనుంచి రెండు చరణాలు పాడారు.

“తెలుగు బోధపడుతుందా?” అని అతను సారంగన్ని అడిగారు. “తెలుగు, ఆ భాషకి మించిన మీ కవిత్వం నాకు బాగా బోధపడుతోంది. కాని అలవాటు లేకపోవడం వలన మాటాడానికి కొంచెం శ్రమగా ఉంది . . . ” అని సారంగన్ చెప్పాడు.

“వినండి. మీరు మాట్లాడడానికి నేను అవకాశం ఇవ్వను. మీతో మాట్లాడడానికి నాకు బొలెడు సంగతులున్నాయి. ఎందుకంటే నా గురించి ఒకపక్షమైన న్యాయమే మీరు ఇంతవరకు వినివున్నారు . . .” అని నరసయ్య కన్నులు గీటుకున్నారు.

"డాక్టర్లు మాటాడవద్దనే చెప్పారు . . . ఐతేనేం, నా ఆయువులో ఇంకా రెండురోజులు తగ్గుతాయి, అంతేకదా? నేను మాటాడుతూ ఉంటాను . . . అంటే ఇంత బలంతో మాటాడేవాడు బతికిపోతాడని కాదు, ఈ రోగస్తులు, చచ్చేవరకూ, తుదిశ్వాస విడిచేవరకూ, నిమ్మళంగా మాట్లాడతారట! . . . ఏమే గంగా, అదేకదా డాక్టరు చెప్పారు?" అని దుడుకుగా నరసయ్య గంగాని చూసారు,

"మీకిలాంటి ఆలోచనలు వద్దు" అని సమాధానం చెప్పి ఉదయం ఆరుగంటలైపోయిందని గుర్తు చేసుకొని, ఆరుగంటలకి అతనికి ఇవ్వవలసిన మందుని గంగా అతని నోటిలో పోసింది.

ఆ రోజు ఉదయం సారంగన్ ఆ కొత్త గ్రామం అన్వేషించాలని బయలుదేరాడు. నగరపరిసరాలకి అన్య నాగరికతో రవంతైనా పొత్తు లేనట్టు - ఆంధ్రప్రదేశంలో ఊన్న - ఆ చిన్న గ్రామం ప్రాచీనత్వం, ఆ గ్రామస్తుల సామాన్య సభ్యత అతనికి భాగా నచ్చాయి. ఆ గ్రామంలో ఎవరూ తమిళంలో మాటాడలేదు; తెలుగు, ఉర్దూ, అతనికి బోధపడని ధోరణిలో ప్రజలు అక్కడ మాటాడుకున్నారు. కాని ఆ భాషలోని సంగీతం వినడానికి చెవులకి ఇంపుగా ఉంది. వీధిలో పాడుతూ వెళ్ళిన ఒక బండివాడి జానపద గీతం విన్నతరువాత అందులోని స్వరంని కర్ణాటక సంగీతంలో ఒక రాగంతో సరిపోల్చి చూసాడు. ఆ గేయంలోని స్వరమే ఆ ప్రభల రాగం పునరుద్ధరణ అని గ్రహించి ఆ స్వరం, ఆ రాగం వల్లించుకున్నాడు.

బజారు వీధిలో, చెరువుగట్టులో, ఆడవారు, మగవారు మాట్లాడుకున్నప్పుడు సారంగన్ తీవ్రంగా ఆ సంభాషణలు విన్నాడు. సంగీతం అనేది నోటి మాటల్లో, ప్రతీ చలనంలో ఎలాగ ఏర్పడుతుందని ఆ గ్రామంలో తిరిగి చూసినప్పుడు తెలుసుకున్నాడు; ఆ గ్రామం ప్రకృతి దృశ్యాలకి తగినట్టుగా అతని మనస్సులో కాల్పనిక గేయాలు స్ఫురించడం మొదలుపెట్టాయి.

లీలా, మురళి మాత్రం ఇంటిలో నరసయ్య మంచం దగ్గర కూర్చున్నారు. అవాళ మధ్యాహ్నం నరసయ్య కొంచెం బలంతో కనిపించారు; తన్ను పట్టుకొని వెళ్ళి ముందు హాలు ప్రదర్శనశాలలో ఉన్న సోఫాలో కూర్చోబెట్టమని వేడుకున్నారు. పక్కనే లీలని,

మురళిని కూర్చోమన్నారు . . . అప్పుడే బయటకి వెళ్ళిన సారంగన్ తిరిగివచ్చాడు. అతన్నికూడా పిలిచి అక్కడ కూర్చోమన్నారు.

గంగా ఇంటి లోతట్టులో ఏదో పనిలో ఉంది.

గభీమని నరసయ్య తనివితీరినట్టు నవ్వారు.

"మురళి, నువ్వు మంచి పని చేసావ్ . . .  నా కోడలుతో నువ్వు రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. అవును, నీ రాకకంటే ఎక్కువగా ఆమె విజయమే నేను ఎదురుచూసాను . . . అవునమ్మా! నీతో మాట్లాడడానికి చాలా సంగతులున్నాయి, ముఖ్యంగా ఈ భార్యలగురించి మాట్లాడడానికి నాకు చాలా సంగతులున్నాయి . . . " అని చెప్పి అతను ఆగారు.

అతను అలవాటుగా మాటాడినప్పుడు అది నాటకరీతిగా ఉంది. దాన్ని మనసార కోరుతూ సారంగన్ ఆతురతతో విన్నాడు.

"లీలామ్మా! నువ్వు వీడి భార్య . . .  అంటే దానికి అర్ధమేమిటో తెలుసా? ఎది ఏమైనా సరే, నీకు వీడిని, వీడి జీవితంని తొలగలేని ఒక బంధం, అంతస్తు వచ్చేసిందన్నమాట. అవునా?"

'అదెలాగ?' అని అడగాలని సారంగన్  ఆలోచించాడు; కాని అతని సంభాషణ వినాలనే ఆతురతతో శ్రద్ధతో వినసాగాడు.

"వివాహం అనేది ఒక ఎడబాయని బంధం - ప్రేమ, కరుణ, త్యాగం, ఓర్పు, క్షమించే ఉత్తమ స్వభావం - అనే గుణాలతో ఇద్దరిని పరిపక్వం చేసే ఒక బంధం. అది పరస్పరం ఒకరినొకరు అణచడానికి, శిక్షించడానికి ఏర్పడిన చెఱసాల కాదు. శిక్షింపలేని మేరకి ఏర్పడిన ఒక బంధంలో దంపతులు ఒకరినొకరు శిక్షించడం, లేక తమ పొత్తుని రద్దు చెయ్యడం సాధ్యం కాదు.  కాని ఈ రోజుల్లో భార్యాభర్తలు ఒకరినొకరు శిక్షించడం, తమ సహకారం రద్దు చెయ్యడం సాధ్యమవడం వలన ఈ వివాహ బంధం శక్తి లేకుండా పోయింది. ఏదో వ్యాపార ఒడంబడికలాగ మైలపడిపోయింది. దీనికి మూల కారణం ఏమిటి? ఇటువంటి భార్యాభర్తలు, ఆవశ్యకముగా. ఒకరినొకరు పూర్తిగా ప్రేమించలేదన్నమాట!" అని చెప్పి, ఆగి, వాళ్ళని చూసి, చిరునవ్వు నవ్వి, ఏదో ఆలోచించారు.

నుదుటని గోకుకుంటూ అతను చెప్పారు: "కొన్నిరోజులముందు నేను ఒక పుస్తకం చదివాను, అందులో ఈ ఘటన వస్తోంది. అది ఒక రష్య నవల. అందులో ఒక భర్త తన పిల్లలకి చదువు చెప్పడానికి వచ్చిన ఒక పంతులమ్మతో అవినీతికరమైన పొత్తు ఉందని అతని భార్యకి తెలిసిపోయింది. రెండు పిల్లలకి తల్లిఐన ఆమె తన భర్త ద్రోహం వలన అతన్ని వదలివెళ్ళిపోవాలని నిశ్చయించింది. ఆ రోజు ఆ ఇంటికి వచ్చిన ఒకావిడ ఆ భార్యని అడిగింది: "నీ భర్త ద్రోహం కోసం అతన్ని వదలివెళ్ళిపోవాలని నువ్వు నిర్ణయం చేసావంటే ఆది పూర్తిగా నీ వ్యక్తిగత వ్యవహారం. కాని నువ్వు నిత్యమూ 'అయ్యో, అతన్ని నేనెలా ప్రేమించాను!' అని అల్లాడుతున్నావే, దానికి ఏమిటి అర్థం? అతను చేసిన నేరాలు క్షమించే రీతిగా నువ్వు అతన్ని ప్రేమిస్తున్నావా?" అని అడిగినప్పుడు ఆ టాల్స్టాయ్ ఎంత పెద్ద సత్యంని స్పష్టపరచుతున్నారు అని మనకి బోధపడుతుంది."

'తనగురించి సూటిగా మాటాడకుండా చాలా చమత్కారంగా - సర్వసాధారణంగా- అతను దేనిగురించో మాటాడుతున్నారు' అని మనసులో తలపోస్తూ లీల అతని మాటలు ఆతరతతో వింటున్నట్టు నటించింది.

"ఇక్కడ  ఒకరిమీదనొకరు చెలాయించే ఆక్రమణకి 'ప్రేమ' అని పొరబాటుగా భావించడం జరుగుతోంది. అందువలన శిక్షించడానికే సిద్ధంగా ఉన్నట్టు ఒక తప్పు కనిపించగానే ఆ బంధం తెంచుకోవడం వీళ్ళకి సులభమైపోయింది! అదెలా ప్రేమ అవుతుంది? వీళ్లు ఎలాగ వివాహం మూలం భార్యాభర్తలు అవుతారు? 'నువ్వు నన్ను ప్రేమించుతున్నావని నేను నమ్మేవరకూ మనం కలిసివుందాం' అని ఇద్దరు భాగస్థులు వ్యాపారంకోసం చేసుకొనే ఒడంబడికకి, దీనికీ ఏమైనా భేదం ఉందా? వివాహం అనేది రద్దు చెయ్యడానికి తగిన ఒడంబడిక కాదు!" అని చెప్పి నరసయ్య సారంగన్ని చూసారు.

"అవును. ఇదే మన దేశం సాంప్రదాయం. ఈ అలవాటు ఒక పురాతన యుగంలో ఎంత  పక్షపాతంతో ఆమోదించబడినా, ఆ కొఱతలని తొలగించాలిగాని వివాహంలోని మహత్తైన ఆధారం మనం పోగొట్టుకోకూడదు. ఎటువంటి శోధనలు, పొరబాట్లు అడ్డం వచ్చినా, ఆ శోధనల మూలం విరక్తి చెందినవారు, ఆ శోధనల మూలం బాధితులు

ఒకరినొకరు ఎడఃబాటు చెయ్యకూడదనే ఉద్దేశంతో వివాహం అనే బంధంలో ఆ దంపతులు సమైక్యంగా ఉంటున్నారు . . .

"భార్య అనే స్త్రీ వట్టి శారీరక సుఖం ఇచ్చే మగువ కాదు; అంతకు మించి, ఆమె తన భర్తకి ఒక తల్లి . . . తల్లికంటే మేలైనది . . . ఎందుకంటే తల్లి వట్టి తల్లి మాత్రం, ఈమె భార్య కూడా! ఇటువంటి మహత్తైన చుట్టరికం ఉన్న ఈ స్త్రీ తొడసంబంధంతో తన భర్తని వశపరచుకున్న ఇంకొక స్త్రీని చూసి, అసూయపడి తన శ్రేష్ఠమైన బంధం మానుకోవడం అంటే నాకు వీళ్ళ ఇద్దరిలో ఏ భేదమూ లేదనిపిస్తోంది. ఒక భార్య అనే హోదాలో నువ్వు నీ భర్తకి ఆడది మాత్రం కాదు, దానికి మించిన ఒక గౌరవం నీకుంది. ఎవరో స్త్రీ ఒక నిమిషంలో నీ భర్తని ఆకర్షించవచ్చు, అంటే నీకంటే ఆమెకి అతనిపై హక్కు ఉందనికాదు . . . చెడిపోవాలనే ఉద్దేశ్యంతో జీవించే దుష్టులగురించి నేను మాటాడడం లేదు. లోకంలో దుఃఖం అనేది ధుష్టులు చేసే పనులు కావు. అందులో నష్టమో, దుఃఖమో లేదు. లోకంలో మహత్తైన దుఃఖం ఏమిటంటే పుణ్యాత్ములు కూడా చెడ్డపనులు చెయ్యడం మనం చూస్తున్నాం! ఒక సర్కసులో చమత్కారంగా తీగలమీద నడిచే ఒక ఆటగాడు ఒకరోజు కాలు జారి కింద పడిపోతే ఎవరూ అతన్నిచూసి నవ్వరు, అవునా? అలాగే, సామాజిక నైతిక విలువలు అనుసరించి జీవించే ఒక పుణ్యాత్ముడు ఒకసారి కాలు జారి పడిపోతే అతన్ని శిక్షించాలని పూనుకునేవారు ఎంత క్రూరమైనవారు! ఏ చింతా, కల్పనా లేకుండా, లోకంలోని సౌందర్యాలు చూడకుండా కళ్ళు మూసుకునేవారు భాగ్యవంతులు. కాని, కొందరు పుణ్యాత్ములకి కష్టం వచ్చినప్పుడు, అందుకోసం, వారి భార్యలు ఒకరినొరు అజ్ఞానంగా శిక్షించుకోవడం ఎంత శోచనీయం!"

"లీలామ్మా . . . నేనిది నీకోసం మాత్రం చెప్పడం లేదు . . . లోకంలోని అందరి భార్యలకి చెప్పాలని నా ఆశ . . . ఇదిగో, వినండి . . . మీరందరూ మీ భర్తలని శిక్షించడానికి మాత్రం రాలేదు . . . ఎప్పుడో ఒకసారి ఎవరైనా పొరబాటు చెయ్యవచ్చు. మీకంటే మరెవరికీ అన్యోన్యమైన బంధం లేదనే పరిస్థితిలో మీరే అసహ్యాపడిపోతే, మరి మీకూ, ఆ భర్తలకి విముక్తి ఎక్కడ? నీ భర్త చేసినది పొరబాటు ఐనా, అదే పొరబాటుకోసం ఒక తల్లి తన కొడుకుని ఎందుకు రద్దు చేసుకోకూడదు? మీ కడుపులో

పుట్టినవాడని ఎన్ని పొరబాట్లు క్షమించారు? కాని మీ భర్త వేరే తల్లికి కొడుకనికదా అతన్ని శిక్షించుతున్నారు?అతను ఇంకొక స్త్రీ అందంలో మురిసిపోయాడంటే, అతనికి నీమీద ద్వేషం వచ్చేసిందనే ఆలోచనతో, నువ్వెందుకు నీ ఉనికి వదిలి పరుగెత్తాలి? లీలమ్మా, నేను నాగురించే నీతో మాటాడుతున్నాను. నేను నా బాలు కంటే - (ఇప్పుడే లీలాకి అతను తన అత్తగారిగురించి మాటాడుతున్నారని బోధపడింది) - గంగాతో సంతుష్టితో - కాపురం చేస్తున్నాను అని నీ ఉద్దేశమా? అలాగేం కాదు. గంగా కళనే నేను ప్రేమించాను. గంగాతో నాకిటువంటి చుట్టరికం అకస్మాత్తుగా సంభవించింది. దానికోసం నాపై ఎటువంటి కనికరం చూపకుండా, బాలు నన్ను శిక్షించడమూ చేసేసింది. అంతేకాదు, నేను ఘోర అవమానంకి పాలయ్యాను. నా ఈ అంతిమకాలంలో, నా తుదిశ్వాస విడిచేముందు, ఒకసారి బాలు మొహం చూడాలని నా అంతరాత్మలో ఒక మెరుపు . . . అదీ త్వరలో ఆరిపోతుంది! నేను ఆమెని ప్రేమించుతూ గంగాతో నా జీవితం గడిపేసాను! ఒక బాధ్యత నెరవేర్చే భావనతో నా జీవితం గడిపేసాను . . .

"కాని నాగురించి అందరూ ఏమంటున్నారో తెలుసా? ఒక కళాభిమాని ప్రేమలో, సహవాసంలో నా జీవితం ఉన్మత్తోత్సవంలాగ ఉందని చాలామంది అపార్థం చేసుకున్నారు. నేను చేసిన ఒకే ఒక పొరబాటుకోసం నన్ను పూర్తిగా ద్వేషించక నా భార్య నన్ను గెలిచివుంటే, నా జీవితంకాడా అలాగ ఉండివుంటుంది. 'నా వలన, నన్ను వదిలి, నా ప్రేమకి అర్హమైన ఒక ఆడది తన జీవితంని ఏకాంతంలో వ్యర్థం చేసుకుంటోంది' అని ఆమెగురించి తలపోసినప్పుడెల్లా నా పరిసరాలలోని స్వర్గం నాకు నరకంగా కనిపిస్తోంది. అమ్మా, నేను ఎంత ఘాటుగా ఆమెని ప్రేమించానని ఆమెకి బోధపడనేలేదు. బోధపడితే నన్ను శిక్షించివుండదు."

"అందుకే చెప్తున్నాను, విరహతాపంలో బాధపడేవారు, వినండి.! మీ ప్రేమకి అర్హులైన వారి తప్పులు, పొరబాట్లు క్షమించే మేరకు వాళ్ళని ప్రేమించండి! పెళ్ళి మండపంలో కూర్చున్న వధువు, వరుడికి నా ఈ సందేశం - మీరు మీ జీవితమంతా మీరలేని ఒడంబడికగా మార్చి రాయండి! కేవలం శరీరం కోసం జీవించడం ఏవగింపు అంటే, మరి ఆ శరీరంలోని ఒక కళంకం కోసం జీవితంని పూర్తిగా నిరాకరించడమూ

ఏవగింపు అని గ్రహించాలి. ఆ పని చేసేసి 'నేను శరీరంకోసం జీవించలేదు!' అని నొక్కి చెప్తే అది పచ్చి అబద్ధం!" అని చెప్పి వాళ్ళ సముఖంలో నరసయ్య ఒక ఆశుకవిత్వం వల్లించారు.

అతనికి మొహమంతా చెమట పట్టేసింది; నెరసిన గడ్డంలో కన్నీరు కారుతోంది.

లీలకి అతని మాటలు, అతను చెప్పే వివరాలు, ఆ ఆశుకవిత్వం అన్నీ వినోదంగా కనిపించాయి. తన మామగారు ఒక అసాధారణ వ్యక్తి అని గ్రహించి ఆమె చాలా సేపు అతని వాదనలు మౌనంగా వింటోంది. కాని, ఆఖరికి అతన్ని అడిగింది: "మీరు చెప్పే నీతులు ఆడవారికి, మగవారికి - రెండు వర్గాలకీ - లోబడతాయి అనవచ్చా?"

నరసయ్య లీల మొహం దయతో చూసి నవ్వారు. ఒక యువతికి సహజమైన సంకుచిత దృష్టిని బోధపరచుకొని అతను చిరునవ్వుతో చెప్పారు: "అమ్మా, నేను న్యాయం గురించి మాటాడుతున్నాను. అది రెండు వర్గాలకీ చెందినది. నీకు ఒక వేళ ఇలా అనిపించవచ్చు, 'ఛీ, ఛీ, చెడిపోయిన భార్యతో మళ్ళీ ఒక మగవాడు జీవించడమా? ఎంత సిగ్గుమాలినతనం!' - అని నీలాగే చాలామంది అడగవచ్చు. పైపైగా చూసేవారందరికీ అలాగే కనిపిస్తుంది. కాని అది నిజం కాదు. కొంచెం ఆలోచించి చూడు. ద్వేషించలేని మేరకు ప్రేమించేవాడు మరేం చెయ్యగలడు? వాళ్ళ చేరువలో నువ్వుగాని ఆ దాంపత్యంని పరిశీలించి చూసావంటే ఆ చెడిపోయిన భార్యకి, ఆమెని వదలి వెళ్ళక ఉన్న భర్తకి మధ్య ఈ లోకం చూసి అసూయపడే విధంగా ప్రేమ వర్ధిల్లడం నువ్వు చూస్తావ్ . . . నేను ముందే చెప్పాను - చెడిపోవాలనే లక్ష్యంతో జీవించే దుష్టుల గుంరించి నేను మాటాడలేదమ్మా!" అని అతను చాలాసేపుగా మాటాడడం గమనించిన గంగా, సమయం చూసి, అతనికి మందు తీసుకొని వచ్చింది.

"డాక్టరు వచ్చే సమయం . . . మందు తాగి కొంచెంసేపు పడకలో నిద్రపోండి . . . అతను వచ్చి సూదిమందు ఇచ్చినతరువాత నిద్రపోవడం కష్టం."

అతన్ని లేపి, నిల్చోబెట్టి, అతని ఎడం చెయిని తన భుజంమీద లాగి, వేసుకొని కుడిచెయితో అతని నడుముని అణచుకొని గంగా అతన్ని అతని గదికి తీసుకొని వచ్చింది.

డాక్టరు వచ్చారు. నిష్కామ్య కర్మలాగ సూదిమందు ఇచ్చి అతను బయలుదేరారు. సారంగన్ డాక్టరుతో ఒంటరిగా కలుసుకొని అడిగాడు.

"ఇంకా కొన్ని గంటలు" అని చెప్పి డాక్టరు నిష్క్రమించారు.

'లేదు, ఇప్పుడే' అని సూచించినట్టు గభీమని గంగా ఏడ్పు ఆ గదిలోనుంచి వినిపించింది.

ఆ కళామండపంలో గుమిగూడిన అందరూ నివ్వెఱబోయి ఆ గదిలోకి పరుగెత్తారు. చింపిరి జుత్తుతో, తడిసిన కళ్ళతో గంగా వాళ్ళని నిరాశతో చూసింది.

లీలా గోడమూల నిలబడి ఒంటరిగా ఏడ్చింది.

మురళి నరసయ్య కాలడుగులని వొంగి చూసి కన్నీరు కార్చాడు.

చుట్టపక్కల ఉన్న స్త్రీలు బిగ్గరగా ఏడ్చారు.

తన బాధ్యత గ్రహించిన ఆదికేశవులు తన గురువుగారి పాదాలు పట్టుకొని అంతిమ అంజలి చేసాడు.

సారంగన్ నివ్వెఱ పోయి జరుగుతున్నదంతా ఒక వినోదంలాగ చూస్తూ నిల్చున్నాడు.

కొంచెం సమయం తరువాత జ్ఞాపకం రాగానే మురళి బాలమ్మాకి టెలిగ్రామం ఇవ్వడానికి తపాలా కార్యాలయంకి పరుగెత్తాడు.

## 8

శేషయ్య సాయం, స్నేహితుల దయ లేకుండానే Ganga Architects అనే తన ఆదర్శ వ్యాపార సంస్థని మురళి అమోఘంగా ఆరంభించాడు. రెండు నెలలు దాటకుండానే అతని ఆశని మించి వ్యాపార ఒడంబడికలు, ప్రస్తావనలు ఆ సంస్థకి వస్తూనే ఉన్నాయి.

మురళి, లీల - లీలా అభిలాషకి తగినట్టుగా - కొత్త కాపురం ఆరంభించారు.

నరసయ్య పూర్వార్జిత ఆస్తి - పొలాలు, తోట - గంగా మురళికే ఇచ్చేసింది. మురళి "వద్దు!" అని ఎంత తీవ్రంగా వాదాడినా వాడు తప్పకుండా అంగీకరించాలని

బతిమాలుడుతూ "మీ నాన్నగారు ఉన్నప్పుడు నువ్వు ఎలాగ వచ్చి పోతుంటావో, అలాగే నన్నూ చూడడానికి వస్తూవుండాలి" అని గంగా ప్రేమతొ వేడుకుంది.

మురళి అక్కడనుంచి తిరిగివచ్చి తన తల్లిని చూసినప్పుడు ఆమెని పూర్తిగా మారిపోయిన రీతిలో తెలుపు చీర, అనలంకృతమైన కంఠంతో, వితంతువుగా చూసి లీల గుండె బద్దలైనట్టు అత్తగారిని కౌగిలించుకొని ఏడ్చింది.

అప్పుడు అది చూసి మురళి ఒక నిమిషం ఆలోచించి మొహం చిట్లుంచు కున్నాడు:"ఛీ, ఛీ! ఈ స్త్రీలు ఎంత వంచకులు! కాలమంతా అతని భార్యగా జీవించిన గంగా అతను కన్నుమూసినతరువాత శోకంతో బాధపడినప్పుడు ఆమెని ఊరడించని లీలకి ఇప్పుడు ఈ తల్లి కొత్త స్వరూపం చూసి ఇంత శోకమా? అతను పోయినతరువాత ఈ తల్లి ఎంత నిమ్మళంగా, తృప్తిగా ఉందని తెలియక ఏడుస్తుందే?"

శేషయ్య ఇంటిలో మురళి, లీల ఒక వారం ఉన్నారు. మురళి శేషయ్యని కలుసుకొని తను తన డబ్బుతో సొంత వ్యాపారం ఆరంభించిన సంగతి తెలియజేసాడు. "నేను ఏదైనా పొరబాటు చేసివుంటే నన్ను క్షమించండి" అని వేడుకున్నాడు. శేషయ్య వాడిని కౌగిలించుకున్నారు.

ప్రారంభంలో శేషయ్య మురళి సొంత కాపురం ఆలోచన అంగీకరించలేదు. తరువాత ఆమోదించి అతను చెప్పారు: "అదీ మంచిదే! చుట్టరికాలనే నిర్బంధం వలన చేరువలో ఉండి చావకుండా దూరంలో వేరేవేరుగా ఉండి చుట్టరికాలు, అనురాగాలు పెంచుకోవడం ఉత్తమం! ఈ తరాల యువకుడుగా నీ ఆలోచన నాకు నచ్చింది."

మురళి తన తల్లిని తనతో రమ్మని పిలిచినప్పుడు బాలంబ దృఢంగా "నేను రానేరాను" అని చెప్పేసింది.

కాని ఆమె కూడా, గత వారం ఒక రోజు మురళి వచ్చి, ఇటీవల లీల అస్వస్థగా ఉందని, తరచుగా ఆమెకి మైకం, వాంతులు వస్తున్నాయని చెప్పగానే బాలాంబ తన్ను మించిన సంతోషంతో, రెండు రోజులుగా జబ్బుతో ఉన్న శేషయ్యనికూడా లెక్కచెయ్యక మురళితో పరుగెత్తింది.

-దీర్ఘంగా ఆలోచించిన తరువాత తన ఆస్తికోసం తండ్రితో వ్యాజ్యమాడడం అనుచితమని సారంగన్ నిశ్చయించాడు.

అతని నిర్ణయం విని నరసింహన్కి పెద్ద నిరుత్సాహం కలిగింది. ఒక రాత్రంతా తన భార్యతో సంప్రతించుకున్న తరువాత అతను, 'ఎవరు ఏమన్నా సరే, నేను నా ఉద్యమం - ఈ దావా - మానుకోవడం జరగదు!' అని దృఢ సంకల్పం చేసుకున్నారు.

కొన్ని రోజుల తరువాత శేషయ్యకి వకీలు నోటీసు వచ్చింది.

'ఈ కుటుంబంలో సభ్యుడుగా ఈ ఇంటిలోనే ఉంటున్న వీడికి ఎంత సాహసం!' అని మండిపడుతూ శేషయ్య నరసింహన్ గదికి వచ్చారు. అక్కడ రాజం, నరసింహన్, శేషయ్యకి ఎటువంటి శ్రమ ఇవ్వకుండా ఆ ఇంటినుంచి శాశ్వతంగా నిష్క్రమించడానికి సిద్ధంగా మూటలు కట్టుతూ కనిపించారు.

'ఈ కోర్టు వ్యవహారం ముగించేముందు నా జీవితం అంతమవుతే మంచిది' అని దుఃఖంతో మూలుగుతూ శేషయ్య తన గదికి నడిచారు.

ఇవాళ ఉదయం చాలాసేపు తరువాత కూడా శేషయ్య పడకనుంచి లేవనేలేదు. ఇన్ని సంవత్సరాలుగా అతని ఆరోగ్యం, మనసు బాగా గ్రహించి అతనికి సేవ చెయ్యడమే తన జీవితం గమ్యం అని నమ్ముకున్న బాలాంబ తన జీవితంలో ఒక కొత్త అధ్యాయం పుట్టిన తరువాత, ఒక కొత్త బంధంలో కట్టుబడి, అతనికి దూరమైపోయింది. శేషయ్య గదినుంచి బయటకి వచ్చి నిలబడితే నాగణ్ణా, కమలమ్మా, మర్యాదగా అతన్ని ఏదో అడుగుతారు కాని ఆతని గదిలో ప్రవేశించి అతనితో మాటాడడానికి వాళ్ళకి ధైర్యమూ, అలవాటూ లేదు.

మెలకువ తరువాత, అలసటతో, పడకనుంచి లేవలేక, అతను చాలాసేపు అలాగే పండుకొనివున్నారు. కీటికీద్వారా బయట చూసినప్పుడు ఆ వెలుతురు మూలం 'సమయం ఎనిమిది గంటలు అయివుంటుంది' అని అతనికనిపించింది.

హాలులోని గడియారంనుంచి ఎనిమిది గంటలు వినిపించాయి.

అతను సవరించుకొని మూలుగుతూ మంచం మీద లేచి కూర్చున్నారు. అతని పాదాలు నేలని తాకినప్పుడు జ్వరంతో బాధ పడుతున్న అతని దేహం చలితో వొణికింది. అతను కంబళి శాలువని లాగి, కప్పుకొని మళ్ళీ నిద్రపోవాలని ప్రయత్నించారు. నిద్ర రాలేదు. తలనొప్పితో కపాలం పగిలిపోతున్నట్టు అనిపించింది. తీవ్ర జ్వరంతో ఊపిరితీయటం సమస్యగా ఉందని గ్రహించి ఎవరైనా దగ్గరికి వచ్చి ఒక

మింగుడు వేడి నీరు ఇస్తే బాగున్ను అనిపించింది. పెదిమలు ఎండిపోయినట్టు దాహం! ఎవరినీ పిలవడానికి అతనికి శక్తి లేదు.

అతను తన దౌర్భాగ్యస్థితిని, ఏకాంతంని గుర్తుచేసుకున్నారు. ముప్పయిఐదు సంవత్సాలముందు గతించిన అతని భార్య; మూడు సంవత్సరాల ముందు అకాలంలో మరణించిన అతని ప్రియమైన కొమారుడు రంగయ్య; ముందటి నెల తన కుటుంబంని వదిలి వెళ్ళిపోయిన మురళి; కొన్నిరోజుల ముందు విడిచిపోయిన బాలమ్మ - అందరినీ శేషయ్య వేరువేరుగా తలపోసారు. గభీమని అతని మనసులో ఒక ఆలోచన కొత్త ధోరణిలో సాగింది:

'వీళ్ళందరూ ప్రేమతో నాకు ఘనమైన సేవ చేసారు. కాని నేను వీళ్ళకి చేసిన ప్రతీకారం ఏమిటి? నేను అధికారం చెలాయించాను, అందరూ నాకు అణిగి నడుచుకున్నారు. నేను అందరినీ దయతో చూసాను. నేను మరేం చెయ్యగలను? నా ప్రేమ వలనే తరచుగా నేను చాలా కఠినంగా ప్రవర్తించడమూ జరిగింది. నాలాగే నన్ను ప్రేమించినవారికి అది బోధపడింది. కాని, ఇప్పుడు, అందరూ నన్ను విడిచి వెళ్ళిపోయారు . . . నేను ఈ ఇంటిలో ఒంటరిగా ఉన్నాను . . . '

'ఓ! బాలమ్మ . . . ఎది ఎలాగున్నా ఆమె ఒక కూతురు అని నాకు ఇప్పుడు అర్థమైంది, దానికీ తెలిసింది! ఇందులో ఏ పొరబాటు లేదే?

'ఈ సారంగన్ ఉన్నాడే, వాడిగురించి నాకు అయోమయంగా ఉంది. వాడు వచ్చిన తరువాత వాడిగురించే రాత్రి, పగలు, తలపోస్తూ, తలపోస్తూ, నేను నా ఆరోగ్యం పాడుచేసుకున్నాను. వీడు వచ్చిన తరువాత ఈ కుటుంబంలో అందరికీ నేనంటే ఉదాసీనత వచ్చేసింది! వీడు రాకపోతే మురళి నన్ను విడిచి వెళ్లడం జరిగివుండదు. అసలు వీడు ఎందుకు వచ్చాడో? వీడిని ఎలాగైనా మళ్ళీ పారిస్ కి పంపిస్తే నేను ఈ అంతిమ కాలంలో నిమ్మళంగా చావగలను . . . అయ్యో, దాహం నా నాలికని చంపుతోంది! ఈ గదికి ఎవరూ రానేరారా?' శాలువని తెరిచి, తలని బయటకి చాపి, శేషయ్య పైకప్పుని చూసారు. ఊపిరాడడం బాధగా ఉంది.

కిటికీద్వారా గదిలో సూర్యకాంతి ప్రకాశించింది.

తోటమాలి కన్నియప్పన్ ఏదో చెట్టుని నఱికే శబ్దం విని అతను చిరచిరలాడారు.

వీధిలో గభీమని ఒక బస్సు పరుగెత్తే ధ్వని వినిపించింది.

బంగళా గేటుముందు కట్టె బండితో కూరగాయలు అమ్మే ముసలివాడితో నాగణ్ణా బేరం చెయ్యడం శేషయ్యకి తెలిసింది; కాని అతని చెవులకి వినిపించినట్టు 'నాగణ్ణా' అని పిలవడానికి నోరు పెగల్లేదు.

గది తలుపుముందు ఎవరో వచ్చి నిలబడినట్టు ఒక నీడ కనిపించింది! ఆ తరువాత గంటలు మ్రోగే ధ్వని! చిన్నిచేతులతో గది తలుపుని తెరచుకొని, అల్లాడుతున్న ఆ ప్రాణం దాహం తీర్చడానికి వచ్చిన దేవుడులాగ పిల్లవాడు కణ్ణన్ గదిలోకి ప్రవేశించాడు.

ఆ నిమిషం రంగయ్య తలంపుతో అతని కళ్లు తడిసిపోయాయి. మాటాడలేని అతని సముఖంలో మాటలు రాని ఆ పిల్లవాడు చేతులు చాటి, పిచ్చిమాటలాడుతూ మంచం దగ్గరకి వచ్చేసాడు.

'ఒరేయ్, నువ్వు పుట్టిన వేళ నా కొడుకుని చంపేసింది . . . ' అని అలవాటుగా ఆలోచించిన శేషయ్య, 'ఛీ, ఛీ, ఇదేం పిచ్చితనం!' అని తన్నే ఖండించుకున్నారు.

'ఒకరి చావుకి ఇంకొకరి జన్మ కారణమా? ఎంత గుడ్డినమ్మకంతో నేను ఇన్నిరోజులూ వీడి ఉనికి మఱచిపోయాను! తుదిశ్వాసవరకూ నన్ను ప్రేమించిన రంగయ్యకి నేను చేసే కర్తవ్యం ఇదేనా? నేను ఎంత కృతఘ్నుడుగా మారిపోయాను! నా కులంకి ఈ పిల్లవాడు ఒక చిహ్నం! వీడూ, వీడి తల్లి ఈ ఇంట్లో ఉన్నారు, మరెందుకు నాకు ఎవరూ లేరని నేను అల్లాడుతున్నాను - పిచ్చితనం అంటే ఇదే . . . '

తడబడుతూ శేషయ్య శ్రమతో లేచి మంచంమీద కూర్చున్నారు. కన్నీరు కార్చుతూనే ఉన్నారు. పెదిమలు వొణికాయి. జ్వరం వలన దేహమంతా కంపించింది.

"రా నాయనా, రా . . . " అని హీన స్వరంలో మూలుగుతూ, శోకంతో పిల్లవాడిముందు చేతులు చాటి అతను ఏడ్చారు. కణ్ణన్ కనిపించలేదని, వాడు శేషయ్య గదిలోకి ప్రవేశించాడని గ్రహించి ఏదో పెద్ద పొరబాటు జరిగిందనే భయంతో పరుగెత్తుకొని వచ్చిన లక్ష్మి . . . పిల్లవాడిని కౌగిలించుకొని ధార ధారగా కన్నీరు కార్చుతున్న మామగారిని చూసి నివ్వెఱపోయి నిల్చుంది.

శేషయ్య కళ్ళు తెరిచి చూసి తన చేష్టకి సిగ్గుపడినట్టు కళ్లు తుడుచుకొని ఒక చిరునవ్వు నవ్వారు; తాగడానికి వేడినీరు కావాలని ఆమెని మెల్లగా అడిగారు. దానికోసం లక్ష్మి పరుగెత్తింది.

శేషయ్య దాహం నెమ్మదిపడింది. వేడినీరు తాగినవెంటనే అతనికి మొహమంతా చెమట పట్టేసింది. లక్ష్మి electric fan మీట నొక్కింది; శేషయ్య మంచంమీద వాలారు.

లక్ష్మి అతని కంఠంలోని చెమటని తువాలుతో తుడిచింది. అతని తలగడకి సమీపంలో ఉన్న మందు సీసాలు చూసి అతను అస్వస్థగా ఉన్నారని గ్రహించి ఈ సమయంలో అతనికి సేవ చేసే బాలమ్మకూడా అతన్ని విడిచి వెళ్ళిపోయిందని బాధపడింది. రెండురోజులుగా ఎవరినీ సాయంకి పిలవకుండా ఒంటరిగా ఇతను కష్టపడుతున్నారని గ్రహించి  అతనికి సేవ చెయ్యడానికి సిద్ధంగా పిల్లవాడిని నడుములో ఎత్తుకొని అతని ఎదుట నిలబడింది.

కొంచెం సేపు తరువాత శేషయ్య కళ్ళు తెరిచారు. తలగడ పక్క ఉన్న ఒక మందు సీసాని లక్ష్మికి చూపి దాన్ని ఇమ్మన్నారు.

లక్ష్మి ఆ సీసా మీదున్న చీటీ చదివి ఒక చిన్నమందు గ్లాసులో తగిన మోతాదులో అతని చెయికి మందు  అందించింది.

“నేను వెళ్ళి వేడివీరు తీసుకొని వస్తాను. మీరు నోరు కడుక్కొని ఏమైనా భోంచేస్తారా?”  అని లక్ష్మి భయపడుతూ, భయపడుతూ అడిగింది; అతను ఆమెని చూసి చిరునవ్వు నవ్వి సమ్మతించారు.

పిల్లవాడిని కింద దింపి లోపలికి వెళ్ళిన లక్ష్మి ఒక చెంబులో వేడినీరు, ఒక పళ్లెం తెచ్చింది. గదిమూల వేలాడుతున్న మోకునుంచి ఒక తువాలు తీసి తన ముంజేయిలో వేసుకొని అతనికి వేడినీరు ధారపోసింది. మంచంమీద కూర్చొని, నేలనున్న పళ్ళెంలో నోరు కడుక్కొని, మొహం సవరించుకున్నారు శేషయ్య. తుడుచుకొడానికి అతనికి తువాలు అందించి, పళ్ళెంని తీసుకొని లోపలికి వెళ్ళిన లక్ష్మి తిరిగివచ్చినప్పుడు ఒక వెండి గ్లాసులో పాలు తెచ్చింది.

పాలు గ్లాసు అందుకొని గదిలోవున్న ఒక కుర్చీలో ఆమెని కూర్చోమని శేషయ్య చెప్పారు. కాని లక్ష్మి భయభక్తితో నిల్చూనే ఉంది.

పాలు ఒక మింగుడు తాగిన తరువాత శేషయ్య "కూర్చో అమ్మా, నిన్ను చూసి చాలా కాలమైపోయింది . . . రా, కూర్చో" అని ప్రేమానురాగంతో ఆమెని వేడుకున్నారు. లక్ష్మి పిల్లవాడిని ఒడిలో పెట్టుకొని  కుర్చీలో వినయంగా కూర్చుంది.

శేషయ్య మౌనంగా పాలు తాగారు. 'ఇంతకాలమూ నేను ఈమెగురించి ఏ తలంపు లేకుండా, పూర్తిగా ఆమె ఉనికి మరచిపోయాను. అందుకు కారణం ఏమిటి?' అని అపరాధ భావనతో అతను అల్లాడారు; మళ్ళీ ఒకసారి ఆమెని చూసి చిరునవ్వు నవ్వారు.

'నామీద నీకు కోపమా?" అని అడిగి ఆమె జవాబు ఎదురుచూడక అతను ఇంకా మాటాడారు:

"నిన్నూ, పిల్లవాడిని నేను తరచుగా చూసినప్పుడెల్లా నా రంగయ్యని పోగొట్టుకున్న శోకంనుంచి కోలుకోవటం జరగదు అనే భయంతోనే నేను మిమ్మల్ని ఎఱగనట్టు ఉన్నాను. అది నా పొరబాటే. రంగయ్య నాకు కొడుకుమాత్రం కాదు . . . దశరథుడికి రాముడు కేవలం కుమారుడంటే సరిపోతుందా అమ్మా?" అని అడిగినప్పుడు పసిపాపలాగ అతను ఏడ్చారు.

"ఈ కుటుంబంలో ఉన్నవారందరూ ఈ కుటుంబంని రెండవ పక్షంగా చూస్తున్నారు. నా రంగయ్య అలాక్కాదు.  నేను ఎంత కఠినంగా ప్రవర్తించినా ఈ సారంగన్ లాగ నా మాటకి జవదాటడు. వాడు ఈ నరసింహన్ లాగ కన్న తండ్రిని కోర్టుకి ఈడ్చే పుత్రుడు కాదు. చూసావా, ఇప్పుడు ఏం జరుగుతోంది? దిక్కులేకుండా నన్ను  వదిలేసి అందరూ వెళ్ళిపోయారు! ప్రొద్దుటనుంచి రెండు గంటలు పడకనుంచి లేవలేక, దాహంతో గొంతు ఎండిపోయి, జ్వరంతో ఎవరూ 'ఏమైంది?' అని అడగని అనాథగా నేను ఈ పెద్ద కుటుంబంలో ఉంటున్నాను! ఎంత ఆస్తి ఉన్నా ఏం లాభం? ప్రేమించనివారి మధ్య జీవించేవారి గతి ఇలాగే ఉంటుంది! 'ఒక మింగుడు నీరు తాగడానికి ఎవరూ లేరంటే ఇలాగే చావడం మంచిది!' అనే వైరాగ్యంతో పడివున్నప్పుడు . . . నా రంగయ్యే వస్తున్నట్టు నన్ను కాపాడడానికి ఈ పిల్లవాడు వచ్చాడు. 'నువ్వూ, నేనూ మాత్రం ఈ ఘనమైన. వంశంకి అర్హులు!' అని వాడు నాకు చెప్తున్నట్టు ఏవో వదరు మాటలు నా చెవిలో వినిపింటాయి. మురళి నన్ను విడిచి వెళ్ళిపోయిన తరువాత 'ఇక ఈ కుటుంబ

బాధ్యతలు ఎలాగ నిర్వహించడం?' అనే భయంతో నా దేహం పూర్తిగా నలిగిపోయింది. ఇప్పుడు ఆ బెంగ నాకు లేదు!" అని మంచంని పట్టుకొని అతను లేచారు. పక్కనున్న మేజాబల్లనుంచి ఒక తాళంచెవులగుత్తి తీసి లక్ష్మి దగ్గరకి వచ్చారు.

"వినమ్మా, ఇక నీకే ఈ కుటుంబబాధ్యత అంతా! నువ్వు చదువుకున్న అమ్మాయివి, ఇక నువ్వే నిర్వహణ చెయ్యాలి! . . . ఇది నీ కుటుంబం . . . ఇదిగో, తీసుకో!" అని అతను ఇచ్చిన తాళంచెవులగుత్తిని ఆమె నిరాకరించినప్పుడు "ఈ కణ్ణన్ కోసం ఈ భారం నువ్వు మోసితీరాలి!" అని అంటూ ఆమె చెయిలో అది అతను అప్పగించారు.

"వెళ్ళి నాగణ్ణాని రమ్మని చెప్పు . . . అతను నీకు సాయం చేస్తూ అన్నీ చూసుకుంటాడు" అని లక్ష్మిని పంపించేసి శేషయ్య బలంతో, తృప్తితో మంచంమీద వాలారు.

అన్యాయంగా తన్ను కసితీర్చుకున్న ఈ కుటుంబం ఆస్తిలో ధార్మికంగా, న్యాయతఃగా, తనకి ఒక దమ్మిడీ కూడా వద్దని నిశ్చయించిన సారంగన్ తనొక సరాసరి భారతీయుడుగా ఈ జీవితంలో మెలగడానికి ఇదొక మంచి అవకాశం అని సంతోషించాడు. ఈ ఇల్లు వదలి వెళ్ళడానికి ముందు కనీశం తన ఆదాయం గురించి ఏదైనా ఏర్పాటు చెయ్యాలని ఆలోచించి, మరేం దారి తెలియక, ఆ తోటలోని ఇంటిలోనే రోజులు గడిపాడు.

వేసవి ముగిసి, వానలు కురిసే వాతావరణంలో అతనికి air conditioning అగత్యం లేకుండా పోయింది, కాని రాత్రివేళ దీపం కావాలికదా? 'ఛీ, దానికోసం వీళ్ళని బతిమాలడమా?' అని కొవ్వొత్తులతోనే రాత్రులు గడిపాడు.

నాగణ్ణా, కమలమ్మా, ఆ ఇంటిలో వండినది ఏదీ తనకి వద్దని కరారుగా ఆజ్ఞ ఇచ్చిన తరువాత సారంగన్ తనే kerosene stove లో ఎదైనా ఉడకబెట్టి తినడం అలవాటు చేసుకున్నాడు.

తన ఖరీదైన దుస్తులన్నీ పెట్టెలో జాగ్రత్తగా పెట్టి తాళం వేసిన తరువాత సారంగన్ పంచె, జిబ్బా ధరించడం ఆరంభించాడు. అతని దగ్గర రెండే జతలుండడం వలన ఒక

జతని చాకలికొట్టుకి ఇచ్చేసి ఇంకొక జతని తనే ఉతికి ఒకటి మార్చి ఒకటిగా ధరించడం అలవాటు చేసుకున్నాడు.

కాని అతను తన్ను ఈ భారతదేశ జీవితంకి ఎంత మార్చుకున్నా, ఇంతకుముందు జీవితంలో పాటించని మితవ్యయం అనుసరించినా, ఈ మద్యం తాగే అలవాటు మాత్రం మానుకోవటం అసాధ్యమనిపించింది.

లలితా ప్రోత్సాహం వలన సారంగన్ 'మనోన్మణి' పత్రికకి సంగీతం గురించి తన అభిప్రాయాలు, ఆదర్శాలు, వ్యాసాలుగా రాసి ఇవ్వడానికి అంగీకరించాడు.

ఇప్పటిలో సారంగన్ ఒక దినంలో అధిక భాగం లలిత ఇంటిలోనే గడుపుతున్నాడు. అందుకు ఒక న్యాయమైన కారణం ఉంది. విద్యుచ్ఛక్తి లేని అతని ఇంట్లో అతను సంగీతం వినలేకపోయాడు. లలితా ఇంట్లో రేడియోగ్రాం ఉంది. ఇటీవల లలితాకి పాశ్చాత్య సంగీతంలో కొత్త అభిలాష కలగడం వలన సారంగన్ రోజువారీ ఒక జాబితా తయారుచేసి ఉదయం రికార్డులతో ఇంటినుంచి వెళ్ళాడంటే సాయంకాలం వరకూ సమయం సంగీతంలోనే గడచిపోతుంది. ఆ తరువాత మహాలింగం రావడంతో మిగిలిన సమయం సంభాషణలో గడచిపోతుంది. అందువలన రాత్రివేళ సారంగన్ ఇంటికి తిరిగి వస్తున్నాడు.

ఆఖరి బస్సులో రాత్రి పదిగంటలు తరువాత ఇంటికి తిరిగివచ్చిన సారంగన్ ఇంటి కాంపవుండులో ప్రవేశించినప్పుడు తోట ఇల్లు ముందు వెలుగుతున్న దీపం చూసి నివ్వెఱపోయాడు; తలుపు తెరచి లోపలికి వెళ్ళి అన్ని మీటలూ నొక్కిచూసాడు. రెండు నెలల తరువాత అన్ని దీపాలు జగజ్యోతిగా ప్రకాశించడం చూసి మనస్సులో సంతోషించాడు. కాని వెంటనే 'వీళ్ళు ఇష్టం వచ్చినట్టు దీపాలు వెలిగించడం, ఆర్పడం చేస్తూ నా మీద అధికారం చెలాయించుతే నేను సహించలేను!' అనే ఆలోచన లోతుగా అతని మనస్సులో పాతుకుంది. సారంగన్ లోతట్టునుంచి ప్రతీ దీపం ఆర్పుతూ ముందు గదికి వచ్చాడు. అక్కడ నాగణ్ణ నిల్చొనివున్నారు.

నాగణ్ణ ఏదో చెప్పాలని ప్రయత్నించడానికి ముందు సారంగన్ అతన్ని చూసి కోపంతో అరిచాడు: " నాకు electricity కావాలని నేనెవరి దగ్గరా ఏడవలేదు; నాకు

వద్దు! రేపు ఉదయం మళ్ళీ cut చెయ్యమని చెప్పు!” అని చెప్పి అక్కడున్న ఒక కొవ్వొత్తిని వెలిగించి, చెయిలో తీసుకొని, గోడ మీదున్న మీటని నొక్కి దీపం ఆర్పాడు.

గభీమని ప్రకాశమైన దీపాలు వెలసిపోయి కొవ్వొత్తి మసక వెలుతురులో నాగణ్ణ కళ్ళకి అంతా చీకటిగా కనిపించింది.

నాగణ్ణ మౌనంగా అక్కడ నిల్చున్నారని గ్రహించి సారంగన్ తలెత్తి చూసాడు. “నాగణ్ణా, ఎందుకు అలా నిలబడ్డారు? ఇలాగ వచ్చి కూర్చోండి” అని కొన్ని నిమిషాలముందు అతన్ని ఒక నౌకరలాగ తరిమినది గుర్తుచేసుకొని లోలోపల దుఃఖిస్తూ సఖ్యభావంతో పిలిచాడు. అతన్ని సమీపించిన నాగణ్ణ ఒక కవరు అందించారు.

“మురళి మీకు అలవాటుగా ఇచ్చే - రెండు నెలలుగా ఇవ్వని - రొక్కంతోబాటు ఈ నెలకీ ఇవ్వవలసినది ఇందులో ఉందట. ఇంటి నిర్వహణ బాధ్యత పూర్తిగా లక్ష్మికి వచ్చేసిందట. ఇక పెద్దాయన ఎవరి వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకోరట. జరిగినదంతా మరిచిపోయి మీరు ఇక్కడే ఉండాలంటున్నారు. లక్ష్మి అమ్మగారు మీకు చెప్పమన్నారు.”

సారంగన్ చెయి చాటి ఆ డబ్బు తీసుకోలేదు. నాగణ్ణ ఆ కవరుని మేజామీద పెట్టారు.

“నాగణ్ణా . . . ” అని అతన్ని కఠినంగా పిలిచి సారంగన్ మేజామీదున్న కవరుని చూపి “Please take it!” అని ఆజ్ఞాపించినట్టు చెప్పాడు.

నాగణ్ణ జంకుతూ నిల్చున్నారు.

“నాగణ్ణా, నాకు డబ్బూ, గిబ్బూ ఏమీ వద్దు . . . సైనా నాకొక సవాలు చేసారు - he was right! ‘సొంత కాళ్ళతో నేను నిలబడగలనా?’ అని అడిగారు. అదే నేను try చేస్తున్నాను . . . నిలబడితే నేను సొంత కాళ్ళతోనే నిలబడతాను, వీలయినంతవరకూ అదే చేస్తాను . . . అతనికి చెప్పండి, నాకేం కోపమూ లేదు . . . ”

నాగణ్ణ సారంగన్ చెప్పే న్యాయంకి విరుద్ధంగా ఏమీ అనలేకపోయారు. తనకి ఆ అధికారమూ లేదని గ్రహించి, మౌనంగా ఆ కవరుని తిరిగి తీసుకున్నారు.

“I am sorry Naganna!”

అతను నిష్క్రమించిన తరువాత కొంచెం సేపు నిమ్మళం లేక సారంగన్ గదిలోనే ఇలాగ అలాగ సంచారం చేసాడు.

మరుదినం ఉదయం సారంగన్ బయటకి వెళ్ళే సమయం . . . అతను తలుపు తెరచేవరకూ కాచుకున్నట్టు లక్ష్మి పిల్లవాడిని నడుములో ఎత్తుకొని వచ్చింది.

ఆమె తనకోసం వచ్చిందని తెలియగానే సారంగన్ ఆమెకి స్వాగతం చెప్పాడు. ఆమెని నమస్కరించి కూర్చోమని చెప్పాడు.

కాని లక్ష్మి ఏదో సాహసంతో అతనితో మాటాడాలని వచ్చి, ఇప్పుడు తను ఇలా రావటం పొరబాటేమో అని భయపడుతున్నట్టు ఒక మూల జంకుతూ మర్యాదగా నిలబడింది.

సారంగన్ని చూసి లక్ష్మి నడుమునుంచి జారి నేల దిగి కణ్ణన్ నడిచివచ్చాడు. కణ్ణన్ని ఎత్తి పట్టుకొని సారంగన్ లక్ష్మికి చెప్పాడు: "I am sorry . . . మీరు నిన్న పంపించిన డబ్బుని నేను నిరాకరించినందుకు నన్ను క్షమించాలి . . . నాగణ్ణ మీకు చెప్పివుంటారు . . . మరేం కారణం లేదు . . . నేను నా సొంత కాళ్ళతో నిలబడాలని ప్రయత్నం చేస్తున్నాను. మీ సాయం అందుకు అడ్డుగా రావడం వలన మీ సాయం నేను నిరాకరించాను . . . అందుకు మీరు నన్ను క్షమించాలి."

"అదెలా సాయం అవుతుంది? అది మీ బాధ్యత. మీకు శ్రమగా ఉందని నేను ఈ భారంకి ఒప్పుకున్నాను . . . ఎలాగైనా, ఇది మీ ఇల్లుకదా? జరిగినదంతా మరిచిపోయి మీరు ఈ కుటుంబంలో ఒకరిగా ఉండాలి. నేను మిమ్మల్ని చూడడానికి వచ్చిన కారణం వేరే. మీ పెద్దన్నయ్యతో మాట్లాడి అతను మళ్ళీ ఈ ఇంటికి రావడానికి మీరే ఏమైనా సాయం చేయాలి."

కలవరపడుతూ సారంగన్ చెప్పాడు: "మీ ఆలోచన నిరాకరించడం నాకు చాలా బాధగా ఉంది. ఈ కుటుంబంకి నావలన ఏ లాభమూ లేదు. ఈ కుటుంబంవలన లాభం పొందడానికి నాకేం హక్కు ఉంది, చెప్పండి? నేను మొండిగా మాటాడుతున్నానని అపార్థం చేసుకోవద్దు. వినండి, నేనేదో కోపం, రోషం వలన ఈ నిర్ణయంకి రాలేదు. ఇందువలన నాకు అనేక లాభాలున్నాయి. నా భవిష్యత్తులో స్వార్థం కోసం నేను నా సొంత కాళ్ళతో నిలబడాలి!" అని ఆమెని సూటిగా చూడకుండా, కణ్ణన్ని

కౌగిలించుకుంటూ సారంగన్ కిటికీద్వారా తన చూపుని దూరంలో పదిలంచేసి మాటాడాడు.

ఇక అతన్ని నిర్బంధిచడమో, ఒప్పించడమో పొరబాటు అని గ్రహించి లక్ష్మి అతని దగ్గర శెలవు పుచ్చుకొని, వినయంగా, "సరే, నేను వస్తాను . . . " అని బయటకి వచ్చింది.

ఆ అపజయం ఆమె మనసుకి భారంగా కనిపించింది. ఆమె సారంగన్ని, నరసింహన్ని, ఈ కుటుంబంతో ఐక్యం చెయ్యాలని ఆలోచించినప్పుడు సారంగన్ విషయమే చాలా సులభం అని ఊహించింది. కాని అతని వాలకం ఇలా ఉంటే ఇక ఈ కుటుంబం మీద వ్యాజ్యం వేసే నరసింహన్ని, అతని భార్యని శాంతపఱచడం అసాధ్యమనిపించింది. అయినప్పటికీ ఆ సాయంకాలం నాగణ్ణాతో నరసింహన్ ఇంటికి వెళ్ళిరావాలని లక్ష్మి నిశ్చయించింది.

## 9

సారంగన్ లలితా ఇల్లు చేరుకున్నప్పుడు అక్కడ బయట ఒక పెద్ద కారు నిల్చొనివుంది.

మహాలింగం కోర్టుకి వెళ్ళిపోయారనే సూచకంగా గారేజ్ ఖాళీగా కనిపించింది. 'లలితాని చూడడానికి మరెవరో వచ్చినప్పుడు మనమూ లోపలికి వెళ్ళడమా?' అని జంకుతూ సారంగన్ ఇంట్లోకి ప్రవేశించాడు.

ముందు హాలులో కూర్చున్న లలిత అతన్ని చూడగానే "అదిగో, అతనే వచ్చేసారు!" అని తన కుడివైపు తిరిగి ఎవరికో చెప్పడం విని 'నాకోసం ఎవరు వచ్చివుంటారు?' అని అర్థంకాని కలవరంతో సారంగన్ హాలుచేరుకున్నాడు. చాలా విచిత్రమైన దుస్తులు ధరించిన ఒకతను లేచి వచ్చి సారంగన్ని కలుసుకున్నారు.

"My name is Gopinath, film producer and director," అని అతను సారంగన్ వైపు చేతులు చాటారు. "మిమ్మల్ని కలుసుకున్నదుకు నాకు చాలా సంతోషం!" అని తన్ను పరిచయం చేసుకొని సారంగన్ లలితాకి ఎదుటవున్న సోఫాలో కూర్చున్న తరువాత లలితాని తేరిపార చూసాడు.

కొన్నిరోజులముందు ఒక ప్రఖ్యాత సినిమా నిర్మాత/దర్శకుడు తనదగ్గరకి వచ్చి సారంగన్ గురించి సంప్రదించినట్టు లలిత అతనికి ఇదివరకే చెప్పివుంది. సారంగన్ అభిప్రాయాలని అనుసరించి సంగీతంలో మార్పులు, పరిశోధనలు చెయ్యడానికి సినిమా ఒక మంచి నేపధ్యం అని మహాలింగం సంతోషంగా అప్పుడు సినిమాని అతనికి సిఫారసు చేసారు.

ఇప్పుడు సారంగన్ ఒక శోచనీయమైన పరిస్థితిలో చిక్కుకొని అల్లాడుతున్నాడని తెలుసుకొని లలిత వచ్చిన నవ్వుని లోలోపల అణచుకొని మాటాడింది:

"కొంచెంసేపుముందు మిమ్మల్ని ఎక్కడ కలుసుకోవటం అని నాకు వీళ్ళనుంచి టెలిఫోను వచ్చింది. చాలా తొందరగా, ముఖ్యంగా మీతో సంప్రదించాలని వాళ్ళు నొక్కి చెప్పారు. అందువలన నేనే మీ అనుమతి లేకుండా 'పదిగంటల తరువాత వస్తే మిమ్మల్ని చూడవచ్చు' అని చెప్పి వాళ్ళని రమ్మన్నాను."

"సరే, చాలా thanks" అని ఆమెకి చెప్పి సారంగన్ గోపీనాథ్ ని చూసి చిరునవ్వు నవ్వాడు.

"సరే, మనం బయలుదేరుదామా? Orchestra party అందరూ రెడిగా ఉన్నారు" అని గోపీనాథ్ తొందరగా లేచారు.

సారంగన్కి ఏమీ అర్థం కాలేదు. 'ఇంత తొందరగా నాతో సంప్రదించి వీళ్లు ఏమిటి చెయ్యబోతున్నారు?మున్నెరుక లేకుండా నేను ఎక్కడికో వెళ్ళాలంటున్నారే?' అని జంకాడు. కాని అతన్ని అడుగుతే అగౌరవం అని 'ఒక నిమిషం' అని చెప్పి లలితాని పిలిచాడు. అతనిదగ్గర క్షమాపణ కోరి, లలితా వెనుక మెడమీదకి వెళ్ళాడు.

మేడమీద ఆమె గదిలో ప్రవేశించగానే "What is this? అతను ఏదో orchestra ready గా ఉందంటున్నారు . . . నేను వెళ్ళి చేసేది ఏముంది?" అని రెండు చేతులూ దులుపుతూ తన శబ్దం కింద వినిపించకూడదని జాగ్రత్తగా లలితతో రహస్యంగా సారంగన్ జగడమాడాడు.

లలిత నవ్వుతూ చెప్పింది: "వాళ్ళతో కొంచెం మాట్లాడి చూడండి. మీరుగాని ఓపికతో విన్నారంటే అదొక సరసమైన అనుభవంగా ఉంటుంది. ఈ గోపీనాథ్ ఇవాళ సినిమారంగంలో ప్రసిద్ధి పొందిన మనిషి. ఎందుకో అతనికి మీరంటే బాగా పిచ్చి

పట్టుకుంది. మీ అభిప్రాయాలతో తనకి నూటికి నూరు శాతం ఏకీభావం అని అతను అంటున్నారు. ఆ నూటిలో అతనికి ఒకటైనా అర్ధమైందా అని నాకు తెలీదు. కాని అతను చాలా smart businessman! ఎదైనా సరే, సులభంగా వందలకొలదీ దబ్బు సంపాదించుతారు. మీతోకలిసి అలాగ ఏదో చెయ్యాలని అతను వచ్చివున్నారు . . . అతనికి మీ పేరు మాత్రం కావాలి . . . 'ఆ సినిమా సంగీతంకి ఫ్రాన్స్ నుంచి ప్రత్యేకంగా నేను తీసుకొనివచ్చాను' అని మీగురించి గొప్పగా చెప్పుకుంటారు . . . అందులో మీకేం నష్టం? మీకు నష్టం లేకుండా మీ సాయంతో అతనికి లాభం అంటే మీరెందుకు అతన్ని ఆపాలి? అన్ని రంగాలు ఆక్రమించుకున్న సినిమాని, మహాలింగం చెప్తున్నట్టు, మీ అభిప్రాయాలకి ఉపయోగపఱచుకోవటం సాధ్యమా అని చూడండి! కాని ఒకటి - అమితమైన ఓపిక, సహనం మీకు కావాలి! . . . ఆ రెండూ మినాయించి మీకన్నీ ఉన్నాయిగా?" అని లలిత ఎగతాళిగా నవ్వింది.

"లలితా, నాకిది చాలా ఇబ్బందిగా ఉంది. అటువంటి వ్యక్తులతో ఎలాగ మెలగడం అని నాకు తెలీదు . . . మీరూ నాతో రాకూడదా?" అని సారంగన్ బతిమాలాడు.

"నాకు అటువంటి అనుభవం వద్దు! సినిమాకి సంబంధించిన వ్యక్తుల మధ్య ఒక స్టూడియోలో, నిలబడడానికి - ఒక ఆడదిగా కాదు, ఒక రచయిత్రిగా - నాకు అసహ్యంగా ఉంది . . . " ఇని సగం సరసంగా, సగం నిజంగా, లలిత చెప్పింది.

"ఓ, అలాగా? మీరూ అంత కటువైన అనుభవం అనుభవించారన్నమాట! సరే, నేనూ అనుభవించి చూస్తాను!" అని సారంగన్ బయలుదేరాడు.

"మీకు నా అభివందనలు" అని అతనితో కరచాలనం చేసి, దగ్గరకి వచ్చి, లలిత సారంగన్ తలని తాకి, సెలవిచ్చింది.

సాయంకాలం ఆరు గంటలకి వానలో తడిసిపోయి సారంగన్ ఇంటికి తిరిగివచ్చాడు. లలితా ఇంటి మెట్లు ఎక్కుతున్నప్పుడు కాలు జారడం వలన అతని ఎడం కాలు చెప్పు తెగిపోయింది. తడిసిన చెప్పుని ఒక చెయిలో పట్టుకొని, వానలో తడిసిపోయి నడిచివచ్చే సారంగన్ని చూసి లలిత తొందర తొందరగా పరుగెత్తుకొని వచ్చింది.

“ఇదేం ఘోరం! వాళ్ళ కారులో మీరు రాలేదా? ఇలాగ వర్షంలో తడిసి రావడమా?” అని సానుభూతితో మందలించి లలిత అతన్ని మేడమీద వరండాలో నిలబెట్టి, గదిలోకి వెళ్ళి తుడుచుకోవడానికి ఒక తువాలు తీసుకొని వచ్చింది.

చెయిలో చెప్పుతో తడిసి నిలబడే సారంగన్ని చూసి మహాలింగం అతన్ని కోపించుకున్నారు. “ఇదేంటి, మీకంతా ఆటగా ఉందా? నాకొక call చేసివుంటే కారుని పంపించివుంటాను . . . ముందు, ఈ పంచె, జిబ్బా, ఊడదీయండి! . . . లలితా . . . అల్మారానుంచి ఒక పంచె, Turkish towel తీసుకురా!” అని ఆ కుంభ వర్షం ఘోషంని మించి అతను అరిచారు. ఇంతలో లలిత కొత్త దుస్తులుతో వచ్చేసింది. “That’s what a wife is: the husband only thinks, she does it instantly!” అని అతను ఆమెని పొగడారు.

“ముందు మీరు దుస్తులు మార్చుకొని రండి. మీ దగ్గరనుంచి నేను సరసమైన వార్తలు ఎదురుచూస్తున్నట్టు, మీకోసం కొన్ని సరసమైన వార్తలు నాదగ్గర ఉన్నాయి!” అని కనుసైగ చేసి లలిత మెట్లు దిగి వచ్చినప్పుడు మహాలింగం నవ్వుతూ సారంగన్ని అడిగారు: “మీ సరసంలో నాకు వాటా ఉందా?”

“హూం, సరసం అంటూ ఏమీలేదు, వట్టి కడుపుమంట!” అని సారంగన్ విసుగ్గున్నాడు.

“What happened? మీరు ఎక్కడనుంచి వస్తున్నారు - ఈ తెగిన చెప్పుని చెయిలో పట్టుకొని?”

“చెప్పు తెంచుకోవడం ఇక్కడే జరిగింది! ప్రొద్దున్నే ఆ cinema fellow నన్ను తీసుకొని వెళ్ళాడు . . .What a disgusting experience! . . . లలిత చేసిన సిఫారసు వలనే ఈ భయంకరమైన అనుభవం!” అని చిరచిరలాడుతూ సారంగన్ తలని దులుపుకున్నాడు.

“ఓ, Director Gopinath ఇవాళ మనింటికి వచ్చారా?” అని మహాలింగం నొచ్చుకున్నారు. ఆ ప్రభల సినిమా దర్శకుడు వచ్చినప్పుడు తను లేకపోవడం ఎంత పెద్ద నష్టమని అతను వాపోయారు.

"వాడొక పెద్ద Genius! వాడి సినిమాలు ఏమైనా మీరు చూసివున్నారా? సినిమా పరిశ్రమలో సాటిలేని వ్యక్తి . . . !"

'ఇతని అభిరుచులు ఎంత చోద్యంగా ఉన్నాయి! ఒక విషయం - అది ఎంత మహనీయమైనా, ఎంత నీచమైనా - అదే దృక్పథంలో చూసే మనిషి ఇతను!" అని ఆశ్చర్యపడుతూ లలితాలాంటి స్త్రీ ఇతనితో ఎలాగ కొనసాగడం సాధ్యమైంది?" అనే తలంపుతో సారంగన్ అతన్ని తేరిపారి చూసాడు.

అతని మౌనం చూసి మహాలింగం "You don't agree with me? That's fine - people do have different tastes!" అని అన్నారు.

ఆ తరువాత మేడమీద మహాలింగం, లలిత, సారంగన్ కాఫీ తాగినప్పుడు సారంగన్ మౌనంగా కనిపించాడు. వర్షంలో తడిసిన జుత్తుని తుడుచుకున్న తరువాత అతను దువ్వుకోలేదు, అది చింపిరిగా ఉంది. సారంగన్ కాఫీ తాగి ముగించేవరకూ అతన్నే లలిత చూస్తూవుంది. అతని నిశ్చలత గమనించి అతనికి ఈ రోజు అనుభవం చాలా కటువుగా ఉండివుంటుందని తెలుసుకుంది. అతను ఏదో ఆలోచనతో కలవరపడుతున్నాడని ఊహించి అతనే ముందు మాటాడనీ అని కాచుకొనివుంది.

"తల దువ్వుకుంటారా?"

"హూం . . . వద్దు . . . " అని నుదుటమీద వాలిన జుత్తుని సారంగన్ చెయితో నెట్టుకున్నాడు.

"Come on . . . మీరు తల దువ్వుకోండి . . . " అని చెప్పి లలిత తన గదికి వెళ్ళింది. సారంగన్ ఆమె వెనుక నడిచాడు.

ఆ పెద్ద గదిలో అద్దంముందు నిలబడి సారంగన్ తల దువ్వుకున్నాడు. అతను తన వెనుక నిలబడివున్న లలితని అద్దంలో తేరిపారి చూసాడు.

'అయ్యో, పాపం! ఇవాళ ఇతని మనసు బాగా చెడిపోయింది! ఆ రోజు శేషయ్యతో వాదించిన ఆ ఘటన కంటే ఇది ఇంకా తీవ్రంగా కనిపిస్తోంది!'అని తనలో మూలుగుతూ లలిత 'దీనికి కారణం నేనేకదా?' అని బాధ పడుతూ, సారంగన్ వెనుక నిలబడి, అతని భుజాలని తన రెండు చేతులతో నొక్కి, అతని చెవులని తన మొహంతో తాకి, ఆ ఏకాంతంలో అతన్ని ఆంతరంగికంగా అడిగింది: "Darling, what happened?"

"Please . . . please . . . " అని ఆమె స్పర్శనే ద్వేషించే ధోరణిలో ఆమె చెయిని పక్కకి తోసి, ఆ గదినుంచి నిష్క్రమించి సారంగన్ హాలుకి వచ్చాడు.

అతని వెనుక వెంటనే రాకుండా తన గదిలోనే కొన్ని నిమిషాలు నిలబడి, ఆలస్యం చేసి, లలిత హాలుకి వచ్చింది.

మహాలింగం ఉల్లాసంగా తాంబూలం వేసుకుంటూ కనిపించారు.

"Mr. సారంగన్, 'మనోన్మణియం'లో మీరు రాసిన వ్యాసంకి మంచి response ఉంది. మీకు చూపడానికి సరసమైన కొన్ని ఉత్తరాలు మాత్రం తీసుకొని వచ్చాను" అని అంటూ లలిత కుర్చీలో కూర్చొని, తన handbag నుంచి కొన్ని ఉత్తరాలు బయటకి తీసింది.

"అన్నీ పొగడే ఉత్తరాలా?" అని మహాలింగం అడిగారు.

"మా అభిప్రాయాలు పొగడేవారు అంత తొందరగా ఏదీ చెయ్యరు. Mr. సారంగన్ ఈ వ్యాసం ఇప్పుడే ఆరంభించారు. కాని అంతలోనే కొందరు ఓర్పు లేకుండా అతనిమీద దాడి చేస్తున్నారు . . . " అని విసుగ్గుంటూ లలిత పామరతనంతో ఎవరో రాసిన ఒక ఉత్తరంని తీసి, చదివి, జాలి పడుతున్నట్టు, విశాల హృదయంతో, తనలో నవ్వుకుంది. మౌనంగా దాన్ని ఒక సారి తనలో చదువుకుంది.

సారంగన్ నిర్లక్ష్యంగా లలితని అడిగాడు: "ఆ ఉత్తరం ఏమంటోంది?"

"అది మిమ్మల్ని పారిస్ కి తిరిగి వెళ్ళమంటోంది! Is it not funny?" అని లలిత నవ్వుతూ వివరించింది.

ఆ తరువాత 'Go Back to Paris!' అనే శీర్షిక కింద ఒక పెద్ద పట్టికలాగ సారంగన్ అభిప్రాయాలని నీచ భాషలో ఖండించి చాలామంది సంతకం చేసిన ఆ ఉత్తరంని ఆమె అతనికి చదివి చూపించింది.

"There is nothing funny about it . . . నేను కూడా పారిస్ కి తిరిగి వెళ్ళడం గురించి ఆలోచిస్తున్నాను."

- నొచ్చుకున్న మనస్సుతో సారంగన్ అన్న ఈ మాటలు విని ఒక గాజు పాత్ర బద్దలైనట్టు లలిత హృదయంలో ఏదో ఒకటి ఇంకా చెదరిపోకుండా, కాని

పగిలిపోయింది. తన భావనలు అణచుకొని లలిత సారంగన్ని, మహాలింగంని, మారి మారి చూసింది.

"ఎన్నిరోజులుగా మీరిలాగ ఆలోచిస్తున్నారు?" అని ఆమె అడిగినప్పుడు ఆమె కంఠధ్వని కొత్తగా వొణికింది.

"ఇవాళ మధ్యాహ్నంనుంచి . . . "

"I am sorry, మీకిలాంటి చెడ్డ అనుభవం నావలన ఏర్పడింది, నన్ను క్షమించండి!" అని ఏడుస్తున్నట్టు లలిత అతన్ని వేడుకుంది. సారంగన్ తలెత్తి ఆమెని కొంచెంసేపు చూసాడు.

"ప్లీజ్, ఇది మరిచిపోండి" అని ఆమె మళ్ళీ అతన్ని ఒక సారి బతిమాలినప్పుడు మహాలింగం ఆ పరిస్థితిని తెలుసుకొని, భయంతో నిలబడే ఒక పిల్లవాడులాగ, ఇద్దరిని చూస్తూవున్నారు.

"ఏం జరిగింది? మీరు దేనిగురించి మాటాడుతున్నారు?"

"మీ సినిమా మేధావి - గోపీనాధ్ - ఇవాళ ఉదయం ఇక్కడ వచ్చారు. అతని చిత్రం సంగీతంకి ఇతనే కావాలని పట్టుబట్టారు. సారంగన్ని మనింటినుంచి పిలుచుకొని వెళ్ళారు. నాకు అంతవరకే తెలుసు . . . ఆ తరువాత ఏమైందో, మిస్టర్ సారంగన్, మీరే చెప్పండి! మీరు మాటాడరేం?"

భరించలేని కటుతతో ఏ దారీ, ఏ దిశా తెలియక, చీకటిలో చిక్కుకున్నట్టు, భ్రమతో, కలవరపడుతూ, ఎవరి మొహమూ చూడడానికి ఇష్టం లేక, సారంగన్ చేతులతో మొహం కప్పుకొని తల వొంచాడు.

"Oh, my god!"

బయట వర్షం ఆగిందని గభీమని తెలుసుకొని "నేను ఇంటికి వెళ్తాను!" అని సారంగన్ లేచాడు.

"Please, మీరు ఇప్పుడు వెళ్ళకూడదు; ఈ moodలో మిమ్మల్ని ఒంటరిగా పంపడానికి మేం సిద్ధంగా లేం. దయచేసి ఏం జరిగిందో మాకు చెప్పండి" అని లలిత పెదిమలు వొణుకుతూ, మహాలింగం సముఖంలో ఉన్నాం అనే సంగతి కూడా మరిచిపోయి సారంగన్ చేతులు పట్టుకొని అతన్ని కుర్చీలో అమర్చమని కోరింది.

మహాలింగం కూడా లేచి వచ్చి అతని ముందు నిలబడ్డారు. “తరువాత నేను మిమ్మల్ని మీ ఇంటిలో దింపుతాను. ఇప్పుడు ఇక్కడే ఉండండి! మధ్యాహ్నం ఏం జరిగిందని చెప్పడానికి మీకు ఇష్టం లేదంటే, మనం మరేదైనా మాట్లాడుకుందాం.”

సారంగన్ మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు. కొంచెంసేపు తల వొంచి ఆలోచించిన తరువాత తన మానసికావస్థ వలన వారిద్దరూ కలవరపడుతున్నారని గ్రహించినట్టు చిరునవ్వు నవ్వి, తలెత్తి వాళ్ళని చూసాడు. ఆ కళ్ళు ఎంత రక్తమయంగా కనిపించాయి!

“నాకు ఎవరిమీదా కోపమో, విచారమో లేదు. అందులోనూ, ముఖ్యంగా, మీమీద నాకు కోపం, విచారం ఈ జన్మలో రాదు. ఇవాళ జరిగిన పొరబాటుకి మీరు బాధపడవద్దు . . . లలితా, మన సాంస్కృతిక జీవితం ఎంత ఘోరమైన పరిస్థితిలో పడిపోయిందని నాకు ఇవాళ బోధపడింది. అది వీళ్ళు ఇంత బహిరంగంగా చెయ్యడం ఎంత అవమానకరం! . . . What a shame!” అని సారంగన్ వాపోయాడు.

కొంచెంసేపు తరువాత తన భావనలు అణచుకొని సారంగన్ ఆ మధ్యాహ్నం జరిగిన ఘటనలు వివరించసాగాడు.

“Mr. మహాలింగం, మీరు ఆ సినిమా మేధావిని ఇంతవరకు కలుసుకోలేదుకదూ, ఎంత దుర్భాగ్యం! మీ చేజారిపోయిన ఆ దుర్భాగ్యం ఆఖరికి నేను అనుభవించాను!”

“కారులో అతనితో వెళ్తున్నప్పుడే నాకు అతనితో  చిరచిరలాడే mood వచ్చేసింది. ఎందుకంటే అతను ఒక నిమిషం కూడా నోరు మూయలేదు. ఆ కారుని అతను కొన్న సంగతి; చెన్నైలో అతనొక పెద్ద భవనం కట్టిన ప్రతాపం; అతని కొత్త హీరోయిన్ గుణవిశేషాలు, ఆమె సాముద్రికా లక్షణాలు గురించి ఏవేవో నేను అడక్కుండా అతనే అనావశ్యకంగా వాగారు . . . మధ్య, మధ్య, తనే బిగ్గరగా నవ్వుకున్నారు . . . ఇటువంటి విచిత్రమైన మనుషులతో ఎలాగ మెలగడం అని నేను ఆలోచించాను. అదేసమయం వీళ్ళందరూ నాతో అసహజంగా మెలుగుతున్నారని నాకు బోధపడింది. అంతేకాదు. నాకు తమిళం తెలియదు అని అతను ఇంగ్లీషులో మాటాడగానే, ఆ నిరర్థక ప్రసంగం నేను భరించలేకపోయాను. నేను వినయంగా అతనికి తమిళంలో చెప్పాను: ‘నాకు తమిళం తెలుసు. మీరు తమిళంలోనే మాట్లాడండి,’ అని. వెంటనే అతని

మొహం తెల్లబోయింది. “మీరు ఇంగ్లీషులో మాటాడుతున్నట్టు తమిళం మాటాడుతున్నారు. అందుకే నేను ఇంగ్లీషులో మాట్లాడాను” అని అతను అన్నారు.

“నేను ఎదురెత్తుగా అతన్ని అడిగాను: ‘మీరెందుకు తమిళంని ఇంగ్లీషులాగ, ఇంగ్లీషుని తమిళంలాగ మాట్లాడుతున్నారు?” అని. ఆ తరువాత స్టూడియో చేరుకున్నవరకూ మేమిద్దరం మాటాడనేలేదు.

“అక్కడికి వెళ్ళగానే అతను తన Production Manager తో మాట్లాడమని చెప్పి వెళ్ళిపోయారు. ఆ Production Manager చాలా మంచివారు, విద్యావంతుడు . . . అతను నాకు అన్ని వివరించి చెప్పారు . . . వచ్చే నెల దీపావళకి రిలీజు అవుతున్న వాళ్ళ చిత్రంకి నేను నేపద్య గీతం అమర్చాలి (వాళ్ళు ఎందుకో దాన్ని Re-recording అని పిలుస్తున్నారు) అని చెప్పారు. అందుకు నాకు ప్రత్యేకంగా 10,000 రూపాయలు ఇస్తామని మాట ఇచ్చారు. కాని అతను అన్యోన్యముగా నాకొక సంగతి చెప్పారు: ‘మీరు ఈ రూపాయలకోసమే ఈ పని చెయ్యాలి . . . వాళ్ళకి మీ పేరే కావాలి. మీగురించి నాకు కొంచెం తెలుసు, అందువలనే మీకు చెప్తున్నాను. మరే విధంగానూ ఇక్కడ మీ ఆదర్శాలకి చోటు లేదు’ అని అతను చెప్పారు.

“ ‘సరే, నాకు ఇప్పుడు డబ్బు ఒక ప్రశ్నగా ఉంది . . . వీలయినంతవరకూ వీళ్ళకి మనం సాయం చేద్దాం!’ అనే ఆలోచనతో నేను సమ్మతించాను. నా ఆదర్శభావనలు నెరవేరడానికి నేను ఈ సినిమాని నమ్మివుండలేదు. ‘నా లక్ష్యంకి భంగం రాకుండా ఉంటే అది నాకు చాలు!’ అని వాళ్ళతో రాజీపడాలని నేను నిశ్చయించాను.

“ఆ తరువాత అక్కడున్న ఒక theatreకి నన్ను పిలుచుకొని వెళ్ళారు; రెండు పొడుగాటి చలన చిత్రాలు చూడడానికి ఏర్పాటు చేసారు. అందులో ఒకటి - దానికి నేపధ్య సంగీతం లేదు - నేను నేపధ్య సంగీతం అమర్చవలసిన చిత్రం. ఇంకొకటి నేను ఎలాగ నేపధ్య సంగీతం అమర్చాలని నాకు నేర్పే, విజయవంతంగా నూరు రోజులు కొనియాడిన వారి చిత్రం!

“ఆ చిత్రాలు చూసినందువలనే నా కడుపు మండింది. అది బోధపడక, వాటి ‘గొప్ప సృజనాత్మక సృష్టి’ చూసి నేను ఉప్పొంగిపోయాననే నమ్మకంతో - ఒక విద్యార్థికి పాఠం చెప్తున్నట్టు అతను నాతో మాటాడారు. ‘ఇదే మనదేశ ప్రజలకి చాలా ప్రియమైన

సాంస్కృతిక దృక్పథం' అని నాకు బోధించారు. తరువాత నాకు నాలుగైదు పనికిమాలిన పాశ్చాత్య సంగీత రికార్డులు అందించి 'ఇలాగ, ఈ ఈ చోట్ల మీరు నేపధ్యగీతం అమర్చాలి' అని నాకు చెప్పారు. వాళ్ళ ప్రఖ్యాతి చిత్రాలు చూసినప్పుడే అందులో నేను విన్న పాటల్లో, నేపధ్యగీతంలో వాళ్ళు ఎంతవరకు పాశ్చాత్య సంగీతంని అనుసరించి చవుకయిన నకిలీలు తయారు చేసారని నాకు బోధపడింది. 'ఆ పనే నేనూ చెయ్యాలని వీళ్ళ ఉద్దేశమా?ఇంతకన్న మరే అవమానం ఉందా?' అనే ఆలోచనతో వాళ్ళముందు నిలబడిన ప్రతీ క్షణం నేను నగ్నంగా నిలబడినట్టు కంపించిపోయాను. నేను నా గురించి కొంచెం ఆలోచించాను:

'మన ప్రాచీన సంగీతం ప్రతిష్టలు కోల్పోయి ఈ చలనచిత్ర పరిశ్రమ ఎంత దారుణమైన అవస్థలో పడిపోయింది! ఈ అవమానకర పని చెయ్యడం కంటే సంగీత విద్వాంసుడైన మా నాన్నగారు చెప్పినట్టు నేను ఏదైనా ఉద్యోగం చేసి బతకవచ్చుకదా? అతను నన్ను కళాకారుడని గౌరవించలేదు. వీళ్ళు నన్ను కపట కళాకారుడనే భావనతో డబ్బు చూపి బేరమాడుతున్నారు. నేను నా నాన్నగారితో దెబ్బలాడి నా సొంత కాళ్ళతో నిలబడాలని శపధం చేసేసాను! నా సొంత కాళ్ళతో నిలబడాలంటే నేను నా అంతరాత్మని అమ్మితీరాలా?'

"ఇలాగ నా కుటుంబంని, సమాజంని, పరాధీనం చేసుకొని నాలాంటి ఒంటరి మనిషి ఇక్కడ జీవించడం ఆత్మహత్యకి సమానం అని నాకు ఇప్పుడే - తొమ్మిది నెలల తరువాత - తెలిసింది.

"నేను వాళ్ళకి చెప్పాను: 'మీ సినిమాకి సంగీతం అమర్చడం నాకు చేతకాదు.'

"ఏం, ఎందుకు? మీరు సంగీత విద్వాంసులు కారా?మీకెందుకు ఆ భయం?" అని నాలో రోషం కలిగేవిధంగా మాటాడారు. కాని ఆ ప్రయత్నంవలనే వాళ్ళకి ఆఖరికి అపజయమే మిగిలింది.

"నేను చెప్పాను: 'మీ సినిమాకి సంగీతం అమర్చడానికి సంగీత విద్వాంసుడు అనవసరం. కొన్ని విదేశీయ రికార్డులు చాలు - లేకపోతే 'మేం సంగీతం సమకూర్చుతున్నాం!' అని వాగే ఏమీ తెలియని మూర్ఖులు చాలు. లేకపోతే మిమ్మల్ని మోసగించాలని పూనుకున్న కొందరు అయోగ్యులు చాలు. నాకు ఈ మూడు వర్గాలలో

వాటా లేదు. దయచేసి నన్ను వదిలేయండి!' అని చెప్పేసాను. ఆ తరువాత వాళ్ళ వ్యాపారంగురించి నాతో మాటాడడం లాభం లేదని వాళ్ళు గ్రహించారు. ఆ దర్శకుడు చాలాసేపు నాతో స్నేహభావంతో మాటాడారు. తరువాత మధ్యాహ్న భోజనంకి తన ప్రత్యేక గదికి అతను నన్ను పిలుచుకొని వెళ్ళారు. అక్కడ తారుమారుగా దుస్తులు ధరించిన ఒక నటికి నన్ను పరిచయం చేసారు. తరువాత తనతో కలిసి మద్యం తాగమని పట్టుబట్టారు. 'నాకు మద్యం తాగే అలవాటు లేనేలేదు' అని నేను నొక్కిచెప్పేసాను.

"'మీరు చూసారే - ఆ రెండు చిత్రాలు - వాటిగురించి మా అభిప్రాయం ఏమిటి?' అని అతను చాలా సంతుష్టితో నన్ను అడిగారు. నేను నా అభిప్రాయం బహిరంగంగా తెలియజేయకుండా, 'నేను film critic కాదు' అని చెప్పాను. అతను అప్పుడు తాగుడుమైకంలో ఉన్నారు. తనే ఆ సినిమాల్లోని మహత్తైన అంశాలగురించి అసహ్యంగా పొగడడం ఆరంభించారు . . .

"నా తలవ్రాత చూసారా? ఇవన్నీ నేను భరించవలసివచ్చింది. అతనికి గభీమని నామీద పట్టరాని కోపం వచ్చేసింది. 'మీరు నన్ను insult చేస్తున్నారు. మీకు పాశ్చాత్య సంగీతం గురించి బాగా తెలుసునేమోగాని మన Indian Music గురించి మీరు చాలా తెలుసుకోవాలి' అన్నారు. 'మీరు Indian Music అంటే దేనిగురించి మాటాడుతున్నారు?' అని నేను అడిగాను: 'Carnatic సంగీతమా? Hindustani సంగీతమా? Paris Club లో వినిపించే సంగీతమా? లేకపోతే మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ జనులు మధ్య మెలిగే సంగీతమా? ఏది Indian Music అని మీరు అంటున్నారు?' అతను నన్ను చూసి పకపకమని నవ్వారు. "మీరింకా గత శతాబ్దంలోనే ఉన్నారు. ఈ యుగంలో Indian Music అంటే సినిమా సంగీతమే! . . . పల్లెలనుంచి మనదేశంలోని కుబేర నగరాల్లో ఈ సినిమా సంగీతం వ్యాపించివుంది. అంత లోతుగా అని ప్రజలమధ్య స్థిరపడిపోయింది' అని అతను అన్నారు.

"అది original music కాదు. అది పాశ్చాత్య సంగీతంనంచి కాపీ చేసిన ఒక చవుకైన అనువాదం!" అని నేను వివరించాను. 'ఇదేం పిచ్చితనం? original గా ఉండాలని ఎవరన్నారు? సినిమాకి original అంటూ ఏమీ లేదు! అది ఒక

International Art! విదేశంనుంచే మనకి film, camera, వస్తున్నాయి, సంగీతం వస్తే ఏం?' అని అతను నాతో తర్కరీతిగా వాదాడారు. నేను ఒక పక్క కోపం, ఇంకొకపక్క విచారంతో పెనుగులాడాను. 'అలాగైతే సినిమా కూడా విదేశీయంనుంచి వస్తోంది, మనం ఎందుకు సినిమాలు తీయాలి?' అని అడిగాను. అతనికి వెంటనే కోపం వచ్చేసింది. 'ఆ సినిమాలు మన ప్రజలకి బోధపడవు. మీలాగ అందరూ పారిస్ నుంచి రాలేదు . . . మన జీవితంని చలన చిత్రంగా చూపిస్తేనే మన ప్రజలకి నచ్చుతుంది" అని అతను అన్నారు. 'మీ చిత్రాలు ఏ జీవితంని ప్రతిఫలించలేదు. నిజం చెప్పాలంటే సినిమా కళ అనే శైలిలో చూస్తే అవి సినిమా కాదు!' అని నా మాటలు విని అతను నన్ను నిరుత్సాహంతో తేరిపారి చూసారు.

"ఆఖరికి అతను నాకు చెప్పారు: 'Mr. సారంగన్! మీతో నేను ఏకీభవించుతున్నాను. మేమెవరూ కీర్తికోసం సినిమాలు తీయడంలేదు, డబ్బుకోసమే తీస్తున్నాం. మీకు డబ్బు కావాలంటే మీరూ బాగా సంపాదించవచ్చు. పారిస్ నుంచి ఇక్కడ వచ్చిన తరువాత మీరు కష్టపడుతున్నారని విన్నాను. కాని నాకిప్పుడు అనిపిస్తోంది - మీరు ఇటువంటి ఆదర్శభావనలతో శుద్ధ idealist గా ఇక్కడ జీవించాలంటే ఇంకా ఎక్కువగా కష్టపడతారు. మీ స్నేహితుడుగా నేను మీకు ఇచ్చే సలహా ఇది: మీరు పారిస్ కే తిరిగి వెళ్ళిపోండి . . . ' అని చెప్పి, అతను ఆ దిండు సోఫాలో కాలు చాటి, గురకతో నిద్రపోయారు.

"నేను చాలాసేపు అక్కడే కూర్చొని చూసాను. బయట వర్షం కురుస్తోంది. ఐనా లెక్క చెయ్యక, పంచెని మడతబెట్టుకొని, బస్ స్టాండువరకూ నడిచివెళ్లి, 25 నంబరు బస్ లో ప్రయాణం చేసి ఇక్కడకి వచ్చాను. ఇక్కడ మెట్లు ఎక్కుతున్నప్పుడే కాలు జారి చెప్పు తెంచుకుంది" అని చెప్పి సారంగన్ చావడిలో కొంచెం సేపు సంచారం చేసాడు.

"Mr. గోపీనాథ్ చెప్పిన మాటల్లో ఎంత అసత్యమున్నా, ఒక సంగతి అతను సరిగ్గానే చెప్పారని నా అభిప్రాయం. 'ఇక్కడ ఉంటే నేనింకా కష్టపడతాను' అన్నది నిజం. నా కుటుంబంనుంచి నేను ఒక penny కూడా - I mean even a paisa - ముట్టుకోను. ఇక

నా రోజువారి ఖర్చులు భరించలేని పరిస్థితిలో నేనేం చెయ్యగలను, చెప్పండి! అందుకే నేను ఈ నిర్ణయంకి వచ్చేసాను. నేను పారిస్ కే వెళ్తున్నాను."

"మీరిప్పుడు బాగా ఆవేశమైపోయి మాటాడుతున్నారు. ఈ మనస్స్థితితో మీరు ఎటువంటి నిర్ణయమూ చెయ్యకూడదు!" అని లలిత వేడుకుంది.

"Mr. సారంగన్, డైరక్టర్ గోపీనాథ్ వాదంకి మీరు జవాబు చెప్పలేదు. 'ఈ రోజుల్లో నవీన సంగీతం అనేది సినిమా సంగీతమే' అని అతను అనడం న్యాయమని నాకనిపిస్తోంది. లక్షలకొలదీ ప్రజలని అది ఆకర్షించుతోంది. దీనిగురించి నవీన సంగీతంని ప్రోత్సహించే మీ అభిప్రాయం ఏమిటని తెలుసుకోవాలనే నేను అడిగాను. అంతకుమించి నాకు దీనిగురించి ఏమీ తెలీదు. కొన్నిరోజులముందు లలిత మీ అలవాటు వలన పాశ్చాత్య సంగీతం రికార్డులు వింటూంటే నేనూ విందామని ప్రయత్నించాను. కాని లాభం లేదు. అందులోని వాద్యసంగీతం వినడానికి బాగుందనిపించింది, కాని పాట ఆరంభమవగానే నాకు నవ్వు వచ్చేసింది. లలిత కోపంతో నన్ను గదికి బయటకి వెళ్ళగొట్టింది. కాని ఈ సినిమా సంగీతం నా చెవులకి ఇంపుగా ఉంది. నాకది చాలా ఇష్టం అని మీకు చెప్తున్నాను. నేను మాత్రం కాదు, మన దేశంలో చాలా మంది నాలాంటివారే. మీరు మమ్మల్ని ఎలాగ ఒప్పించగలరు?"

'మహాలింగం చాలా పామరతనమైన ప్రశ్నలతో సారంగన్ని కలవరపరచుతున్నారు' అని లలిత కనుబొమలు ముడుచుకుంది. కాని సారంగన్ అతని ప్రశ్నలో తన న్యాయం వక్కాణించడానికి అవకాశం దొరికిందనే ఆతురతతో 'ఇది ఒక మంచి ప్రశ్న!' అని అతన్ని పొగడాడు.

"అసలు సినిమా సంగీతం ఈ దేశంలో లక్షలకొలదీ ప్రజల జీవితంలో, హృదయంలో పదిలమైపోయిందని మీరు చెప్పినది నేను అంగీకరించను. మన నగరపరిసరాల్లో జీవించే ప్రజలు, పైపైగా అభిరుచి ఉన్నవారు, స్వదేశాభిమానం లేనివారు, ఏదో శాపంలాగ అది పట్టుకున్న మీలాంటివారికి ఆ వాదం న్యాయంగా కనిపించవచ్చు. కాని ఇందియా జనాభాలో మీరు ఎంత శాతం? సంగీతం విని అనుభవించడానికి 'He has a ear for music' అనే వచనం చెప్తారు. కాని మీరుకూడా అటువంటి 'సంగీతం చెవి' తో దాన్ని వింటున్నారని చెప్పలేం. సినిమాలు చూసే అలవాటు వలన, దానితోబాటు

మీరు తరచుగా ఆ పాటలు రికార్డులలో వినడం వలన, మీ అనుభవంలో ఒక సినిమా నేపథ్యమే ఏర్పడడం వలన, మీకు అది నచ్చింది, అంతే.

"'భారతదేశీయ సంగీతం అంటే సినిమా సంగీతం' అని దయచేసి మీరే మీ మొహంలో కాండ్రించి ఉమ్ముకోవద్దు. మన దేశీయ సంగీతం అనేది గంగానదిలో పడవ నడిపేవాడు పరంపరగా పాడుతున్న పాట; ఇక్కడ మన గ్రామాల్లో - ఏం, ప్రతీ ఇంట్లో - పిల్లలు నిద్రపోవడానికి తల్లులు పాటే జోలపాటలు. అంటే, మానవజీవితాన్ని సంగీతం పూర్తిగా ఆవరించుకుందన్నమాట! ఆకలిని మరిచిపోయి పాప నిద్రపోతోంది! ప్రపంచంలో ప్రతీ చలనం సంగీతంతో కలిసి లయతో పనిచేస్తోంది! మనం చూసే అన్ని వస్తువులలోనూ ఆ స్పందన పాటగా రూపొందడం చూడగలం. కొంచెం నిదానించి చెవుల తీక్షత మెరుగుపరిచి వినండి . . . ఈ క్షణం మీరొక మంచి పాట అనుభవించగలరు . . .

"అదిగో, అదిగో . . . ఒక నిమిషం జాగ్రత్తగా వినండి. నేను చెప్పేది సరే అన్నట్టు ఆ మేపచెట్టు కొమ్మని వానగాలి తరచుగా తోయడంవలన అది ఇంటి పైకప్పుమీద వాలినప్పుడు ఒక సుస్వరమైన ధ్వని వినిపిస్తోంది. ఇలాగే మానవుడి అంతరాత్మలో నిత్యమూ సంగీతం పొంగి పొర్లుతూవుంది. కాని ఆ సంగీతం స్వభావంగా ప్రకృతిలో ఏర్పడిన ధ్వని కాదు. అది మానవుడు కల్పనాశక్తితో, తన కంఠంతో, తన వాద్యాలతో, ప్రకృతికి పోలినట్టు సృష్టించే నాదం! అదే కళ, అతనే కళాకారుడు!"

- సారంగన్ కళ్ళు మూసుకొని, సిగరెట్టు తాగుతూ, తరచుగా నుదుటని తోముకుంటూ ఆ వసారాలో సంచారం చేస్తూ మాటాడాడు. ఇంతలో మద్యం తాగకుండానే అతనికి నిషా బాగా వచ్చేసిందని గ్రహించిన లలిత తొందర తొందరగా లోపలికి పరుగెత్తుకొని వెళ్ళి తన డైరీ తీసుకొని వచ్చి అతని వివరణలు అందులో రాసుకుంది.

"మీరు అభిరుచి గురించి మాటాడారు. పాశ్చాత్య సంగీతం వింటే మీకు నవ్వు వస్తోందని అంటున్నారు . . . అది నాకు అర్థమైంది. ఒక కళాకారుడికి, దాన్ని అనుభవించేవాడికి మధ్య ఎక్కువ భేదం ఉండకూడదు . . . ఆ భేదం ఎక్కువైతే ఆ అభిమానికి ఆ కల్పన వట్టి వెర్రితనంగా కనిపించుతుంది. మీ చెవులకి వింతగాను, వినే

పరిచయం లేకపోవడంవలన మీకు నవ్వాలనిపిస్తోంది. సరే, మన కర్ణాటక సంగీతం ఉందే - అది విని ఎవరూ నవ్వరని మీరంటున్నారా? ఒక సంగీత విద్వాంసుడు మన గ్రామాలకి వెళ్ళి, ఒక కచేరీలో, మన సభలలో పాడే ఒక రాగంని ఆలాపన చేసాడనుకోండి. అది విని మన ప్రజలు అతన్ని చూసి నవ్వుతారు. ఎందుకు? ఆ విద్వాంసుడు - ఉత్తరదేశపు గాయకుడు - మాల్కోష్ రాగంని తన పద్ధతిలో పాడినప్పుడు ఈ నగరం లోని sophisticated శ్రోతలు నవ్వడం నేను చూసాను! కాని మీకు తీరా పరిచయంలేని ఒక ప్రాశ్చాత్య melodyని, పాటని, అలాగే కాపీచేసి, ఎటువంటి పొంతనలేని సన్నివేశంలో దాన్ని అంటించి సినిమాద్వారా మీకు ఇస్తే మీరు దాన్ని అంగీకరిస్తారు, అవునా?

"కర్ణాటక సంగీతం ఈ సమాజంలో ఒక సనాతనిలాగ, ఎవరినీ తాకకుండా, ఒక మూల ఓరగా నిలబడివుంది. ఈ రోజుల్లో, గ్రామాల్లో మనం వింటున్న జానపదగేయాల ఆధారంతో వికసించిన కర్ణాటక సంగీతంలోని రాగాల గురించి సంగీత ప్రవిణులు చాలా రాసివున్నారు. అంటే ఒక classical కళకి, అంత మేరకు పామర జనుల సంగీత సాధనాలతో పొత్తు ఉంది! 'ఒక నవీన సంగీతం', 'ఒక నవీన కళ' అని మనం అన్నప్పుడు దానికి పురాతన సంగీతగురుతులతో సంబంధం ఉందని గ్రహించాలి. కాని ఇవాళ మన కళలు, సంగీత సాహిత్యం అన్నీ దేనికీ చెందకుండా ఒక మధ్యతరవర్గంలో పడిపోయాయి! ఇలాంటి middle way వలన చాలా అపాయముంది . . . మన కళాభిమానంకి ఎది అనుగుణమో, అదే మన అంతరాత్మ ప్రతిఫలించాలి.

"నేను అడుగుతున్నాను: మన ఇతిహాసాల్లో, మన పురాతన సమాజంలో, ప్రజలు జీవించిన శైలిని మనం ఇప్పుడు ఆమోదించడం సాధ్యమా? కాని మనం అటువంటి తలంపుతో - మన భావన ఒకటి, మన చర్య ఒకటిగా -మనల్ని మనమే మోసగించుకొని జీవిస్తున్నాం.

"మా నాన్నగారిని తీసుకోండి. మనదేశ సంగీతం అంటే అది పూజ్యమైన ఒకటి అని అతని అభిప్రాయం. కాని మన దైనిక వ్యవహారాల్లో ఆ సినిమా సంగీతం ఎంతవరకు మన సంస్కృతిని పాడు చేస్తోందని అతనికి తెలీదు; దానిగురించి అతనికి ఏ బాధా లేదు. కాని జీవితంకి సంగీతం అగత్యం - సుఖవాసులకి మాత్రం కాదు,

కష్టజీవులకికూడా అది భోజనంలాగ కావాలి. కాలంకి తగినట్టు మన పురాతన సంగీతం పునస్సృష్టి పొంది, అష్టదిశలలో వ్యాపించి, నవీనత లేకుండా, సనాతనంతో వర్ధిల్లడం వలనే సినిమా సంగీతం మన రోజువారీ జీవితంకి అవశ్యకమైపోయింది! ఇదెలాగ ఉందంటే వివాహమనే ఒక హిందు సిద్ధాంతంని అనుసరించి రద్దుచెయ్యలేని ఒక బంధంలో చిక్కున్న ఒక యువతి, తనకి అగత్యమైన పారంపర్య ఘనతని బాహాటంగా వదులుకోకుండా రహస్యంగా దాంపత్యద్రోహం చేస్తున్నట్టుంది. 'ఇదే మన హిందూ నీతిప్రవర్తన!' అంటే ఎలాగ? దానికి బదులు ఆ చిక్కుని తొలగించడానికి 'ఇదే నిజమైన నీతిప్రవర్తన!' అని ఆ దుష్ట బంధంని రద్దుచేసుకొని, కొత్త జీవితంని అంగీకరించే విదేశీయ, నవీన పథకం నాకు గొప్పగా కనిపిస్తోంది.

"మన పురాతన సంగీతంలో ఘనత, ప్రాశ్చాత్య సంగీతంలో ఘనత, నూతనత్వం ఉన్నాయి. మీరు పొగడుతున్న మన సినిమా సంగీతం అక్రమంగా మనం చేస్తున్న ఒక వ్యవహారం, మరేంకాదు. నా లక్ష్యం మన పురాతన సంగీతంని ఆధునీకరించడం. దానికి ఇతర దేశాలసంగీతంనుంచి మనం ఎంత నేర్చుకోవాలో అంతవరకూ మనం నేర్చుకోవాలి. కాని ఇప్పుడున్న పరిస్థితిలో అది అంతగా సాధ్యం కాదని నాకు బోధపడింది. అందుకే నేను నా అభిప్రాయాలు తెలియజేసి ఇక్కడనుంచి జారుకోవాలని నిశ్చయించాను. 'నా ఉద్యమం ఆరంభించడానికి ముందే నేను ఓడిపోయాను' అని నేను అనను. ఎందుకంటే నా ప్రయత్నంకి అడ్డుగా ఉన్నవి నా విదేశీయ ధోరణీలు. నేనేమో ఏదో అన్యదేశంనుంచి వచ్చి ఈ భూమిలో నిలబడలేక ఏవో గాలిమేడలు కట్టాలని కోరుతున్నానని కొందరికి నామీద అనుమానం ఉంది. ఏది ఎలాగున్నా నాకు ఈ జీవితంపై నమ్మకం ఉంది. నానావిధ ఘట్టాలు దాటిన, నేను నమ్ముతున్న, ఇక్కడ 'ఇందియా నవీన సంగీతం' తప్పకుండా రూపమేర్పడం జరుగుతోంది, జరుగబోతుంది' అనే నమ్మకంతో నాకు కొంతవరకు పరిచయమైన పారిస్కి వెళ్లిపోవాలని నిశ్చయించాను."

సారంగన్ మాటాడి ముగించేవరకు వాళ్ళ ఇద్దరిని చూడకుండా సంచారం చేస్తూనేవున్నాడు.

అతనికి ఏ జవాబూ చెప్పలేక మౌనంగా కూర్చున్న మహాలింగం చాలాసేపు తరువాత నిట్టూర్పు వదిలి చెప్పారు:

“మీ అభిప్రాయాలు ఆమోదించడానికి నాకు ధైర్యం లేదు, బలమూ లేదు. కాని, Mr. సారంగన్, నిజంగా మీరొక Revolutionary!”

లలిత మొహం పూర్తిగా ఎర్రబారిపోయింది; కళ్ళు చెమ్మగిల్లాయి.

వెళ్ళేముందు సారంగన్ ఎంత నిశితమైన బల్లెంని లోతుగా ఆమె హృదయంలో ముంచాడని అతనికి తెలియకపోయినా, లలిత ఆ యాతన బాహటంగా తెలియజేయకుండా లోలోపల చిత్రవధ అనుభవించింది.

కొన్నిరోజులముందు ఒక రోజు ఆమెతో సారంగన్ చెప్పిన విడాకుల సలహాని తను నిరాకరించడంవలనే ఇంత క్రూరంగా అతను తన మనసుని నొప్పించుతున్నాడని లలిత మనసార నమ్మింది.

సారంగన్ వాడిన ‘దాంపత్యద్రోహం’ అనే వార్త ఆమె గుర్తుచేసుకుంది. అది విని మనసు నొచ్చుకున్నా, ‘అవును, అది నిజమే కదా?’ అని గ్రహించడంవలన ఆమె కళ్ళు తడిసిపోయాయి; మహాలింగంకి తెలియకుండా తుడుచుకుంది.

“ఇంతకుముందు అటువంటి శోచనీయ ఘటనలలో ఆ నీచులు దాన్ని ‘ప్రేమ’ అని పిలిచారు. నేను నా జీవితంలో మొట్టమొదటిసారి ఒకతని ప్రేమించాను. అతనే దాన్ని దాంపత్యద్రోహం అని అంటున్నారు’ అని వాపోయినప్పుడు ఆమె హృదయం నలిగిపోయింది. ‘ఇంకా కొంచెంసేపు ఇక్కడ ఉంటే, మహాలింగం ఉన్నారనే సంగతి మరిచిపోయి నేను వెక్కి వెక్కి ఏడుస్తానేమో?’ అని భయపడి, ప్రయాసతో, తన్ను సర్దుకొని, మెల్లగా లేచి, లలిత తన గదికి వెళ్ళింది.

సారంగన్ ఆమెతో సెలవు పుచ్చుకొని వెళ్ళినప్పుడు లలిత నోటిలోనుంచి ఏ మాటా పెగల్లేదు. ఇక్కడ తన ప్రయత్నాలన్నీ విఫలమై, తన్ను మళ్ళీ పారిస్ కి తరుముతున్న కారణం వలన మనస్సు కుంగిపోయిన సారంగన్ ఆమె వేదన గ్రహించలేకపోయాడు. సారంగన్ని అతని ఇంటిలో దింపేసి తిరిగివచ్చిన మహాలింగం హాలలో లలిత కనిపించలేదని, వంటమనిషి మణి అయ్యర్ని “లలితా భోంచేసిందా?” అని అడిగారు.

“లేదు. మీరు వెళ్ళిన తరువాత ఆవిడ మేడదిగి రాలేదు అని మణి అయ్యర్ చెప్పగానే అతను మేడమీదకి వెళ్ళారు.

మూసిన తలుపుని అతను లేతగా తట్టారు.

“లలితా, లలితా, ఏమిటి, అప్పుడే నిద్రపోతున్నావా?”

లోపల, పైకప్పుని తేరిపారి చూస్తూ, మంచంలో పండుకొని, కన్నీరు కార్చుతూ, తన శోచనీయ, స్త్రీజన్మగురించి లలిత ఆలోచిస్తోంది.

అతను రెండుసార్లు తలుపు తట్టారు.

“ఇదిగో వస్తున్నాను . . . ” అని చెప్పి, లలిత అద్దంముందు నిలబడి మొహం తుడుచుకొని, లేతగా పౌడరు వేసుకొని, వికసించిన మొహంతో తలుపు తెరిచింది.

బయట మళ్ళీ వర్షం కురవడం ఆరంభించింది.

“ఏం నిద్ర ఇప్పుడు?” అని ఆమెని అతను కౌగిలించుకున్నారు.

“లేదు . . . లోపల మొహం తుడుచుకున్నాను . . . ”

ఆలింగనంతోనే ఇద్దరూ పడకమీద కూర్చున్నారు. “మణి అయ్యర్ కాచుకొనివున్నారు . . . రా, భోంచేద్దాం . . . ” అని అతను అమెని తొందరపెట్టారు.

“హూం, నాకు ఆకలి లేదు . . . సారంగన్ నా మనసుని చెల్లాచెదరు చేసేసారు. అతను ఇంత pessimist గా ఉంటారని నేను నమ్మలేకున్నాను.”

“అతన్ని pessimist అనకు. ఒక విప్లవకారుడు అత సులభంగా నలిగిపోవడం జరగదు. ఏమైనా సరే, అతను పారిసి కి తిరిగి వెళ్ళడం సరే అని నేను ఒప్పుకోను.”

ఇప్పుడు ఇద్దరూ పడకమీద చేరువలో ఉన్నారు. చుబుకంని రెండు చేతులతో తాకుతూ. తల వొంచి, గూఢంగా ఆలోచిస్తున్న లలితని మహాలింగం రెప్పవాల్చకుండా చూసారు. ‘సారంగన్ అభిప్రాయాలతో, అతని సంగీత ప్రజ్ఞతో ఆమె మనస్సు ఎంత లోతుగా వశమైపోయింది’ అనే యోచన మించి అతని మనస్సులో మరేంలేదు.

“లలితా, దీనిగురుంచి అతనితో మాట్లాడి మనం అతను పారిస్ వెళ్లే ప్లాను మార్చగలం అని నాకనిపిస్తోంది.”

“Never! నాకలా తోచలేదు. అతను ఇక్కడ ఉండడానికి, ఆ కుటుంబంలో, సమాజంలో, అతనికి ఎటువంటి అగత్యమూ లేదే? ఈ కుటుంబం అతన్ని

తరుముతోంది, ఈ సమాజమూ తరుముతోంది . . . అతన్ని కౌగిలించి ఆపడానికి ఇక్కడ ఎవరున్నారు?”

“ఏం, మనం లేమా? మనమిద్దరం కలిసి అతన్ని పట్టుకుందాం . . . సరే, సంగీతం గురించి ఏదో పుస్తకం రాయాలని మీరు చాలా రోజులు కూర్చొని రాసారే, అది ఏమైంది? ఓ, అదే ‘మనోన్మణియం’ పత్రికలో ధారావాహికంగా వస్తోందా?” అని చాలా ఉత్సాహంతో మాటాడుతున్న మహాలింగం “క్రమంగా అన్నీ జరుగుతాయిలే, నువ్వేం బాధపడకు” అని వీపుమీద తట్టి, ఆమెని ఊఱడించి, తనతో రమ్మన్నారు.

లలిత అతని భుజంని గట్టిగా పట్టుకుంది. నిష్కపటమైన అతని ఉదాత్త గుణాలు తలపోయగానే అతని కాళ్ళముందు పడిపోవాలనిపించింది.

మేడమెట్లు దిగుతున్నప్పుడు ఆమె అతన్ని గభీమని కౌగిలించుకొని ముద్దుపెట్టుకుంది.

“Come on . . . ” అని ఆవెశంతో మహాలింగం ఆమెని కౌగిలించుకొని, రెండు చేతులతో ఎత్తుకొని, మెట్లు దిగారు.

“ష్ . . . మణి అయ్యర్ . . . ” అని దిగులుతో లలిత అతని చేతులనుంచి మెల్లగా జారుకొని కందకి దిగింది.

బయట, నిదానమైన వర్షం తీవ్రమైంది.

## 10

సారంగన్ మొండితనంకి పూర్తి స్వరూపంగా మారిపోయాడు.

ఎవరితోనైనా, దేనిగురించైనా, ఒక దీర్ఘమైన వివాదంకి సిద్ధమైన అతను ఎవరు ఏం చెప్పినా ఆఖరివరకూ చిరచిరలాడుతూ, మౌనంగా వింటూ, ఆఖరికి వారి సలహా నిరాకరించడం అలవాటు చేసుకున్నాడు.

కుటుంబ బాధ్యతలు పూనుకున్నతరువాత తన చమత్కారం, రాజీపడే గుణంతో రాజం మనసు గెలిచి, శేషయ్యమీద వేసిన దావానికూడా నరసింహన్ వాపసు చెయ్యడానికి నచ్చచెప్పిన లక్ష్మి సారంగన్ హఠంని మాత్రం పడగొట్టలేకపోయింది.

ఆమె ఎంత బలిమాలినా సారంగన్ మూర్ఖపట్టుతో తోట ఇల్లు విద్యుత్తంతులు తెగతెంచుకున్నాడు.

ఈ నెల పూర్తిగా సారంగన్ తన పెర్మిట్ తో మద్యం కొనలేదు. నాటుసరకు మద్యమే అమితంగా తాగడంవలన అతని దేహమూ నీరసించిపోయింది. కిందటి నెల కుంభ వర్షం కురిసిన ఒక దినం నిర్మాత/దర్శకుడు గోపీనాథ్ని చూసి వచ్చాడే, ఆ తరువాత ఒక వారం వరకూ సారంగన్ లలిత, మహాలింగం దంపతులని చూడనేలేదు.

ఉద్యోగరీతిగా తను ఎంత పనితొందరలోవున్నా, మహాలింగం ప్రతీరోజు, సాయంకాలం ఇంటికి తిరిగివచ్చినప్పుడెల్లా సారంగన్ గురించి లలితని అడిగి తెలుసుకున్నారు.

ప్రతీ నిమిషం సారంగన్ని చూడాలని లలిత మనస్సులో తపించుపోతున్నా స్త్రీజాతికి తగిన ఉపేక్ష కొన్ని రోజులు ఆమెని ఆటంకపరిచింది; కాని ఆఖరికి ఆమె హఠంకి అదీ ఓడిపోయింది.

కిందటి నెల ఒక రోజు మధ్యాహ్నం రెండు గంటలకి లలిత తన్ను మించిన ఒక ఉద్రేకంతో సారంగన్ని వెతుక్కుంటూ వచ్చింది.

మూసివున్న తోట ఇల్లు తలుపుని జంకుతూ ఆమె తేలికగా తట్టినప్పుడు, అలవాటుగా తనే లేచి వచ్చి ఉత్సాహంతో తలుపు తెరిచే సారంగన్ నాగరికతకూడా ఇప్పుడు మాసిపోయింది; “Who is that?” అని కఠినమైన అధికార ధ్వని వినిపించింది.

‘ఒక వేళ ఇప్పుడు సారంగన్ లోపల లేరేమో?’ అని లలిత ఒక క్షణం అనుమానించింది. ‘ఇలాగే వెళ్ళిపోదామా?’ అని అసమ్మతంగా, ఆమె కాళ్ళు వెనకాడాయి. కాని స్వయంప్రజ్ఞ లేకుండా వేళ్ళు తలుపుని మళ్ళీ లేతగా తట్టాయి.

చిరచిరలాడుతూ “I say, who’s that?” అని విసుగ్గుంటూ సారంగన్ సద్దుగా తలుపు తెరిచాడు. ఒక క్షణం ఇద్దరూ ఒకరినొకరు చూసి స్తంబించిపోయారు.

“Please come in . . .” అని దీనమైన స్వరంతో సారంగన్ ఆమెకి స్వాగతం చెప్పాడు. అతన్ని వెంబడించి లోపలికి వచ్చిన లలిత ‘ఈ ఒక వారంలో ఇతనెలా కృశించిపోయారు!’ అనే ఆలోచనతో తహతహలాడింది.

ఆ ముందుగది బూజు, దూళితో, నేలమీద చెల్లాచెదరైన, పుస్తకాలతో కానవచ్చింది; కాల్చి పారేసిన సిగరెట్టు తునకలు చిందరవందరగా లలిత చూసింది.

ముందటి రాత్రి అమితంగా తాగి కక్కేసిన తరువాత సారంగన్ తనే శుభ్రం చేసుకున్న ఆ ఒంటరి సోఫా చూడడానికే అసహ్యంగా, మఱకబడి, మూగుతున్న ఈగలగుంపుతో ఉంది. అది గమనించక లలిత ఆ సోఫాలో కూర్చోవాలని ప్రయత్నించినప్పుడు, "Please, don't!" అని సారంగన్ ఆమెని అడ్డగించాడు. 'సరే, ఇక మనల్ని ఇలాగే నిలబెట్టి, మాటలాడి, వెళ్ళగొట్టాలని ఇతని పధకం కాబోలు!' అని లలిత నివ్వెఱపడినప్పుడు, "ఈ సోఫాలో కూర్చోండి" అని ఆమెకి చెప్పి, లోపలికి వెళ్ళి మొహం కడుక్కొని సారంగన్ తిరిగి వచ్చాడు.

'నాకు బాగా పరిచయమైన, సొంతమైన ఈ జాగా ఇప్పుడు ఎంత విరసంగా కనిపిస్తోంది? ఇతనికి నేనంటే ఎందుకు పగ, దానికి కారణం ఏమిటి?' అని తలపోస్తూ లలిత నిట్టూర్పు వదిలింది. 'నన్ను భ్రష్టురాలు  అని బాహాటంగా ఖండించి, ఒక వారంగా నన్ను ఊరడించకుండా మరిచిపోయిన ఇతన్ని వెతుక్కుంటూ నేను రావడం నేను చేస్తున్న  ఒక పెద్ద పొరబాటు. నా స్త్రీత్వం, లజ్జ, హఠం, మానసిక స్థిరత్వం అన్నీ వదిలేసి నేనెందుకు ఇతని పాదాలలో శరణు కోరుతున్నాను?' అనే తలంపు రాగానే ఆ క్షణమే పారిపోవాలని ఆమెకి తోచింది.

"I am sorry . . . ఇలాంటి అసహజమైన స్థితిలో మీకు స్వాగతం చెప్పే నన్ను క్షమించండి . . . " అని అంటూ సారంగన్ వేరొక సోఫాలో కూర్చున్నాడు.

ఆమె మౌనంగా అతన్ని చూస్తూనేవుంది.

అతని మొహం బాగా తెల్లబారిపోయి చాలా సేపు ఒకే తీరులో నిద్రపోవడం వలన బుగ్గలమీద, చెవుల మూల, పడక మడత పదిలమైపోయి ఎర్రగా కనిపించింది. మొహం ముడుచుకొనివుండడం వలన అతని చిన్న కళ్ళు  కొంచెం పెద్దగానూ,  రెండు కన్నుల కింద కాటిక పూసినట్టు నలుపు వలయమూ కనిపించాయి. క్షవరం లేకుండా లేతగా పెండ్రుకలు కనిపించిన మొహంలో కొన్ని చోట్ల నెరసినట్టు కనిపించింది. ఆమె తన్నే చూడడం గ్రహించి సారంగన్ చిరునవ్వు నవ్వాడు. కాని ఆ నవ్వులో ఆమెకి అలవాటుగా కనిపించే ఆహ్లాదం లేదు.

ఆమె అతన్ని మౌనంగా చూస్తూనేవుంది.

ఆమె మౌన చూపు తాళలేక సారంగన్ కళ్ళు రెండుసార్లు కిందకి జారాయి.

'నేను చాలారోజులుగా ఈమెని చూడలేదని బాధపడుతోంది. అనాలోచితంగా నేను ఆమె మనస్సు నొప్పించాను . . . ' అనే తలంపుతో సారంగన్ తల గోకుకున్నాడు. తరువాత తలెత్తి ఆమెని చూసి చిరునవ్వుతో "లలితా, ఇటీవల నా మనస్సు సరిగ్గా లేదు. మీరైనా నన్ను చూడడానికి వస్తారని చాలాసార్లు ఆలోచించాను. నేను రాలేదని మీరు బాధపడడం న్యాయమైతే, మీరు రాలేదని నేనూ బాధపడతాను!" అని గదమాయించుతున్నట్టు బొటనవేలుని ఊపాడు.

లలిత మౌనంగా అతన్ని చూస్తూనేవుంది.

సారంగన్ లేచి వెళ్ళి ఒక సిగరెట్టు వెలిగించుకొని సోఫాలో కూర్చున్నాడు.ఈ ఎడబాటులో ఆమె ఏమైనా మాట్లాడుతుందా అని ఆమె కంఠధ్వనిని ఎదురుచూస్తూ అతను ఆమె మొహం చూడలేదు.

పొగ ఊదుతూ, తలెత్తి చూసి 'ఈమెకి నేనంటే ఎందుకు కోపం?' అని అతను ఒక నిమిషం ఆలోచించాడు.

"లలితా, మీరెందుకు మాటాడకుండా ఉన్నారు? మీకెందుకు నేనంటే కోపం?" అని స్వరం తగ్గించి సారంగన్ అడిగాడు.

"ఓ, మిమ్మల్ని సంప్రతించకుండా నేను పారిస్ వెళ్ళడం నిర్ణయించానని మీకు కోపమా? అది న్యాయమే . . . కాని ఇంతవరకూ మీరు ఇంకొకరి భార్య . . . నేనెలాగ మిమ్మల్ని బలవంతంగా ఈడ్చుకొని పారిస్ వెళ్ళడం సాధ్యం? మీకు జ్ఞాపకం ఉందా, మీరు మీ భర్తతో విడాకులగురించి సంప్రతించాలని నేను ఎన్నోసార్లు చెప్పాను . . . నేను ఒకసారి విడాకులగురించి మాటాడినప్పుడు మీరు 'దీనిగురించి నేను మాటాడవలసినది Mr. మహాలింగంతో!' అని మొరటుగా నాకు జవాబు చెప్పారు. ఆ తరువాత నేను మళ్ళీ దానిగురించి మిమ్మల్ని అడిగితే అది అనాగరిత కదా? మీరు మీ విడాకులు గురించి ఎవరితో సంప్రతించాలో అది చెయ్యనేలేదు. అందువలన నేను నా పారిస్ తిరుగు ప్రయాణం గురించి తలపోసినప్పుడు మీగురించి ఆలోచించడానికి నాకు హక్కులేదని గ్రహించాను . . . ఇప్పుడుకూడా . . . It is not too late! . . . లలితా,

వినండి . . . త్వరలో మీరు మీ విడాకులు గురించి ఒక నిర్ణయంకి వచ్చారంటే మనిద్దరం పారిస్ ప్రయాణం గురించి ఆలోచించగలం. ఆహా, అది ఎంత ఆహ్లాదమైన కల్పన! మీరు పారిస్ నగర జీవితం గురించి రాయవచ్చు - పారిస్ నుంచి తమిళ సాహిత్యంకి మీరు చేసే సేవ అపూర్వంగా ఉంటుంది . . . ఇవన్నీ తరువాత . . . ముందు మీ విడాకులు గురించి ఒక ఏర్పాటు ముఖ్యం . . . మీరు దానిగురించి ఏమిటి ఆలోచిస్తున్నారని నాకు తెలీదు . . . చెప్పండి, మీ మౌనంకి అర్థం ఏమిటి? My goodness, నా మనసు పడుతున్న బాధలు చాలవా? లలితా, నాతో మాటాడండి, ఈ మౌనం నేను సహించలేను!" అని ఆమెతో రహస్యంగా మాటాడుతున్నట్టు సారంగన్ ఆమె కూర్చున్న జంట సోఫాదగ్గరకి వచ్చాడు.

ఆమె మౌనంగా అతని మొహం తేరిపారి చూసింది. అతను, ఆమెని సమీపించి చూసినప్పుడు ఆమె కన్నులు చెమ్మగిల్లడం గమనించాడు.

"Oh, Lalitha, my dream, my child . . . " అని పిచ్చిమాటలాడుతూ సారంగన్ ఆమె భుజంని తాకి, కౌగిలించుకొని, నేలమీద కూర్చొని బతిమాలాడు:

"నా జీవితంలో ఆఖరిగా జొరపడిన ఆడది మీరే! 'మనమిద్దరం కలిసివున్నాం' అనే తలంపుతోనే నా జీవితం సఫలమైందని నేను సంతోషిస్తాను . . . కాని మనమిద్దరం ఒకరినొకరు పూర్తిగా ప్రేమించామనడానికి ఒకే ఒక రుజువు - మనం ఎక్కడున్నా ఆ ప్రేమ పూర్ణతకి హాని రాకూడదు! అవును, నేను చెప్పేది మీకు బోధపడిందా?" అని హడలెత్తిన కళ్ళతో, వొణుకుతున్న పెదిమలతో ఆమెని చూసాడు. గభీమని, ఆవేశంతో, ఆమె ఒడిలో తల దోపుకొని, ఆమెని గట్టిగా కౌగిలించుకొని, అర్థంకాని మాటలతో వాపోయాడు.

లలిత కూడా మౌనం మానుకుంది.

బిగువుగా మూసిన కన్నులనుంచి ధారధారగా కన్నీరు కార్చుతూ, లలితా ఒడిలో వాలిన సారంగన్ తలని పైకెత్తి, తన తలమీద పెట్టుకొని తనూ ఏడ్చింది. రెండు దేహాలూ కలిసి ఒక ప్రాణమైపోయినట్టు, బ్రతుకు, జడిమ మధ్య చిక్కుకొని ఇద్దరూ పెనగులాడారు.

గదిలోని గడియారంలో పైకప్పులోని తలుపుని తెరుచుకున్న ఆ పిట్ట బయటకి తల చాటి మూడుసార్లు పిలిచింది.

"నేను ప్రతీరోజు దానిగురించి ఆలోచించి అతనితో ఎలా మాటాడడం అని తెలియక కలవరపడ్డాను. ఇప్పుడుకూడా అతనిలాంటి ఉత్తమ జీవినుంచి కలిగే ఎడబాటు జ్ఞాపకం నేను స్వర్గంలో ఉన్నప్పుడు వచ్చినా, నా సంతోషంలో శూన్యం కలిసిపోతుందనిపిస్తోంది. ఎలాగైనా దీనిగురించి నేనొక నిర్ణయంకి వచ్చితీరాలి. మీకు గుర్తుందా? అవాళ మీరు నన్ను దాంపత్యద్రోహంకి ఒక నిదర్శనంగా వర్ణించారు. అది విని ముందు నేను బాధపడ్డాను, కాని మీరు కటువైన ఒక సత్యంని నాకు నిర్మొహమాటంగా చూపారని నేను సంతోషించాను. అవును, నేను నిశ్చయం చెయ్యాలి, దానికి నాకు కొంచెం సమయం కావాలి . . . " అని చాలాసేపు ప్రయాసపడుతూ లలిత వివరించింది.

ఆమెకి దగ్గరగా కూర్చున్న సారంగన్ ఆమె మొహంని తనవైపు మళ్ళించి చెప్పాడు:

"మీరు ఎన్నిరోజులు తీసుకున్నా సరే. అంతవరకు నేను నా పారిస్ ప్రయాణం ఆపుతాను. ఈ జీవితం ఎంత దుఃఖకరమైనా నేను సహించుకొని మీకోసం కాచుకొనివుంటాను."

త్వరలో మహాలింగం - లలితా మధ్య విడాకులు గురించి వాళ్ళిద్దరూ నిర్ణయించి ఇరవై రోజులు ఐపోయాయి.

ఈ ఇరవై రోజుల ఎడబాటులో సారంగన్, లలిత తరచుగా కలుసుకున్నారు. కాని ఇద్దరూ మొండిగా ఒకరికొకరు దూరంగానే మెలిగారు.

** ** **

చలనచిత్రం ముగింపు తరువాత, రంగస్థలంనుంచి బయటకి రావడానికి ఆటంకంగా వర్షం కురుస్తోంది. రంగస్థలం అన్ని ద్వారాల్లోనూ జనులు గుమిగూడి ఉన్నారు.

ఇంగ్లీషు చలన చిత్రాలు మాత్రం చూపే ఆ రంగస్థలం నగరం మధ్య ఒక ప్రధాన వీధిలో ఉంది. దాని పరిసరాల్లో జన సమ్మర్దం పెరిగి, ఎత్తయిన భవనాలు ఉన్నా, రంగస్థలంకి వచ్చే ప్రేక్షకుల వాహనాలకని ప్రత్యేకంగా అక్కడ చోటు లేదు. కాని

రంగస్థలంకి ఎదుట నాలుగు పక్కలా వాహనాలు వక్రగతిలో ప్రయాణం చెయ్యడానికి వసతిగా వృత్తాకారంలో ఒక స్థలంని నగర స్థానిక సంఘంవారు అమర్చివున్నారు. ఆ బహిరంగ స్థలమే రంగస్థలంకి parking garage గా ఐపోయింది.

ఆ జన సమూహం, సందడికి దూరంగా, గోడకి సమీపంలో Anna Karenina అని ఇవాళ చిత్రం గురించి బోర్డులో రాసివుంది. దానికి సమీపంలో నిలబడివున్న మహాలింగం, లలిత దంపతుల మధ్య ఏదైనా ఘర్షణ కనిపిస్తోందా?

మహాలింగం మొహం చూస్తే అలాగేం లేదు. అతని పెద్ద కన్నులు ఉత్సాహంతో గుంపులని చూస్తూ, ఆనందిస్తున్నాయి. పెదవులమధ్య ఉన్న సిగరెట్టుని గూఢంగా పీల్చుతూ కోటు జేబులలో చేతులు పోనిచ్చి చలిలో అతను వర్షంని అనుభవిస్తున్నారు.

పట్టుచీర కొనని బాగా లాగ్గొని, మొహంని కప్పుకొని, లలితా మాత్రం అతనితో జగడమాడే ధోరణిలో - ఈ ప్రపంచంని చూడడానికి ఇష్టం లేనట్టు - తల వొంచి నిల్చొనివుంది.

మహాలింగం కొంచెం దూరం జరిగి, వర్షం ఆగిందా అని చెయి చాటి చూసారు. తరువాత తడమాడుతూ ఆమె దగ్గరకి వచ్చారు.

“నువ్వు ‘ఇవాళ వద్దు!’ అని చెప్పినా నేను మొండిగా నిన్ను ఈడ్చుకొని వచ్చేసాను . . . మనం వర్షంలో బాగా చిక్కుకున్నాం . . . నీకు నామీద కోపం కదూ?”

లలిత మొహంలోని భావనలన్నీ గభీమని మాయమై, నిగనిగమని చిరునవ్వు కనిపించింది.

“ఎవరికి కోపం? మీరేమంటున్నారు? . . . వర్షం వచ్చేసిందని అన్నాను . . . ఎంత అద్భుతమైన చిత్రం!” అని నిట్టూర్పు వదిలింది.

“లలితా, అదిగో చూడు, మన సారంగన్! . . . చెయిలో గొడుగుతో కనిపిస్తున్నారు! . . . Mr. సారంగన్!” అని చేతులు తట్టి మహాలింగం పిలిచారు.

లలిత తన సమీపంలోవున్న Anna Karenina పోస్టర్ లో విరాన్స్కీ పఠం చూస్తూవుంది.

దూరంలో చింపిరి జుత్తు, ఖదరు జిబ్బాతో, కలలు కంటున్న కన్నులతో, వర్షంని, దాని సంగీతంని అనుభవించుతున్న సారంగన్ తిరిగి చూసి వీళ్ళని సమీపించాడు.

"సాయంకాలం మీ ఇంటికి వెళ్ళాను. మీరు సినిమాకి వెళ్ళారని మణి అయ్యర్ చెప్పారు. బయట మీ కారు చూసాను. సినిమా అవగానే కారు దగ్గరకి రాగానే మిమ్మల్ని చూడవచ్చు అని కాచుకొనివున్నాను" అని అంటూ సారంగన్ గొడుగుని మడిచాడు.

తరువాత గొడుగులోకి మహాలింగంని రమ్మని పిలిచి అతనితో నడిచివెళ్ళి సారంగన్ కారులో అతన్ని చేర్చాడు. రెండవ నడకలో లలితాతో వెళ్ళాలని అతను తిరిగివచ్చినప్పుడు - తనలాగే ఒక శోచనీయమైన ప్రేమ వ్యవహారంలో చిక్కుకున్న ఆ కథానాయకి అన్నాని తలపోస్తూ, ఆవేశపూరితమై, ఎర్రబారిన మొహంతో నిల్చున్న లలితా - ఒక క్షణంలో తన భావనలు అణచుకొని, అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది.

సారంగన్ చూపు చాలా దూరంనుంచే ఆమెని విద్యుత్కిరణంలాగ అదరగొట్టింది.

దగ్గరకి రాగానే ఆమెతో రాజీపడినట్టు అతనూ, సమాధానపడినట్టు ఆమె, ఒకరినొకరు చూసుకున్నారు.

ఇద్దరూ గొడుగులో సమీపించినప్పుడు "Film music ఎలాగుందని చూసారా?" అని సారంగన్ లలితని అడిగాడు. అదే సమయం 'ఈ చిత్రంలో పాత్ర చిత్రీకరణ ఎంత అద్భుతంగా ఉంది!' అని ఆమె తనలో మెచ్చుకుంది.

కారులో వాళ్ళ సంభాషణ Tolstoy, Anna Karenna గురించి మళ్ళింది. మహాలింగం, లలితా మాత్రం మాట్లాడుకున్నారు. సారంగన్ ఈ ప్రపంచంలోనే లేనట్టు కారు ముందున్న అద్దాలని చెదరిగొట్టే వర్షంని, కుడి ఎడమలు కదలుతూ 'క్రిక్', 'క్రిక్' అని ధ్వని చేస్తున్న wipersని చూస్తున్నాడు. ఇళ్ళు, చెట్లు, వీధులు, దీపాలు, మనుషులు, వాటి నీడలు పొగపాటిన ఒక పురాతన గోడమీద రాసిన చిత్రాలుగా ఆ అద్దంలో కనిపించినప్పుడు అతనికి ఒక modern painting గుర్తుకి వచ్చింది.

"చాలా అద్భుతమైన చిత్రం! కొన్ని చోట్ల నాకు తెలియకుండానే ఏడుపు వచ్చేసింది!" అని కారుని నడుపుతూ వెనుకనున్న లలితకి చెప్పారు మహాలింగం.

ఒక క్షణం మౌనం తరువాత లలిత నవ్వింది.

“ఎందుకు నవ్వుతున్నావ్?”

“మీకే వింతగా లేదు? సీతా, కణ్ణగి, నళాయిణి వంటి పతివ్రతలకి సానుభూతి చూపే మనల్ని ఆ టాల్స్టాయి ఒక పాడైన, భార్యకోసం ఏడిపించడం మీకు ఆశ్చర్యంగా లేదూ?” అని ఇంగ్లీషులో అతన్ని లలిత అడిగింది.

“అందుకోసం ఎవరైనా అన్నా పాత్రని ద్వేషించగలరా?”

“నాకు అన్నామీద జాలి కలుగుతోంది. కాని నా సానుభూతి అన్నాకంటే ఆమె భర్తకే . . . ” అన్నారు మహాలింగం. “Mr. సారంగన్, మీరు చెప్పండి. ఈ కథలో మీ సానుభూతి ఎవరికి?” అని పక్కనవున్న సారంగన్ని అతను అడిగారు.

“నా సానుభూతి Tolstoy కే” అని సారంగన్ చెప్పడం విని లలిత బిగ్గరగా నవ్వింది: “ఇది చాలా విచిత్రమైన అభిప్రాయం!”

“Yes, I really mean it! ఒక కళాకారుడుగా ఇక్కడ Tolstoy తన సైద్ధాంతిక పరిమితులు అనాలోచనగా మరిచిపోయాడనిపిస్తోంది. అందువలనే తను అనుభవించిన అలజడలు, తత్తరపాట్లు, తనకి తెలియకుండానే తన సృష్టిలో ప్రతిఫలింపచేసి ఆఖరికి అతను ఆ పాత్రని చంపేసాడు! అందువలనే అతనికి ఆ నవల వలన సంతుష్టి కలగలేదు!” అని తన అభిప్రాయంని సారంగన్ కచ్చితంగా తెలియజేసాడు.

“Mr. సారంగన్, మీరిక్కడ విరుద్ధమైన రెండు సంగతులు మాటాడుతున్నారు. ‘Tolstoy కి ఈ నవల మూలం సంతుష్టి కలగలేదు’ అనేది నిజమే కావచ్చు, అది వేరే సంగతి. కాని ‘తను అనుభవించిన అలజడలు, తత్తరపాట్లు, తనకి తెలియకుండానే తన సృష్టిలో ప్రతిఫలింపచేసి ఆఖరికి అతను అన్నాని చంపేసాడు!’ అని మీరు అంటున్నారే, దానితో నేను ఏకీభవించను. అదొక సారహీన అభిప్రాయం!” అని మహాలింగం వాదించారు.

“లేదు. నేను మీకు వివరించి చెప్తాను. అన్నా కరేన్ దగ్గర విడాకులు అడుగుతోంది. అందుకు అతను సమ్మతించకుండా చెప్పే కారణాలన్నీ నాకు అతీతంగా కనిపిస్తున్నాయి. కరేన్ ఆమెకి వివాహరద్దు ఇచ్చాడనుకోండి; అన్నా చరిత్ర పూర్తిగా మారిపోయివుంటుందికదా?”

లలితాకే సారంగన్ వాదం సరి అనిపించలేదు. ఈ విషయంలో అతను చాలా వ్యక్తిగతంగా ఆరసించి పొరబాటు చేస్తున్నాడనివించింది. ఏ ప్రశ్న అయినా తర్కరీతిలో విమర్శించే సారంగన్ ఇలాగ మొండిగా వక్కాణించడం చూసి ఆమెకి కొంచెం ఆశ్చర్యం కూడా కలిగింది. మహాలింగం కూడా సారంగన్ ఏదో మానసిక వ్యధవలన అలాగ మాటాడుతున్నాడనే ఊహతో మౌనం వహించారు.

సుమారు ఒక గంట తరువాత సారంగన్ని అతని ఇంటిలో దింపేసి వాళ్ళిద్దరూ ఇంటికి వచ్చి భోజనంకి డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చున్న సమయం లలితాని చూసి - సహజంగా - కారులో మాటాడిన సంగతి గురించి -మహాలింగం కొనసాగారు.

"నువ్వేమంటున్నావ్? సారంగన్ వాదం సరేనా?"

భోజనం చేస్తున్న లలిత తలెత్తి అతన్ని చూసింది. "లేదు. అతనిదగ్గరనుంచి ఇటువంటి విమర్శ నేను ఎదురుచూడనేలేదు. మీకు బోధపడిందా? అతను దేనిగురించి వాదించినా ఇలాగ తారుమారుగా మాటాడరు. ఇవాళ అతని మనస్సు సరిగ్గా లేదు. అందుకే నేనూ అతనితో వాదించక ఊరుకున్నాను. ఆ తరువాత 'ఒక వేళ కరేన్ అన్నాకి విడాకులు ఇచ్చివుంటే ఏమై ఉంటుంది?' అని నాకూ అనిపించింది." ఆమె ఆ ఆఖరి వాక్యం పలికినప్పుడు తనకే పట్టుదలలేని ఒక విషయంకి తనూ వకాలతు కోరుతున్నట్టు ఆమె అస్పష్టంగా అడిగింది. అసలు అలాగ అడగాలని ఆమె మనసులో లేదు. కాని మహాలింగం దగ్గర విడాకులగురించి మాట్లాడడానికి ఇదొక నెపం అని ఆలోచించి సారంగన్ వాదంకి తనూ కట్టుబడాలని లలిత ప్రయత్నించింది.

"లలితా, నువ్వా ఇలాగ మాటాడుతున్నావ్? మానసిక ప్రక్రియలోని రహస్యాలని నీ రచనలలో వ్యక్తపరచి రాసే నీకు ఇది అర్థం కాదా? అన్నా, కరేన్ విదేశీయులు కాబట్టి వాళ్ళకి సహజమైన మనోభావనలు లేవని నీ ఉద్దేశమా? విడాకులు అనేది చట్టరీత్యా కట్టుబడిన ఒక షరతుగా ఎక్కడైనా ఉండవచ్చు. కాని ఇద్దరి స్వకీయ జీవితంలో దాన్ని ప్రయోగించినప్పుడు - అందులోనూ చిరకాలం ఒకే జీవితంని సమంగా పంచుకున్న జీవులు - దంపతులుగా, నమ్మికగా, ఒకరినొకరు ప్రేమించినప్పుడు -ఆ బంధుత్వంని అంతం చెయ్యడం సులభం, ఒక సాధారణ విషయం అని నువ్వు అంటున్నావా?"

అతను భోజనం చెయ్యకుండా ఆవేశంతో మాటాడడం గమనించిన లలిత, ఒక చిరునవ్వుతో అతన్ని భోంచెయ్యమని వేడుకుంది.

కాని మహాలింగం లలితా కన్నుల ద్వారా ఆమె హృదయంలో గుప్తమైన ఒక మూలలో దాగివున్న రహస్యాలు వెలికితీసే ఆతురతతో, ఆలోచనలో పడి, ఆమెనే తీక్ష్ణతతో చూస్తున్నారు.

లలితకి దిక్కుమాలిన ఒక బహిరంగ స్థలంలో తుపాకీతో గురి చూస్తున్న ఒకతని ఎదుట చిక్కుకున్నట్టనిపించింది; దిగులు, కలత ఆమెని ఆవరించుకున్నాయి.

"ముందు భోంచెయ్యండి" అని తన ఎడం చెయితో మేజామీదున్న అతని చెయిని నొక్కింది.

అతను ఒక గుక్కెడు భోంచేసారు; ఒక మింగుడు నీళ్ళు తాగారు; మళ్ళీ, అదే చూపుతో ఆమెని అడిగారు: "నీ అభిప్రాయం ఏమిటి? అది అందరికీ సాధ్యమా?"

అతను లలిత తనదగ్గర విడాకులు కోరితే, తన పరిస్థితి ఏమవుతుందని కల్పన చేసుకొని బాధపడ్డారు. ఏ కారణం వలన ఈ రోజు తన మనస్సులో అటువంటి ఆలోచన వచ్చిందని ఒక క్షణం అతను ఆలోచించారు. కాని దానిగురించి అతను మాటాడలేకపోయారు.

"బాగా ఆలోచించు. గతకాలంలో నువ్వూ, నేనూ, ఎటువంటి పరిచయం లేని అన్యులం. కాని కొన్ని సంవత్సరాలలో మనం సార్ధకమైన ఒక జీవితం జీవించివున్నాం. నువ్వో, నేనో, ఆ జీవితంని రద్దుచేసుకోవడం సాధ్యం అని నీ ఉద్దేశమా?" అని అతను అడిగినప్పుడు ఆమె జవాబు చెప్పలేదు.

ఆమె జవాబుని అతను ఆతురతతో ఎదురుచూసారు. 'లలితని తొందరపెట్టవద్దు, ఆమె తనే ఆలోచించి నాకు జవాబు చెప్పనీ' అని  అతను మౌనంగా భోజనం చెయ్యడం ఆరంభించారు.

భోజనం సమాప్తమయినవరకూ ఇద్దరూ మాటాడలేదు.

"మీరు అపార్ధం చేసుకోవద్దు - ఒక వివాదం అని మీరు ఆరంభించారు, అందుకే అడిగాను. ఒక ఉదాహరణగా అడిగాను, అంతే!" అని లలిత వట్టి పీఠికనే మళ్ళీ మళ్ళీ చెప్తోంది.

పడకగదిలో నీల దీపం మసక వెలుతురులో ఇద్దరూ గాఢమైన ప్రేమతో కలిసివున్నా, వాళ్ళ భావనలు దూరదూరాలకి వేరేవేరేగా ప్రయాణం చేస్తున్నాయి.

"ఉదాహరణగా అడిగాను - 'నేనే మిమ్మల్ని విడాకులు అడిగాను' అని అనుకోండి."

ఆమె వాక్యం ముగించలేదు. మహాలింగం ఆవేశంతో లేచి దూకారు; ఆమె పెదవులు అతని బుగ్గలని అణచాయి. ఆమె నోటినుంచి ఏ మాటా రాలేదు; ఆమె నోరూ, మనసూ, పని చెయ్యలేదు.

"వొద్దు, లలితా వొద్దు . . . ఉదాహరణకి కూడా అలా అడగవద్దు!" గభీమని జ్వరంతో బాధపడుతున్నట్టు, అతని దేహం ఆమె కౌగిలింపులో వొణుకుతోంది; కన్నులనుంచి ధారధారగా కన్నీరు కారుతోంది.

"లలితా, ఆ సినిమా చూస్తుంటే . . . ఆ అన్నాని చూసినప్పుడెల్లా నాకు నువ్వు జ్ఞాపకంకి వచ్చావ్! చూడడానికి ఆమె చాయ, రూపం నీ లాగే ఉండడం కారణమేమో? లలితా, నువ్వలా చెయ్యవు, నన్ను వదిలి వెళ్ళడం నీకు సాధ్యం కాదు! చావు వలన మనలో ఎడబాటు రావచ్చు. అప్పుడుకూడా నేనే ముందు చావాలని నా కోరిక . . . "

ఇప్పుడు లలితా కూడా ఏడ్చింది. అతను మాటాడకుండా, అతని పెదవులని తన పెదవులతో అణచుకుంది.

ఆమె చెవుల్లో, ఆమె హృదయంలో వల్లించుతున్నట్టు ఆవేశంతో మాసిపోయిన స్వరంతో రహస్యంలాగ అతను మాటాడుతూవున్నారు: "జీవితంలో అధికపక్షం నేను వృధాగా పోగొట్టుకున్నాను . . . లలితా, నువ్వే నా జీవితంకి ఒక అర్థం సమకూర్చావ్! లలితా, నావలన నీకేం లాభం చెప్పు! నీకని ఒక పాప పుట్టివుంటే అది సార్థకమైవుంటింది. అందువలనే లలితా నాకు చాలా భయంగా ఉంది . . . ఏమైనా సరే, నన్ను మరిచిపోకు! నువ్వు నాకు కావాలి . . . నువ్వే కావాలి . . . "

అతను తల్లిప్రేమని కోరే పసిపాపలాగ బతిమాలారు, ప్రలాపించారు. ఆమె కూడా ఒక తల్లిలాగ అతన్ని కౌగిలించుకుంది.

"నాకు మీరే, మీరు మాత్రం కావాలి! ఓ, నేను ఎంత భాగ్యవంతురాలు! నేను మిమ్మల్ని వదలగలనా? మిమ్మల్ని మరవగలనా? మీరు నా దైవం, నన్ను నమ్మండి" అని ఆ నిమిషం లలిత చెప్పినవన్నీ ఆమె హృదయంనుంచి వచ్చిన వార్తలే.

- రాత్రంతా, నిద్రలోకూడా, చీకటిని చూసి భయపడే పాపలాగ ఆమె చేతులు గట్టిగా పట్టుకొని అతను వాగుతూనేవున్నారు.

అతన్ని ఓదార్చుతూ, ప్రేమతో మెల్లగా తట్టుతూ, సమాధానపరచిన లలిత రాత్రంతా మెలకువతోనే ఉంది.

గతకాలంలో తన శోచనీయమైన, నిరాధారమైన జీవితంగురించి, ఆ జీవితంలో మహాలింగం ఒక దేవ ధూతలాగ జొరపడి తన్ను దీవించిన ఘటనలు, దాంపత్యంలో అతనితో తన అనుభవించిన అతని ఉదాత్త గుణాలు, కృతజ్ఞతతో ఆమె గుర్తుచేసుకుంది.

ఆఖరికి, గతకాల ఘటనలగురించి, ఇక రాబోయే ఘటనలగురించి ఏమీ బాధపడక ఆమె స్పష్టంగా ఒక నిర్ణయంకి వచ్చింది.

అవునుమరి, హృదయంని చంపుకొని ఎక్కడో, ఎవరితోనో జీవించడం అసాధ్యం కదా?

## 11

"లలితా, నేను కిందటి నెలలోనే పారిస్ కి వెళ్ళిపోవాలని నిశ్చయించాను. ఇంకా కొన్నిరోజులు ఇక్కడ ఉండి దాని వలన మీ అభిలాషకి విరుద్ధంగా మిమ్మల్ని నిర్బంధించడానికి నాకిష్టం లేదు. మీరొక పెద్ద కులంలో పుట్టినవారు. నిర్బంధాలవలనే మీ అంతరాత్మకి విరుద్ధంగా మీ జీవితంలో కటువైన ఘటనలు చాలామట్టుకు జరిగాయి. మీ మనోవ్యధ నాకు బోధపడింది. మీరు త్వరలో ఒక నిర్ణయంకి వచ్చేయండి. మీ జ్ఞాపకంతోనే నేనిక నా జీవితమంతా సంగీతంకే అంకితం చేసుకుంటాను. అలాగే మీరూ మీ జీవితం సాహిత్యసేవకి అంకితం చేసుకుంటారని నాకు తెలుసు. మనలాంటి కళాకారులకి ఇదొక వరప్రసాదం. వ్యక్తిగత జీవితంలోని శోచనీయమైన అనుభవాలు గొప్ప కళారచనలుగా మారడం మనకి తెలుసు. సామాన్య ప్రజలు ఇటువంటి ప్రేమవ్యహారాల్లో ఒక పరాజయంతో తమ జీవితంని పాడుచేసుకుంటారు. మీకది తెలుసు అని నా నమ్మకం. జీవితం అనేది మనకి బాహటంగా కనిపించేదిమాత్రం కాదు. మనం ఎంత materialism మాట్లాడినా కళాకారులుగా బాహ్యా భ్రమలకి మురిసిపోయే అలవాటు మనకి లేదు. లలితా,

మిమ్మల్ని ఇంకొక సంగతి అడగాలని చాలారోజులుగా నా మనస్సులో ఉంది" అని అంటూ సారంగన్ లలితని సమీపించాడు.

ఏడ్చి, ఏడ్చి, లలితా మొహమూ, ముక్కూ, ఎర్రబారిపోయాయి; ఆమె అతన్ని తిరిగి చూసింది.

"లలితా! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. ఇటువంటి ఆలోచనలు, ఊహలతో మీకూ పరిచయం ఉందా అని నాకు చెప్పాలి. నేను ఒకప్పుడు నరకంలో పడిపోయినట్టు చాలా కష్టాలు అనుభవించివున్నాను. తీవ్రమైన పేదరికం, స్నేహితుల పగ నన్ను ఒంటరిగా నిలబెట్టినప్పుడు ఆ బాధలన్నీ నేను భరించివున్నాను. నా ప్రియమిత్రుడు ఒకడు కన్నుమూసినప్పుడు అతని ఇంటిలో దుఃఖించినప్పుడు కూడా నాలో ఏదో ఒకటి నిలకడగా, నిష్కపటంగా, నిర్మలమైన బ్రహ్మానందంలో తేలుతున్నట్టు ఒక భావన నేను అనుభవించివున్నాను! నేను కోపించుకున్నా, ప్రేమించినా, మద్యం తాగి మైకంలో ఉన్నా, ఆ నిశ్చల స్థితి శాశ్వతంగా నాలో కట్టుబడి ఉండడం నేను గ్రహించాను! నా మనసు క్రుంగివున్నప్పుడెల్లా అది ఎదీ తాకలేని ఒక సూదిలాగ నాకు కాంతి ఇస్తోంది!

"నేను ఏదో ఇంద్రజాలం మాటాడుతున్నానని అపార్థం చేసుకోవద్దు. ఇదొక, యధార్థమైన, సార్థమైన భావన. మీరలాగ అనుభవించివున్నారా? మన ఎడబాటు వలన కలిగే ఈ దుఖంలో కూడా నాలో వున్న 'దానికి' చపలం లేదు. ఆ నమ్మకం వలనే మీ ఎడబాటు తరువాత నా జీవితం కూలిపోతుందనే భయం నాకు లేదు. మీకూ అటువంటి ఒక అంతర్గత అనుభవం ఉందా?" అని సారంగన్ అత్యాదరంగా అడిగాడు.

అతని మాటలు ఆమె వింటున్నప్పుడు, తన అంతరాత్మని కూడా అటువంటి పరమానందం ఏలుతున్నట్టు, ఇంత కాలమూ అది తనకి తెలియనట్టు లలిత గ్రహించింది.

"అవును, నాకూ అలాంటి అనుభవం ఉందనిపిస్తోంది."

"ఒ, లలితా! మనిద్దరికీ ఎంత పొత్తు ఉంది చూసారా?" అని సారంగన్ ఆమె బుగ్గలని తాకి ఆమె నుదుటమీద మర్యాదగా ముద్దుపెట్టాడు.

అతని రెండు చేతులు గట్టిగా పట్టుకొని లలిత చెప్పింది: "మీరు ఎంత ఉదాత్త మహనీయులు! మీ స్నేహం అనుభవించిన భాగ్యం నాకు చాలు! మీరు పారిస్ కి తిరిగి

వెళ్ళడం వలన ఈ దేశంకే పెద్ద నష్టం. నన్ను ఊరడించడానికి మీరు ఏమేమో చెప్పారు. జీవితంలో ఎన్నో శోధనలు నేను మనోబలంతో దాటి వచ్చాను, కాని ఈ శోధనలో నేను ఓడిపోయాను. అర్ధశూన్యమైన జీవితం గడుపుతున్న నావలన తన జీవితంకి ఒక అర్ధం కల్పించుకున్న నా భర్త జీవితంని పాడుచేసి మీ జీవితంని ప్రకాశింపజెయ్యడం నాకు చేతకాదని తెలుసుకున్నాను. కాని న్యాయ అన్యాయలని దాటిన, ఒక సాధ్యంకాని ప్రేమలో మీతో చిక్కుకొని నేను ప్రయాసపడుతున్నాను. ఇంత కాలమూ ఎవరి దయ లేకుండా స్వతంత్రంగా జీవించడానికి నేను మూర్ఖంగా పోరాడివున్నాను. కాని ఈ విషయంలో నా స్వతంత్రత నాకు అడ్డుగా ఉంది. నా యజమాని అనే వంకలో మీరు నాకు ఆజ్ఞ ఇవ్వండి! నేను అన్ని నియమాలూ దాటి, మీతో ఇప్పుడే వచ్చేస్తాను! కాని ఇది నేనే తెగించి చెయ్యలేను. నేను అతనితో జీవించడానికి కూడా మీ ఆజ్ఞ నాకు కావాలి. మీ ఆజ్ఞ ప్రకారం జీవితం గడుపుతున్నాను అనే నమ్మకంతో, భవిష్యత్తులో అతనితో నేను నిమ్మళంగా జీవించగలను. రెండులో ఒకటి చెప్పండి" అని అతని చేతులు పట్టుకొని లలిత బతిమాలింది.

"Please, లలితా, దయచేసి మీ స్థితిలో నన్ను పెట్టవద్దు; నా శక్తికి అది మించిన పని. అలాంటి స్థితిలో మీ ప్రశ్నని తీర్చడం నాకు చేతకాదు. అంతేకాదు. ఆజ్ఞ పాటించేవారే ఆజ్ఞ ఇవ్వడానికి యోగ్యులు."

"వినండి. దయచేసి నా దృష్టిలో కొంచెం ఆలోచించండి. మీరు నాకొక మంచి మిత్రులు - నా శ్రేయస్సు కోరేవారు - అనే ధోరణిలో ఒక మంచి ఆలోచన చెప్పండి, నేనేం చెయ్యాలి?" అని లలిత మెత్తగా అడిగింది.

సారంగన్ కొంచెంసేపు కిటికీదగ్గర నిలబడి, పొగ తాగుతూ, గూఢంగా ఆలోచించాడు. సిగరెట్టుని పారేసిన తరువాత సోఫాలో ఆమె ఎదుట కూర్చున్నాడు.

"మీ పరిస్థితిలో నాకు ఈ ప్రశ్న వస్తే ఒక వేళ నేను ఇలాగ చెయ్యవచ్చు. వివాహం గురించి, జీవితం గురించి నాకున్న లోకజ్ఞానంతో నేను ఇలా నిశ్చయం చేస్తాను: 'జీవితమనేది ఒక పొడుగాటి ప్రయాణం. అందులో మనం చేరే స్థలం, దిశ మాత్రమే ముఖ్యం, వాహనం కాదు. జీవితంలోని నిర్భంధాలని సులభం చేసుకుంటే జీవితం ఇంకా బాగా ఉంటుంది. శుద్ధ ఆవేశంతో నన్ను తన ప్రాణంగా కొవియాడే నా భర్త కొంత

కాలం తరువాత కటువైన అనుభవాలనుంచి పరిపక్వత పొందుతారు' అని నిర్ణయించి, విడాకులమూలంగా అతన్ని వదిలి నేను ఆశించిన జీవితంకి సిద్ధమౌతాను.

"లేకపోతే, నన్ను తన ప్రాణంగా గౌరవించే ఒక ఉదాత్త మనసుని ఇంత క్రూరంగా చితగగొట్చిన నేను మరెవరితోనైనా నిజంగా జీవించగలనా? ఇలాగ సాగుతూ పోతుంటే మరి నా జీవితంకి అంతు ఎక్కడ? ఆఖరికి నా జీవితం వట్టి చపలబుద్ధికి లొంగిపోవాలా?' అని నేను నాలో కఠినంగా ఆత్మ విమర్శ చేసుకుంటాను. 'లేదు, నా జీవితంలో ఆఖరిగా జొరపడిన మగవాడు ఇతనే!' అనే సత్యంని ఆ విమర్శకి జవాబుగా నేను గ్రహిస్తాను! 'అంత స్థిరమైన, గాఢమైన ప్రేమ అంటే దాని జ్ఞాపకంలోనే అతనితో నేను ఉండవచ్చుకదా? ఎడబాటు గురించి ఎందుకు బాధపడాలి?' అనే పూర్ణ తృప్తితో, శాశ్వతమైన ప్రేమికులుగా . . . నా జీవితంని పవిత్రం చేసుకొని నా సాహిత్య సేవకి నన్ను అంకితం చేసుకుంటాను. ఈ రెండూ శ్రేష్టమైన నిర్ణయాలు. వీటిమధ్య దుష్టమైన జీవితంకి నేనెప్పుడూ సమ్మతించను!'

సారంగన్ ఎప్పుడు తన ఉపదేశం ముగించాడని మరిచిపోయినట్టు వారిద్దరూ ఒకరినొకరు మౌనంగా చూసుకున్నారు.

గభీమని లలిత మొహంని ఒక కాంతి ఆవరించుకుంది. ఆమె మనస్సులోని కలవరం, తమస్సు తొలగి, స్పష్టత, ప్రకాశం చోటుచేసుకున్నాయి. కన్నులు మెరిసాయి. ఆమె చిరునవ్వు నవ్వింది.

"Mr. సారంగన్! నేనొక నిశ్చయంకి వచ్చేసాను! మీకు నిత్యమూ నా మనస్సులో ఒక పవిత్రస్థానం ఉంటుంది. మీతో గడిచిన ప్రతీ క్షణమూ గుర్తుచేసుకొని నా జీవితంలోని అన్ని బాధలు నేనిక మరిచిపోతాను. మీరు పారిస్ కి తిరిగి వెళ్ళండి!" అని అన్నప్పుడు ఆమె ధారధారగా కన్నీరు కార్చింది. "'మీరు వెళ్ళడం గురించి నాకు బాధగా ఉంది' అని చెప్తే అది మీ ప్రేమికురాలనే ధోరణిలో కాదు. ఒక గొప్ప కళాకారుని కోల్పోయినప్పుడు అతని అభిమానులు పడే వేదన అది. ఈ ఎడబాటు మనం ఒకరినొకరు మరిచిపోవాలని కాదు; ఒకరినొకరు నిత్యమూ జ్ఞాపకం ఉండడడానికే ఈ ఎడబాటు. నేను చెప్పేది సరేనా?"

సారంగన్ పెదవిని కొరుకుతూ, తన భావనలు అణచుకొని, లేచి, ఆమె నిర్ణయంని అంగీకరించినట్టు, తల వొంచి ఆమెతో కరచాలనం చేసాడు.

"నన్ను క్షమించండి . . . " అని వెక్కుతూ లలిత లేచింది.

అతను ఔదార్యంతో ఆమె కళ్ళు తుడిచి, ఆమె వీపుని లేతగా తట్టి, ఓదార్చాడు.

-ఆ రెండు హృదయాలు - వేరే వేరేగా - ఎంత బరువుగా ఉన్నాయి!

## 12

లలితా ప్రత్యేక గదిలో ఆ గడియారం పైకప్పు ద్వారం తెరుచుకొని తల చాటిన ఆ పిట్ట కూత ఆరుసార్లు వినిపించింది.

సారంగన్ ఆ గడియారంని వాళ్ళ స్నేహితంకి చిహ్నంగా లలితకి ఇచ్చాడు. లలిత తన పడకగది గోడలో వేలాడుతున్న, తన మిత్రుడు ఆలన్ ఆధునిక పద్ధతిలో చిత్రించిన ఆ వినాయకుడి పటం సారంగన్ కి బహుమతిగా ఇచ్చింది.

"లలితా, సమయం ఆరుగంటలు . . . మనమే వెళ్ళి సారంగన్ని airport లో చేర్చాలి . . . హుం, రెడీ అవు . . . " అని లలితని తొందరపరచాలని మహాలింగం లలిత గదిలోకి ప్రవేశించారు.

"అయ్యో, వేసివిలో ఎందుకండీ ఈ సూటూ, బూటూ?" అని అతన్ని మందలించుకుంటూ లలిత అతని టైని సర్దుచేసింది.

"వేసవి ఐతేనేం? ఒక foreign friend వెళ్తున్నప్పుడు మనమూ తగిన ఆచారం పాటించాలి" అని అంటూ మహాలింగం మెట్లు దిగారు.

"సైనా . . . , సైనా . . . " అని పిలుస్తూ శేషయ్య తలుపు గదిని సారంగన్ తట్టాడు.

పిల్లవాడు కణ్ణన్ని ఎత్తుకొని తలుపు తెరిచిన శేషయ్య "తంబుడూ . . . " అని ప్రేమతో పిలిచారు.

"ఎన్ని గంటలకి నీ ప్రయాణం? Airport కి నేనూ వస్తాను . . . ఈ సారి పారిస్కి వెళ్ళగానే లక్ష్మికి ఒక ఉత్తరం రాసి పడేయ్ . . . నేను కన్నుమూస్తే తప్పకుండా అది నీకు టెలిగ్రాం పంపుతుంది, అప్పుడు నువ్వు తప్పకుండా రావాలి . . . సరే, నీ హక్కులకి అడ్డురాకుండా నువ్వు ఎక్కడైనా స్థిరపడాలి . . . " అని దీవించి, అతని భుజంని తట్టి, అతని చెయి పట్టుకొని శేషయ్య ముందు హాలుకి వచ్చారు.

“సైనా! ఈ ఇంటిలో చెలాయించే హక్కులు నాకేవీ లేవు!” అని సారంగన్ అనగానే ‘ఈ సమయంలో వీడితో ఏ జగడమూ వద్దు’ అనే ఆలోచనతో శేషయ్య కొంచెంసేపు అతన్ని చూసారు.

అక్కడ హాలులో కుటుంబ సభ్యులందరూ గుమిగూడివున్నారు.

బాలాంబ, మురళి, గర్భవతి లీల కూడా సారంగన్ పారిస్ ప్రయాణం గురించి తెలుసుకొని ఆ మధ్యాహ్నం అక్కడకి వచ్చివున్నారు.

బాలాంబ లోపలనుంచి హారతి కలుపుకొని వచ్చింది.

కాంపౌండుగేటు దాటి మహాలింగం Ambassador కారు లోపలికి వచ్చి ద్వారమంటపంలో నిలబడింది.

కారునుంచి మహాలింగం, లలిత దిగి లోపలకి రావడం చూసిన శేషయ్య, “ఓ, వాళ్ళూ వచ్చేసారు. నేను వెళ్ళి చొక్కాయి వేసుకొని వచ్చేస్తాను” అని తన చెయిలో ఉన్న కణ్ణన్ని సారంగన్ కి అప్పగించి లోపలికి వెళ్ళారు.

“కణ్ణా, నన్ను మరిచిపోకు!” అని పిల్లవాడి నుదుటని ముద్దాడి, సారంగన్ హాలులో ఉన్న గుంపులో వాడి తల్లిని వెతికాడు.

లోపల, ఆ గది మూసిన తలుపు సందులో లక్ష్మి మొహం మాత్రం కనిపించడం అతను మాత్రం గమనించాడు. ఆ గదికి సారంగన్ నడిచాడు. ఆమె తలుపు తెరిచి అణచిన స్వరంలో “వెళ్ళి రండి” అని తెలుగులో చెప్పింది.

కణ్ణన్ తల్లి దగ్గరకి దూకాడు. పిల్లవాడు తల్లిని చేరుకున్నతరువాత సారంగన్ చేతులు జోడించి చెప్పాడు: “మీరు నన్ను క్షమించాలి. నేను రెండు మూడు సార్లు మీతో మోటుగా ప్రవర్తించాను . . . దానిగురించి నాకిప్పుడు బాధగా ఉంది . . . దయచేసి నన్ను క్షమించండి . . . నేను పారిస్కి తిరిగి వెళ్ళడం ఈ కుటుంబంలో ఏర్పడిన చిక్కులవలన మాత్రం కాదు . . . ఇక నేను సెలవు పుచ్చుకుంటాను . . . నన్ను క్షమించండి.”

లక్ష్మి చీరకొనతో కళ్ళు తుడుచుకొని నవ్వింది.

కన్నియప్పన్ సామాను, మూటాముల్లె కారులో అమర్చి సారంగన్ దగ్గర వచ్చి నిల్చున్నాడు. సారంగన్ వాడిని చూసి నవ్వుతూ చెప్పాడు: “నువ్వే నన్ను మొట్టమొదట పారిస్కి తిరిగి వెళ్ళిపొమ్మని చెప్పావ్!”

తనకెందుకు విచారం అని తెలియకుండానే చేతులు జోడించి కన్నియప్పన్ ఏడవడం ఆరంభించాడు: “సార్ . . . ”

“Don’t be silly . . . ” అని వాడి బుగ్గని తట్టి సారంగన్ కారుకి నడిచాడు.

కమలమ్మ అతనికి హారతి తీసి నెత్తిమీద తిలకం పెట్టింది.

కారులో వెళ్తున్నప్పుడు లలిత సారంగన్ని అడిగింది: “మీ Calcutta friend కి ఉత్తరం రాయాలని చెప్పారు, రాసారా?”

“ఓ, నిన్నే రాసేసాను” అని కారు బయట సరదాగా చూస్తూ సారంగన్ చెప్పాడు.

విమానాశ్రయంలో కళాశాల ప్రధానాధ్యాపకుడు మేనన్, అతని విద్యార్థులు కొందరు, సారంగన్ కి వీడ్కోలు చెప్పడానికి వచ్చి గుమిగూడివున్నారు.

సారంగన్ని విమానాశ్రయంలో కలుసుకున్న మేనన్ “మీరు ఇంత తొందరగా పారిస్కి తిరిగి వెళ్ళడం గురించి నాకు చెప్పనేలేదే?” అని నొచ్చుకున్నారు. కొందరు కొత్త విద్యార్థులు సారంగన్ దగ్గరకి వచ్చి autograph లు అడిగి తీసుకున్నారు.

‘బొంబాయికి వెళ్ళే ప్రయాణికులు విమానంలోకి ప్రవేశించండి’ అనే ప్రకటన వినగానే తన పెద్ద కోటుని మోజెయిలో మార్చుకొని సారంగన్ అందరిదగ్గర సెలవు పుచ్చుకున్నాడు.

శేషయ్య, మురళి, నరసింహన్, మేనన్ అని క్రమంగా అందరిదగ్గర సెలవు తీసుకొని మహాలింగంని చేరుకున్నప్పుడు అతను ఒక పెద్ద గులాబీ పువ్వుల దండని సారంగన్ మెడలో వేసి, అతని చెయికి ఒక పూల గుత్తి అందించి, కరచాలనం చేసారు.

సారంగన్ లలిత చెయిని పట్టుకొని కరచాలనం చేసినప్పుడు ఎంత ప్రయత్నించినా, తన్ను మీరి  అతని కళ్ళు బాగా తడిసిపోయాయి. “I am sorry” అని క్షమాపణ కోరుతూ, రుమాలు తీసి సారంగన్ బాగా  కళ్ళు తుడుచుకున్నాడు. అతని కళ్ళు, ముక్కు ఎర్రబారిపోయాయి.

మహాలింగం నవ్వుతూ అతన్ని సరదాగా అడిగారు: “విప్లవకారులుకూడా కన్నీరు కార్చుతారా?”

“విప్లవకారులకి కూడా హృదయం ఉంది” అని మేనన్ మహాలింగంకి జవాబు చెప్పారు.

”హృదయం ఉండడం వలనే వాళ్ళు విప్లవకారులు” అని లలిత వివరించింది.

సారంగన్ అందరికి కలసికట్టుగా, మౌనంగా, నమస్కరించి, కొన్ని అడుగులు వెనుకాడాడు . . . తన్ను బలవంతంగా లాగ్గొని వెళ్తున్నట్టు గభీమని తిరిగి విమానం ఉన్న మైదానం ప్రవేశించి, ముందుకు నడిచాడు.

అప్పుడు గుంపుని నెట్టుకుంటూ చెయిలో ఒక పూలదండతో తొందర తొందరగా పరుగెత్తుకొని వచ్చిన మాధవి, ప్రయాణికులు ప్రవేశించకూడని ఎల్లలు దాటి, లోపలికి వచ్చి సారంగన్ మెడలో పూలదండ వేసి, అతని చెయి పట్టుకొని, కరచాలనం చేసి, ఊపిరాడక, “I am sorry” అని తన ఆలస్యమైన వీడ్కోలుకి క్షమాపణ కోరుతూ అతన్ని సాగనంపింది.

ఒక సహోదరుని వాంఛతో సారంగన్ ఆమె నుదుటమీద ముద్దు పెట్టాడు. ఆ తరువాత విమానం మెట్లు ఎక్కి, నిలబడి, అందరికీ చెయి చూపి, విమానంలోకి మాయమయ్యాడు.

Santa Cruz విమానాశ్రయంలో ప్రయాణికుల విశ్రాంతిగదిలో వివిధదేశస్తుల మధ్య ఒంటరిగా కూర్చున్న సారంగన్ దిక్కుగా అతను నడిచి వచ్చారు.

సారంగన్ విమానం బయలుదేరడానికి ఇంకా ఐదారుగంటల సమయం ఉంది. ఒక ఒంటరి సోఫాలో అతను కాలు మీద కాలు వేసుకొని, తన పాస్పోర్ట్, విమానం టిక్కెట్టు, యిత్యాది చూసుకుంటున్నాడు. అప్పుడు సారంగన్ దగ్గర వచ్చి నిలబడిన అతను “క్షమించండి. నా పేరు సుందరం . . . కలకత్తానుంచి వస్తున్నాను” అని చెయి చాటారు.

“Oh, you, Mr. Sundaram? What a strange encounter! నా ఉత్తరం మీకు దొరికిందా? ఇది అకస్మాత్తుగా జరిగే మీటింగా? లేక మీరు నన్ను వెతుక్కుంటూ వచ్చారా?” అని కరచాలనం చేసినప్పుడు సుందరం చెయిని వదలకుండా గట్టిగా పట్టుకొని సారంగన్ అడిగాడు.

"మీ ఉత్తరం అందిన తరువాతనే మిమ్మల్ని కలుసుకోవాలని ఇవాళ ఉదయం నేను ఇక్కడికి వచ్చాను. విమానంనుంచి దిగినవెంటనే మీ ఉత్తరంలో మీరు పారిస్కి వెళ్ళే విమానం ఎన్ని గంటలకి బయలుదేరుతుందని చూసాను . . . అందువలనే మధ్యాహ్నంనుంచి మీకోసం ఈ విమానాశ్రయంలో నేను ఊరకే తిరుగుతున్నాను . . . మీరెక్కడ బస చేస్తున్నారని నాకు తెలీదే? . . . " అని చాలా రోజులుగా పరిచయమున్నట్టు మాటాడుతూ అతను పక్కనేవున్న సోఫాని లాగ్గొని సారంగన్ దగ్గర కూర్చున్నారు. సారంగన్ అతన్ని తేటిపారి చూసాడు: అతను అలవాటుగా దక్షిణపు దుస్తులే ధరించేవారని తెలుసుకున్నాడు; బలిసైన దేహం; చాలా నలుపైన చాయ; నిర్మలమైన ఖదరు ఉడుపు; సోడా బుడ్డి కళ్ళద్దాలు. అతను స్పష్టంగా, నిదానంగా తమిళంలోనే మాటాడారు.

సాధ్యమైనంతవరకూ, సారంగన్ అతనితో తమిళంలోనే మాటాడాడు.

వాళ్ళు కూర్చున్న మూల జనసమూహం ఎక్కువగా లేకపోవడం వలన ఇద్దరూ అక్కడే స్థిరంగా కూర్చున్నారు. సారంగన్ అతనికి ఒక సిగరెట్టు అందించాడు.

"క్షమించండి, నాకు అలవాటు లేదు" అని అతను నిరాకరించగానే, సారంగన్ అగ్గిపెట్టెని, సిగరెట్టు పేకెట్ని, పక్కనేవున్నబల్లమీద పెట్టేసి, తన సంచినుంచి కొన్ని నెలలముందు సుందరం రాసిన ఉత్తరంని తీసాడు.

"ఓ, ఎంత హామీ ఇచ్చే వాక్యాలు అవి! . . . మీరు అప్పుడే హెచ్చరిక చేసారు - 'ఈ పరీక్షనుంచి వెనకాడే అపాయం ఉంది' అని. ఒక దీర్ఘదర్శిగా అది మీ వక్కాణింపు! 'కాని మీ మనవి మీరి, నేను వెనకాడేసాను!' అని బాధపడుతూ నేను ఆ ఉత్తరం మీకు రాసాను . . . " అని చెప్పి, " అవును, నేను ఓడిపోయాను" అని సారంగన్ తనలో గొణుక్కున్నాడు.

"లేదు, మీరు వెనకాడలేదు, ఓడిపోలేదు. 'మీ లక్ష్యంని మీరు నెరవేర్చుతారు' అని మీకు చెప్పడానికే నేను వచ్చాను" అన్నారు సుందరం.

"మీరేమంటున్నారని నాకు అర్థం కావటంలేదు" అని భ్రమతో సారంగన్ అతన్ని చూసాడు.

“ముందు మీరు నాకు ఒక సంగతి స్పష్టపరచాలి. మీ ఉత్తరంలో మీరు రాసినట్టు మీ కుటుంబ సహాయ నిరాకరణతోబాటు, మీరు మీ సొంత కాళ్ళతో నిలబడి మీ లక్ష్యం నెలవేర్చడానికి చెన్నైలో వీలు కాదని మీరు పారిస్కి తిరిగి వెళ్ళిపోవాలని నిశ్చయించారా? లేక వేరేదైనా ప్రత్యేకమైన కారణం ఉందా? నేను తెలుసుకోవాలంటే - దయచేసి చెప్పండి.”

సారంగన్ పొగతాగుతూ కొంచెంసేపు మౌనం వహించాడు.

“మంచిది. నన్ను పారిస్ పిలవలేదు; ఇండియా కూడా పిలవలేదు, కాని ఇండియా నన్ను తరుముతోంది. పారిస్ నన్ను వెళ్ళగొట్టదు. అందుకే పారిస్ వెళ్తున్నాను. ఇంతవరకూ ఏ కళాకారునీ పారిస్ వెళ్ళగొట్టలేదు” అని కన్నులు మూసుకొని అన్ని కళాకారులకి ఆశ్రయం ఇచ్చిన ఆ పారిస్ మహానగరంని అతను కల్పన చేసుకున్నాడు.

అతను కళ్ళు తెరిచి చూసినప్పుడు, గొప్ప వాంఛతో, ఒక విధమైన భక్తితో, తన్ను చూస్తున్న సుందరంని చూసి సారంగన్ నవ్వాడు. అతనూ నవ్వుతూ అడిగారు:

“ఇండియా మిమ్మల్ని తరుముతోందని అంటున్నారా? ఈ అవమానం నేను సహించలేను. అది నిజమూ కాదు. ‘మీ లక్ష్యం నెరవేరడానికి, మిమ్మల్ని ఆదరించడానికి ఇండియా కాచుకొనివుంది’ అని చెప్తే మీరు నమ్ముతారా? అది రుజువు చేస్తే మీరు ఇక్కడే స్థిరపడిపోతారా? దయచేసి చెప్పండి . . .”

“ఓ! ఈ కల్పన వినడానికి చాలా మజాగా ఉంది!” అని అపనమ్మిక స్వరంలో సారంగన్ అన్నాడు.

“My dear friend! మనమిద్దరం రెండు మూడు ఉత్తరాలు పరివర్తన చేసుకున్నాం. కాని మన వ్యక్తిగత జీవితాలు, వసతులు గురించి మనం పరస్పరం చెప్పుకోలేదు. మీరు రాసిన ఉత్తరంలోనే మీరు దానిగురించి జాడగా చెప్పివున్నారు. అంతవరకూ ఆర్థిక స్థితిలో, మీరు సుఖంగా, అన్ని వసతులతో ఉన్నారని నేను అనుకున్నాను. కాని మీకు రావలసిన ఆస్తినే మీరు కోర్టు వ్యాజ్యం మూలంగా పొందవలసిన దుర్భాగ్యం గురించి - అదీ మీకు ఇష్టం లేదని - నేను తెలుసుకున్నాను, కళాకారుడికి ఆత్మగౌరవం చాలా ముఖ్యం. అది మీరు అద్భుతంగా కాపాడుకున్నారు. అందువలనే ఉత్తరం మూలంగా మిమ్మల్ని ఒప్పించడం కష్టం అని నేను సముఖంగా వచ్చాను.

“నేను నాగురించికూడా మీకు చెప్పాలి. నేను కర్ణాటక సంగీతం, శాంతినికేతన్ లో కొంతవరకు రవీంద్ర సంగీతం అభ్యసించివున్నాను. ఇప్పుడు కలకత్తాలో తమిళులు నివసించే భాగంలో ఒక సంగీత విద్యాలయం నడుపుతున్నాను. దాన్ని చాలా విపులంగా, భవిష్యత్తులో అభివృద్ధిపరచడానికి చాలా ప్రణాళికలు తయారు చేసివున్నాను. దానిగురించి తరువాత మాటాడుదాం. మీలాంటివారి సహకారం నాకు దొరికితే, మొదట నాకు, ఆ తరువాత భవిష్యత్తులో ఇందియాకి అది పెద్ద భాగ్యం అవుతుంది. ఇప్పుడు, వెంటనే నేను ఒక పాశ్చాత్య  సంగీత తరగతి ఆరంభించబోతున్నాను. ఇందియా నా రూపంలో వచ్చి మిమ్మల్ని వంగదేశంకి పిలుస్తోంది! మీరు వస్తారా? ఇవాళ మనం కలుసుకోవడం మంచిదయింది. లేకపోతే నేను దీనిగురించి మీకు పారిస్కి రాసివుంటాను” అని అతను చెప్తూపోతుంటే సారంగన్ భరించలేని ఆశ్చర్యం, ఆనందంతో, పరవశమై సుందరం చేతులు పట్టుకున్నాడు.

“నా భావనలు ఎలా తెలియజేయాలని నాకు తెలీదు. మీలాంటివారే సంగీత అభివృద్ధికి ప్రతినిధులు. మిమ్మల్ని పొగడడానికి తగిన వార్తలు నాకు తెలీదు.”

-సారంగన్ handbag ని ఎత్తుకొని, “రండి, మనం వెళ్ళి మీ టికెట్టు వాపసు చేసుకుందాం. రేపు విమానంతో మనం కలకత్తా వెళ్దాం. సరేనా?” అని తన పథకం నెరవేరిందనే ఉత్సాహంతో సుందరం లేచి నిల్చున్నారు. ఇద్దరూ తిన్నగా కౌంటర్ కి నడిచారు.

శేషయ్య పూజాగదినుంచి వీణ మ్రోగింది. బాలకుడిని దైవంగానూ, దైవంని బాలకుడుగానూ భావించి ఆ తలంపునే భక్తిగా కొనియాడే వైష్ణవ కులంలో పుట్టిన శేషయ్య, కణ్ణన్ని ఎదుట కూర్చోబెట్టి వీణ వాయించారు. ఆ భక్తుడు - అంధుడు సూర్దాస్ - తంబూరా వాయించుతూ ఆ పరమాత్ముడిని ప్రార్థించినప్పుడు ఆ బాలకృష్ణుడే ఎదుట వచ్చి కూర్చొని వింటాడట! అలాగుంది ఈ దృశ్యం!

‘నన్ను పాలింప నడచి వచ్చితివో?’ అని మోహన రాగం కీర్తన అతను వాయించుతున్నారు.

‘సంగీతం దైవ ఉపాశన’ అని బలవంతంగా పూజాగదిలో ఎవరినీ అనుమతించని శేషయ్య ఇప్పుడు కణ్ణన్ కోసం కూడా వాయించుతున్నారు.

"కణ్ణా, వీణ నేర్చుకుంటావా?" అని వాడితో ముద్దాడుతున్నారు.

పిల్లవాడు కణ్ణన్ మైమరపుతో ఆనందిస్తున్నాడు.

లలితా తన గదిలో సారంగన్ జ్ఞాపకంతో ఎక్కడో తేలిపారి చూస్తూ రేడియోగ్రాములో వస్తున్న చైకోవిస్కీ నాలుగవ గీతంలో తన హృదయం కోల్పోయింది.

'అది ఒక తియ్యని కల!' అని ఆ స్వరమేళనం త్వరిత గతి గురించి దాన్ని సృష్టించినవాడే చెప్పాడని ఒక సారి సారంగన్ ఆమెకి చెప్పివున్నాడు; అది ఇప్పుడు ఆమె గుర్తు చేసుకుంది.

ఆ కల అతి వేగంగా ఉత్సాహంకి, ఆనందంకి అభయం ఇస్తున్నట్టు ఇరుకగా వచ్చి ఆమెని కౌగిలించుకొని, క్రమక్రమంగా మాసిపోయింది.

మనసుని ఆకర్షించే అనుభూతులు కనిపించి తక్షణం మాయమవడం ప్రకృతిలో అతి శోచనీయమైన ఒక అనుభవం. ఇప్పుడు ఆ సంగీతం విని ఆమె అంతరాత్మలో అటువంటి స్పందన కలిగింది.

ఆమె తన పెద్ద కళ్ళని మూసుకున్నప్పుడు వాటి మొనలు తడిసిపోయాయి.

దేశదేశాలని వేరువేరుగా వ్యాపించిన పూల తోటల్లో రకరకాల ఛాయలలో వికసించే మానవజాతి అనే పుష్పాలలోని మకరందంని వెతుకుతూ వచ్చే భ్రమరం లాగ - పాడుకుంటూ, ఆకాశంలో పైపైకి ఎగురుతున్న విమానం - పారిస్ కి కాదు. కలకత్తా దిక్కుగా మళ్ళింది!

*****

**(సమాప్తం)**

# అనుబంధం

## అనువాదకుని ముందుమాట:

నేను సూచించిన నవలకి తమిళంలో పేరు ***'ఒరు నటిగై నాటగం పార్కిరాళ్'***. దానికి అర్ధం, తెలుగులో, ***'ఒక నటి నాటకం చూస్తోంది'***.

జనవరి 2006 లో దాని తెలుగు అనువాదం ***'కళ్యాణి'*** అనే పేరుతో Visalandhra Publications, Hyderabad, ప్రచురించారు. అనువాదకుని పేరు G. బాలాజి.

కధానాయకి పేరు కళ్యాణి, కాని ఇతర పాత్ర పేర్లు మారాయి. రంగా రంగారావుగా, అణ్ణాసామి ఆనందరావుగా మార్చడమైంది.

## జయకాంతన్ ముందుమాట:

ఇక్కడ జయకాంతన్ సూచించే పద్యం ***'నన్నూలి'*** అనే పురాతన తమిళ గ్రంధంలో ఉంది.

ఈ పద్యంని విశ్లేషించే పండితులు దీనికి నేపథ్యంగా రామాయణంలో హనుమంతుని పాత్రని రెండు ఘటనలలో వివరించుతారు.

మొదటి ఘటన: ప్రదేశం: లంకా, ఆశోకవనం. హనుమంతుడు సీతాదేవితో మొట్టమొదటిసారిగా శ్రీరాములవారి దూతగా సంప్రదించినప్పుడు పలికిన మాటలివి:

"శ్రీరాములవారి సైన్యంలో నేనొక సేవకుడు మాత్రమే. అక్కడున్న యోధులలో నాకంటే సామాన్యమైనవారు మరెవరూ లేరు."

అంటే హనుమంతుడు ఇక్కడ తన్ను చులకనగాచేసి మాటాడుతున్నాడనికాదు. అణకువగా, నిగర్వంగా, నమ్రతతో అతను సీతాదేవి సముఖంలోమాటాడుతున్నాడని మనం గుర్తుచేసుకోవాలి.

రెండవ ఘటన: రావణవధంతో యుద్ధం ఐపోయింది. కాని విజయంతో తిరిగివచ్చే వానరసైన్యం అలసటతో ఆశక్తమైపోయింది. 'ఈ సముద్రంని మనం దాటగలమా?' అనే

అనుమానం కూడా కొందరిని ఆవరించుకుంది. ఆ సందర్భంలో హనుమంతుడు పరివారంకి చెప్పాడు:

"నేను మీ నాయకుడిని, అతివేగంగా ఎగిరే ఆ గరుత్మంతుడిని కూడా నేను ఒక చెయితో ఆపగలను . . . "

ఇవి ఆత్మస్తుతిగా అతను పలికిన మాటలు కావు. బడలిన వానర సైన్యం త్రాణ, నైతిక స్థితిని బలపరాచాలని అతను పలికిన వాఖ్యాలు.

తమిళులు కొనియాడే 'కంబ రామాయణం' లో హనుమంతుడి వేదపాండిత్యం, నిర్భయత్వం, వాక్ నైపుణ్యం గురించి చాలా చెప్తారు. అతన్ని 'వాగీసుడు' అని పొగడడానికి హనుమంతుడు లంకనుంచి తిరిగి వచ్చిన సంభవం ఒక ఉదాహరణ:

ఆతురతతో శ్రీరాములవారు, అతని బృందం, వానర సైన్యం లంకనుంచి హనుమంతుని తిరుగుదలకి కాచుకొనివున్నారు. హనుమంతుడు ఎగిరివచ్చి శ్రీరాములవారి కాళ్ళముందు వాలగానే పలికిన మాటలివి: "చూసాను సీతని!"

తనగురించి తక్కువగా చెప్పుకోవడం (self-deprecation), లేక శ్లాఘించడం (self-promotion) - ఈ రెండూ హనుమంతుడి పాత్రలో మనం చూస్తున్నాం.

తన ప్రతివాదంలో జయకాంతన్ ధోరణి చూసిన వారికి 'వినయంని అత్యధికంగా ఎంచుకోవడం ఒక సద్గుణమైపోయింది!'[1] అనే నానుడి గుర్తుకి రావడం సహజం.

*****

[1] *"Modesty is the most overrated virtue."* A Quote by John Kenneth Galbraith (1908-2006)

# Jayakanthan’s Works Available in Telugu

**(Translated by Andy Sundaresan)**

## Novels

గంగా తపస్సు (2010)

కళ ఎల్లలు దాటాలి! (2025)

## Short-Story Collections

జయకాంతన్ కథలు (2021)

ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!(2023)

## E-Books

ఋషి మూలం (2020)

కోకిలా ఎంత పని చేసింది!(2021)

బ్రహ్మోపదేశం (2021)[1]

ఎవరికోసం ఏడ్చాడు?(2024)

*****

[1] Includes the story స్ఫటికం by writer Maharishi (1932-2019)

# రచయిత జయకాంతన్
(1934-2015)



ISBN 979-8-218-99801-1